


"శ్రీదేవి డిగ్రీ కాలేజ్ అధ్యాపక బృందం వారి విహారయాత్ర"

బస్ ముందుభాగాన కట్టిఉన్న బానర్ చూసినవారికి అది ఒక పిక్నిక్ పార్టీకి చెందిన బస్ అని అర్ధమైపోతుంది. అది ఒక మినీబస్. దానిలో టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ కలిపి ఓపాతికమంది పైనే ఉంటారు. అందరి కేరింతలు, ఆనందోద్వేగపు అరుపులు కలగలిసి ఆబస్ లోని వాతావరణం చాలా కోలాహలంగా ఉంది.

కార్తీకమాసపు తొలిరోజులు. నల్లని తారురోడ్డుమీద ఆ వీడియోకోచ్ బస్ మెత్తగా దూసుకుపోతోంది. బస్ కిటికీలు మూసిఉన్నా , మెయిన్ డోర్ లోనుంచి, కిటికీలసందులలోనుంచి చల్లనిగాలి రివ్వున వీస్తూనే ఉంది

రోడ్డుకిరువైపులా ఉన్న పొదలమీదుగా అల్లిబిల్లిగా అల్లుకున్న అడవితీగలకి పేరుతెలియని పువ్వులేవో మనోహరంగా విరబూశాయి. ఎక్కడనుంచో ఎప్పుడూ వినని రాగాలలో పక్షులు కిలకిలధ్వనులు చేస్తున్నాయి వీనులవిందుగా.

కళ్లవిందు కావిస్తున్న అందమైన ప్రకృతి దృశ్యాలని అబ్బురంగా వీక్షిస్తున్న మౌక్తిక మనసు ఏదో ఆనంద పారవశ్యానికి లోనైంది. నిజంగా ఈ సృష్టి ఎంత సుందరమైనది! ప్రపంచంలోని సౌందర్యాన్ని అంతా ఈసృష్టి తనలోనే ఇముడ్చుకుందా!

నీలిమేఘాల్లో ఒక అందం, వానచినుకుల్లో ఒకఅందం, పచ్చనిపైరుల్లో ఒక అందం, ఎగిరే పక్షుల్లో ఒకఅందం, తేలేమబ్బుల్లో ఒకఅందం,వాలే పొద్దుల్లో ఒకఅందం,అన్నింటినీమించి లేబ్రాయంలో ఒళ్ళంతా మిడిసిపడే యవ్వనశోభతో అలరారుతూ...ఈప్రకృతిలోని అందాలన్నింటికీ సవాలు విసిరే

కులుకులొలికే పదహారేళ్ళ పడుచుపిల్లది ఒకఅందం.

అనంతమైన అందాలని సృజించి ఈజగత్తుని మురిపిస్తున్నాడా విధాత.

'రమణీయమైన ఈ ప్రకృతిని చూస్తే తనకి కవిత్వం పుట్టుకొస్తోందేమిటి!' తన ఊహలకి తానే నవ్వుకుంది మౌక్తిక.

"ఏయ్ అంతర్ముఖీ...ఏమిటాలోచిస్తున్నావు!" మౌక్తిక ముఖమీద చిటికె వేస్తూ ప్రశ్నించింది రమ్య.

తనని ఎవరన్నా 'అంతర్ముఖి' అని విమర్శిస్తే మండిపడే మౌక్తిక రమ్యను మాత్రం ఏమీఅనదు. అనలేదు కూడా.రమ్య అలా పిలిచినప్పుడు ఆపిలుపులో ధ్వనించే ఆత్మీయత మలయసమీరంలా చల్లగా తాకుతుంది మౌక్తిక మనసుని.

ఆస్వరంలోని అనురాగలు మాలిమి మేలిమి బంగారమల్లే మెరిసిపోతూ కనబడుతుంది ఆమె అంతశ్చక్షువులకి. ఈప్రపంచంలో తనకున్న అతికొద్దిమంది సన్నిహితుల్లో రమ్యను కూడా ఒకదానిగా భావిస్తుంది మౌక్తిక.

అసలు ఈలోకంలో చాలామంది మనుషులు అంతర్ముఖులుగానే జీవిస్తారని మౌక్తికకు గట్టినమ్మకం.

కొందరు కొన్ని సందర్భాలలోనైనా మనసులో మాట బయట పెట్టుకుని గుండెబరువు దించుకుంటారు.

కాని, మౌక్తిక అలాకాదు...తన మనసులో ఏముందో ఎవరికీ తెలియనివ్వక గుట్టుగా వ్యవహరిస్తూ ఉంటుంది. ఆనందమైనా, విషాదమైనా పదిమందిలో ఉన్నప్పుడు ఆమెస్పందన ఒకేలాగా ఉంటుంది. ఆమె ప్రాణ స్నేహితురాలైన రమ్య ఆమెలోని ఈస్వభావాన్ని చూసి "అంతర్ముఖీ" అంటూ ముద్దుగా పిలుస్తూ ఉంటుంది.

"మళ్ళీ నీ ఊహల్లోకి వెళ్ళిపోయావా!" మౌక్తిక అలా ప్రకృతిలో లీనమవ్వడం గమనించిన రమ్య విసుగ్గా ముఖం పెట్టింది.

సమాధానంగా ఒక చిన్ని నవ్వు చిందించి కిటికీలోనుంచి బయటకు చూస్తూ ఉండిపోయింది మౌక్తిక.

బస్సులోని వారంతా జట్లుజట్లుగా విడిపోయి, కబుర్లలో మునిగిపోయారు. ఎవరిలోకం వారిది...ఎవరి చర్చలు వారివి. కొందరు సినిమాపాటలలో అంత్యాక్షరి ఆడుతూ ఉంటే, మరికొందరు బస్ లో వేస్తున్న సినిమా చూస్తున్నారు.

ఎప్పుడూ ఏకాంతాన్ని ఇష్టపడుతూ, తనలోకి తాను ముడుచుకున్నట్లుగా ఉండే మౌక్తిక ఈ హడావుడిని, గోలని భరించలేకపోతోంది.అసలు ఇదంతా తట్టుకోలేకే తాను ఈపికినిక్ కి రానంటూ మొరాయించింది. కాని, రమ్య వినిపించుకోలేదు. మౌక్తిక బయలుదేరేవరకు చెవిలో జోరీగలా పోరుపెట్టి, తెగ సతాయించి మరీ ఆమెను ఒపించింది.

సిటీకి నలభై కిలోమీటర్ల దూరంలో ఏదో రాజావారి దివాణం ఉందని తెలిసి అందరూ ఈవిహారయాత్రకి ప్లాన్ చేశారు. అలాగని ఆదివాణం ప్రసిద్ధి చెందిన చారిత్రిక స్థలమేమీ కాదు.

వీళ్ళుపనిచేస్తున్న కాలేజ్ లోనే 'శమంతకం' గారని ఫిజిక్స్ హెడ్ ఒకాయన ఉన్నరు.

'మరి సత్‌రాజిత్తు ఈయనకి ఏమౌతాడూ!'' అంటు చిలిపిగా ఆటపట్టిస్తూ ఉంటుంది రమ్య అప్పుడప్పుడు.

శమంతకంగారి అమ్మాయి సుమతికి ఈమధ్యనే పెళ్ళైంది. ఆ అమ్మాయిది ఈచుట్టుపక్కలే ఏదోగ్రామం...ఆమెను కాపురానికి దిగబెట్టి రావడానికై ఈఊరు విచ్చేసిన శమంతకంగారు , ఖాళీసమయాల్లో ఏమీతోచక ఊరంతా చుట్టబెట్టి, విశేషాలన్నీ తానే స్వయంగా అన్వేషించి మరీ వచ్చారు.

అప్పుడే ఆయన ఈ రాజావారి దివాణం గురించి తెలుసుకున్నారు.

రాజవంశాలన్నీ తమ ప్రాబల్యాన్ని కోల్పోయి జనబాహుళ్యంలోకి విస్తరిస్తున్న దశలో, రాచరిక వ్యవస్థ దాదాపుగా అంతరిస్తున్న ఈరోజుల్లో... ఈదివాణం గురించి, దానికి సంబంధించిన వ్యక్తుల గురించి కొన్ని ఆసక్తికర విషయాలు తెలియడంతో కాలేజ్ స్టాఫందరికీ ఎంతో ఉత్సుకత కలిగింది.

అనాదిగా ... ఆరాచవంశంలో ఒక్కో వారసుడు మాత్రమే పుడుతున్నాడట. అది వరమో శాపమో...తెలియని అయోమయావస్థలో ఉండేవారట ఆ రాచకుటుంబమంతా.

దానికితోడు ఈతరంలో జన్మించిన వారసుడు 'రాజా కుమారవర్మ' పెళ్లంటే విముఖతను కనబరచేవారట. ఆయన వైఖరికి బాధపడుతూ, ఆయనతోనే ఈవంశం అంతమైపోతుందేమోనని అందరూ బెంగపెట్టుకుని, తల్లడిల్లిపోతున్న తరుణంలో... లేటువయసులో... కుమారవర్మ తండ్రికి సుపుత్రికా జననమైంది. కొడుకు పుట్టిన ఇరవైమూడేళ్ళ తరువాత, వంశలక్షణాలకి వ్యతిరేకంగా, అందాలచంద్రబింబంలాంటి ఆడశిశువు ఆఇంట రాజావారు ఆనందపరవశులైనారు.

అయితే...వారి ఆనందం ఎంతకాలమో నిలవలేదు. అమ్మాయి పుట్టిన నెలరోజులకి ...రాజావారు, వృధ్ధులైన వారి మాతాపితరులు అందరూ కలిసి తిరుమల దైవదర్శనానికి వెళ్లివస్తూ...దారిలో కారుయాక్సిడెంట్ లోమరణించారు.

ఆవార్తను విన్న బాలింతయైన రాణీగారు ఉన్నపళంగా గుండాగి చనిపోయారు నవజాత శిశువును తల్లిలేని పిల్లను చేస్తూ.

వరుసగా ఇన్ని చావులను చూసి విరక్తి చెందిన చిన్నరాజావారు అటుపైన అక్కడ ఉండడానికి మనస్కరించక, తన చిట్టిచెల్లెలిని తీసుకుని విదేశాలకి వెళ్ళిపోయారు.ఆస్తినంతా ఆఊరి ప్రెసిడెంటైన సుమతి మామగారికి అప్పగించి,లావాదేవీలు అన్నీ ఆయన్నే చూసుకోమని ఆదేశించారు.

శమంతకంగారు, తాను స్వయంగా చూసి తెలుస్కున్న విశేషాలకి కాల్పనికతను జోడించి కళ్లకు కట్టినట్లుగా వర్ణించి, వివరించి చెప్పారు.

ఒక అద్భుతమైన సినిమా చూసిన అనుభూతి కలిగింది స్టాఫందరికీ. అలాంటి రాజావారికి చెందిన దివాణాన్ని చూడాలన్న తపన వారిలో మొదలైంది. దాని ఫలితమే ఈవిహారయాత్ర.

ఈజనాభాకంతటికీ భోజనాది కార్యక్రమాల ఏర్పాట్లని దగ్గరుండి పర్యవేక్షించడానికి ముందురోజే బయలుదేరి వచ్చేశారు శమంతకంగారు.

ఊరుచేరడానికి ఇంకా అరగంటసమయం పడుతుంది. బస్ లో చాలామంది ఇంటిదగ్గరనుంచి తెచ్చుకున్న స్నాక్స్ పని పడుతున్నారు. కరకరమన్న ధ్వనులు వినబడుతున్నాయి. మౌక్తికకు అలా నమిలేటప్పుడు చప్పుడు చేసే తినుబండారాలు అంటే మహా చిరాకు.

చేగోడీలు, జంతికలు, అప్పడాలు వడియాలు... సాధ్యమైనంతవరకు ఇలాంటి పదార్థాలకి దూరంగా ఉంటుంది.

అందుకే రమ్య ఆమెను"ఎద్దుకేం తెలుసు అటుకుల రుచి'' అంటూ వెక్కిరిస్తుంది.

"నా అభిప్రాయం నాది. నీకిష్టమైతే నువ్వు తిను... నేనే వద్దన్నానా?'' ముఖం ముడుచుకుంటూనే నవ్వేస్తుంది మౌక్తిక.

" మన ముందు సీట్లో ఒక మహాతల్లి కూర్చుంది చూశావూ! ఎవటితోటీ కలవదు...సోషల్ మూవింగ్ అస్సలు తెలియదు.''

"అవునే... వట్టిజడపదార్థం...టేస్ట్ లెస్ క్రీచర్... ఏస్పందనాలేని బండరాయి... ఈవిడగారిని ఎవడు చేసుకుంటాడో గాని...మటాష్ అయిపోతాడు.''

"ఎవరితోనూ కలవలేనప్పుడు ఇలా... పిక్నిక్ లకి గట్రా రవడం దేనికో!''

ఈమాటలన్నీ తనని ఉద్దేశ్యించి అంటున్నవేనని మౌక్తికకి తెలుసు. ఆఅంటున్నది...రిసెప్షనిస్ట్ మాలతి, క్లర్క్ నవనీతలని కూడా తెలుసు.. అయినా వాళ్ళు చేస్తున్న ఈవ్యాఖ్యలు మౌక్తిక మనసుని ఎంతమాత్రం బాధించలేదు. వాళ్లనైజం అదికాబట్టి వాళ్ళు బహూకరించిన ఈబిరుదులని ఆనందంగా స్వీకరించింది ఏగొడవాలేకుండా.

నిజంగానే తాను జడపదార్థమా! టేస్ట్ లెస్ క్రీచరా! ఏమో!...నవ్వుకుంది మౌక్తిక తనలో తానే.

"ఎక్స్ క్యూజ్ మి...అకారణంగా ఎవరినీ ఆడిపోసుకోవడం అంత మంచిపనికాదు మాలతిగారూ, నవనీత గారూ...మనం వచ్చింది విహారయాత్రకి. మన మనసులో టెన్షన్స్ అన్నీ పక్కకు పెట్టేసి ,హ్యాపీగా ఎంజాయ్ చేస్తూ మనసుని రీచార్జ్ చేసుకోవాలికాని, ఇలా ఎవరినో ఒకరిని కామెంట్ చేసి ఇన్సల్ట్ చేస్తూ మూడ్ పాడుచేసుకోకూడదు.''

వాళ్లని మందలించిన ఆస్వరం ఎవరిదో అర్థం అయ్యింది మౌక్తికకు. ఆగొంతు... మాథ్స్ లెక్చరర్ మధుకిరణ్ ది.

అతడి చూపు ఎప్పుడూ మౌక్తికను వెంటాడుతూ ఉంటుంది. ఆచూపులో భావం బోధపడనంత అమాయకురాలేమీ కాదు మౌక్తిక.

ఆచూపులో కళ్లవేడుక, కోరిక ఇలాంటిభావనలు ఏమీ కనబడవు.

ఆ చూపులు వెదజల్లే భావన ఇలాంటి భావనలకన్నాఅతీతమైన భావన...అపురూపభావన.

ఆ భావన పేరు ‘ప్రేమ’ అని భాష్యం చెప్పింది రమ్య. కాని, మౌక్తిక అందుకు అంగీకరించదు. రమ్యమాత్రం అతడి చూపులు వ్యక్తీకరించేది ఆమెపట్ల గల ఆరాధననే అని ఖచ్చితంగా చెబుతుంది.

“నీముఖం... వయసులో అందంగా ఉన్న ఏఆడపిల్లను చూసినా మగవాడు అలాగే కన్నార్పకుండా చూస్తాడు...దానికి నువ్వు ప్రేమా దోమా అంటూ డెఫినిషన్సేమీ ఇవ్వకు.’’ అంటూ కొట్టిపారేస్తుంది మౌక్తిక.

కాని,తాను కనబడినప్పుడల్లా అతడి కళ్లలో ప్రస్ఫుటించే మెరుపులను చూస్తే రమ్య మాటలు కరెక్టేననిపిస్తాయి. ఆకళ్ళు... తనను చూసి ఏవో ఊసులు చెప్తున్న ఫీలింగ్ కలుగుతుంది. కాని, అవేమీ రమ్యముందు బయటపెట్టదు.

కాని, అతడు ఎదురైన ప్రతిసందర్భం ఆమెలో ఏదో అలజడి రేపుతూ, మౌక్తిక కు అస్థిమితాన్ని కలుగజేస్తుంది.

మధుకిరణ్ వర్ధమాన రచయిత కూడా. అడపాదడపా అన్ని పత్రికలో అతడి రచనలు ప్రచురితమౌతూ ఉంటాయి. అతడి రచనల్లో భావుకత్వంపాళ్ళు కూడా ఎక్కువే. అతడి కథల్లో స్త్రీపాత్రల వర్ణనలు మౌక్తికనే పోలి ఉంటాయని అంటూ ఉంటుంది రమ్య.

కాదని ఖండించదు మౌక్తిక.

అంతేకాదు పనిగట్టుకు మరీ అతడి గుణగణాలను కీర్తిస్తూ ఉంటుంది రమ్య. అతడు చేసే సేవా కార్యక్రమాల గురించి అదేపనిగా మెచ్చుకుంటుంది. అనాధబాలలకోసం తన జీతంలోనుంచి కొంతమొత్తాన్ని కేటాయిస్తాడని, ఫీజులు కట్టలేని పేదవిద్యార్థులకి తనవంతు సాయం అందించి వాళ్ల చదువులు ముందుకు సాగేలా చేస్తాడు అనీ..ఇలాంటివే ఏవేవో...

“వాళ్ళ మాటలకి హర్ట్ అయ్యావా ముక్తా...’’ మౌక్తికనే తదేకంగా గమనిస్తున్న రమ్య అడిగింది.

“అబ్బే..లేదే... ఎవరి అభిప్యాయాలు వాళ్లవి. అయినా నాకిది అలవాటే కదా!హర్ట్ అయ్యేందుకేముంది?’’ నిర్లిప్తంగా అంది మౌక్తిక.

“ఎవరి అభిప్రాయాలైనా పక్కవాళ్ళని నొప్పించేట్లుగా ఉండగూడదు కదా! పైగా వాటిని అలా పదిమందిలో ఎక్స్ ప్రెస్ చేయకూడదు కదా! అయినా నీ మౌనప్రేమికుడేం ఊరుకోలేదులే...మెత్తగా అంటించాడు.’’ చిలిపిగా ఆమెచెవిలో గుసగుసలాడింది రమ్య.

మౌక్తిక కోపంగా చూసింది ఆమెవైపు.

“నువ్వు మరీ అలాంటి అర్థాలేమీ వెతక్కు...’’కసురుకుంది విసుగ్గా.

ఫకాలున నవ్వింది రమ్య. చుట్టుపక్కలున్నవారు వీళ్లవైపోసారి చూసి మళ్ళీ వాళ్ళ వ్యాపకాల్లో మునిగిపోయారు.

అలానవ్వుతూ ఉన్న రమ్య రూపం సొట్టలు పడిన బుగ్గలతో, ఎంతో మనోజ్ఞంగా ఉంది.

మౌక్తిక, రమ్య ఇద్దరూ విభిన్నమైన అందాలకి నమూనాలని చెప్పుకోవచ్చును. 'అందం' అంటే ఇలాగే ఉండాలన్న నిబంధనలేమీ లేవనిపిస్తుంది వారి రూపాలని చూస్తే.

రమ్య అందమంతా నవ్వుతున్నప్పుడు సొట్టలుపడేఆమె బూరెబుగ్గలలో ఉంటే, చిరునవ్వు నవ్వినప్పుడు బయటపడే పలువరసలో ఓమూలగా కనిపించే దొంతరపన్నులోనే మౌక్తిక సోయగమంతా దాగిఉన్నట్లనిపిస్తుంది.

ఆడపిల్ల అందానికి కొలబద్దలు కోలకళ్లు, వాలుజడ, కోటేరువేసిన నాసిక, తీర్చిదిద్దిన శరీర సౌష్టవం, పచ్చని పసిమి దేహఛాయ...ఇత్యాది కవులవర్ణనలేమీ కానక్కరలేదు. అటువంటి లక్షణాలేమీ లేకున్నా చూపరుల మనసులని అయస్కాంతంలా ఆకట్టుకునే కొన్ని ప్రత్యేకతలుంటాయి కొంతమంది ఆడపిల్లలకి.

మౌక్తిక, రమ్యలు ఆకోవకే చెందుతారు.

"ఏమండీ... టీ తాగుతారా?'' మధుకిరణ్ స్వరం విని అటువైపు చూశారు మిత్రురాళ్ళిద్దరూ.

చేతిలో పెద్ద వాక్యూమ్ ఫ్లాస్క్, డిస్పోజబుల్ పేపర్ గ్లాసులతో నిలబడి ఉన్నాడు మధుకిరణ్.

"అబ్బే...వద్దులెండి'' రమ్య అంది ఒకింత మొహమాటంగా.

మౌక్తిక బదులే చెప్పలేదు. ఎందుకో తెలియదు గాని, అతడు ఎదుటపడగానే ఆమె పక్షవాతం వచ్చి మాట పడిపోయినట్లుగా మూగవోతుంది. గుండె తానుకొట్టుకునే వేగాన్ని రెట్టింపు చేసుకుని నిముషానికి నూటనలభైనాలుగు సార్లు కొట్టుకుంటుంది.

"భలేవారే... నేను మీకొక్కరికే ఆఫర్ చేయలేదు.కావలిస్తే చూడండి... అందరూ తాగుతున్నారు.'' అంటూనే ఫ్లాస్క్ లోని టీని పేపర్ గ్లాసుల్లోకి వంచి వాళ్లకి అందించాడు.

"టీచాలా బాగుంది మధుకిరణ్ గారూ...మీ మిస్సెస్ చేశారా?'' రమ్య ఆప్రశ్న కావాలనే అడిగింది అనిపించింది మౌక్తికకు.

పెదవులు విడీవిడకుండా మనోహరంగా నవ్వాడు మధుకిరణ్. .."లేని మిస్సెస్ టీ ఎలా చేసివ్వగలదు రమ్యగారూ...నేనే చేశాను...''.

"అయితే మీరు ఇంకా బాచిలరేనన్నమాట!''

"ఎస్ రమ్యగారూ... ఇప్పటివరకు నాకు నచ్చిన అమ్మాయి దొరకలేదు. నాఅన్వేషణ ఫలించినప్పుడు తప్పకుండా చేసుకుంటాను.'' ఓరకంట మౌక్తికనే చూస్తూ చెప్పాడు మధుకిరణ్.

ఆచూపు ఒక విరిశరమై తనను తాకిన అనుభూతి కలిగింది మౌక్తికకు. కలవరంగా తన దృష్టిని ఇంకోవైపు తిప్పుకుంది.

"అయినా ఇదేం బాగాలేదండీ...కేవలం ఆడవాళ్ళు మాత్రమేనా ఇంతబాగా టీ తయారు చేసేదీ! మగవాళ్లం ఎందులో తీసిపోయాము చెప్పండి. నలుడు, భీముడు మాజాతివారేగా!'' అన్నడు మధుకిరణ్ చాలెంజింగ్ గా.

అతడివాక్కు ఎంతో మృదువుగా, వీనులకి ఇంపుగా అనిపిస్తోంది. మౌక్తికకేదో ఇబ్బందిగా అనిపించింది. అతడు తన సమక్షంలో ఉంటే 'ఇదీ' అని వ్యక్తపరచలేని వింతభావనేదో కలుగుతోంది.

యవ్వనమొచ్చాక ఏమగవాడిమాటలూ కూడా ఆమెమీద ఇంతగా మత్తు జల్లలేదు. ఏపురుషుడి ప్రవర్తనా ఇంతలా ఆకట్టుకోలేదు. ఇంత బలీయంగా ఆమె మనోనిగ్రహానికి పరీక్ష పెట్టలేదు.

కాని, ఇప్పుడేమిటి ఇలా!

అతడి స్వరం తేనెలో నానబెట్టి, పంచదారపాకంలో రంగరించి, చెరుకుపానకంలో ఊరించి మలచినంత మధురంగా ఉంటుంది. పేరులోని ' మధువు' ను తన గొంతులో నింపుకున్నాడా అన్నంత తీయగా ధ్వనిస్తాయి అతడి పలుకులు.

అతడి ముఖంలోకి సూటిగా చూస్తే కనక... తన ప్రమేయం లేకుండానే అతడికి వశమైపోతుందని మౌక్తికకు భయం.అందుకే... అతడు ఎదుట పడినప్పుడు తప్పించుకుని తిరుగుతుంది సాధ్యమైనంత వరకు.తన మనసులోని ఘర్షణ రమ్యకు తెలియనివ్వకుండా మసలుకుంటుంది.




రవికిరణాలు సోకగానే కమలాలు, చంద్రకాంతి తమను స్పృశించినప్పుడు కలువలు ఎందుకు విచ్చుకుంటాయో, కారుమొయిల్ని చూసిన మయూరం హర్షాతిరేకంతో పులకించి, ఎందుకు పురివిప్పి నర్తిస్తుందో, సన్నగా వీచే మలయానిల స్పర్శకి శ్రావణమేఘాలు ఎందుకు కరిగి వర్షిస్తాయో... మౌక్తికకు తెలియదు.

వాటి ప్రమేయంలేకుండానే జరిగే ఆ చర్యలకు కారణం లేనట్లే, మధుకిరణ్ ని కాంచినప్పుడు...అతడి తీయనిస్వరం చెవినపడినప్పుడు తన మదిలో వేనవేల ప్రకంపనలు చెలరేగి, సుమధురస్పందనలు ఎందుకు రేకెత్తుతాయో కూడా ఆమెకి తెలియదు.

అది ఒక అసంకల్పిత ప్రతీకార చర్యలా అనిపిస్తుంది ఆమెకి.

అతడు తన ఎదుట నిలబడితే అతడి ఆకర్షణలో పడిపోతుందేమోనన్న భయం మౌక్తికను అంతర్లీనంగా వెంటాడుతూ ఉంటుంది. అలా జరగకూడదని... తన మనసుకి తానే సజెషన్స్ ఇచ్చుకుంటూ ఉంటుంది. అయినాసరే... అప్పుడప్పుడు ఆమె ఊహల్లోకి చొరబడుతూనే ఉంటాడతడు ఆమె అనుమతిలేకుండానే.

అతడివెంట పరుగులుదీసే తనమనసుకి కళ్లాలువేసి ఆపడానికి విఫలయత్నం చేస్తూ ఉంటుంది మౌక్తిక.

"ఏయ్! మళ్ళీ పరధ్యానమా! పాపం కిరణ్ గారు చూడు...ముఖం వేలాడేసుకుని ఎలా దూరంగా వెళ్లారో! అతడంత ఇష్టంగా నీతో మాట్లాడడానికి ఇంట్రస్ట్ చూపిస్తూ ఉంటే నువ్వలా ముడుచుకుపోతావేమిటి అత్తిపత్తిలా!'' మందలింపుగా అంది రమ్య అతడు వెళ్ళినవైపు చూస్తూ.

బదులుచెప్పలేని అసహాయతతో మౌనంగా ఉండిపోయింది మౌక్తిక.

'నాలోనేనూ...లేనే లేను...'' బస్ లో ఎవరి సెల్ లోనుంచో పాట వినిపిస్తోంది.

ఆపాటవిన్న మౌక్తిక విరక్తిగా నవ్వుకుంది.

నిజమే...తనలో తాను లేనేలేదు. తనమనసు తన అధీనంలో లేదు. తన జీవితానికి సంబంధించిన ముఖ్యమైన నిర్ణయాలు తీసుకునే విషయంలో తాను అశక్తురాలు. ఎవరో నొచ్చుకుంటారని బాధపడుతూ తనను తానే హింసించుకుంటూ బతికే వ్యర్థజీవితాను. ఎవరినీ సంతోషపెట్టలేని నిరర్ధక జీవి తను.

బాధగా కళ్ళుమూసుకుని సీటు వెనక్కి చారబడింది మౌక్తిక. మూసుకున్న ఆకన్నులనుండి రెండు నులివెచ్చని భాష్పకణాలు ఆమె బుగ్గలమీదుగా కిందికి జారి ఆమె ఎదలోతుల్లో ఇంకిపోయాయి.

మూడ్ ఆఫ్ అయిన నెచ్చెలిని చూసి ' అదితనకి అలవాటే 'అన్నట్లుగా నిట్టూర్చింది రమ్య.

" ఫ్రెండ్స్...ఊరుదగ్గరపడుతోంది... అందరూ కాస్త వార్మ్ అప్ కండి.'' మధుకిరణ్ అందరినీ ఉద్దేశ్యించి చెప్పాడు.

పిచ్చాపాటీలో మునిగితేలుతున్న వాళ్లంతా సర్దుకునే ప్రయత్నాల్లో పడ్డారు. ఊళ్ళోకి ప్రవేశించిగానే బస్ ఆగింది. శమంతకంగారు బస్ దగ్గరకు వచ్చారు వీళ్ళని రిసీవ్ చేసుకునేందుకు.

అందరినీ పేరుపేరు వరసనా పలకరిస్తూ "అందరూ వచ్చినట్లేగా! ఇదిగోనయ్యా శంకర్‌రావూ...అనుకున్నవాళ్లందరూ వచ్చారో లేదో కాస్త చూడవయ్యా...'' ఎక్స్ కర్షన్ కి వచ్చిన స్కూల్ పిల్లలు ఎక్కడ తప్పిపోతారోనని ఆదుర్దా పడుతున్న స్కూల్ టీచర్ లా కాలేజ్ సబ్ స్టాఫ్ అయిన శంకర్‌రావుకి గైడెన్స్ ఇచ్చారు ఆయన.

చాలాసేపటి నుంచి కదలకుండా కాళ్లువెలవేసుకుని కూర్చోవడం నుంచేమో పాదాలు బరువెక్కిపోయాయి అందరికీ. ఎవరి సామాన్లు వాళ్ళు మోసుకుంటూ బస్ దిగారు. నడకకి కాళ్ళు సహకరించక అడుగులు అస్తవ్యస్తంగా పడసాగాయి.

అందరూ కబుర్లు చెప్పుకుంటూ ఊరు చూస్తూ నడవసాగారు. శమంతకంగారి అమ్మాయి ఇల్లు కాస్త ఇరుగ్గా ఉన్నవీధిలో ఉండడం నుంచి బస్ రోడ్ మీదే నిలచిపోయింది. దానితో లోపలికి నడవక తప్పలేదు.

ఊరంతా సిమ్మెంట్ రోడ్లతో చాలా నీట్ గాఉంది. ఊళ్ళో డ్వాక్రాగ్రూపులన్నీ నడుము బిగించి గ్రామంలో పచ్చదనం , పరిశుభ్రత అన్న నినాదాన్ని అమలుపరుస్తున్నట్లుగా చెప్పారు శమంతకంగారు. ఊరంతా పచ్చని చెట్టుచేమతో, విరగపండిన పంటచేలతో సశ్యశ్యామలంగా ఉంది.

వీధిలో మనుషుల అలికిడి కాగానే లోపలనుంచి శమంతకంగారి కూతురు, అల్లుడు శ్రీకాంత్,పెద్దపెద్ద మీసాలున్న నడివయసు వ్యక్తి, పనివాళ్ళలా కనిపిస్తున్న ఇద్దరు మనుషులు వచ్చారు. శమంతకం గారు వాళ్ళని అందరికీ పరిచయం చేశారు. ఆబొద్దుమీసాలాయన సుమతి మామగారు సంగమేశ్వరరావు గారు.

“రండి రండి... మా వియ్యంకుడు తన కాలేజ్ స్టాఫంతా పికినిక్ కి వస్తున్నారని చెప్పగానే చాలా సంతోషించాను. ఈమారుమూల పల్లెకి వచ్చే వాళ్ళ సంఖ్య చాలాతక్కువ. అలాంటిది ఇంతమంది ఒక్కసారి వస్తే ఎంతో సందడిగా అనిపిస్తోంది. మీ అందరికీ ఆతిధ్యం ఇచ్చే భాగ్యం నాకు కలిగినందుకు ఎంతో ఆనందంగా ఉంది.’’ సాదరంగా ఆహ్వానించారాయన.

చూడడానికి ఆయన ఆకారం భీకరంగా ఉన్నా స్వరం ఎంతో మృదువుగా ఉంది. పనివాళ్ళు కాళ్ళు కడుక్కునేందుకు నీళ్ళు అందించారు.

మూడంగడాల మిద్దె ఇల్లువాళ్ళది. ప్రయాణంచేసి అలసిపోయిన వాళ్ళని దక్షిణంవైపు నుంచి వచ్చే చల్లనిగాలి ఆప్యాయంగా పలకరించింది...మర్యాదలు చేయడంలో ఈఇంటివాళ్ళకి మేమెందులోనూ తీసిపోమంటూ. అటువైపు ఉన్న మూడుగదులను వీళ్ళకి కేటాయించారు.

స్త్రీలు అందరూ ఒక పెద్ద రూమ్ లో సర్దుకుని మగాళ్ళకోసం మిగతా రెండుగదులు వదిలేశారు. చుట్టూ పెద్దపెద్ద వసారాలు, మధ్యలో విశాలమైన లోగిలి. ఇంటిలోకి గాలి, వెలుతురు ధారాళంగా వస్తున్నాయి. పాతకాలంనాటి గృహనిర్మాణ నైపుణ్యానికి అద్దంపట్టినట్లుగా ఉంది ఆఇల్లు.

సంగమేశ్వరరావు గారి శ్రీమతి సరస్వతి కూడా భర్తకి తగిన ఇల్లాలు అనిపించింది. సాదరంగా స్వాగతిస్తూ వేడివేడి కాఫీలందించింది.

కాఫీల సెక్షన్ పూర్తయ్యాక సుమతి చెప్పింది “ ఎవరూ దేనికీ మొహమాటపడకండి. మా అత్తమామలు సాక్షాత్తు ఆదిదంపతులు. అతిధులను ఆదరించడంలో సిద్ధహస్తులు. ఏంకావాల్సినా నన్ను స్వతంత్రంగా అడగవచ్చు.’’

“అత్తగారి సంగతేమో గాని, మామగారు మాత్రం మీసాలమీద నిమ్మకాయలు నిలబెట్టడంలో ఖచ్చితంగా సిద్ధహస్తులే...’’ ఆయన మీసాలమీద వ్యాఖ్యానించింది రమ్య మౌక్తిక చెవిలో రహస్యంగా.

ఎవరూ చూడకుండా చిన్నగా గిల్లింది మౌక్తిక ఊరుకోమన్నట్లుగా. సుమతి దగ్గరుండి వంటావిడచేత వంటంతా రెడీచేయించింది.

సరస్వతి పర్యవేక్షణలో అందరూ పీకలదాకా తిన్నారు.

సన్నబియ్యపు అన్నం, కాలీఫ్లవర్-పచ్చిబఠాణీ కలిపిన కూర, దోసకాయపప్పు, సాంబారు, నిమ్మకాయ పులిహోర, రవ్వకేసరి...

రుచికరమైన భోజనం పొట్టపగిలేలా తినడంతో భుక్తాయాసంతో కళ్ళుమూతపడ్డం మొదలైంది అందరికీ.

వారి ఆతిధ్యానికి కృతజ్ఞతలు తెలియజేసి రూముల్లోకి వచ్చిపడ్డారు.

నిద్రముంచుకొచ్చేస్తోందంటూ బట్టలైనా మార్చుకోకుండా మంచమెక్కేసింది రమ్య. మౌక్తికకు ఒళ్లంతా చీదరగా అనిపిస్తోంది. 'స్నానం చేయకపోతే నిద్ర పట్టేట్టులేదు...' స్వగతంగా అనుకుంటూ బ్యాగ్ లో నుంచి నైటీ తీసుకుని వరండాలో చివరగాఉన్న బాత్ రూమ్ వైపు నడిచింది మౌక్తిక.

మాలతి, నవనీతలు నోరెళ్ళబెట్టి ఆశ్చర్యంగా చూస్తున్నారని తెలిసినా పట్టించుకోలేదు.

'ఎముకలు కొరికే ఇంతటి చలిలో కూడా చన్నీటిస్నానం చేస్తోంది...దీనికి పిచ్చిగాని లేదు కదా!' అనివాళ్ళు అనుకుంటూ ఉంటారని కూడా ఊహించింది మౌక్తిక. హాయిగా స్నానం చేసొచ్చి పౌడర్ తీసి మెడకు, ముఖానికి కొద్దిగా రాసుకుంది.

ఒళ్లంతా తేలిగ్గా అనిపించింది బడలిక తీరినట్లుగా. ఇంత ఫ్రెష్ గా ఉండకపోతే ఆనిద్రాదేవత తన దరిదాపులకి కూడా రాదు... నవ్వుకుంది మౌక్తిక.

రమ్య అప్పటికే గాఢనిద్రలో మునిగిపోయింది.

'పక్కవాసన చూడగానే నిద్ర ముంచుకొస్తుంది మహాతల్లికి... ఎంత అదృష్టవంతురాలో గాని... కమ్మనైన నిద్రకి నోచుకోవడానికి కూడా పెట్టిపుట్టాలి...అనేకరకాల సమస్యలను ఎదుర్కొంటూ ఎంతో మానసిక ఒత్తిడికి గురౌతున్న సగటుమనిషికి కంటినిండా కునుకుపట్టడం ఒక అరుదైన వరం అనే చెప్పుకోవాలి!'

ఆవరానికి నోచుకున్న అతికొద్దిమంది అదృష్టవంతులలో రమ్య ఒకతె. చీకుచింతలేని జీవితం.ఆకలేసినప్పుడు రుచిపచి అని ఎంపుళ్ళు చేయకుండా ఏగడ్డి దొరికినా తినేస్తుంది. నిద్రొచ్చినప్పుడూ అంతే... అది కటికనేలా, పట్టుపరుపా! అని ఆలోచించకుండా కునుకు తీసేస్తుంది.

'ఆకలి రుచెరగదు...నిద్ర సుఖమెరగదు..' అని అందుకే అంటారేమో!

మరి తనకో! ఆకలేసి ఆవురావురుమని తిందామంటే మంచి భోజనం దొరకదు... పంచభక్ష్య పరమాన్నాలూ అందుబాటులో ఉన్నప్పుడు తనకి తినాలనిపించదు.

అలాగే...నిద్ర.పరిసరాలన్నీ శుభ్రంగా, ప్రశాంతంగా ఉంతేగాని తనకి కునుకుపట్టదు. ఏచిన్నపాటి అలికిడైనా సరే... చప్పున మెలకువ వచ్చేస్తుంది.

"మన మనసులో ఏదన్నా బాధ ఉంటే సన్నిహితులతో పంచుకోవాలి. అప్పుడే హృదయభారం తీరి మనసు తేలికపడుతుంది.కళ్ళుమూతలు పడతాయి..." అంటూ ఉంటుంది రమ్య తరచుగా.

అయితే తనమనసులో ఫీలింగ్స్ ఎవరితో షేర్ చేసుకునేందుకు అంతగా ఇష్టపడదు మౌక్తిక...అది ఎంత దగ్గరవారైనా సరే. ఆనందమైనా, ఆవేదనైనా...తనకే పరిమితం చేసుకుని జీవిస్తుంది. ఆమెసంగతి తెలిసిన రమ్య ఎప్పుడూ ఏ విషయమూ తనతో చెప్పమని బలవంతం చేయదు.

ఆదమరచి నిదురిస్తున్న రమ్య పక్కనే చోటు చేసుకుని పడుకుంది మౌక్తిక. కాని, నిద్రపట్టి చస్తేనా!

వాళ్ళపక్కనే శయనించిన మాలతి, నవనీతలు నాన్ స్టాప్ గా అలా బాతాకానీ కొడుతూనే ఉన్నారు.

ఆవకాయ నుండి అణుబాంబుల వరకు, సీమచింతకాయల నుండి అవినీతిపరుల స్విస్ బ్యాంకు అకౌంట్స్ వరకు... 'కాదేదీ చర్చకనర్హం'అన్నరీతిలో అన్ని విషయాల గురించి ఆమూలాగ్రం విశ్లేషించుకుంటున్నారు.

'వీళ్ల ముఖాలుమండా! అంతసేపు జర్నీ చేసి ఒళ్ళు పులిసిపోయి ఉండికూడా..కబుర్లు చెప్పుకునేందుకు వీళ్ళకి ఓపిక ఎక్కడినుంచి వస్తోందో!' అక్కసుగా అనుకుంది మౌక్తిక.

నిద్రలోనే బద్ధకంగా కదిలి అటువైపు తిరిగి పడుకుంది రమ్య.

ప్రపంచాన్ని చుట్టచుట్టి తమ చర్చలలో ఇరికించి అనేకరకాల కబుర్లు చెప్పుకున్నాక, రైలింజన్ లెవెల్లో గురకపెట్టి మరీ నిద్రపోయారు వాళ్ళు. అంతసేపూ...అవిరామంగా వాగివాగి తననిద్రను పాడుచేసిన వాళ్ళు...నిముషాలమీద మొద్దునిద్రలోకి జారిపోవడం చూసి ఉక్రోషంగా అనిపించింది మౌక్తికకు.

కేవలం వాళ్ళమీదే కాదు...ఈ భూప్రపంచంలో హాయిగా, ప్రశాంతంగా నిద్రపోయేవాళ్లందరిమీదా మౌక్తికకు అసూయ కలిగింది. అది ఒక్క క్షణంసేపు మాత్రమే.

తనసమస్య అందరిమీదా అసూయపడడంతో తీరిపోతుందా! నవ్వుకుంటూ సెల్ తీసి టైమ్ చూసింది. అర్ధరాత్రి ఒంటిగంటా పది నిముషాలు. డిస్ ప్లే లో డేట్ మారిపోయి కనిపిస్తోంది.కన్ను పొడుచుకున్నా నిద్ర రావడంలేదు. మంచంమీద నుంచిలేచి, చెప్పులు తొడుక్కుని చప్పుడు కాకుండా గది తలుపులు తీసుకుని వరండాలోకి వచ్చింది

మౌక్తిక.మెల్లగా అడుగులు వేసుకుంటూ వరండాలో ఓపక్కగా ఉన్న మెట్లమీదుగా మేడపైకి చేరుకుంది.

ఆరోజు అమావాస్య వెళ్ళిన పంచమో, షష్ఠో కాబోలు వెన్నెల పలచపలచగా పరుచుకుంది. ఆఇంటికి కాస్త దూరంగా కనిపిస్తున్న రాజావారి దివాణం తెల్లని డిస్టెంపర్ పైపూతతో వెండికొండలా మెరుస్తోంది ఆమసకవెలుతురులో.

ఆ దివాణప్రాంగణంలో... నిటారుగా నిలబడ్డ అశోక వృక్షాలు లీలగా కనిపిస్తున్నాయి అంత దూరానికి కూడా. చల్లని పరిసరాలు, ఆప్యాయంగా చిరుగాలి వీస్తున్న వింజామరలు, ఎంతో మనోజ్ఞంగా ఉంది వాతావరణం.


మేడపై కుండీలలో పెంచిన చేమంతిపులు నిండుగా విరబూసి, మంచుబిందువుల ఆభరణాలను ధరించి మురిసిపోతున్నట్లుగా ఉన్నాయి.కార్తిక మాసపు చలిగాలి రివ్వుమని వీస్తూ చాచి

కొడుతున్నట్లుగా దేహాన్ని తాకుతోంది. ఆచలి మౌక్తికను ఎంతమాత్రం బాధించలేదు. అలా...అలా... ఆచిరువెన్నెలలోనే పరిసరాలను వీక్షిస్తూ ఒక అరగంతసేపు పచార్లు చేసింది.

నీరవ వాతావరణంలో వినిపిస్తున్న కప్పల బెకబెకలు, వీచేగాలి పాడుతున్న సంగీతం, కీచుకీచుమని అరుస్తూ అదోరకమైన ధ్వని సృష్టిస్తున్న కీచురాళ్ల అరుపులు, మృదువుగా రవళిస్తున్న మౌక్తిక కాలిమువ్వల శబ్దం...ఇవన్నీ వివిధవాద్యాల సమ్మేళనంలా అనిపిస్తున్నాయి.

అలా... కాసేపు హాయైన వాతావరణంలో గడిపాక...అనుభూతులన్నీ ఆస్వాదించాక... మెల్లమెల్లగా మౌక్తిక కనురెప్పలమీద అధిష్ఠించింది నిద్రాదేవత.

'నీలల కన్నుల్లో మెలమెల్లగా ...నిదురా రావమ్మా...రా రా...నెమ్మదిగా రా...' అంటూ ఆప్రకృతి ఆమెకు జోలపాడి లాలించిందేమో! ఆవులింతలు ఆగకుండా వచ్చేశాయి.




గబగబ మేడదిగి, గదిలోకి నడిచి, తలుపు గడియపెట్టి, రమ్య పక్కనే పడుకుని ఐదే నిముషాల్లో గాఢ సుషుప్తిలోకి జారిపోయింది మౌక్తిక.

-------------------          ----------------------------------

--------------------

“ముక్తా..లే...ఏమిటా మొద్దునిద్ర!’’ రమ్య పిలుపుతో ఒళ్ళు విరుచుకుంటూ లేచింది మౌక్తిక.

కళ్ళు తెరవగానే సుందరమందస్మితయైన రమ్య ముఖారవిందం దర్శనమిచ్చింది.

“త్వరగా లేచి తయారవ్వు... అందరూ రెడీ అయిపోయారు. నీదే ఆలస్యం. దివాణం అంతా చుట్టి చూసేసరికి చాలా సేపు పడుతుందట. పక్కనే పెద్దతోట కూడా ఉందట. అదీగాక ముందు ఊళ్ళోఉన్న రాముడి కోవెల చూడాలట...’’ అంది రమ్య మౌక్తిక కప్పుకున్న దుప్పటి లాగిపారేస్తూ.

రాత్రి ఆలస్యంగా పడుకున్నా...హాయిగా నిద్రపట్టడం మూలాన మౌక్తిక ఒళ్ళంతా తేలిగ్గా ఉంది. ముందురోజు పడిన అలసట అంతా ‘ఉఫ్’ మని ఊదేసినట్లుగా ఎగిరిపోయింది.

ఛెంగున మంచం దిగి బ్యాగ్ లోనుంచి బట్టలు తీసుకుని బాత్ రూమ్ లోకి పరుగెత్తింది. సరిగ్గా అరగంటలో స్నానాదికాలు పూర్తిచేసుకుని బయటపడింది అప్పుడే మొలిచొచ్చిన మొక్కలా. చకచక తయారైపోయి, జడను రబ్బర్ బాండ్ తో బిగించింది.

“వ్వావ్... యుఆర్ లుకింగ్ సో క్యూట్...’’ అంది రమ్య      చప్పున మౌక్తిక బుగ్గను ముద్దాడుతూ.

“ యుసిల్లీ...రాన్రానూ చిన్నపిల్లవైపోతున్నావు...’’ మురిపెంగా విసుక్కుంది మౌక్తిక.

ఇంతలో బయటినుంచి మాలతి హడావుడిగా పరుగెత్తుకొచ్చింది.

“మీకీ విషయం తెలుసా?’’ అంది ఆయాసంతో వగరుస్తూ.

“నువ్వు చెప్పనిదే ఎలా తెలుస్తుందీ! మాకేం దివ్యదృష్టి లేదే!’’ దీర్ఘం తీసింది రమ్య కాస్త వ్యంగ్యంగా.

“నిన్నరాత్రి...మన శంకర్రావుకి... ఈమేడమీదా......’’ రొప్పుతోంది మాలతి.

“తొందరేంలేదులే...ఆయాసం తగ్గకే చెప్పు...’’ చిరాగ్గా అంది రమ్య.

“నిన్నరాత్రి... శంకర్రావుకి...దెయ్యం కనబడిందట!’’ చెప్పింది మాలతి గభాలున.

మౌక్తిక, రమ్యలు ఆశ్చర్యంగా ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు. ‘దెయ్యమా! ఈరోజుల్లోనా! దేన్ని చూసి ఏమనుకున్నాడూ!’

“డోంటాక్ రబ్బిష్...దెయ్యమేమిటి నాముఖం...ఏదో పీడకల వచ్చుంటుంది...’’ విసుగ్గా అంది రమ్య.

“కల్పించి చెప్పడానికి నాకేం అవసరం! అతడు నిజంగా చూశాడుట...ఆభయానికి ఝుడుసుకుని జ్వరం కూడా పెట్టుకున్నాడు...అవతల ఒకటే హంగామాగా ఉంది..’’ మాలతి చిన్నబుచ్చుకుంది.

“అయాంసారీ... నా ఉద్దేశ్యం నిన్ననాలని కాదు...’’ అంది రమ్య నొచ్చుకుంటూ.

“రాత్రి...సుమారు ఒంటిగంట ప్రాంతంలో బాత్ రూమ్ కని లేచాడట! అతడు బయటకి వచ్చేసరికి డాబామీద అటూఇటూ పచార్లు చేస్తూ కనబడిందట ఆ ఆడదెయ్యం. ఆదెయ్యం సినిమాల్లో

చూపించినట్లుగా తెల్లచీర కట్టుకొని లేదట. తెల్లనైటీ వేసుకుని, జుట్టు విరబోసుకుని, గజ్జెలు శబ్దం చేసుకుంటూ తిరుగుతోందట.

అంతే... గుండె ఠారెత్తిపోయిందట మానవుడికి. ఒకటే ఝుడుపు, జ్వరం...సంధిప్రేలాపనలు కూడా మొదలైనాయట...ఆగదిలో పిచ్చిచూపులు చూస్తూ, బిగదీసుకు కూర్చున్నాడు.'' వాచికానికి, ఆంగికాభినయాన్ని కూడా జతపరచి కళ్లకు కట్టినట్లుగా వర్ణించి చెప్పింది మాలతి.

బిత్తరపోయింది మౌక్తిక. రాత్రి నిద్రపట్టక గాలికోసం తిరుగుతున్న తనను చూసి దెయ్యమేమోనని భ్రమించి, భయపడ్డాడా అర్భకుడు. అతగాడిది బలహీనమైన గుండె కాబోలు...భీతావహుడై, జ్వరం తెచ్చుకున్నాడు.

ఏదో... గిల్టీ ఫీలింగ్ లాంటిది కలిగింది మౌక్తికకు.

"అబ్బా తల్లీ...ఇప్పుడు కూడా ఆలోచనలేనా!''రమ్య తనని పట్టికుదిపేవరకు అదోరకమైన అలౌకిక స్థితిలో ఉండిపోయింది మౌక్తిక.

కక్కాల్సిందంతా కక్కేశాక మాలతి బయటకు జారుకుంది మళ్ళీ. మౌక్తిక తేరుకుని రాత్రి జరిగిన దాన్ని రమ్యకు చెప్పింది. కాసేపు అలా ఉండిపోయి... ఆతరువాత పగలబడి నవ్వడం మొదలెట్టింది రమ్య. పొట్టచేత్తో పట్టుకుని అలా నవ్వుతూనే ఉండిపోయిందెంతసేపో!

"ఏయ్ రమ్యా...నీకేమన్నా పిచ్చెక్కిందా? అతడి అవస్థ నీకు నవ్వు తెప్పిస్తోందా?'' కోపంగా ప్రశ్నించింది మౌక్తిక.

నవ్వడం కొనసాగిస్తూనే "మరేమీ లేదు ముక్తా...మా ' అంతర్ముఖి'కి కూడా సెన్సేషన్ క్రియేట్ చెయ్యడం వచ్చునే... ' అని నవ్వొచ్చింది'' అంది రమ్య.

మౌక్తిక ముఖం ముడుచుకుంది.

"నా ముఖం...నేనేం కావాలని చేశానా! నిద్రపట్టక అనీజీగా అనిపిస్తే... గాలికోసం మేడెక్కాను. ఇలా జరుగుతుందని నేను మాత్రం కలగన్నానా!'' లోలోపల చిరాగ్గా అనిపిస్తున్నా బయటకు మాత్రం స్థిరంగా ఉండడానికి ప్రయత్నించింది మౌక్తిక.

జరిగినది తలచుకుంటే ఆమెకు నెర్వస్ గా అనిపిస్తోంది. ఇతరుల బాధకి తాను కారణం కాకూడదు అనుకుంటుందెప్పుడూ కూడా...అందులో తన ప్రమేయం లేకున్నాసరే.

"ఒకే... రిలాక్స్ ముక్తా... మన శంకర్రావుకీ వార్త చెప్పి అతడిని భయవిముక్తుడిని కావిద్దాం...'' నాటకఫక్కీలో అంది రమ్య.

అంతసేపూ... విరగబడి నవ్విన ఆమె అలా ... గంభీరతను నటిస్తూ అనేసరికి మౌక్తికకు కూడా నవ్వొచ్చింది. ఈసారి దాన్ని దాచుకునే ప్రయత్నమేదీ చేయలేదామె.

రమ్యతో కలిసి శంకర్రావు ఉన్న గదిలోకి వెళ్ళింది.

గదిలో... మంచంమీద గోడకానుకుని కూర్చుని బిర్రబిగుసుకుపోయి ఉన్నాడు శంకర్రావు.

రాత్రి అతడు అనుభవించిన భయానక రస ఛాయలు అతడిని ఇంకా వీడిపోయినట్లు లేదు...మిడుగుడ్లు పడి పిచ్చి చూపులు చూస్తున్నాడు. అతడి వాలకం చూస్తే షాక్ నుంచి ఇంకా తేరుకోనట్లుగా ఉంది.

మౌక్తిక, రమ్యలను చూసి చుట్టూ మూగిఉన్నవాళ్ళందరూ పక్కకి తొలిగారు. శమంతకం గారిని పక్కకి పిలిచి విషయం మొత్తం వివరించింది రమ్య.

ఆయనకు కూడా నవ్వొచ్చింది జరిగిన ఉదంతం విన్నాక. చిన్నగా నవ్వుకుంటూ శంకర్‌రావుని సమీపించారు.

“ఇదిగో... శంకర్‌రావ్...నీ భయావతారం చాలించవయ్యా... తెల్లారిన దగ్గరనుంచీ మా బుర్రలు కొరికేసి ఒకటే టెన్షన్ పెట్టావు. నిన్నరాత్రి నువ్వు చూసినది దయ్యాన్ని కాదు. మన మౌక్తికా మాడమ్ ని.'' కొయ్యలా బిగుసుకుపోయిన శంకర్‌రావుని కుదుపుతూ చెప్పారు శమంతకం గారు.

అంతే...అక్కడ ఉన్నవాళ్లందరూ మౌక్తికవైపుకి తిరిగి “వ్వాట్... మన మౌక్తికా మాడమా!'' అన్నారు ఆశ్చర్యంగా.

వాళ్ల చూపులు, విస్మయంనిండిన వాళ్ల స్వరాలు మౌక్తికను ఎంతో ఇబ్బందిపెట్టాయి. మధుకిరణ్ కూడా విస్మయంగా చూశాడు ఆమెవైపు.

వాళ్లందరి ముందూ అలా... తప్పుచేసిన దానిలా తలదించుకుని నిలబడాల్సి రావడం ఎంతో ఎబ్బెట్టుగా అనిపించింది మౌక్తికకు. దానితోపాటు అందరి ఆశ్చర్యానికీ తానే కేంద్రబిందువు కావడం కాస్త అసౌకర్యాన్నీ కలుగజేసింది.

విభ్రమ నుంచి తేరుకున్న తరువాత అందరూ పకపక నవ్వేశారు. శమంతకంగారు చెప్పినది విన్నాక మెల్లగా ఈలోకంలోకి వచ్చిపడ్డాడు శంకర్‌రావు. తాపీగా రిలాక్సయ్యాడు.

“మౌక్తికా మాడమ్... రాత్రి మేడమీద కనబడింది మీరేనా! నేనింకా దెయ్యమేమోనని హడలి చచ్చాను. భలే జర్కిచ్చారు మాడమ్ గారూ...'' అన్నాడు తేలికగా నవ్వేస్తూ.

అతడు మనుషుల్లో పడడం చూసి మౌక్తిక రిలీఫ్ గా ఫీలౌతూ “సారీ శంకర్‌రావ్... నేను నిన్ను ఇబ్బంది పెట్టాను'' అంది మౌక్తిక కాస్త గిల్టీనెస్ ని స్వరంలో మిళితంచేసి.

“మొత్తానికి మౌక్తికగారు... మన ఈ ట్రిప్ ని మరచిపోలేని విధంగా చేశారు...ఇటీజె థ్రిల్లింగ్ ఎక్స్పీరియన్స్...'' మధుకిరణ్ బిగ్గరగా నవ్వాడు.

అతడంత పెద్దగా నవ్వడం మొదటిసారి చూస్తోంది మౌక్తిక. దోషిలాగా తల దించుకుంది.

“ఆపాటి థ్రిల్ లేకపోతే మనం ఈ పిక్నిక్ ని, ఈ రాజావారి దివాణాన్ని గుర్తుంచుకుంటామా చెప్పండి! ఈ ఊరు పేరు చెప్పగానే జరిగిన హంగామా అంతా గుర్తురావాలి మనకు. ఇదొక వండర్ ఫుల్ మెమరీ...'' రమ్య అంది మధుకిరణ్ ని బలపరుస్తూ.

మొహమాటంగా నవ్వేసింది మౌక్తిక.

"రియల్లీ అయాం వెరీ సారీ శంకర్‌రావ్..." మరోసారి క్షమాపణలు చెప్పింది.

"భలేవారే మాడమ్...మీరు నాకు సారీ చెప్పడం దేనికి? మీరేమీ కావాలని చేయలేదు కదా! నేనే అనవసరంగా భయపడి అల్లరి చేశాను." అమె పట్ల గౌరవం ఉట్టిపడింది శంకర్‌రావు స్వరంలో.

"అయినా అమ్మాయ్...కొత్తచోటు... పైగా అర్ధరాత్‌రి... అందునా ఆడపిల్లవి. ధైర్యంగా డాబాపైన తిరగడానికి నీకు భయమేయలేదూ! పెద్దముండావాడిని. నామాటవిని ఇంకెప్పుడూ ఇలాంటి సాహసాలు చేయకు..." మందలించారు శమంతకం గారు.

ఆమందలింపులో నిండిన ఆప్యాయత, విజ్ఞత,పెద్దరికం, అన్నీ కలిసి తనకు జాగ్రత్తలు చెబుతున్నట్లుగా అనిపించింది మౌక్తికకు.

"అలాగేనండీ" అంది నమ్రతగా.

"అయినా బావగారూ...మా ఊళ్ళో అలాంటి భయాలేమీ ఉండవు... ఏ దెయ్యాలు, దేవతలు మీద వాలకుండా మా కోదండరాముడే కాపాడుతాడు..." ఎనలేని భక్తిప్రపత్తులు ఉట్టిపడుతూండగా అన్నారు సంగమేశ్వర రావుగారు.

"పదండి...పదండి...ఇప్పటికే బారెడు పొద్దెక్కింది. ముందు గుడికెళ్ళి రాముడి దర్శనం చేసుకుని, తరువాత బ్‌రేక్ ఫాస్ట్ చేసి దివాణం చూడడానికి వెళ్దాం..." అందరినీ అదిలించారు శమంతకంగారు.

---------------------------- -------------------- ------- --------------------

అపరిమితమైన కళలను వెదజల్లుతూ, అత్యంత శోభాయమానంగా, కళ్ళు చెదిరేలా ఉంది గుడిలోని కోదండరాముడి విగ్రహం. అందరినీ చల్లగా చూడమని ఆ రాముడిని మనసారా వేడుకున్నారందరూ.

తిరిగి ఇంటికొచ్చి, వేడి-వేడి కట్టుపొంగలి, మసాలావడలు, కొబ్బరి చట్నీ, అల్లప్పచ్చడి కాంబినేషన్ తో లాగించి, దివాణం చూడడానికని బయలుదేరారు. శమంతంకం గారు చెప్పినట్లు నిజంగానే దివాణం చాలాపెద్దది. చుట్టూ ప్రహారీగోడతో దుర్భేధ్యంగా ఉంది.

ఎంట్రన్స్ లో ఉన్న పెద్ద ఇనుపగేట్లను తీసుకుని దివాణంలోకి ప్రవేశించారందరూ. గేటుదగ్గరనుండి లోపలున్న భవనం వరకు సుమారు ఓ పావుకిలోమీటర్ దూరం ఉంటుంది.

దివాణం ఆవరణలో అనేక రకాల పూలమొక్కలు, ఫలవృక్షాలు ఉన్నాయి. తోటలో అక్కడక్కడా వాటర్ ఫౌంటెన్స్, విశ్‌రాంతిగా కూర్చునేందుకు సిమ్మెంట్ బెంచీలు ఉన్నాయి. తోట మధ్యలో అనేకభంగిమలలో అందంగా మలచిన పాలరాతి శిల్పాలు కొలువై ఉన్నాయి.

దివాణంలోకి అడుగు పెడుతూంటే ఏదో ఒకానొక వింత అనుభూతితో ఒళ్ళు జలదరించింది. విశాలమైన పెద్దపెద్ద వసారాలు,, చిన్నపాటి ఇళ్ళు కట్టుకునేంత జాగాలలో నిర్మించిన అతిపెద్ద గదులు, ఆర్చిల్లాంటి గుమ్మాలు, అద్భుతమైన పనితనంతో మెరుస్తూ ఉన్న టేకుదర్వాజాలు... దివాణం వైభవం చూడడానికి రెండుకళ్ళూ చాలడంలేదు.

గదులలో రాజవంశపు పెద్దలు సేకరించిన అనేకానేక పురాతన కళాఖండాలు , వంశపారపర్యంగా వస్తున్న పొడవాటి కత్తులు, వేటకెళ్లి తెచ్చిన పులిచర్మాలు, పులిగోళ్ళు, ఎన్నో ఏనుగుదంతాలు ఇవన్నీ ఉన్నాయి.

ఆ ఏనుగుదంతాలను చూసి " ఆరోజుల్లోనూ వీరప్పన్ లాంటివాళ్ళు ఉన్నారన్నమాట!'' గుసగుసలాడింది రమ్య మౌక్తిక చెవిలో.

మరొక గదిలో రాజవంశపు పుట్టు పూర్వోత్తరాలు తెలియజేసే వంశవృక్షం గోడకి తగిలించబడి ఉంది. ఆనాటి రాజుల చిత్రపటాలన్నీ గోడలమీద అలంకరించబడి ఉన్నాయి.


ఠీవిగా, దర్జాగా, అధికార దర్పాన్ని ఒలకపోస్తూ... ఒంపులు తిరిగిన కోరమీసాలతో ఉన్నారు వారందరూ.

చివరగా...చిన్న రాజావారైన కుమారవర్మ తైలవర్ణ చిత్రం అమర్చబడి ఉంది.

"వావ్... ఎంత హ్యాండ్ సమ్ గా ఉన్నాడో! ఈయనకి పెళ్ళి మీద విముఖతేమిటో పాపం!'' అంది రమ్య చిన్నగా అరుస్తూ.

అందరూ ఆమెకేసి చూశారొక్కసారిగా.

"ష్... నెమ్మది. అందరూ వింతగా మనల్నే చూస్తున్నారు'' వారించింది మౌక్తిక.




" తో క్యా? చూస్తే చూడనీ. ఉన్నమాటే కదా... అన్నదీ... నిజం చెప్పు...చాలా బాగున్నాడు కదూ!'' అంది రమ్య తమాషాగా కళ్ళు చికిలిస్తూ.

"అబ్బ! ఏమిటి రమ్యా...పసిపిల్లలా'' ఆపినా ఆగదని తెలిసినా ఆమె అల్లరిని ఆపాలని చూసింది మౌక్తిక.

దివాణంలోని ప్రతి అంగుళం పట్టిపట్టి చూసేసరికి దాదాపు ఒంటిగంటైంది. ఎవరికీ కూడా బోర్ కొట్టకుండా తన వ్యాఖ్యానంతో అలరించారు శమంతకం గారు. ఒక సుందరమైన ప్రదేశాన్ని సందర్శించిన అనుభూతి ఒక తీపిగుర్తుగా మిగిలిపోయింది అందరి హృదయాలలోనూ.

దివాణం వెనకవైపునున్న మామిడితోటలోకి మధ్యాహ్నభోజనాలు తీసుకొచ్చారు సుమతి తాలూకు మనుషులు. ఉసిరిచెట్టుకింద కారీకదీపం వెలిగించి, అందరూ రుచికరమైన భోజనాన్ని తిన్నారు. అక్కడే కాస్సేపు కార్డ్స్ ఆడారు.

తరువాత తోటంతా విహరించారు. తోటంతా అనేకరకాల ఫల, పుష్పవృక్షాలతో కళకళలాడిపోతోంది. వసంతకాలంలో వన విహారం చేయడానికి అనువుగా తోటమధ్యలో నిర్మించిన

మంటపం ఆకర్షణీయమైన శిల్పాలతో తీర్చిదిద్దబడి చూపరులని ఆకట్టుకుంటోంది. అక్కడ ఓ పక్కనే ఉన్న చిన్న నీటికొలను, నిండా తామరపూలతో రమణీయంగా ఉంది.

సుందర నందనోద్యానంలా ఉన్న ఆతోట అందాలకి పరవశించిపోయారందరూ. ఆడవాళ్లందరూ మాలినడిగి తలా కాసిని పూలు కోసుకున్నారు. మగాళ్లందరూ ఇళ్లదగ్గర ఉన్న భార్యలకోసమని కొన్ని పూలను ప్యాక్ చేసుకున్నారు.

తోట చూడడం పూర్తయ్యాక, ఊరికి ఉత్తరాన ఉన్న ఉన్న బోడికొండను అధిరోహించారు. ఆ కొండమీద కూడా కిందన ఉన్నట్లే సీతారాముల గుడి ఉంది.కాకపోతే కాస్త శిధిలావస్థలో ఉంది. లోతెంతుంటుందో తెలియని రామగుండం, బౌద్ధుల కాలంనాటి కొన్ని చారిత్రిక అవశేషాలు, వనవాససమయంలో సీతారాములు ఆప్రదేశంలో సంచరించినట్లుగా తెలియజేస్తున్న కొన్ని గుర్తులు, ఇవన్నీ చూసి కొండదిగేసరికి సాయంత్రం ఐదయ్యింది.

మెట్లసౌకర్యం లేని బోడికొండ ఎక్కి దిగేసరికి కాళ్ళు పట్లుపట్టేసి సలుపులు ప్రారంభమైనాయి. అందరూ సుమతి ఇంటికి చేరుకుని సామాన్లు సర్దుకుని తిరుగుప్రయాణానికి సంసిధ్ధులైనారు.

"చాలా థాంక్సండీ...పరాయివారు, పరిచయం లేనివారు అని కూడా చూడకుండా చక్కగా ఆతిధ్యం ఇచ్చారు.'' అంతసేపూ ఏమూలనున్నారో కూడా తెలియకుండా నోరుమూసుకుని ఉన్న కాలేజీ ప్రిన్సిపాల్ అహోబిలం గారు తన ఉనికిని చాటుకుంటూ వందన సమర్పణ గావించారు.

పేరుకి ఆయన ప్రిన్సిపాల్ అయినా, పెత్తనమంతా శమంతకం గారిదే అనుకుంటారు అందరూ. అనుకోవడం కాదు... అది వాస్తవం కూడానూ.

"అయ్యో! అలా అనుకోకండి. ' అతిథి దేవోభవ' అని పెద్దలేనాడో చెప్పారు.'' సుమతి మామగారు మీసాలు దువ్వుకున్నారు.

కోడలిచేత ఆడవారికి పసుపుకుంకాలు- జాకెట్ బట్టలు ఇప్పించింది సరస్వతి.

పనివాళ్ళ సేవలకి సంతోషంగా డబ్బులిచ్చారు అందరూ. పొంగిపోతూ తీసుకున్నారు వాళ్లు.

మరొకసారి సుమతికి, శ్రీకాంత్ కి కృతజ్ఞతలు చెప్పి బస్ ఎక్కారు. అప్పుడప్పుడు విహారయాత్రల పేరుతో ఇలా ప్రకృతిని సందర్శిస్తే ప్రశాంతతతో పాటుగా, బుధ్ధి కూడా వికసిస్తుందనిపించింది అందరికీ.

ప్రతిఒక్కరూ అలసిపోయి ఉండడంతో... బస్ సాగిపోతున్నప్పుడు వీస్తున్న చల్లగాలికి కళ్ళుమూతలు పడ్డాయి వారి ప్రమేయం లేకుండా.

వచ్చేటప్పుడు ఉన్న ఉత్సాహం వెళ్ళేటప్పుడు లోపించినా మనసు మాత్రం మధురానుభూతులతో నిండి ఉంది.

వాళ్ళు ఊళ్ళోకి ప్రవేశించేసరికి దగ్గరదగ్గర పదకొండైంది. నిద్రకి జోగుతూన్న అందరినీ అలర్ట్ చేశారు శమంతకం గారు. తమ వీధి చివరన బస్ ఆపించుకుని దిగేశారు మౌక్తిక, రమ్యలు.

దుమ్మురేపుకుంటూ ముందుకు సాగిపోయింది బస్. ఇద్దరూ ఒకే ఇంట్లో పక్కపక్క వాటాల్లో ఉంటున్నారు. రెండువాటాలకీ మధ్యన తలుపే అడ్డు. నిద్రలో తూలుకుంటూనే ఇల్లు చేరారు ఇద్దరూ. కాలింగ్ బెల్  మోగిన మూడు నిముషాలకి తలుపు తీశాడు రమ్యభర్త శరత్.

అతడు ఒక చిన్న ప్రైవేట్ కంపెనీలో మానేజర్ గా పనిచేస్తున్నాడు. చెప్పుకోదగిన జీతగాడు కాదు. వేణ్ణీళ్ళకి చన్నీళ్ళలా ఉంటుందని తానూ ఉద్యోగం చేస్తోంది రమ్య. రెప్పొద్దున్న పిల్లలు పుడితే ఎటూ వీలవదని ఆమెకి తెలుసు. అందుకే ఈలోపే కాస్త వెనకేసుకుందామని వాళ్ళ ఉద్దేశ్యం.

మౌక్తిక తన ఇంటి తాళం తీస్తూండగా "గుడ్ నైట్ ముక్తా... సీ యూ టుమారో మార్నింగ్." అని చెప్పేసి లోపకి మాయమైపోయింది ఏదో మంత్రం వేసినట్లుగా.

తనూ ఆమెకు 'గుడ్ నైట్' చెప్పేసి లోపలికి వెళ్ళి బ్యాగ్ కుర్చీలో విసిరేసి, స్నానం చేసొచ్చింది మౌక్తిక. ఫ్రిజ్ లోనుంచి యాపిల్స్ తీసుకుని, మొండిబారిన చాకుతోటి అతికష్టం మీద తెగాయి యాపిల్స్.

ఆ చాకుతో ' మొండివాడి ముక్కు కూడా తెగదు' అంటుంది రమ్య.

యాపిల్ ముక్కలు తినేసి, పెద్ద గ్లాసుడు మజ్జిగ తాగేసి మంచంమీద చేరింది మౌక్తిక. బస్ లో హాయిగా కునుకు తీయడం నుంచి మరి నిద్ర రావడంలేదు.

పక్కవాటాలోనుంచి రమ్య, శరత్ ల గుసగుసలు, కిలకిలలు మంద్రస్థాయిలో వినబడుతున్నాయి.

ఆసవ్వడులకి మౌక్తిక మనసంతా అదోలా అయిపోయింది. ఏదో వేదన మనసుని మెలితిప్పింది.

'అదృష్టవంతులు' సంసారజీవితంలోని మాధుర్యాన్ని మనసారా ఆస్వాదిస్తున్న ప్రణయజీవులు. అటువంటి భాగ్యవంతులు ఈలోకంలో ఏకొద్దిమందో ఉంటారు.

పెళ్ళై రెండేళ్ళు దాటినా ఇంకా నిన్నగాక మొన్న పెళ్ళైన కొత్తజంటలా ఎంతో అన్యోన్యంగా అతుక్కుని ఉంటారు.

నిశ్శబ్దమైన ఆ వాతావరణంలో వాళ్ల  ఉచ్ఛ్వాస నిశ్వాసాలు పాముబుసల్లా వినిపిస్తున్నాయి. మౌక్తిక మది బరువుగా మారింది. మనసు ఏదో ఆవేదనతో విలవిలలాడింది. అంతసేపూ లేని ఒంటరితనం ఒక్కసారిగా తన కబంధ హస్తాలు చాచి ఆమెను ఆలింగనం చేసుకుంది.

దాన్ని తరిమికొట్టడానికి టి.వి. ఆన్ చేసింది అందులోనూ అంతే ఏదో శృంగారభరిత చిత్రం వస్తోంది. సంసారంలోని సరాగాలన్నీ ప్రోదిచేసి, దానికి సరసాన్ని మిక్స్ చేసి, చిరుచిరు ప్రణయ కలహాలను అద్ది, అన్ని మసాలాలను సమపాళ్లలో రంగరించి ప్రేక్షకుల మీదకు ఎక్కుపెట్టి వదిలిన సకుటుంబ కథాచిత్రం అది.

తాను దేనిని అవాయిడ్ చేయడానికి టివి పెట్టిందో...అక్కడా అదే కనబడుతూ ఉండడంతో ఒకింత అసహనానికి గురైంది మౌక్తిక. ఏఛానల్ మార్చినా అదే పరిస్థితి. లేట్ నైట్ కావడం మూలాన అన్ని ఛానల్స్ లోనూ మిడ్ నైట్ మసాలా వస్తోంది.

పక్కవాటా లోనుంచి వినబడుతున్న లైవ్ కంటే ఈ సినిమానే మేలు అనుకుని ఇందాకటి సినిమానే చూడడం కంటిన్యూ చేసింది మౌక్తిక.

అపార్థాలు- అలకలు, విరహాలు- వేడికోళ్లు, హీరో హీరోయిన్స్ మధ్యన చోటు చేసుకుంటూ, మాంచి రసవత్తరంగా సాగుతూ ఏకబిగిన  కన్నార్పకుండా చూసేటట్లు చేసింది ఆ సినిమా.

అప్పుడప్పుడు పంటికింద రాళ్లలా వ్యాపార ప్రకటనలొకటి! సినిమా పూర్తయ్యేసరికి ఒంటిగంట దాటింది. టివి ఆఫ్ చేసింది మౌక్తిక.

రమ్య వాళ్ళింట్లో ఏ అలకిడీ లేకుండా ప్రశాంతంగా ఉంది. అప్పుడు వచ్చింది మౌక్తిక కంటిమీదకు నిద్రాదేవత. వెంటనే సర్వం మరచి నిద్రలోకి జారుకుంది మౌక్తిక.

-------------------    -------------------    -----------------

తలుపు బద్దలయ్యేంతగా దబదబ బాదుతున్న శబ్దం వినిపిస్తూ ఉంటే కళ్ళు తెరిచి అయోమయంగా దిక్కులుచూసింది మౌక్తిక. ఒక్క క్షణంసేపు తానెక్కడుందో అర్ధంకాలేదు.

నిద్రమత్తులో కూరుకుపోయి స్తబ్దుగా మారిన మెదడుకి పదునుపెట్టి చుట్టూ పరికించి చూసింది. మొద్దుబారిపోయిన మెదడుకి కాస్త చైతన్యం కలిగింది.

‘ హమ్మయ్య! తానున్నది తనగదిలోనే’ ముందురోజు కాలేజ్ స్టాఫందరూ కలిసి పికినిక్ కి వెళ్లడం, అర్ధరాత్రప్పుడు ఇంటికి తిరిగిరావడం అన్నీ వరసగా జ్ఞాపకం వచ్చాయి.

బద్ధకంగా ఒళ్ళు విరుచుకుంది మౌక్తిక.

ఇంతలో మరోసారి దబదబ...

తప్పనిసరై లేచివెళ్ళి తలుపుతీసింది. ఎదురుగా రమ్య. చేతిలో పాలగిన్నెతో నిలబడి ఉంది. తలారా స్నానంచేసి, పూజాదికాలు ముగించుకుని, నుదుట అగ్నిశిఖలా వెలుగుతున్న ఎర్రని కుంకుమతో, నిండైన నవ్వు ముఖంతో...సాక్షాత్తు లక్ష్మీదేవిలా వెలిగిపోతోంది.

“ఏమిటి తల్లీ ... అంత మొద్దునిద్ర! ఇప్పటికి నాలుగుసార్లు తలుపు కొట్టాను. పాలబ్బాయి కూడా యధాశక్తి బాదేసి, చివరకు మాఇంట్లో పాలుపోసేసి పోయాడు.’’ అంది రమ్య చొరవగా లోపలికి వస్తూ.

“సారీ రమ్యా... తెలివిరాలేదు.’’ పక్కకు జరిగి ఆమెకు దారిచ్చింది మౌక్తిక.

తన చేతిలోని పాలగిన్నెను టేబుల్ మీద ఉంచుతూ “సర్సరే...నువ్వు స్నానం చేసి తయారవు... నేను టిఫిన్ తెస్తాను.’’ చెప్పింది రమ్య.

మౌక్తికకి ఎందుకో మొహమాటంగా అనిపించింది. ఎప్పుడూ రమ్యే ఏదో ఒకటి చేసి తినడానికి ఇస్తుంది. తను ఒక్కతే కాబట్టి ఏ ‘రెడీ టు కుక్’ ప్యాకింగ్ లో, ఫ్రోజెన్ చపాతీలో తెచ్చి ఉడకేసుకు తింటుంది. కాని రమ్య అలాకాదు. అన్ని రకాలూ ఇంట్లోనే తయారుచేస్తుంది.

తనకి రాని వంటలులేవు. శరత్ భోజనప్రియుడు. ఇంట్లో చేసిన వంటకాలంటేనే ఇష్టం.

ఆఖరుకి సాంబారుపొడి కూడా బయటకొన్నది నచ్చదు అతడికి.

చక్కగా ఇంట్లో దంచిన సాంబారుపొడైతేనే మిరియాలఘాటుతో, ఘుమఘుమలాడుతూ ఉంటుందని అతడి ఉద్దేశ్యం. అది కూడా నిలవుండకూడదు. అప్పటికప్పుడు తాజాగా దంచాల్సిందే.

"అటు ఉద్యోగం చేస్తూ, ఇటు ఇంట్లో ఇలా కష్టపడడానికి నీకు ఇబ్బందిగా లేదూ! నువ్వు కూడా తనతో సమానంగా ఉద్యోగం చేస్తూ, శ్రమపడుతున్నప్పుడు కొంచెం సర్దుకుపోతే తప్పేముంది!'' రమ్యతో చనువు ముదిరాక ఓసారి ప్రశ్నించింది మౌక్తిక.

రమ్య చిరునవ్వు నవ్వింది.

"శరత్ ని నువ్వు తప్పుగా అర్ధం చేసుకున్నావు ముక్తా...అతడు అందరిలాంటి మగవాడూ కాదు. నాకు అన్ని పనుల్లో సాయం చేస్తాడు. అది లంగానా, లుంగీనా అని చూడకుండా ఉతికి ఆరేస్తాడు. మగాడు చీపురు పట్టుకోకూడదు అన్న నిబంధనలేమీ లేకుండా ఇల్లు తుడిచేస్తాడు. నేను వంట చేస్తూంటే కూరగాయలు కోసిస్తాడు. ఇలా... ఇన్ని పనుల్లో అతడు నాకు సహకరిస్తున్నప్పుడు, ఆఫ్ట్రాల్...అతడికి నచ్చిన రీతిలో వండిపెట్టడానికి నాకేం ఇబ్బంది చెప్పు!

అతడు భోజనప్రియుడు. అన్ని రుచులూ కావాలి. అమ్మ తరువాత భార్యగా నేనతడి కడుపు నింపితేనే కదా...నా ఈ 'భార్య' స్థానానికి అర్ధం.'' రమ్య మాటలలో శరత్ పట్ల ప్రేమ గంగలా ఉప్పొంగిపోతూ కనిపించింది.

'తల్లి కడుపు చూస్తుంది...పెళ్లాం జేబు చూస్తుంది' అని ఎవరన్నారో గాని, ఆ అభిప్రాయం మార్చుకోవలసిందే రమ్యను చూశాక.

"అబ్బ! మళ్ళీ ఆలోచనలా? ఎదురుగా ఇంత మనిషిని... నీ ప్రియసఖిని నేనుండగా నీలోకంలోకి వెళ్ళిపోతే ఎలా!?'' సుతారంగా మౌక్తిక నెత్తిన మొట్టింది రమ్య.

"సారీ రమ్యా" అంది మౌక్తిక నొచ్చుకుంటూ.

"త్వరగా స్నానంచేసి రా...ఇప్పటికే బారెడు పొద్దెక్కింది. టిఫిన్ చల్లారిపోతుంది'' చనువుగా ఆమెను బాత్ రూమ్ లోకి నెట్టింది రమ్య.

"ఇప్పుడు టిఫినెందుకులే రమ్యా... స్నానం చేసొచ్చి కుక్కర్ పెట్టేసుకుంటాగా!'' అంది మౌక్తిక.

రమ్య ఆమెకేసి సూటిగా చూసింది. అదోలా చూసింది. ' ఇన్నేళ్ల మన స్నేహబంధంలో మన నడుమ ఇంతటి ఎడం ఇంకా మిగిలుందా!' అని నిలదీస్తున్నాయామె చూపులు.

మౌక్తిక చేతిలో తన చేతిని వేసి బిగిస్తూ ' ముక్తా...నువ్వంటే నాకిష్టం...మాటల్లో చెప్పలేనంత ఇష్టం. అది ఎందుకో చెప్పలేను. తోబుట్టువులు లేకుండా ఒంటరిగా పెరిగాను. అందుకే... నీతో స్నేహం నాకెంతో అపురూపం. నువ్వు –నేను వేరువేరు అన్న భావన నాకెప్పుడూ కలగలేదు.''

అంది రమ్య ఆప్యాయంగా.

మౌక్తిక కళ్లలో నీళ్లు సుళ్ళు తిరిగాయి. తన జీవితంలో తననింత ప్రీతిపాత్రంగా భావించే అతికొద్ది మంది ఆత్మీయులలో రమ్య ఒకతె. తన తోడబుట్టిన అక్కచెల్లెళ్ళైనా రమ్యంతగా ప్రేమించరేమో!

"సారీ రమ్యా..." కళ్ళనీళ్ళు తుడుచుకుంది మౌక్తిక.

"అప్పుడే ఇది రెండోసారి... నువ్వు నాకు సారీ చెప్పడం." నవ్వింది రమ్య.

ఆ నవ్వు పున్నమివెన్నెల కురిసినంత ఆహ్లాదంగా ఉంది. చల్లని పిల్లతెమ్మెర వీచినంత హాయిగా ఉంది.

"ఆ(...నువ్వు వంట ప్రయత్నాలేమీ తలపెట్టకు...అన్నీ మాఇంట్లోనే." చెప్పేసి వెళ్లింది రమ్య.

తలారాస్నానం చేసి తయారయింది మౌక్తిక. రమ్య తెచ్చిన హాట్ ప్యాక్ ముందుంచుకుని టిఫిన్ లాగించేసింది. దూదుల్లా...మెత్తగా ఉన్న మల్లెపూవుల్లాంటి ఇడ్లీలని... కారప్పొడి, కొబ్బరిచట్నీలతో నంచుకుని తింటూంటే చచ్చి స్వర్గాన ఉన్న బామ్మ జ్ఞాపకం వచ్చింది మౌక్తికకు.

"ఒసేయ్ శకుంతలా...కాస్త పప్పు నానేసి నాలుగు గారెముక్కలు చేసి పెట్టకూడదూ...ముక్తమ్మకి ఇష్టం." అంటూ తల్లికి పురమాయించేది.

ఆవిడేమో 'ఆపాటి ప్రేమ నాకు లేదా!' అన్నట్లుగా కొరకొర చూసేది.

తల్లి ఉత్తరధృవమైతే బామ్మది దక్షిణ ధృవం. ఏ విషయంలోనూ పొసగేది కాదు. తల్లివి కొంచెం పురాతన భావాలు. బామ్మ మాత్రం సినిమాల్లో బామ్మలా ఎంతో మాడ్రన్. ఇద్దరూ ప్రతి విషయంలోనూ రగడ పడేవారు. ఆవిడ 'యతి' అంటే ఈవిడ 'ప్రతి' అనేది.

అనుక్షణం పోట్లాడుకునే వాళ్ళమధ్యన బద్ధవైరం ఉంటుందని ఎవరైనా భావిస్తే అది పొరబాటే. ఒకరంటే ఒకరికి ప్రాణం.

తల్లి ఎటన్నా వెళ్ళి ఒక అరగంట సేపు కనబడకపోతే చాలు "శకుంతలా...శకుంతలా..." అంటూ వెతికేసుకునేది బామ్మ.

ఏరోజైనా బామ్మకి కాస్త ఒళ్ళు వెచ్చచేసి ఏజ్వరమో తగిలిందంటే తల్లి తెగ హడావుడి పడిపోయి, జావలు కాచిచ్చి, పథ్యాలు చేసిపెట్టి అవిడకి తగ్గేవరకు కంటికి రెప్పలా కాపాడుతూ నానా హైరానా పడేది.

"మొన్న ఆవ పెట్టిన పనసపొట్టు కూర తినద్దంటే మొండితనంగా తిన్నారు. పైత్యం చేసినట్లుంది" అనేది తల్లి బామ్మని మందలిస్తూ.

"నీది మరీ చోద్యమే శకుంతలా...నేనెంత కూర తిన్నాననీ...ఏదో జిహ్వాచాపల్యంకొద్దీ ఓ చెంచెడు కూర వేసుకున్నానంతేగా! అయినా నీకళ్ళు పడిన తరువాత నాకెలా అరుగుతుందీ!" దీర్ఘాలు తీసేది బామ్మ.

అంతే! మళ్ళీ అకారణరణం మొదలు. దానికి అంతం ఎప్పుడో...ఎక్కడో... తమకెవరికీ అంతు చిక్కేది కాదు. ఇంతగా వాదులాడుకునే వాళ్ళ మధ్య అంతులేని అనురాగం ఎలా వెల్లివిరుస్తుందో తమకెవరికీ అర్ధం అయ్యేదికాదు.

'ఆపోజిట్ పోల్స్ అట్‌రాక్ట్స్ ఈచ్ అదర్' అన్న సూత్రం తలపుల్లో మెదులుతుంది అప్రయత్నంగా.

భిన్న మనస్త్వత్వాలు కలిగిన వాళ్లిద్దరూ ఈ సూత్రం ప్రకారమే ఒకరినొకరు అభిమానించుకునే వారేమో!

తల్లి, నాయనమ్మ జ్ఞప్తికి రాగానే మౌక్తిక మనసు బరువెక్కింది. కళ్లు చెమర్చాయి.

' ఈ మమతానుబంధాలు విచిత్రమైనవి. ఎప్పుడెవరిని కలిపి ముడేస్తాయో!' అనుకుంది భారంగా.

"ముక్తా...ఎంతసేపింకా? జలకాలాటలు పూర్తవలేదా!'' కేక పెట్టింది రమ్య తనవాటాలోనుంచే.

ఎప్పుడైనా శరత్ ఇంట్లో లేకపోతే మధ్య తలుపు తెరిచేసి పెట్టుకుని ఇష్టారాజ్యంగా గడిపేస్తారు. ఆదివారం కావడం మూలాన అతడు ఇంట్లోనే ఉన్నట్లున్నాడు. తనవాటాకి తాళంపెట్టి చుట్టుతిరిగి రమ్య ఇంటికి వెళ్లింది మౌక్తిక.

అప్పటికే తయారైన శరత్ హాల్లో సోఫాలో కూర్చుని షూలేసులు ముడేసుకుంటున్నాడు. అతడి తల్లిదండ్రులు పక్కనే ఉన్న పల్లెలో ఉన్న పెద్దకొడుకు దగ్గరుంటున్నారు. అప్పుడప్పుడు శరత్ వెళ్ళి చూసొస్తూ ఉంటాడు. వరస రెండుమూడు రోజులు సెలవొచ్చినప్పుడు రమ్య కూడా వెళ్తుంది. అత్తమామలు కూడా ఆమెని ఎంతో ప్రేమగా చూస్తారు.

"గుడ్ మార్నింగ్ శరత్.'' విష్ చేసింది మౌక్తిక.

తలెత్తి చూసిన శరత్ పలకరింపుగా నవ్వి" వెరీ గుడ్ మార్నింగ్ ముక్తా... ఎలా జరిగింది మీ పికినిక్ ప్రోగ్రాం...'' అడిగాడు షూ వేసుకోవడం పూర్తిచేసి లేచినిలబడుతూ.

" వెరీనైస్ ...చాలా బాగా జరిగింది'' చెప్పింది మౌక్తిక.

"గుడ్...నేను ఊరెళ్ళి మా అమ్మనాన్నలని చూసొస్తాను. నీకు, మీ ఫ్రెండ్ కి ఈ రోజంతా పండగే హ్యాపీగా ఎంజాయ్ చేయండి.'' అల్లరిగా నవ్వుతూ బెడ్ రూమ్ లోకి నడిచాడు.

శరత్ చాలా సరదా మనిషి. ఎప్పుడూ సంతోషంగా అందరినీ నవ్విస్తూ... జాలీగా ఉంటాడు. రమ్యా అంతే... భార్యాభర్తలిద్దరి స్వభావాలూ ఒకేలా ఉండడం అరుదైన సంగతి అనిపిస్తుంది.

"సాయంత్రానికి వచ్చేస్తారా?'' రమ్య అడుగుతోంది సన్నగా.

"విత్ ప్లై... రెక్కలు కట్టుకు వాలనూ! అసలే రెండురోజుల విరహం. ఈరోజు కూడానా! స్వీట్ రివెంజ్ తీర్చుకోకపోతే మన వయసూరుకుంటుందా!'' ఎంత చిన్నగా అంటున్నా మోహావేశపు తమకం నిండిన శరత్ స్వరం మౌక్తిక చెవిన పడనే పడింది.


ఏదో... తెలియని అసౌకర్యం తనని చుట్టుముట్టగా అసహనంగా కదిలింది మౌక్తిక.

కాసేపటికి తరువాత బయటకి వచ్చాడు శర్త్. అతడి వెనుకే రమ్య. ఆమె ముఖం కందిపోయి ఉంది. మౌక్తిక ముఖంలోకి చూడలేనట్లుగా సిగ్గుతో తలదించుకుంది.

“బై రమ్యా... బై ముక్తా...'' ఇద్దరికీ వీడ్కోలు పలికి వెళ్లాడు శరత్.

అతడు వెళ్లాక స్నేహితురాళ్ళిద్దరూ వంటగదిలోకి నడిచారు.

నేలమీద బాసింపట్టు వేసుకుని కూర్చుని “వాట్ నెక్స్ట్? వంటలో ఏదన్నా సాయం చేయాలా నీకూ'' అడిగింది మౌక్తిక.




“ఏముందీ...ఏమైనా స్పెషల్ గా చేసుకుని మింగేసి, హాయిగా ఏ సినిమాకో చెక్కేయడమే...'' రమ్య అంది ఫ్రిజ్ లోనుంచి కూరగాయలు తీస్తూ.

'మెనూ ఏమిటి?' కాసేపు తర్జనభర్జన అనంతరం వెజిటబుల్ బిర్యానీ, బంగాళదుంపల క్ర్మా, పెరుగుపచ్చడి, క్యారెట్ హల్వా చేసుకుందామన్న నిర్ణయానికొచ్చారు.

రమ్య బియ్యం కడిగ్తే మౌక్తిక మసాలా నూరింది. ఆమె కూరగాయలు కోస్తే ఈమె హల్వాచేసింది. వంటగదిలో ఒగంటసేపు కుస్తీలు పట్టి వాళ్ళు కోరుకున్న వంటకాలు సిద్ధం చేసుకున్నారు.

"అన్నట్లు ముక్తా... నీకిష్టమైన మూవీ మన లక్ష్మీ థియేటర్ లో ఆడుతోంది." చెప్పింది రమ్య సడెన్ గా.

"నాకిష్టమైన మూవీనా" ఆశ్చర్యంగా అడిగింది మౌక్తిక.

"అవునుతల్లీ...మాయాబజార్ ఎన్నిసార్లు చూసినా నీకు తనివి తీరదుగా! పైగా రంగులద్దుకుని సరికొత్తగా. కిందటిసారి రిలీజ్ అయినప్పుడు చూడడం కుదరలేదని గునిశావు కదా! " ఊరించింది రమ్య.

పరవశంతో మౌక్తిక ఒళ్ళు పులకరించింది. మాయాబజార్ సినిమాని చూడడంలో ఆమె ఇప్పటికి అర్ధ శతకం పూర్తిచేసి ఉంటుందేమో! టివిలో అప్పుడప్పుడు చూసింది కాక , ఇలా థియేటర్ లో ఓ ఇరవైసార్లైనా చూసి ఉంటుంది. ఇన్నిసార్లు టివిలో చూసిన మీదట మళ్ళీ థియేటర్ కి వెళ్ళడం ఎందుకని ఎవరైనా భావిస్తారేమో గాని, మౌక్తిక మాత్రం కాదు.

ఇరవై నిముషలకో బ్రేక్ చొప్పున ఆపేస్తూ, వందలాది వ్యాపారప్రకటనల మధ్యన ప్రసారమయ్యే అటువంటి అపురూప కళాఖండాన్ని చూడడం వలన  మధురానుభూతి కాదు కదా... కనీస ఆనందం కూడా మిగలదు.

వీరుండే ఇంటికి దగ్గరలోనే పాతకాలంనాటి ఒక సినిమాహాలుంది. ఆయజమాని పాపం కాస్త టేస్టున్నవాడే. తన కళాభిరుచిని చాటుకునేందుకు అప్పుడప్పుడు ఇలాంటి ' మాస్టర్ పీస్' లని తీసుకొచ్చి ఆడిస్తూ ఉంటాడు. మౌక్తికలాంటి 'కళాభిమానులు' ఆ చిత్రాలను చూసి తరిస్తూ ఉంటారు.

'మాయాబజార్' ని తలచుకుంటూ స్వాప్నిక జగత్తులో మౌక్తిక మునిగి ఉండగానే" హలో అమ్మాయి... అప్పుడే మాయాబజార్ లోకి ప్రవేశించావా?" అంది రమ్య ఆమె ముఖంముందు చేతులాడిస్తూ.

ఉలిక్కిపడి నవ్వేసింది మౌక్తిక.

"పదపద బిర్యానీ ఘుమఘుమలకి ఆత్మారాముడు ఆవురావురుమంటున్నాడు. త్వరగా లాగించేసి తయారవుదాం" మౌక్తికను తొందరచేసింది రమ్య.

కబుర్లు చెప్పుకుంటూ, పదార్థాలరుచిని ఆస్వాదిస్తూ తినేసి గబగబ ఇల్లు సర్దేసుకుని తయారైపోయారిద్దరూ.

లేత మబ్బురంగు చీరలో మౌక్తిక మేఘకన్యకలా మురిపిస్తూంటే, లెమన్ ఎల్లో కలర్ వర్క్ సారీలో పసుపుకొమ్మలా కనువిందు చేస్తోంది రమ్య.

"నీకీ కాటన్ చీరల పిచ్చేమిటి ముక్తా...బాబోయ్...వాటిని మెన్టెయిన్ చేయడానికెంత అవస్థ! ఆ ఉతకడాలు, గంజిపెట్టడాలు మనవల్లకాదు." పెదవి విరిచింది రమ్య మౌక్తిక కట్టుకున్నకాటన్

చీరను చూసి.

సమాధానంగా పెదవులు విడీవిడని నవ్వొకటి రువ్వింది మౌక్తిక. రమ్య టు వీలర్ మీద ఇద్దరూ థియేటర్ కి వెళ్లారు. థియేటర్ దగ్గర జనం పలచగా ఉన్నారు.

'వీళ్లందరూ కూడా తమలాగా కళాపిపాసులే అయ్యుంటారు...ప్రజలలో కళాభిరుచి పోలేదనడానికి ఇదే నిదర్శనం' అనుకుంది మౌక్తిక.

కార్నర్ సీట్లు చూసుకుని కూర్చున్నారిద్దరూ. ఏవో వ్యాపార ప్రకటనలు వస్తున్నాయి. మగవాళ్ళు వాడే పెర్ ఫ్యూమ్ తాలూకు యాడ్ వస్తోంది.

ఒక పురుషుడు వాడిన ఆపెర్ ఫ్యూమ్ కి ఆకర్షించబడిన అమ్మాయిలు గుంపులుగుంపులు గా వెళ్ళిపోతున్నారతడి వెంటబడి...ఆఖరుకి హాస్పిటల్లో నర్సుతో సహా.

ఎంత అవాస్తవికంగా...అసందర్భంగా ఉందీ! ఫలానా ఫెర్ ఫ్యూమ్ వాడితే అమ్మాయి ఆవాడినవాడి వెనక గంగవెర్రులెత్తి వెళ్లిపోతుందా! అంటే ఆమెకి ఆలోచనాశక్తి అంటూ ఉండదా! ఎంత అసహజత్వం! అంతా కాల్పనిక మాయాజాలం.

అంటే.. ఈ యాడ్ చూసి అబ్బాయిలంతా ఫ్లాట్ అయిపోయి ఆబ్రాండ్ కొనేస్తారనే కదూ...ఆ ఉత్పాదకుల ఆంతర్యం!

నిట్టూర్చింది మౌక్తిక. సినిమా మొదలౌతుందన్న దానికి సూచనగా హాల్లో పెద్దలైట్లన్నీ ఆపేసి డిమ్ లైట్స్ వేశారు. వీళ్లముందు వరసలో ఎవరో అమ్మాయి- అబ్బాయి కూర్చున్నారు.

' ఫరవాలేదే... ఇప్పటి యూత్ లో కూడా మంచి టేస్ట్ ఉంది' అనుకుంది మౌక్తిక అభినందన పూర్వకంగా.

సినిమా మొదలైంది. టైటిల్స్ కలర్ లో పడుతూ ఉంటే ఏదో తాదాత్మ్యంతో మౌక్తిక ఒళ్లు పులకరించింది.

"శ్రీకరులు దేవతలు శ్రీరస్తులనగా చిన్నారి శశిరేఖ వర్ధిల్లవమ్మా" అంటూ పాట మొదలైంది. చిన్నప్పటి శశిరేఖగా వేసినమ్మాయి హావభావాలు ఎంతో ముద్దుగా , అందంగా ఉన్నాయి.

'ఇప్పుడీ అమ్మాయికి ఏ డెబ్భై అయిదో, ఎనభైనో ఉండుంటాయి.' అనుకుంటూ సినిమాలో లీనమైన మౌక్తికను డిస్టబ్ చేశాయి ముందువరసలోనుంచి మంద్రస్థాయిలో వినిపిస్తున్న గుసగుసలు.

పరమ చిరాగ్గా అనిపించిందామెకి. పోచుకోలు కబుర్లాడుకునేందుకు ఈ థియేటర్లే దొరుకుతాయి కాబోలు వీళ్లకి! పాతసినిమా కాబట్టి హాలు ఖాళీగా ఉంటుంది కనుక ఇష్టానుసారం ప్రవర్తించవచ్చుననుకుంటారో ఏమో!

తమ ప్రవర్తన బట్టి పక్కసీట్ల వాళ్ళు అసౌకనికి గురవుతారని అస్సలాలోచించరు.

ఆజంట ఇంకొంచెం అడ్వాన్స్ అయిపోయినట్లున్నారు... ఒకటే ముద్దుల చప్పుడు. చాలా

ఇర్‌రిటేటింగ్ గా అనిపించింది.

'ఛ...ఛ..ఎంతో ఆశగా వస్తే మూడంతా ఆఫైంది. తొందరపడి వాళ్లని కళాభిమానులని తలచినందుకు ఎంతో పశ్చాత్తాపం చెందింది మౌక్తిక.

"పద వెళ్దాం" లేచి నిలబడింది విసుగ్గా ముఖం పెట్టి.

"ఏం" ఆశ్చర్యంగా అడిగింది రమ్య.

"ముందు చూడు... ఆసినిమాకన్నా మంచి పిక్చర్. ఇంగ్లీష్ సినిమాలోల్లా 'లిప్ టు లిప్ కిస్' లు.'' కసిగా అంది మౌక్తిక.

"ఆమె చేయి పట్టుకుని కూర్చోబెడుతూ" కూర్చో ముక్తా... పాత సినిమాలు ఆడే హాళ్లలో ఇలాంటివన్నీ మామూలే. మనం పట్టించుకోకూడదు. అయినా ఇప్పుడు ఇంగ్లీష్ సినిమాల్లో ఏం ఖర్మ... తెలుగు సినిమాల్లో కూడా ముద్దు సీన్లొచ్చేశాయి.'' మౌక్తిక మూడ్ మార్చే ప్రయత్నం చేసింది రమ్య.

ఎంతో ఉత్సాహంగా మంచి సినిమా చూద్దామని వస్తే, ఆదిలోనే రసభంగం జరిగింది. చిరాగ్గా నుదురు చిట్లించింది మౌక్తిక.

ముందు వాళ్ళు ఏమాత్రం నెమ్మదించలేదు. సరికదా మరింత విజృంభించారు. పక్కవాళ్ళకి తమవలన ఇబ్బంది కలుగుతుందని కూడా ఆలోచించకుండా రెచ్చిపోయి ప్రవర్తించసాగారు.

"ఇక నావల్ల కాదు" విసురుగా లేవబోయింది మౌక్తిక.

"చూడండి...మేము సినిమా చూడడానికి బోలేడంత డబ్బు పోసి టికెట్ కొనుక్కుని వచ్చాము. దయచేసి మీరు మమ్మల్ని థియేటర్ లో వేస్తున్న సినిమా మాత్రమే చూడనివ్వండి.'' ముందు వరసలో నుంచి వినబడిందో స్వరం. ఆస్వరం సుపరిచితమైనది గా అనిపించింది వీళ్లకి.

ఆజంట ముఖాలు నల్లగా మాడిపోవడం అంత చీకట్లోనూ స్పష్టంగా వినిపించింది. ఏమనుకున్నారో ఏమో ముఖాలు చాటు చేసుకుని ఇంకో చోటకి వెళ్ళిపోయారు. ఇంతా చేసి వాళ్ల వయసు పదిహేడు- పద్దెనిమిది కన్నా ఉండదు.ఆకుర్‌రాడికి మీసాలన్నా మొలవలేదు...ఆ అమ్మాయి ముఖంలో పసిదనమింకా పోలేదు. అప్పుడే ఎంత అడ్వాన్స్ అయిపోయారు వీళ్లు!

ఇదంతా ఏమిటి! దీన్నేనా యువత ప్రేమ అనుకుంటోంది! క్లాసులో పాఠాలెగ్గొట్టి, ఇలాంటి మారుమూల ప్రదేశాలెంచుకుని, చాటుమాటుగా తింగరి చేష్టలు చేయడమేనా ప్రేమంటే! బతుకుపట్ల అవగాహన లేకుండా చేసి, ఈప్రేమ అనే మత్తుమందుజల్లి యువతను తప్పుదోవ పట్టించేలా సినిమాలు తీస్తున్న దర్శక, నిర్మాతలను ఏమనాలి!

ఇటువంటి పసిప్రేమాయణాలు దేనికి నాంది! ప్రణయానికా! ప్రళయానికా!

అసలు ప్రేమకి సరైన నిర్వచనం ఏమిటి! కొందరి దృష్టిలో ప్రేమ కాలక్షేపం బఠాణీ అయితే...

మరికొందరి దృష్టిలో తాను ప్రేమించిన అమ్మాయి తనను కాదన్నదన్న ఉక్రోషంతో ఆమెమీద

యాసిడ్ పోసో...కత్తితో దాడి చేసి గాయపరచే ఉన్మాదం...

మౌక్తిక మనసు చేదుమాత్ర మింగినట్లుగా తయారైంది. తనను ఇబ్బందికరమైన ఈ పరిస్థితి నుంచి గట్టెక్కించిన ఆపుణ్యమూర్తి ఎవరా అని ఆత్రుతగా చూసింది మౌక్తిక. అతడు వాళ్లకి కాస్త దూరంగా ఉండడంచేత ఆమసక వెలుతురులో సరిగ్గా కనబడలేదు.

"ముక్తా...ప్లీజ్ రిలాక్స్. నువ్వు మరీ ఇంత ఎమోషనల్ అనుకోలేదు." మౌక్తిక చేతిలో చేయి చేయివేసి నిమిరింది రమ్య.

ఆత్మీయమైన ఆస్పర్శ మౌక్తిక మదిలో ఉద్భవించిన అశాంతిని పారద్రోలింది.

"చూడు చూడు...ఈ గొడవలో పడి నీకిష్టమైన సినిమానెంతగా మిస్ అయిపోతున్నావో! కమాన్ ఛీరప్..." మౌక్తిక దృష్టిని సినిమావైపు మళ్లించింది రమ్య.

సరిగా అప్పుడే ' నీవేనా నను పిలిచినది' అంటూ తెరపై ప్రత్యక్షమయ్యాడు అక్కినేని. అంత సేపూ తానునుభవించిన అలజడంతా మటుమాయమైనట్లుగా అనిపించింది మౌక్తికకు. కొత్త సొబగులద్దుకున్న అలనాటి అపురూప చిత్రరాజం ఎప్పటిలాగే ఆమెకు అవ్యక్తానుభూతిని కలుగజేస్తోంది.

ఇంటర్ వెల్ ఇచ్చారు. హాల్లో లైట్లన్నీ వెలిగాయి. సీట్లో చిన్నగా సర్దుకుంటూ యాధాలాపంగా ముందువరసకేసి చూస్తున్న మౌక్తికకు, తమవైపే చూస్తున్న మధుకిరణ్ కనబడ్డాడు.ఉలిక్కిపడింది మౌక్తిక.

అంటే...అంటే... ఇందాకా ఆకుర్రజంటను మందలించింది ఇతడేనా!

ఎందుకో నెర్వస్ గా అనిపించింది ఆమెకి.

"ఏయ్ ముక్తా... మన మధుకిరణ్ కూడా వచ్చారు చూశావా!" అప్పుడే అతడిని గమనించిన రమ్య అంది హుషారుగా.

"ఈ హాలు మన ఒక్కరికే స్వంతం కాదుకదా!" ముక్కసరిగా అంది మౌక్తిక.

ఆమె వైపు విచిత్రంగా చూసింది రమ్య. అతడిని పలకరించాలని ఆమె అనుకునేంతలో అతడే లేచి వాళ్ళ దగ్గరికొస్తూ కనిపించాడు.

"హాయ్ లేడీస్...ఏమిటీ సినిమాకొచ్చారా?" ఏదో అడగాలన్నట్లుగా అడిగాడు మధుకిరణ్.

"సినిమాహాలుకి సినిమా చూడడానికి కాకపోతే మరిదేనికొస్తారు!" తనలో తానే గొణుక్కుంది మౌక్తిక.

అంతలోనే ఆమెకి నవ్వొచ్చింది. ఏమో... సినిమాహాలుకి దేనికోసమైనా రావచ్చు. ఆవిషయం ఇందాకటి యువజంట నిరూపించింది కూడానూ.

"ఏమిటీ... మీలో మీరే నవ్వేసుకుంటున్నారు...మాకు చెబితే మేమూ నవ్వుతాం కదా!" చొరవగా

నవ్వుతూ అన్నాడు మధుకిరణ్.

"అబ్బే! ఏమీలేదండీ..." ముడుచుకుపోయింది మౌక్తిక మొహమాటంతో.

అతడు మాట్లాడకుండా బయటకి వెళ్ళి కూల్ డ్రింక్స్, చిప్స్ ప్యాకెట్లు తీసుకొచ్చాడు. వీళ్ళకివ్వబోతే వద్దంటూ తిరస్కరించింది మౌక్తిక.

"నన్ను పరాయివాడిగా చూడద్దు ముక్తాగారూ..." అభిమానంగా అన్నాడు మధుకిరణ్.

"తీసుకో ముక్తా... ఆయన మన కొలీగ్... కాదంటే మర్యాదగా ఉండదు." ఆమెకి మాత్రమే వినిపించేంత మెల్లగా అంది రమ్య.

గత్యంతరం లేక తీసుకుంది మౌక్తిక. అతడి సమక్షం ఆమెలో ఏదో తెలియని వింతభావనని కలుగజేస్తోంది. మాట్లాడాలనుకున్నా స్వరం సహకరించడంలేదు. బిడియం అడ్డొస్తోంది. బలవంతాన గొంతు పెగల్చుకుని 'థాంక్స్' మాత్రం చెప్పింది.

ఆమె ఇబ్బందిని అర్థం చేసుకున్నాడేమో... వెళ్లి తన స్థానంలో కూర్చున్నాడు మధుకిరణ్. తిరిగి సినిమా మొదలైంది. సినిమా పూర్తయ్యాక తన బైక్ తీసుకుని బయటకు వస్తూ కనిపించాడు. అతడికి ' బై' చెప్పేసి బయటపడ్డారు స్నేహితురాళ్ళిద్దరూ.

వీళ్లు ఇంటికి వెళ్లిన మరికాస్సేపటికే వచ్చేశాడు శరత్. ఊరునుండి శరత్ అమ్మగారు పంపిన సున్నుండలు మౌక్తికకిచ్చింది రమ్య. సున్నుండల రుచి జిహ్వకి తగలగానే మళ్లీ తనవాళ్ళు గుర్తు వచ్చారు మౌక్తికకి.

ఆ పూట మరి భోజనానికి రానని చెప్పేసింది మౌక్తిక. కొద్దిగా బియ్యం పెట్టుకుని కందిపొడి, నువ్వులపొడి, గోంగూర పచ్చడి వేసుకుని అన్నం తిన్నాననిపించింది.

భోజనం పూర్తయ్యాక చేతికందిన పుస్తకం తీసుకుని మంచంమీద వాలింది మౌక్తిక. ఏ రసమూలేని నిస్సారమైన ఆమె జీవితానికి అవే తోడు. కాస్సేపటికి కళ్ళు మూతలు పడినట్లనిపించి పుస్తకం మూసేసి, లైట్ ఆపేసింది.

కాని, నిద్ర రావడంలేదు. ఇందాకా కళ్ళు మూతలు పడినా అది ఆవులింతల వరకే పరిమితమవడంతో...అలా కిటికీలోనుంచి కనిపిస్తున్న ఆకాశాన్ని చూడసాగింది. కృష్ణపక్షపు రోజులు కావడంతో చందమామ కొద్దిగా ముఖం చాటేసినట్లుగా కనబడుతున్నాడు. దానికి తోడు అతడిని తమ వెనకాతల దాచేసి దోబూచులాడుతున్నాయి తుంటరి మబ్బులు.

చంద్రకాంతిలేని వినీలాకాశం వెలెవెలబోతోంది. అక్కడక్కడా తళుకుమంటున్న తారకలు...నిర్భాగ్యుని మనసులో ఉండి-ఉడిగి చెలరేగే ఆశల్లా మిణుకుమిణుకుమంటున్నాయి.

బయట ప్రపంచంలో లాగానే మౌక్తిక మనసునిండా కూడా చీకటి.

కృష్ణపక్షం వెళ్ళి శుక్లపక్షం రాగానే చీకటి కమ్ముకున్న ఆకాశంలోకి నెలరాజు ఆగమనం జరుగుతుంది. అనంతమైన వెన్నెల నింగిని ఆవరించుకుంటుంది.

నీలాకాశాన్ని కాంతిమంతం చేయడానికి వెన్నెలదీపంలా చల్లనిజాబిలి వస్తాడు.

కాని...కాని... తన మనసులోని ఈ గాఢాంధకారాన్ని తొలగించడానికి ఎవరొస్తారు! అసలీ చీకటి ఏనాటికైనా తొలగుతుందా!?

చీకటి మూసిన ఏకాంతం నిండిన తన బతుకుని వెలిగించే ఆ చందమామ ఎవరు! అసలు... ఈ జన్మలో తన బతుకులో వెలుగురేఖలు వ్యాపిస్తాయా!

సమాధానంలేని ఎన్నో ప్రశ్నలు మౌక్తిక మనసుని అల్లకల్లోలం చేసి పారేశాయి. అనేక ఆలోచనలతో సమరం సాగిస్తున్న ఆమె మెదడు విశ్రాంతిని కోరుకుంది. మరి కొద్దిసేపటికి ఆమె కళ్ళు మూతలు పడ్డాయి.

------------------------- -------------------- --------------------

"ముక్తా గారూ..." స్టాఫ్ రూమ్ లో విశ్రాంతిగా కూర్చున్న మౌక్తిక మధుకిరణ్ పిలుపుకి తలెత్తిచూసింది.

సున్నితమైన ఆపిలుపు మౌక్తిక చెవులకి మంగళవాయిద్యాల్లా శుభప్రదంగా వినిపించింది.

సన్నిహితులందరూ ఆమెని 'ముక్తా' అనే పిలిచినా... ఎవరి పిలుపులోనూ లేని మాధుర్యం ఇతడి పిలుపులో నిండిఉంది.

"ఏమిటండీ..." అదుపు తప్పుతున్న తలపులను నియంత్రించేందుకు ప్రయత్నిస్తూ అడిగింది మౌక్తిక.

"ఏమీలేదండీ... బిఎస్సీ సెకెండ్ ఇయర్ వాళ్ళకి ఇప్పుడు ఫిజిక్స్ క్లాస్. ఇవాళ శమంతకం గారు రాలేదు కదా! వీళ్ళు తెగ అల్లరి చేసేస్తున్నారు. వీళ్లగోల వినలేకుండా ఉన్నామని పక్కక్లాసులవాళ్ళు ఒకటే బాధపడుతున్నారు. మీకు అభ్యంతరం లేకపోతే... ఆక్లాస్ టేకప్ చేయగలరా?" అభ్యర్థనగా అన్నాడు మధుకిరణ్.

"నో ప్రాబ్లం...నాకెటూ లీజరే." బల్లమీద పుస్తకాలు తీసుకుని లేచినిలబడింది మౌక్తిక.

"థాంక్యూ వెరీమచ్ ముక్తా గారూ..." మర్యాదగా చెప్పాడు మధుకిరణ్.

"యు ఆర్ వెల్ కం..." ఎటో చూస్తూ చెప్పింది మౌక్తిక.

అతడివైపే సూటిగా చూస్తే తన మనసుకి కళ్ళెం వేయలేదేమోనని ఆమెకి భయం. అతడి కళ్ళు ఆపాదమస్తకమూ తననే పరికిస్తూ ఉంటాయని ఆమెకు తెలుసు. ఆకళ్ళలో ప్రస్ఫుటంగా కనిపించే ప్రేమభావన ఆమెను ఉక్కిరిబిక్కిరి చేస్తుంది. అవ్యక్తమైన ఆరాధనేదో అతడివైపుకి బలంగా ఆకట్టుకుంటుంది.

వింతమోహంతో జ్వలించుకుపోతూ...అతడివెంట పరుగులుతీసే మనసుని నియంత్రించడం ఆమె వల్లకాదు. అందుకే ఆ దిక్కులు చూడడం.

ఆమె అలాగే... ముక్తసరిగానే ప్రవర్తిస్తుందని అతడికీ తెలుసును. అందుకే స్టాఫ్ రూమ్ లోనుంచి తన క్లాసుకి తరలిపోయాడు మధుకిరణ్.

అతడు చెప్పిన విధంగా బిఎస్సీ సెకెండ్ ఇయర్ వాళ్ళకి ఫిజిక్స్ క్లాస్ తీసుకుంది మౌక్తిక. ఆమె పాఠం చెబుతున్న విధానానికి వాళ్ళ అల్లరి కాస్త శాంతించింది.

మరి కాసేపటికి క్లాసంతా పిన్ డ్రాప్ సైలెన్స్ గా మారిపోయింది.

తాను టైమ్ పాస్ కి చదువుకున్న చదువు ఇలా పొట్టకూటికి ఉపయోగపడుతుందని మౌక్తిక అస్సలనుకోలేదు. బాగా టీచ్ చేస్తుందని కాలేజ్ లో మంచిపేరే ఉందామెకి. అనవసరమైన విషయాల్లో తలదూర్చదన్న కీర్తీ ఉంది. తాను ప్రశాంతంగా జీవించడానికి కారణమైన ఈ ఉద్యోగమంటే ఆమెకి అపరిమితమైన గౌరవం, ఇష్టం ఉన్నాయి.

అందుకే... సాధ్యమైనంతవరకూ తన ఉద్యోగానికి న్యాయం చేయాలని ఆమె ప్రయత్నం.




ఆ సాయంత్రం... కాలేజ్ అయిపోయాక ఇంటికి వెళ్తూ ఉంటే... కాలేజ్ ఎంట్రన్స్ దగ్గర నిలబడి తననే తదేకంగా చూస్తున్న మధుకిరణ్ కనిపించాడు. అ చూపులోని తీవ్రతకి ఒళ్ళు ఝల్లుమంది.

ఎందుకు! ఎందుకిలా జరుగుతోంది!

తనమనసు తన అధీనంలో ఉండనని మొరాయిస్తోందెందుకు!

అతడిమైకంలో పడిపోతానంటూ మారాం చేసి తనను విసిగిస్తోందెందుకు!

పాడు మనసు... పాడు మనసాని!

ఈ మనసు చేసే వింతచేష్టలకి పర్యవసానం ఏమిటీ?

అందుకే కాబోలు...' మనసు కోతివంటిదీ...వయసు కొమ్మవంటిదీ...ఊపేసి పోతుంది మొదటిదీ... ఆ ఊపు మరవనంటుంది రెండవదీ' అన్నాడో సినీకవి.

దానికి సజీవసాక్ష్యం ప్రస్తుతం తానున్న స్థితి.

ఇంకానయం! రమ్య అతడిని గమనించలేదు. గమనించి ఉంటే తన బుర్ర అప్పడంలా నమిలేసి ఉండేది.

'బతుకుజీవుడా' అనుకుంది మౌక్తిక.

ఇంటికి వచ్చి పనుల్లోపడినా మధుకిరణ్ తలపులు మాత్రం ఆమెని వీడలేదు.

------------------------- ------------------------ -----------------------

ఒక్క ఉదుటున లేచి కూర్చుంది మౌక్తిక.. చుట్టూ పరికించి చూసింది. తానున్నది తనగదిలోనే అని రూఢి అయ్యాక...ఏదో రిలీఫ్ గా అనిపించింది. గదిలో లేత నీలిరంగు జీరోవాల్ట్ బల్బ్ మసగ్గా వెలుగుతోంది. అంతకుముందు తాను గాంచిన కల జ్ఞప్తికి రాగానే అమె ఉఛ్వాసనిశ్వాసాలు తీవ్రతరమైనాయి.ఒళ్ళంతా అప్పుడే స్నానం చేసినట్లుగా చెమటలు పట్టాయి.

ఆకల...తరచుగా వస్తూ ఆమెని ఇబ్బంది పెడుతోంది. కలతనిద్రలో ఆమెను వెంటాడి... వేధించే అతి భయంకరమైన కల అది.

అసలా కల తనకెందుకొస్తోందో ఆమెకు అంతు చిక్కదు. మామూలప్పుడు ఏకలా రాకుండా ఏదో ఒకవేళకైనా కాస్త నిద్ర పడుతుంది.. కాని, మౌక్తిక మనసు మారుమూలల్లో ఏమైనా స్పందనలు కలిగిననాడు...అదుపు తప్పిన ఆమె మనసు అస్థిమితంగా కొట్టుకునేవేళ... అకస్మాత్తుగా వచ్చి, ఆమెను ఆరడి పెట్టి, ఆమె మనసుని కల్లోలపరచి...ఆమెను హింసిస్తుంది.

అసలా కలకి అర్థం ఏమిటి!? అస్తమానం వచ్చి తన మానససరోవరంలో అలజడి సృష్టిస్తుందెందుకు? తానేంచేయాలి?

వెంటనే గూగుల్ లో సెర్చ్ చేసింది. అందులో సమాచారం చదివాక ఆమెకు మరీ ఆందోళన ఎక్కువైంది. ఫోన్ క్లోజ్ చేసేసి అలా ఏదో తెలియని వేదనతో సతమతమైంది.

ఎన్నోరకాల ప్రశ్నలు పగబట్టినట్లుగా వేధిస్తూంటే ఆరాత్రి మరి నిద్రపోలేదు మౌక్తిక. మనశ్శాంతిని కోల్పోయిన తన జీవితంలో... శుభతరుణం ఎన్నటికీ రాదా!

కకావికలం అయ్యింది ఆమె మది.

-------------------                    -------------------

----------------------

భోరుమని కురుస్తోంది వర్షం. మండుటెండల తాకిడికి ఎండి, బీటలువారిన పుడమితల్లిని సేద తీర్చేందుకు వరుణదేముడు చిలకరించిన పన్నీటిజల్లులా జోరుగా కురుస్తోంది వాన.

వానధారలు సన్ షేడ్ లమీదుగా భూమ్మీదకి జారిపడుతూ ' టప్....టప్...' అంటూ లయబద్ధంగా చప్పుడు చేస్తున్నాయి. దివిని భువిని అనుసంధానం చేయడానికి వెండితీగలతో అల్లిన వంతెనల్లా ఉన్నాయి ఆపకుండా నింగిలోనుంచి జాలువారుతున్న వర్షపుధారలు. ప్రకృతిసమస్తం పులకరించి, ఆనందతాండవం చేస్తోంది.

అప్పుడప్పుడు ఫెళఫెళమంటూ గర్జిస్తున్న మేఘాల శబ్దాలు...చేయి తిరిగిన మార్దంగికుడు లయవిన్యాసం చేస్తున్నప్పుడు వెలువడే మృదంగనాదాల్లా ఉన్నాయి. తళతళ మెరుపులకాంతిలో వింత అందంతో అలరారుతున్నాయి చెట్టు-చేమ.

కిటికీలోనుంచి వానదేముడి విన్యాసాలను చూస్తున్న మౌక్తిక మది అవ్యక్తానందానుభూతులకి ఆలవాలమైంది. అద్భుతమైన ఈ వర్షం కురిసిన రాత్రిని ఉల్లాసంగా గడపాలంటే చెంత వలచిన విభుడుండాలి.

బయట...అడ్డు-ఆపు లేకుండా కురుస్తున్న వానవలన ఉత్పన్నమౌతున్న చల్లదనం... లోన వయసులో ఉన్న శరీరాల రాపిడికి రాజుకుంటున్న అగ్నిగుండం...బయట ప్రకృతి చిందులు...లోన రగులుతున్న నెగళ్లు.

అసలీ రకమైన ఆలోచనలు తనకెందుకొస్తున్నాయో...ఆమెకే అంతుచిక్కడంలేదు. తనకిటువంటి ఊహలు కలగడం సబబేనా! తానేదైనా తప్పుగా ఆలోచిస్తోందా!

తరచితరచి మనసుని ప్రశ్నించుకున్నా సమాధానం శూన్యం.

అయినా  దాన్నడిగితే అదేం చెబుతుంది! వెర్రిమనసు... తానెప్పుడో దానినోరు నొక్కేసింది. అయినా ఆగనంటోంది ఈ జ్వలనం.

ఇలాంటి రసవత్తరమైన సమయంలో రమ్యశరత్ లు ఏం చేస్తారు? ఒకరి కౌగిలిలో ఒకరు ఒదిగిపోయి స్వర్గసుఖాలు అనుభవిస్తారు.

వర్షమంటే రమ్యకు ప్రాణం... పసిపిల్లలా అల్లరి చేస్తుంది.

"జలుబుచేస్తుంది తడవకు..'' అంటూ శరత్ ప్రేమతో చేసే హెచ్చరికలు పట్టించుకోనంతగా వానలో నానిపోతూ గంతులు వేస్తుంది.

అలా తడుస్తున్న ఆమెను బలవంతంగా చెయ్యిపట్టి లోపలికి లాక్కెళ్తాడు శరత్. ముద్దుగా మందలిస్తూనే తల తుడుస్తాడు. విక్స్ పూస్తాడు. ఎందుకో... ఆసమయంలో అతడిని చూస్తే రమ్యకి కేవలం భర్తలా మాత్రమే అనిపించడు. ఒక తల్లిలా, ఒక తండ్రిలా, ఒక సంరక్షకుడిలా...

ఎన్నోరకాల రక్తసంబంధం ఉన్నవాడిలా అనిపిస్తాడు.

ఆడదాని అదృష్టమంతా ఆమెను కట్టుకున్నవాడేమోననిపించేంత గాఢంగా రమ్యను ప్రేమిస్తాడు. పూజిస్తాడు...లాలిస్తాడు... పాలిస్తాడు.

స్త్రీ కేవలం ఒక మగవాడిని మాత్రమే మొగుడిగా కోరుకోదు. ఆమగవాడు...అన్ని పాత్రలను సమర్ధవంతంగా పోషించే మొనగాడు కావాలనుకుంటుంది. అటువంటి పూర్ణ, పుణ్యపురుషుడు భర్తగా లభిస్తే...ఓహ్! ఆ మగువదే మహద్భాగ్యం.

అటువంటి అతికొద్దిమంది అదృష్టవంతుల్లో రమ్య ఒకరు.

తాను రమ్యను చూసి జెలస్ ఫీలౌతోందా! ఏమో... తన ఆలోచనలకి నవ్వుకుంది మౌక్తిక.

బయట వానజోరు ఊపందుకుంది. రమ్య, శరత్ లు ఊళ్ళోలేరు. శరత్ వాళ్ల చిన్నాన్న కూతురికి డెలివరీ అయిందని చూడడానికి వెళ్లారు. మరునాడు పొద్దున్నకి గాని రారు.

ఒక్కతీ ఉండడానికి భయమైనా తప్పదు. వానతోపాటు గాలివేగం కూడా పెరిగింది. ఆతీవ్రతకి విరిగిపోతాయేమోన్నంతగా కొట్టుకుంటున్నాయి కిటికీ రెక్కలు. తలుపులు మూసేద్దామని కిటికీ దగ్గరకు వెళ్ళినదల్లా ఆగిపోయింది ఒక్కసారిగా.

అక్కడ...అక్కడ... సన్ షేడ్ కింద గడగడ వణుకుతూ నిలబడి ఉంది ఒక ఆకారం. కొంపదీసి దొంగ కాదు కదా!

భయమేసింది మౌక్తికకు.

“ఎవరూ!?'' అడిగింది బింకంగా.

సమాధానంలేదు.

దిగజారిపోతున్న ధైర్యాన్ని కూడగట్టుకుంటూ వరండాలో లైట్ స్విచ్ వేసి"మిమ్మల్నే ... ఎవరంటే మాట్లాడరేం?'' స్వరం పెంచి విసుగ్గా అడిగింది మౌక్తిక.

ఆ ఆకారం ఇటువైపుకి తిరిగింది. లైటు వెలుగులో అతడెవరో పోల్చుకుంది మౌక్తిక. అతడు... ఈ మధ్యనే వాళ్ళ కాలేజ్ లో చేరిన ఫ్లోర్ ఇన్ ఛార్జ్ శివాజీ.

అతడికి 'రాముడు మంచిబాలుడు' అని నామకరణం చేసింది రమ్య. జుట్టుకి కుంచెడు నూనె రాసుకుని నున్నగా తల దువ్వుకుంటాడు. పూర్వకాలంనాటి నారోకట్ ప్యాంట్ వేసుకుంటాడని ‘ గొట్టాంగాడు' అని ఇక్ నేమ్ కూడా తగిలించేసింది.

రమ్య అంతే... తనెవరినైనా ఏమన్నా అనేస్తుంది. తనని ఎవరేమన్నా పట్టించుకోదు. అంతా జాలీటైప్.

కిటికీలోంచి ఆసక్తిగా చూస్తున్న మౌక్తికను చూసి “మేడమ్ గారూ... ఇదేనా మీఇల్లు?'' అడిగాడు శివాజీ ఎంతో ఆశ్చర్యంగా.

అతడికంత ఆశ్చర్యం దేనికో మౌక్తికకు అర్థంకాలేదు. అవునన్నట్లుగా తలూపి ఊరుకుంది.

ఎంత సన్ షేడ్ కింద నిలుచున్నా, ఫోర్సుగా ఏటవాలుగా కురుస్తున్న వానధాటికి తడిసి ముద్దయ్యాడు అతడు.తడిసిన బట్టలు శరీరంలో చలి పుట్టిస్తున్నాయేమో... గజగజ వణుకుతున్నాడు కూడానూ.

మౌక్తికకు జాలివేసింది. తలుపుతీసి లోపలికి రమ్మని పిలిస్తేనో!

అంతలోనే భయంవేసింది. తాను చూస్తే ఒంటరిగా ఉంది. వాతావరణం చల్లగా ఉండి కోరికలను ప్రేరేపిస్తోంది. ఇలాంటప్పుడు అతడిని లోపలికి ఆహ్వానిస్తే...అతడు అడ్వాంటేజ్ తీసుకుని తననేదైనా చేస్తే...దిక్కా...దివాణమా!

ఛీ...తానేమిటి ఇలాంటి ఊహాగానాలు చేస్తోంది. అతడు అందరిలాంటివాడు కాదని తెలుసు. అనవసర ప్రసంగాలు చేయడు. వెకిలిదనం ప్రదర్శించడు. ఆడవాళ్ళకి ఆమడదూరంలో ఉంటాడు. ఇంకా తనకు దేనికి భయం!

మనసులో స్వచ్ఛత, ప్రవర్తనలో హుందాతనం , ప్రవృత్తిలో నిగ్రహం ఇవన్నీ ఉంటే ఎవరిని ఎవరూ ఏమీచేయలేరు.

మెల్లగా వీధి తలుపు తెరిచి "తడిసిపోతున్నారు... లోపలికి రండి'' అంది మౌక్తిక లోస్వరంతో.

మరోసారి ఆశ్చర్యపోతూ లోపలికి వచ్చాడు శివాజీ.

'మాటిమాటికీ ఆశ్చర్యపోవడం ఇతడి మానరిజంలా ఉంది.' నవ్వుకుంది మౌక్తిక.

అల్మారాలోనుంచి ఇస్త్రీ తువ్వాలు తీసి ఇచ్చింది. మొహమాటపడుతూనే అందుకున్నాడు శివాజీ.

"అలా కూర్చోండి. తాగడానికేమైనా తీసుకొస్తాను.'' వంటింట్లోకి వెళ్ళింది మౌక్తిక.

పర్కొలేటర్ లో డికాక్షన్ తీసి, పాలు కలిపి స్ట్రాంగ్ గా కాఫీ కలిపి తీసుకొచ్చింది.

"అబ్బే ఇవన్నీ దేనికండీ...'' ఇంకా మొహమాటం వీడలేదు శివాజీలో.

మౌక్తిక మాట్లాడలేదు. అతడు మౌనంగా కాఫీ తాగడం పూర్తిచేశాడు.

"థాంక్యూ మాడమ్ గారూ... వేడివేడి కాఫీ ఇచ్చారు. మరికాస్సేపుంటే చలిపట్టి చచ్చిపోయుండేవాడిని...'' అన్నాడు శివాజీ చూపులనిండా కృతజ్ఞతను కురిపిస్తూ.

ఫరవాలేదన్నట్లుగా తలూపింది మౌక్తిక.

బయట వర్షపు ఉధృతి ఎక్కువైంది. కంటికి వానధారలు తప్ప మరేమీ కనబడడంలేదు. ఎక్కడో...పిడుగు పడింది పెద్దశబ్దంతో. పరిసరాలన్నీ దద్దరిల్లాయి. మౌక్తిక గుండె గుభేల్ మంది.

"బంగాళాఖాతంలో అల్పపీడనంట. తుఫానుగా మారవచ్చునని వాతావరణ సూచనల్లో చెప్పారు''

అన్నాడు శివాజీ తనలో తనే అనుకుంటున్నట్లుగా.

మళ్లీ తలాడించింది మౌక్తిక. ఇంతలో హఠాత్తుగా కరెంట్ పోయింది. చుట్టూ చిక్కటి చీకటి నల్లనికాటుక పులిమినట్లుగా ఆవరించుకుంది. అప్పుడప్పుడు మెరిసే మెరుపుల వెలుగులు తప్ప మరేమీ కానరానంత గాఢాంధకారం.

మౌక్తికకు చీకటంటే చచ్చేంత భయం. ఎందుకంటే చీకటి చిచ్చు పెడుతుంది. మనిషిలో అంతర్లీనంగా అణగారి ఉండే దురూహలని తట్టిలేపి, ఊపిరులూదుతుంది చీకటి.

పైశాచికత జడలువిప్పి నర్తించేందుకు ప్రేరణ ఇస్తుంది చీకటి. పశుప్రవర్తన పంజా విసిరేందుకు దోహదపడుతుంది చీకటి. అందుకే చీకటంటే మౌక్తికకు భయం.

ఛార్జింగ్ లైట్ లో కూడా ఛార్జింగ్ అయిపోయినట్లుగా ఉంది. అందుకే కరెంట్ పోగానే వెలగాల్సింది వెలగలేదు. టేబుల్ మీదున్న సెల్ తీసి, ఫ్లాష్ లైట్ ఆన్ చేసి, ఆవెలుగులో వెళ్లి కొవ్వొత్తులు వెతికి తేవాలనుకుంది మౌక్తిక.

మెల్లగాలేచి, అంచనా మీద తడుముకుంటూ టేబుల్ దగ్గరకు చేరి తన సెల్ కోసం తడిమింది మౌక్తిక. సెల్ దొరకలేదు కాని, మొరటుగా ఏదో స్పర్శ తగిలింది.

అది... శివాజీ చేయని గ్రహించి" సారీ శివాజీ గారూ'' అంది గభాలున చేయి వెనక్కు లాక్కుంటూ.

"సారీనా? ఎందుకు?'' శివాజీ స్వరంలో అదోలాంటి మార్పు.

విస్తుపోయింది మౌక్తిక. మనసేదో కీడుని శంకించింది.

వెలుతురులో ఏమీ ఎరుగని అమాయకుడిలా ప్రవర్తించే అతడు చీకటిని చూడగానే చెలరేగిపోతున్నాడు. అంటే...చీకటికి వెలుగుకి నడుమనున్న తేడాలో మనిషిలో ఇన్ని భిన్నకోణాలు దర్శనమిస్తాయా?

శివాజీ చేయి దవ్వకాడలా కోమలంగా ఉన్న మౌక్తిక జబ్బను ఒడిసిపట్టుకుంది.

"శివాజీ గారూ...ఏమిటిది? వదలండి. మీరెంతో డీసెంట్ అనుకున్నా...ప్లీజ్...'' అతడి పట్టునుండి విడిపించుకోవాలని గింజుకుంది మౌక్తిక.

"ఇప్పుడు నా డీసెన్సీకి వచ్చిన లోటేముంది? ప్లీజ్ ముక్తా... జస్ట్ ఒక్కసారి... ఏంకాదులే. చాలా బాగుంటుంది.'' చీకట్లో కంటికి కనబడని మౌక్తిక నడుముని కాంక్షగా తడిమాడు శివాజీ.

'మేడమ్' అన్న సంబోధన నుండి ' ముక్తా' అని పిలిచేంత చనువు అతడికీ తనకీ మధ్యన ఎప్పుడేర్పడిందో మౌక్తికకు బోధపడలేదు. బహుశా... ఈ వాతావరణం అతడిలో ఆరకమైన చొరవని పెంచిందేమో!

అతడి స్పర్శకి ఆమెలో పులకింతకి బదులు కంపరాన్ని కలిగించింది.

"ప్లీజ్... ఇది మీకు మర్యాదకాదు. మీరంటే నాకు చాలా మంచి అభిప్రాయం ఉంది. దాన్ని

పోగొట్టుకోకండి.'' అతడి చేతిని తోసేయడానికి శతవిధాల ప్రయత్నిస్తోంది.

తన గొంతు తనకే బలహీనంగా వినిపిస్తోంది.

“ఏంటి ముక్తా... అంత బెట్టు చేస్తావు? ఇన్ని సంవత్సరాలు పెళ్ళి-పేరంటం లేకుండా ఇలా ఒంటరిగా ఉన్న నీకు కోరికలు లేవంటే నేను నమ్మను. అవి తీర్చుకునే మార్గం లేక ఇలా మడికట్టుకుని ఉన్నావు. నలుగురికీ తెలిస్తే అల్లరౌతుందన్న భయంతో కోరికలను అణగదొక్కుకున్నావు. ఇకముందు నీకా భయం అక్కరలేదు.రెండోకంటి వాడికి తెలియకుండా నేను మ్యానేజ్ చేస్తాను.'' అతడి ఉడుంపట్టు అంతకంతకీ బిగుసుకుంటోంది.

మౌక్తికకు నరకయాతనగా ఉంది. అతడు ఎలాగైనా తనను లొంగదీసుకోవాలనుకుంటున్నాడని బోధపడుతూనే ఉంది. తన దేహంమీద పారాడుతున్న అతడి చేతుల స్పర్శకి తేళ్ళు, జెర్రులు పాకుతున్న ఫీలింగ్ కలుగుతోంది. ఆ మేరకు పెట్రోల్ పోసి కాల్చేసుకోవాలనిపిస్తోంది.

అందుకే... ఆడది మగవాడిని ద్వేషిస్తుంది. ఆడదాని మనసుతో ప్రమేయం లేకుండా ఆమె శరీరాన్ని అనుభవించాలనుకుంటారు.కాస్తంత చనువుగా మసలితే చాలు.... విచక్షణ మరచి, ఆమేదో కోరికలతో కొవ్వెక్కి కొట్టుకుంటోందని భావిస్తారు. అవకాశం దొరికితే ఆమెను కబళించాలని చూస్తారు.

ఒక్క మగవాడి ప్రవర్తనతో యావత్ మగజాతినీ ద్వేషించడం తప్పని తెలిసినా, శివాజీ విపరీత ధోరణి చూసి ఆ అభిప్రాయానికి రాక తప్పడంలేదు.

అతడు తన పట్టు సడలించడంలేదు. సరికదా...మరింత బిగిస్తున్నాడు. ఏమి చేయాలో తోచని నిస్సహాయ పరిస్థితిలో, అతడిని దూరంగా నెట్టేసే ప్రయత్నంలో ... ఆసరాకోసమని టేబుల్ అంచు పట్టుకుని రెండోచేత్తో తన సెల్ కోసం టేబుల్ మీద తడిమింది మౌక్తిక.

సెల్ దొరకలేదు కాని, మధ్యాహ్నం జామకాయ కోసుకుని టేబుల్ మీద వదిలేసిన కత్తి దొరికింది. దాన్ని అందుకుని గట్టిగా పట్టుకుంది.

ఇంతలో భగవంతుడు ఆమెకి అనుకూలించినట్లుగా కరెంట్ కూడా వచ్చేసింది. అయినా శివాజీ తన పట్టు వీడలేదు.

'కామాతురాణాం' న భయం... నలజ్జా' అని అందుకే అన్నారేమో!

“మర్యాదగా విడిచిపెట్టు శివాజీ...లేకపోతే దీనితో పొడిచేస్తాను'' కత్తిపిడిని గట్టిగా ఒడిసిపట్టుకుని అతడి ముఖంకేసి చూపించింది మౌక్తిక.

చటుక్కున ఆమెను వదిలేశాడు శివాజీ. అతడి ముఖంలో భయం స్పష్టంగా కనిపించింది. ఒక్కసారిగా డీలా పడిపోయాడు.

మౌక్తిక గుండెలనిండా ఊపిరి తీసుకుంది. ఇందాక ఆమెలో చోటు చేసుకున్న భయం స్థానే కాస్త ధైర్యం వచ్చిచేరింది.




కత్తిని వదలకుండా అలాగే పట్టుకుని “యు రాస్కెల్...గెటౌట్. గెటౌట్ ఫ్రమ్ హియర్. మగవాడు ఎప్పుడూ అవకాశం కోసమే పొంచి చూస్తాడని నిరూపించావు. నిన్ను తక్కువ అంచనావేసి లోపలికి రానివ్వడమే నేను చేసిన పెద్దతప్పు....ఫో అవతలకి” పిచ్చి పట్టినట్లుగా అరిచింది మౌక్తిక.

ఎవరి కుతంత్రాలతోటీ, దురాలోచనతోటీ  పనిలేనట్లుగా కుండపోతగా కురుస్తూనే ఉందివాన. నేలతల్లికి అంటిన మురికిని  ఆవర్షం కడిగేస్తోంది . మరి... మనిషి మనసుకి అంటిన కల్మషాన్ని ఏవాన కడగగలదు! ఎన్ని పాపనాశనాల్లో మునిగితేలినా... ఇటువంటి మనుషులకి స్వచ్ఛత అనేది ఏర్పడుతుందా!?

ఏమనుకున్నాడో ఏమో... మారుమాట్లాడక తలుపు తీసుకుని చీకట్లో కలిసిపోయాడు శివాజీ. మౌక్తిక ఒళ్లంతా చెమటలతో నిండిపోయింది. ఆమె గుండెచప్పుడు ఆమెకే వినబడుతోంది. అతడు గుమ్మందాటగానే ఠక్కున తలుపు మూసేసి గడియ పెట్టుకుంది.

తన చేతిలో ఉన్న కత్తి మీదకి దృష్టిపోగానే ఆమె పెదవులు చిరునవ్వుతో విచ్చుకున్నాయి అప్రయత్నంగా. శివాజీ ఇంతటి పిరికివాడా!?

ఆకత్తి గురించి రమ్య చేసే వ్యాఖ్యలు తలచుకుంటే నవ్వు ముంచుకొస్తుంది. ఆకత్తి పవర్ అలాంటిది మరి! అటువంటి పనికిమాలిన ఆయుధానికి శివాజీ ఝడిసాడంటే నవ్వురాక మరేమౌతుంది?

కాని, ఆ 'మొండికత్తే' నేడు తన మానాన్ని కాపాడింది. తన జీవితానికి మచ్చ ఏర్పడకుండా రక్షించింది.

మరి కాస్సేపటికి గాని స్థిమిత పడలేదు మౌక్తిక.

ఛీ...ఛీ... ఎంత మానర్ లెస్ గా బిహేవ్ చేశాడు! బాహ్య ప్రవర్తనని బట్టిమనిషి అంతరంగాన్ని అంచనా వేయడం ఎంత అవివేకమో తెలిసొచ్చింది ఆమెకి.

ప్రతివ్యక్తికి రెండుముఖాలుంటాయేమో! సమయానుసారంగా ఆముఖాలను ప్రదర్శిస్తూ ఉంటారు కాబోలు!

ఇలాంటి వాళ్లని గుడ్డిగా నమ్మబట్టే అమ్మాయిలంత త్వరగా మోసపోతూంటారు.

ఆ రాత్రంతా బిక్కుబిక్కుమంటూ గడిపింది మౌక్తిక. తెలతెల వారేసరికి వాన నెమ్మదించింది. మరి కొద్దిసేపటికి రమ్య, శరత్ లు వచ్చేశారు. వారి రాక మౌక్తికకు అపరిమితమైన ధైర్యాన్ని ప్రసాదించింది.

------------------- -------------------
--------------------

" ముక్తా...ముక్తా..'' క్లాసు పూర్తైన తరువాత వరండాలో నడిచివస్తున్న మౌక్తిక దగ్గరకు పరుగెత్తుకొచ్చింది రమ్య.

అది లంచ్ అవర్. స్టాఫ్ రూమ్ కి వెళ్లబోతోంది మౌక్తిక. రమ్య స్టాఫ్ రూమ్ కి వెళ్లకుండా తనకెదురు రావడంతో ఆశ్చర్యపోయింది.

గతరాత్రంతా నిద్రలేకపోవడం మూలాన ఆమెకు ఏమీ తినాలనిపించడంలేదు. అందుకే బాక్స్ కూడా తెచ్చుకోలేదు. కాసేపు విశ్రాంతి తీసుకుంటే ఆ నీరసం తగ్గుతుందన్న భావనతో వడివడిగా స్టాఫ్ రూమ్ కి వెళ్తోంది.

"రమ్యా... ఏమిటా కంగారు? ఏమైంది?'' విస్మయంగా అడిగింది రమ్య.

"ముందిది చెప్పు...నిన్నరాత్రి మనింటికి శివాజీ వచ్చాడా?'' సూటిగా ప్రశ్నించింది రమ్య.

"ఎందుకలా అడుగుతున్నావు? ఎనీ థింగ్ సీరియస్?'' ఆదుర్దా, ఆత్రుత మౌక్తిక స్వరంలో మిళితమైనాయి.

"వచ్చాడా...లేదా? అది చెప్పుముందు!'' గట్టిగా నిలదీసింది రమ్య.

"ఆ( వచ్చాడు...'' అంటూ ముందురోజు రాత్రి జరిగిన ఉదంతాన్ని అంతా పూసగుచ్చినట్లుగా వివరించింది మౌక్తిక.

అసలు... ఆసంగతి రమ్యతో కూడా చెప్పాలనుకోలేదు ఆమె. ఆసంగతేమిటి! ఒకరికి కలవరం కలిగించేదేదైనా సరే... గుండెలోతుల్లో నిక్షిప్తమై సమాధి కావలసిందే గాని, తనకు తానుగా బయటకు

చెప్పదు మౌక్తిక.

బహుశా ఆ కారణం చేతే రమ్య ఆమెను ‘ అంతర్ముఖి’ అంటుందేమో!

ఇప్పుడు రమ్య రొక్కించి అడుగుతూంటే చెప్పక తప్పలేదు. అంతా విని నిర్ఘాంతపోయింది రమ్య. నమ్మలేనట్లుగా చూసింది.

“నిజంగా శివాజీ ఇలాంటివాడా! ఐ కాంట్ బిలీవ్.” రమ్యస్వరంలో సంభ్రమం.

“ నేనూ మంచివాడనుకునే లోపలికి రమ్మన్నాను. ఆ తరువాత అతడు నాతో మిస్ బిహేవ్ చేయడంతో అతడి నైజం బయటపడింది.” అంది మౌక్తిక.

“మరి... అతడు... స్టాఫ్ రూమ్ లో అలా చెబుతున్నాడేమిటి?” గొణుక్కున్నట్లుగా అంది రమ్య.

“ఎలా చెబుతున్నాడూ” అయోమయంగా అడిగింది మౌక్తిక.

“అతడు...అతడు...”

“ఆ(... అతడూ?”

“నిన్నరాత్రంతా నీతోనే గడిపానని, అతడు –నువ్వు కలిసి చాలా ఎంజాయ్ చేశారని, స్వర్గసుఖాల్లో తేలియాడారని... ఇంకా... చాలా...ఛండాలంగా చెబుతున్నాడు. నా చెవిన పడగానే చెంప పగలగొట్టాలని అనుకున్నాను. కాని, సంగతేమిటో... నీనోటితో విని, ఆపని చేద్దామని ఆగాను.” బాధగా చెప్పింది రమ్య.

“నువ్వు... అది నమ్మావా?” ఆవేశంతో రమ్య భుజాలు కుదిపేసింది మౌక్తిక.

“ ఛ...ఛా...నేను నీ ప్రియసఖిని. నిన్ను తప్పుగా అనుకుని నన్నునేను అవమానించుకోలేను. కాకపోతే... వాడలా కాకమ్మ కథలు వినిపిస్తున్నాడంటే... దానికి మూలం ఏదో ఒకటి ఉండాలి కదా! అందుకే...నిన్ను గుచ్చిగుచ్చి అడిగింది. ఆవెధవకి ఎంతధైర్యం?” ఉక్రోషంతో రమ్య పిడికిళ్ళు బిగుసుకున్నాయి.

మౌక్తిక ముఖం జేవురించింది. రక్తమంతా ముఖంలోకి పొంగుకొచ్చినట్లుగా ఎర్రగా మారిందామె మోము. అవమానభారంతో తనువు నిలువెల్లా కంపించింది.

పోనీకదా...వానలో తడిసి ముద్దైనాడన్న జాలితో లోపలికి రానిస్తే...తనమీద అత్యాచారం చేయడానికి ట్రై చేసి అది కుదరకపోయేసరికి, రివర్స్ గేర్ లో దుష్ప్రచారం చేస్తున్నాడు. రాస్కెల్...ఎంతకు తెగించాడూ!

లజ్జాభారంతో మండిపోతున్న మనసునీ, పూలతీవెలా ఊగిపోతున్న తనువునీ కంట్రోల్ చేయడానికి విఫలయత్నం చేసింది మౌక్తిక. ఉద్రేకంతో ఆమె హృదయం ఉడికిపోయింది.

వెధవన్నర వెధవ... నోరుంది కదాని ఇష్టానికి వాగుతాడా!? లాభంలేదు. వీడినిలా వదిలేస్తే అది మెతకదనంగా భావించి ఇంకా పేట్రేగిపోతాడు. ఈకాలేజ్ లో తన పరువు తీస్తాడు. వాడినోరు

మూయించే తీరాలి.

విసవిస నడుస్తూ స్టాఫ్ రూమ్ కేసి నడిచింది మౌక్తిక... ఆమె ఆగ్రహం చూసి బెదిరిపోయిన రమ్య "ముక్తా ఆగు... నామాట విను..." అని అరుస్తున్నా ఆగకుండా.

స్టాఫ్ రూమ్ లోకి ప్రవేశిస్తూండగానే "బయటకలా అమ్మమ్మలా ...ఏమీ ఎరగనట్లు ఇన్నోసెంట్ గా కనిపిస్తుంది గాని,ఆ మౌక్తిక 'అక్కడ' మాత్రం ఎంత యాక్టివో తెలుసా!" శివాజీ చెప్తూండడం చెవులారా వింది మౌక్తిక.

ఇక ఆలస్యం చేయకుండా తిన్నగా వెళ్ళి అన్నం తింటున్న శివాజీ షర్ట్ కాలర్ పట్టి గుంజింది మౌక్తిక.

"ఏయ్ మేడమ్... ఏమిటీ రౌడీయిజం...ముందు షర్ట్ వదలండి" ఆమె చేతిని నెట్టేయాలని చూశాడు శివాజీ.

మౌక్తిక చూపులకే మండించేగుణం ఉండుంటే కనుక అతడా క్షణమే మాడి మసైపోయుండేవాడు.

"ఏంట్రా రాస్కెల్... నువ్వు రాత్రంతా నా గదిలోనే ఉన్నావా? తెల్లార్లూ మనం కలిసి ఎంజాయ్ చేశామా! నీది నాలుకా ? తాటిపట్టా? స్త్రీల పట్ల నీకింత చులకన భావమా! నీ నాలుక తెగ్గోసినా పాపంలేదురా" హిస్టీరిగ్గా అరవసాగింది మౌక్తిక.

అప్పటికే అక్కడ లంచ్ చేస్తున్న స్టాఫ్ వాళ్ళు చుట్టూ మూగారు. అంతా వినోదం చూస్తున్నట్లుగా నిలబడ్డారేగాని, ఏ ఒక్కరూ కూడా జోక్యం చేసుకోలేదు.

దానికి కారణం మౌక్తిక రౌద్రాకారం కావచ్చు. భీతి గొలిపేట్లుగా ఉన్న ఆమె వాలకాన్ని చూసి కాస్త బెదిరాడు శివాజీ.

అతడి ముఖం కత్తివేటుకి నెత్తుటి చుక్క రాలనంతగా పాలిపోయింది. ఆమె అంతలా రియాక్టౌతుందని అతడూహించలేదు. ఏదో... సొల్లు కార్చుకుంటూ తన చుట్టూ మూగే సోంబేరి బ్యాచ్ ని ఆకట్టుకునేందుకే అతడా కట్టుకథను వినిపించాడు. కాని, అది మౌక్తిక చెవిదాకా వెళ్తుందని,ఆమె ఇలా దాడి చేస్తుందని అతడస్సలనుకోలేదు.

చుట్టూ మూగిన వాళ్లని తోసుకుంటూ ముందుకొచ్చారు శమంతకంగారు, అహోబిలంగారు.

"అమ్మా మౌక్తికా... ఏం జరిగిందమ్మా? ఎందుకలా ఆవేశపడుతున్నావు?" అడిగారు శమంతకం గారు ఉగ్రరూపం దాల్చి, నిప్పులు కురిపిస్తున్న మౌక్తికను.

మౌక్తిక కోపం ఇంకా చల్లారలేదు. పళ్ల బిగువున దుఃఖాన్ని అణిచి ఉంచడంతో ఆమె పెదవులు అదురుతున్నాయి.

"ఏమైందమ్మా... నీ తండ్రిలాంటి వాడిని నాతో చెప్పవూ?" అనునయంగా అడిగారు శమంతకం గారు.

భోరుమని ఏడ్చేసింది మౌక్తిక గట్టు తెగిన గోదారల్లే.

"ముక్తా గారూ..ప్లీజ్ రిలాక్స్..." ఆస్వరం విని చప్పున తలెత్తి చూసింది మౌక్తిక.

ఎదురుగా మధుకిరణ్. మౌక్తిక ముఖం వెలవెలబోయింది. ఏమని చెప్తుంది! తనను ఇలా బహిరంగంగా అవమానించిన శివాజీమీద కక్ష బయలుదేరింది. ఛ... ఇంతకన్నా తాను చచ్చిపోయి ఉంటే బాగుండేది.

ఆమె అసహాయత, అవస్థ గమనించిన రమ్య జరిగినది క్లుప్తంగా వివరించింది. శమంతకంగారు ముక్కున వేలేసుకున్నారు. మధుకిరణ్ శివాజీని మింగేసేలా చూశాడు. తాను చేసిన తప్పు ఇలా నలుగురి ముందు బహిర్గతమవడంతో అవనత వదనుడై నిలబడ్డాడు శివాజీ.

ఇలా జరుగుతుందని అతడు కూడా ఊహించి ఉండడు. లేనిపోనివి కల్పించిచెప్పి, తన భజన బృందం దగ్గర హీరో అయిపోదానుకున్నాడు. వికృతమైన మానసికానందాన్ని అనుభవించాలనుకున్నాడు. కాని, చివరకు ఘోరంగా పరాభవింపబడ్డాడు.

శమంతకం గారు అతడిని తీవ్రంగా మందలించారు. ఇకముందెప్పుడైనా ఇలా...నీచంగా ప్రవర్తిస్తే పై అధికారుల దృష్టికి తీసుకెళ్ళాల్సి ఉంటుందని ఘాటుగా హెచ్చరించారు.

"వర్ణించి, వర్ణించి నిజమనుకునేలా చెప్పాడు. నేనప్పుడే అనుకున్నాను మౌక్తికా మాడమ్ అటువంటివారు కాదని." ఇంతసేపూ శివాజీ వినిపించిన కట్టుకథలని ఏ రామాయణమో, మహాభారతమో వింటున్నంత ఆనందంగా ఆలకించినవాళ్ళు ఊసరవెల్లుల్లా రంగుమార్చి ప్లేటు ఫిరాయించారు.

మాలతి, నవనీతలకి చాలా వినోదం కలిగిస్తోందీ సంఘటన. వికృతానందం పొందుతూన్నట్లుగా చూస్తూ నిలబడ్డారు.

"మీరు చాలా తప్పు చేశారు శివాజీ గారూ... మీరు చేసినవి ఒకటి కాదు రెండు తప్పులు ... నిన్న రాత్రి వానలో మీకు ఆశ్రయమిచ్చిన మౌక్తికగారి పట్ల అసభ్యంగా ప్రవర్తించడం ఒకటైతే... జరిగినదాన్ని వక్రీకరించి ప్రచారం చేయడం ఇంకోటి.

స్త్రీ అంటే ఎవరనుకున్నారు? శక్తిస్వరూపిణి, మమతల పాలవెల్లి. మన తల్లి, చెల్లి, అక్క, భార్య అందరూ స్త్రీలే. వారిపట్ల ఎవరైనా ఈరకంగా ప్రవర్తిస్తే మనకెలా ఉంటుంది!?

కాస్త ఆలోచించండి. మగవాడి జీవితానికి ఆసరా, ఆలంబన అయిన మగువను అవమానిస్తే పుట్టగతులుండవు. ఇంకోసారి ఇటువంటి తప్పులు రిపీట్ కానివ్వకండి." మధుకిరణ్ మాటలు మెత్తగానే ఉన్నా, చురకల్లా తగిలాయి శివాజీకి.

అతడి బుర్ర భూమిలోకి కృంగిపోతోంది. ఎటూ మాట్లాడలేక బయటకి వెళ్లిపోయాడు.

"వెళ్లండయ్యా..వెళ్లండి. అందరూ సినిమా చూస్తున్నట్లుగా నిలబడ్డారు. 'చెప్పేవాడికి చెముడైతే వినేవాడికి వివేకం ఉండద్దూ! " కేకలేశారు శమంతకం గారు.

ఎవరి సీట్ల దగ్గరకి వారు వెళ్ళిపోయారు. మౌక్తిక మెదడంతా గజిబిజిగా గందరగోళంగా తయారైంది. తాను సదుద్దేశ్యంతో అతడిని ఇంట్లోకి రానిస్తే ఇతడింత వరస్ట్ గా బిహేవ్ చేశాడేమిటే!

నలుగురిలో తనను నవ్వులపాలు చేశాడు. తలెత్తుకోలేనంతగా పరాభవించాడు.   తన ముఖంమీద ఎవరూ ఏమీ అనకపోయినా ఒక్కొక్కరి చూపుల్లో ఒక్కో రకమైన భావం గోచరిస్తోంది.

'ఆ(...ఇది ఏదో చేసుంటుంది. లేకపోతే అతడంత నిర్భయంగా చెప్తాడా! కల్పించి చెప్పవలసిన అవసరం అతడికేముంది?' అన్న భావన కొందరిదైతే...

'అయ్యో పాపం! ఆడపిల్ల...ఇలా పదిమందిలో పలుచనైతే రేప్పొద్దున్న ఆమె భవిష్యత్తేమిటి?' అన్న జాలి కొందరి దృక్కుల్లో నిండి ఉంది.

అనుమానం, అవహేళన , జాలి, ఆసక్తి...ఇత్యాది భావాలు నిండిన వాళ్లచూపులు తనని చురకత్తులై చీల్చేస్తున్నట్లుగా ఉంది. మనసంతా మసకబారిన అద్దంలా తయారైంది. అది ఆమెను అంతర్ముఖురాలు కాకుండా అడ్డుకుంటోంది.

ఓదార్పుగా ఆమె వెన్ను నిమిరింది రమ్య.

"వ్వావ్...నువ్వు ' అంతర్ముఖి' వే అనుకున్నాను. అవసరమైతే 'ఆదిశక్తి'గా కూడా మారగలవని ఇప్పుడే తెలిసింది.'' చిలిపిగా నవ్వింది రమ్య.

ప్రస్తుతం తానున్న మూడ్ లోనుంచి బయటకు రప్పించడానికే ఆమె అలా అంటోందని మౌక్తికకి అర్థమైంది. కన్నీళ్ళు తుడుచుకుంటూ తేలిగ్గా నవ్వేసింది. రమ్య వదనం నిండా సంతోష తరంగాలు అలుముకున్నాయి.


"ఎందుకంత ఎక్సైట్ అయ్యావు ముక్తా...'' లాలనగా అడిగింది రమ్య.

ఇందాకటి తన ప్రవర్తన తలుచుకుని సిగ్గుగా తలదించుకుంది మౌక్తిక. కాని, తాను అలా రియాక్టవడం సబబే అని ఆమెకు తెలుసు.

"ఏ స్త్రీ అయినా తన క్యారెక్టర్ మీద చెడుముద్ర పడడం సహించలేదు రమ్యా. అతడు నామీద వేసినది నిందేనని నిరూపించకపోతే ...దాన్ని అలుసుగా తీసుకుని రేప్పొద్దున్న ఇంకెవడో, ఇంకేదో కూస్తాడు. అందుకే... నోరు తెరవాల్సి వచ్చింది''

"నిజమే ముక్తా... అపవాదు అగ్నికన్నా ప్రమాదకరమైనది. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా మనం దానికి ఆహుతైపోతాము. మంచిడోసే ఇచ్చావు వాడికి. ఈ దెబ్బతో నీజోలికే కాదు...మరే ఇతర ఆడదాని జోలికీ పోడు.'' అభినందించింది రమ్య.

"సారీ ముక్తాగారూ... మీకెదురైన పరిస్థితి ఇంకే ఆడపిల్లకీ ఎదురవకూడదు. కాని, మీరు స్పందించిన విధానం, అతడి వైఖరిని ఖండించిన తీరు మాత్రం అపూర్వం. ఆల్ ది బెస్ట్'' సుతిమెత్తని స్వరంతో ఆమెను మెచ్చుకుని తన సీటు దగ్గరకి వెళ్ళిపోయాడు మధుకిరణ్.




అతడివాక్కులు చెవిలో అమృతజలం చిలకరించినంత తీయగా ధ్వనించాయి. రమ్య సాభిప్రాయంగా చూసింది అతడివైపు.

అక్కడితో ఆగొడవ సద్దుమణిగింది.

-------------------------------- --------------------- ---------------------

"ఇవాళ నేను నీ గదిలోనే పడుకుంటాను ముక్తా..'' చేతిలో తలగడ, దుప్పటి సహితంగా లోపలికి వచ్చింది రమ్య.

"శరత్ ఏమయ్యారు?'' సంశయంగా ప్రశ్నించింది మౌక్తిక.

" క్యాంపుందంటూ ఇందాకే బయలుదేరి వెళ్లారు. ఎల్లుందికి కాని రారు'' అంటూ ఆమె పక్కనే సెటిలైపోయింది రమ్య.

అప్పుడప్పుడు వాళ్లకిది అలవాటే. ఇద్దరూ అర్ధరాత్రివరకు కబుర్లు చెప్పుకుంటూ పడుకుంటారు.

"ఆ(... అన్నట్లు నీకో విషయం చెప్పడం మరచాను.'' పడుకున్నదల్లా లేచి కూర్చుంది రమ్య.

"ఏంటో!'' ఆసక్తిగా అడిగింది మౌక్తిక.

"నిన్న మధుకిరణ్ నన్ను పిలిచి...'' సస్పెన్స్ లో ఆపింది రమ్య.

"ఆ... పిలిచి?'' ఆదుర్దాగా అడిగింది మౌక్తిక.

"కంగారు పడే విషయం కాదులే. నీ గురించి అడిగారంతే.''

"నా గురించా? ఏమని అడిగారు?''

"ఎందుకు బాలా ... ఆ ఎక్సైట్ మెంట్... నీ గురించి అంటే...నీ కుటుంబ నేపథ్యం, తదితర వివరాలన్నమాట''

"వాటిగురించి అతడికెందుకు మధ్యలో?'' ముఖం ముడుచుకుంది మౌక్తిక.

"హయ్యో రామా! ఇంకా నీకర్థం కాలేదా? అతడు... నిన్ను లవ్ చేస్తున్నాడే మొద్దూ...'' చెప్పింది రమ్య సంబరంగా.

నిశ్చేష్టురాలై ఉండిపోయింది మౌక్తిక. రమ్య చెబుతున్నది నిజమేనా! మధుకిరణ్ తనని ప్రేమిస్తున్నాడా! అదే నిజమైనే అతడి ఆరాధనను అందుకునే అదృష్టం తనకుందా?

అసలు... తన గురించి ఏం తెలుసునని తనని ప్రేమిస్తున్నాడు!? అతడికి తాను తగదని తెలిసిన నాడు అతడెలా స్పందిస్తాడు? తనని అసహ్యించుకుంటాడా! అన్నీ ప్రశ్నలే.

"ఏమిటే... మళ్లీ ముడుచుకుపోయావా?'' ఆమెకళ్ళముందు చేతులాడించింది రమ్య.

తడబడింది రమ్య.

" నీఊహ తప్పేమో రమ్యా...అతడు నన్ను ప్రేమిస్తున్నాడని నువ్వెలా భావించావు? అతడు నోరువిప్పి నీతో చెప్పాడా? అతడు నా గురించిన వివరాలు అడిగినప్పుడు నువ్వెలా స్పందించావు? నా వివరాలతో అతడికి పనేమిటని నిలదీయలేదూ!'' కలవరాన్ని కప్పిపుచ్చుకుంటూనే, రమ్య సమాధానం కోసం ఆత్రుతగా ఎదురు చూసిందిమౌక్తిక.

" అయిందా... నీ ప్రశ్న పరంపర? మన కాలేజ్ లో ఎంతోమంది పెళ్లికాని లేడీ స్టాఫ్ ఉండగా...అతడు ప్రత్యేకించి నీ వివరాలే ఎందుకడుగుతాడూ! ఇది ఫస్ట్ పాయింట్. ఇక రెండవది... నీ గురించి మాట్లాడుతున్నప్పుడు అతడి ముఖం వింత ఆనందంతో వెలిగిపోతుంది. నీపేరును అతడు మంత్రాక్షరాలు జపిస్తున్నంత పవిత్రంగా ఉచ్చరిస్తాడు. నీ ప్రస్తావన రాగానే ఆసక్తిగా చెవులొగ్గి మరీ వింటాడు.ఇవన్నీ చాలవా... అతడు నిన్ను ప్రేమిస్తున్నాడని గ్రహించడానికి!'' అవలీలగా తేల్చి చెపేసింది రమ్య.

ఆమాటలు అక్షరసత్యాలని అంగీకరించే తీరాలి. కాని, మౌక్తిక పరిస్థితే... అడకత్తెరలో పోకచెక్కలా ఉంది. ఎటూ చెప్పలేని డోలాయమాన స్థితి.

"నువ్వేమన్నావింతకీ?'' కుతూహలంగా అడిగింది మౌక్తిక.

రమ్య విశ్రాంతిగా మేనువాలుస్తూ" నీ గురించిన వివరాలు నీ అనుమతి లేకుండా వెల్లడించడం సభ్యత కాదని నాకు తెలుసు. అందుకే నాకంతగా తెలియదని దాటవేశాను. అయినా... నీ గురించి నాకేం తెలుసునని చెప్తానూ!'' దీర్ఘం తీసింది రమ్య కినుకగా.

అందులో... 'ఇంత సన్నిహితంగా ఉన్నా కూడా నాకేమీ తెలియదనడం ఎంత అసంబద్ధంగా ఉందో చూశావా!' అన్న దెప్పిపొడుపు ధ్వనించింది.

మౌక్తిక మౌనం వహించింది.

"అయినా ...ఒకవేళ అతడు నిన్ను ప్రేమిస్తున్నాడనే అనుకుందాం. అతడి ప్రేమని ఆమోదించడానికి నీకేం అభ్యంతరం? మనిషా ఉత్తమోత్తముడు. అందగాడు...ఉద్యోగస్తుడు. నిన్ను దేవతలా నెత్తిన పెట్టుకుని ఊరేగిస్తాడు. దానికి నేను గ్యారెంటీ. మరి దేనికి నీ సంకోచం?'' అతడిని చేపట్టడానికి ఇంతకన్నా అర్హతలు ఇంకేమి కావాలన్నట్లుగా ప్రశ్నించింది రమ్య.

రమ్య చెప్పినది నూటికి నూరుపాళ్ళూ సత్యం. అవేమీ అసత్యాలు, అసంగతాలు కావు. ఏ ఇంతైనా ఇలాంటి ఉత్తమ లక్షణాలు మూర్తీభవించిన పురుషుడినే తన జీవితంలోకి ఆహ్వానించాలనుకుంటుంది. అందులో ఏమాత్రమూ సందేహం లేదు.

కాని, ఇప్పుడు తానేం చేయాలి? ఒకవేళ అతడు డైరెక్ట్ గా ఈ విషయం తనతో ప్రస్తావిస్తే...తనకి ప్రపోజ్ చేస్తే ఏమని బదులీయాలి? ఏమిటీ సంఘర్షణ! ఏమిటీ నరకయాతన! మౌక్తిక మనసు అనేకరకాల సందేహాలతో, సంకోచాలతో త్రాసులో ముల్లులా అస్థిరంగా ఊగుతోంది.

ఆమెనే గమనిస్తోంది రమ్య. ఆమె ఎందుకో మథనపడుతోందని గ్రహించిందో ఏమో...

"సరేలే...ఇప్పుడా విషయం గురించి చర్చ దేనికి ? ఒకవేళ అతడు సడెన్ గా నీముందుకొచ్చి అతడి మనసులోని మాటను డైరెక్ట్ గా చెప్పేస్తే, నువ్విబ్బంది పడతావేమోనని ముందు జాగ్రత్త కోసం ఈ విషయం నీతో చెప్పాను. అప్పటి సంగతి ఆలోచిద్దాం కాని, నువ్వు పడుకో...'' అంది ఆవిలిస్తూ.

మరుక్షణంలో పక్కకు తిరిగి నిద్రలోకి జారుకున్న ఆమెను బలవంతంగా లేపి కూర్చోబెట్టి, నాలుగు తన్నాలనిపించింది మౌక్తికకి.

'తన మానస సరోవరంలో గులకరాయి పడేసి, అంతులేని ప్రకంపనలు సృష్టించి, తను మాత్రం హాయిగా గుర్రెట్టి నిద్రపోతోంది. పాపి... మిత్రద్రోహి...' నోటికి వచ్చిన తిట్లన్నీ తిట్టేసుకుంది మౌక్తిక.

చాలాసేపు గింజుకున్న తరువాత మౌక్తిక కనురెప్పలు మూతబడ్డాయి.

---------------------- ----------------------- ----------------------

'యవ్వన మధువనిలో... వన్నెల పూవుల ఉయ్యాలా...'' ఉయ్యాల ఊగుతోంది జోరుగా.

మౌక్తిక తనువు గాలిలో తేలిపోతున్నట్లుగా ఉంది. మనసు మైమరచి మధురరాగాలాలపిస్తోంది.

అంతలోనే... ఎప్పటిలాగానే... అమ్మో! స్పర్శ... బరువైన మెత్తని స్పర్శ...జుగుప్సని కలిగించే స్పర్శ.

సుతిమెత్తని ఆమె కంఠసీమ చుట్టూ దండలా చుట్టుకుని, రక్తనాళాలు తెగిపోయేలా మెడచుట్టూ బిగుసుకుంటూ... ఆమెను ఉక్కిరిబిక్కిరి చేసే విచిత్రమైన స్పర్శ.

తన గొంతుచుట్టూ హారాల్లా అల్లుకుంటున్న ఆ పాములను తీసి పారేయాలని ప్రయత్నించింది మౌక్తిక.

కాని, సాధ్యపడలేదు. ఆమె తీసేద్దామనుకున్న కొద్దీ మరింతగా అల్లేసుకుంటున్నాయి ఆ సర్పాలు.

ఇంతలో... గగనతలం నుంచి కిందికి దిగివస్తూ...గాలిలో అలవోకగా తేలుతూ...ఆమెవైపే వస్తోంది...తెల్లని పారిజాత సుమమాల.

మత్తైన సువాసన. స్వర్గలోకంలోని నందనవనంలో విరబూశాయేమో...దివ్యమైన సుగంధాలను నలుదిక్కులా వెదజల్లుతున్నాయి ఆ దేవపుష్పాలు.

అందాలొలికే ఆపారిజాత సుమమాలిక మౌక్తిక వైపే వస్తోంది. కాంతులీనే ఆమె గళసీమను అలంకరించేందుకే వస్తోంది.

ఆనందంతో పరవళ్ళు తొక్కింది మౌక్తిక మది.

తన మెడని ఆప్యాయంగా కౌగిలించుకునేందుకు వస్తున్న ఆ అద్భుతహారాన్ని చూసి మురిసిపోయింది మౌక్తిక.

అప్పటికే... అతిబలంగా ఆమె మెడచుట్టూ పెనవేసుకుని ఉన్న ఆ పాములు " నీకిక్కడ స్థానంలేదు... ఆచోటుని మేమెన్నడో ఆక్రమించేశాము.'' అంతూ వికటాట్టహాసం చేశాయి.

అంతేకాదు... మౌక్తికను చేరడానికి ఆత్రంగా వస్తున్న ఆ విరిదండను, తమ తోకలతో విసిరికొట్టాయి.

అధాటికి...దూరంగా మట్టిలో పడిపోయిన ఆ పారిజాతమాలిక' ఏంచేయనూ...ఎంతో ఆశగా నీమెడను చేరడానికి వస్తున్న నన్ను నెట్టి పారేశాయవి. సున్నితమైన నన్ను నీ చెంత చేర్చుకునే అదృష్టం నీకులేదు.'' అంటూ జాలిగా పలకరించింది ఆమెని.

మౌక్తిక మృదువైన చేతులు ఆపాములను వదిలించుకునే ప్రయత్నం చేసీ...చేసీ... అలసిపోయి, బలహీనమై మరింతగా కందిపోయాయి.

నిస్సహాయంగా భూమ్మీద రాలిపోయిన ఆ పూలహారాన్ని...విజయగర్వంతో చూశాయి ఆపాములు.

దిగ్గునలేచి కూర్చుంది మౌక్తిక. ఎప్పుడూ వచ్చే ఆకల... ఆరోజు మరికాస్త విచిత్రంగా వచ్చింది. సాధారణంగా...తనపక్కన ఎవరైనా తోడుంటే ఆ కల రాదు. కాని, ఇవాళ పక్కనే రమ్య ఉన్నా ఆ కల వచ్చింది.

మౌక్తిక నిద్రలోనుంచి ఉలిక్కిపడి మేలుకున్నందువలన ఆ విసురుకి ఆమె చేయితగిలి మంచంపక్కనే ఉన్న నీళ్లజగ్గు పెద్ద చప్పుడుతో కిందపడింది. జగ్గులోని నీళ్లన్నీ కళ్లాపి జల్లినట్లుగా నేలమీద పడ్డాయి.

గాఢనిద్రా పరవశురాలై ఉన్న రమ్య డిస్టర్బ్ అయినట్లుగా కళ్ళు తెరిచింది. మౌక్తిక గుండె దడదడమంటూ వేగంగా కొట్టుకుంది. ఒళ్లంతా ముచ్చెమటలు పోశాయి.

అప్పుడప్పుడు...పిలవని పేరంటంలా తన ప్రమేయం లేకుండా వచ్చి తనను పలకరిస్తూ భయభ్రాంతురాలిని చేసే ఈవిచిత్రమైన కలకి ఈ వింత పొడిగింపేమిటి! దీనర్థం ఏమైఉంటుంది?

జీవితాంతం ఇలా... ఈ పీడకల బారిన పడుతూ... ఒత్తిడికి గురౌతూ...తానిలా నరకయాతన అనుభవించవలసిందేనా!? అంతులేని ఆవేదన మౌక్తిక మదిని అతలాకుతలం చేసింది.

ఆమె స్థితిని గమనించిన రమ్య లేచికూర్చుంది.

"ఏమైంది ముక్తా... ఎందుకలా భయపడుతున్నావు? పీడకలేదన్నా వచ్చిందా!'' మౌక్తిక వీపుమీద నిమిరింది రమ్య సాంత్వనగా.

మాట్లాడలేనన్నట్లుగా సైగచేసింది మౌక్తిక. రమ్య వెళ్లి గ్లాసుతో మంచినీళ్ళు తెచ్చి ఆమెచేత తాగించింది. ఫ్యాన్ ఫుల్ స్పీడ్ లో పెట్టింది. చల్లని నీళ్ళు తాగిన తరువాత మౌక్తిక ప్రాణం తెరిపినపడింది. దడ, ఆయాసం తగ్గుముఖం పట్టాయి.

రమ్య ఓపిగ్గా అంత సేపూ ఎదురుచూసి" ముక్తా... నన్ను నీ బెస్ట్ ఫ్రెండ్ అని అంటావే గాని. ఏనాడూ కూడా నీమనసులోని బాధ నాకు చెప్పవు. ప్లీజ్... అలా నిద్రలోనుంచి ఎందుకులేచావు? ఏదన్నా పీడకల వచ్చిందా?'' అనునయంగా అడిగింది రమ్య మౌక్తికను పొదివిపట్టుకుంటూ.

ఆ లాలనకి మంచులా కరిగిపోయింది మౌక్తిక.ఆమె భుజంమీద తలవాల్చి తెప్పరిల్లుతున్నట్లుగా ఉండిపోయింది కాసేపు.

"అవును రమ్యా... అది పీడకలే. అది తరుచూ వస్తూంటుంది. ఆకల వచ్చినప్పుడు నాకు చెప్పలేనంత భయమేస్తుంది. ఆకల పదేపదే ఎందుకు వస్తోందో...నన్నెందుకింత ఆరడి పెడుతోందో నాకు తెలియడంలేదు.'' అంతూ నెమ్మదిగా తనకొస్తూన్న ఆ కలను వివరించింది మౌక్తిక.


చిత్రంగా ఆమె మనసెంతో తేలికపడింది. రమ్య చెప్పింది నిజమే... మనసులోని బాధను ఆప్తులతో పంచుకుంటే ఎదబరువుతీరి తేలికపడుతుంది.

రమ్య సాలోచనగా ఆమెవైపు చూసింది. ఆ చూపులో ఎన్నో భావాలు.

"చాలా థాంక్స్ ముక్తా... ఇప్పటికైనా నన్ను నీ ఆత్మీయురాలిగా అంగీకరించావు. నేనెక్కడో చదివాను... మనకొచ్చే కలలు మన ఆలోచనలకి ప్రతిబింబాలని. మెలకువలో మన అంతరంగాలలో బలవంతంగా అదిమేసే ఆలోచనలే... కలత నిద్రలో కలలుగా వచ్చి మనలని కల్లోల పెడతాయట. పాములు కలలో కనబడితే దానికి అనేక అర్థాలు చెబుతారు. ముఖ్యంగా...''

అర్ధోక్తిలో ఆగిపోయిన రమ్యను చూస్తూ "ఏమిటే ...ఏదో చెప్పబోతూ ఆగిపోయావూ...చెప్పు.'' అంది మౌక్తిక.

"నాకు తెలిసిన, నేను చదివిన పరిజ్ఞానంతో చెబుతున్నాను... నువ్వు తప్పుపట్టుకోకూడదు మరి!'' సంశయంగా అంది రమ్య.




ఆమె ఎందుకు సంకోచిస్తోందో అర్థం కాకపోయినా "నేనేమంటాను చెప్పు! ప్లీజ్ కంటిన్యూ." అంది మౌక్తిక.

"పాములు... తీరని లైంగిక వాంఛాలకి సంకేతాలుగా భావిస్తారు కలలమీద పరిశోధనలు చేసేవారు. నీకు కూడా..." తతపటాయించింది రమ్య.

అటువంటి సున్నితమైన అంశాలను ప్రస్తావించడానికి ఎందుకో ఇబ్బందిగా అనిపిస్తోందామెకి.

ఈ చర్చపట్ల మౌక్తిక ఎలా రియాక్టౌతుందోనని మనసులో గుబులుగా ఉంది.

కాని, మౌక్తిక ఆమెని ఖండించలేదు.. అలా...తలదించుకుని మౌనంగా ఉండిపోయింది.

"లైంగిక పరమైన ఆలోచనలు కలగడం తప్పా రమ్యా?" కాసేపటి తరువాత మెల్లగా ప్రశ్నించింది.

రమ్య విస్తుపోయి చూసింది. ఆతరువాత ఏదో అర్థం అయినట్లుగా తల పంకించింది.

"తప్పెలా అవుతుంది ముక్తా? ఆహార, నిద్రా, భయ మైధునాలు ఏ మనిషికైనా ప్రకృతిపరంగా రేకెత్తే 'సహజ ప్రవృత్తులు'. వాటిని తీర్చుకోవాలని ఏ మనిషైనా వాంఛిస్తాడు. మన మనసుతో ప్రమేయం లేకుండానే వాటంతట అవే మనిషిలో సహజంగా ఉత్పన్నమౌతాయి. నీమనసులో ఏముందో నాకు తెలియదు. నీ కలలకు పూర్తి అర్థం చెప్పేంత పరిజ్ఞానమూ నాకులేదు. కాని నువ్వనుభవిస్తున్న మానసిక సంఘర్షణకి, తరచుగా వచ్చి నిన్నిబ్బందిపెట్టే కలకు ఏదో... సంబంధం ఉండితీరాలి." దీర్ఘంగా నిట్టూర్చింది రమ్య.

మౌక్తిక మాట్లాడలేదు. ఆమె మనసు అల్లకల్లోల సంద్రంలా ఉంది. రమ్య ముందు మనసు

విప్పాలని ఉందామెకి.ఆమె ఓదార్పులో సేద తీరాలని కూడా అనిపిస్తోంది. కాని,వ్యక్తపరచలేని అభ్యంతరమేదో ఆమెని పట్టి ఆపేస్తోంది.

"నీమనసులో మాట నాతో పంచుకోమని నిన్ను ప్రెస్ చేయను. చెప్పడం చెప్పకపోవడం అన్నది నీ ఇష్టం. కాని, నీ వేదన నాకు తెలిస్తే నేనేరకంగానైనా నీకు సహాయపడగలనేమోనని నా ఆరాటం. నీకొచ్చిన ఈ కలను విశ్లేషించి, దానికి భాష్యం చెప్పగలిగిన వ్యక్తొకరున్నారు. ఆయన దగ్గరకు నిన్ను తీసుకెళ్తాను.'' అంది రమ్య.

"ఎక్కడికి" అని మౌక్తిక అడగలేదు. 'ఫలానా చోటుకి' అని రమ్య చెప్పలేదు. రమ్య తన మేలుకోరే వ్యక్తే కాని,కలలోనైనా తనకు కీడు తలపెట్టదు. అందుకే భారం ఆమెపైన మోపి అలాగేనని తలూపింది రమ్య.

"దైవనామస్మరణ చేసుకుంటూ ప్రశాంతంగా పడుకో... హాయిగా నిద్రపడుతుంది.'' ధైర్యం చెప్పింది రమ్య.

ఆమె ఇచ్చిన సూచన పాటించిన మౌక్తిక కాసేపటికి నిద్రపోయింది.

----------------------- ---------------------- --------------------------

"డాక్టర్ యతిరాజ్' (సైకాలజిస్ట్)...గేటుముందు ముచ్చటగా రాయబడి ఉన్న ఆబోర్డ్ వైపు ప్రశ్నార్ధకంగా చూసింది మౌక్తిక.

రమ్య తనని ఇక్కడికెందుకు తీసుకొచ్చినట్లు!?

ఆమె ఆశ్చర్యాన్ని గమనించినదానిలా " నాతోరా...'' అంది రమ్య ఆమెలో మరింత ఉత్కంఠని రేపుతూ.

సంశయంగానే ఆమెవెంత లోపలికి నడిచింది మౌక్తిక. కాలింగ్ బెల్ మ్రోగించిన మూడు నిముషాల తరువాత తలుపులు తెరుచుకున్నాయి.

తలుపుతీసినామె పనిమనిషి కాబోలు..."ఎవరు కావాలండీ'' అని అడిగింది.

"యతిరాజ్ గారున్నారా? పొద్దున్న ఫోన్ చేసి అపాయింట్ మెంట్ తీసుకున్నాం.'' చెప్పింది రమ్య.

"ఉన్నారమ్మా... లోపలికి వచ్చి కూర్చోండి.'' అందామె గుమ్మానికి అడ్డు తొలుగుతూ.

ఇద్దరూ లోపలికి వెళ్ళి కూర్చున్నారు.ఆ లివింగ్ రూమ్ అత్యాధునికమైన ఫర్నిచర్ తో అందంగా అలంకరించబడి ఉంది. గోడలకి లేత నీలిరంగు ఎమల్షన్ పెయింట్ వేయడం వలన ఎంతో డీసెంట్ లుక్ వచ్చింది.

మెత్తని సోఫాలు, అక్కడక్కడ అమర్చిన ఇండోర్ ప్లాంట్స్, కిటికీ గ్రిల్ కి పాకించిన మాలతీలత... ఆవాతావరణం ఎంతో ఆహ్లాదభరితంగా ఉంది.

మౌక్తికనింకా సందిగ్ధానికి గురిచేయడం ఇష్టంలేనట్లుగా చెప్పింది రమ్య" యతిరాజ్ గారు మా డాడీకి బెస్ట్ ఫ్రెండ్. సైకాలజీలో మాస్టర్ డిగ్రీ తీసుకున్నారు. ప్రత్యేకించి 'కలలు' అనే అంశం మీద పరిశోధన చేసి డాక్టరేట్ తీసుకున్నారు. ఆయన్నడిగితే నీకలని విశ్లేషిస్తారేమోననీ...''

మౌక్తిక కళ్ళమ్మట నీళ్ళు తిరిగాయి. తన పట్ల ఇంత శ్రద్ధ తీసుకుంటున్న ఆమెని ఏవిధంగా మెచ్చుకోవాలో ఆమెకి తెలియడంలేదు.

ఇంతలో ఎవరో వస్తున్నట్లుగా మెత్తటి అడుగుల సవ్వడి వినిపించింది. చప్పున కళ్ళు తుడుచుకుని ఆ వైపు చూసింది రమ్య. ఒక నడివయసు వ్యక్తి ఆగదిలోకి వచ్చాడు. అతడిని చూస్తూనే లేచి నిలబడింది మౌక్తిక.

రమ్య మాత్రం అలా కూర్చునే "గుడీవినింగ్ అంకుల్'' అంది మర్యాదపూర్వకంగా.

"గుడీవినింగ్ రా...ఎలా ఉన్నావు? శరత్ బాగున్నాడా?'' ఆప్యాయంగా పలకరించాడాయన.

"వియ్ ఆర్ ఫైన్ అంకుల్. ఈమె నా ఫ్రెండ్ మౌక్తిక.'' అంది రమ్య మౌక్తికను పరిచయం చేస్తూ.

మౌక్తిక వినయంగా ఆయనకి నమస్కరించింది. కూర్చోమన్నట్లుగా సోఫా చూపించాడాయన.

ఆయన చూడడానికి సామాన్యంగా ఉన్నా ముఖంలో ఏదో వింతతేజస్సు ఉట్టిపడుతోంది. నిరంతరం విజ్ఞానామృతపానం చేయడం వలన కాబోలు  కళ్లలో ఏదో కాంతి నిండిఉంది. కళ్లకు దళసరి అద్దాలున్న కళ్ళజోడు, సాదాగా కనబడే వస్త్రధారణ, చురుకైన చూపులతో ఆయన చాలా హుందాగా కనిపిస్తున్నాడు.

"చెప్పరా రమ్యా...అపాయింట్ మెంట్ కావాలని అడిగావూ...బయటవాళ్లకైతే అపాయింట్ మెంట్లూ అవీనూ...నువ్వు ఎప్పుడైనా రావచ్చు.'' మృదువుగా అన్నాడు యతిరాజ్.

"మీరు చాలా బిజీ కదా అంకుల్... అపాయింట్ మెంట్ తీసుకుని వస్తే మీకూ మాకూ కూడా మంచిదనీ...'' నవ్వింది రమ్య.

ఆయనా నవ్వేశాడు.

"ఈమధ్యన చాలా రోజులుగా మాఫ్రెండ్ కి ఓ వింతకల వస్తోంది. దానివలన తను మానసికంగా చాలా డిస్టర్బ్ అవుతోంది. ఆకల ఎందుకొస్తోందో మీరు అనలైజ్ చేసి, ఆమెకి మనశ్శాంతి కలిగేందుకు ఏదైనా రెమిడీ సూచిస్తారేమోనని... మీదగ్గరకు తీసుకొచ్చాను.'' రమ్య చెప్పింది క్లుప్తంగా.

యతిరాజ్ ఆసక్తిగా చూశాడు మౌక్తికవైపు. తన పరిశోధనకి కొత్త సబ్జెక్ట్ లభించిన అనందమా అది!...

నవ్వుకుంది మౌక్తిక.

"చెప్పమ్మా మౌక్తికా...ఆకల ఏమిటో నాకు సవివరంగా చెప్పు...'' సౌమ్యంగా అడిగాడు యతిరాజ్.

కొత్తవ్యక్తులముందు నోరిప్పే అలవాటు మౌక్తికకులేదు. మనసిప్పడం మరీతెలియదు. ప్రియమైన నెచ్చెలి రమ్యకే  తన మదిలోని బాధ ఏనాడూ చెప్పుకోలేదు. ఇప్పుడీ అపరిచిత వ్యక్తిముందు తన హృదయఘోషను ఎలా వెల్లడించగలదు! కల గురించి విన్నాక ఈయన తానేదో తీరని కోరికలతో కొవ్వెక్కి కొట్టుకుంటోందని అపోహచెందితే?

సంశయంగా వెనుకంజ వేస్తున్న మౌక్తికకేసి చిరాగ్గా చూసింది రమ్య.

"ఆయన కలలమీద రీసెర్చ్ చేసి పట్టా పుచ్చుకున్న వ్యక్తి. నీకొచ్చిన ఆపాడుకలని విశ్లేషించి, నీ ఒత్తిడి తగ్గే మార్గం చెబుతారని ఇక్కడికి తీసుకొచ్చాను. నువ్వు ఆయనకి నీకల గురించి మాత్రమే చెబుతున్నావు. నీ జీవిత చరిత్ర మొత్తంకాదు...ఆయన సమయం చాలా విలువైనది. మురిపించుకోక మొదలుపెట్టు'' కాస్త కోపంగా మౌక్తికకు మాత్రమే వినబడేతట్లు అంది రమ్య.

అలా అనడంలో ఆమెలోని సహనం తగ్గుముఖం పట్టినట్లుగా అనిపించింది. ఇక తప్పదన్నట్లుగా ప్రారంభించి మౌక్తిక. అలా... బిడియపడుతూనే తనకొచ్చే కల, దానిలోని అంశాలు...అన్నీ పొల్లుపోకుండా వివరించింది.

చెప్పడానికి ముందున్న సంకోచం చెప్పేశాక తొలగిపోయింది.

యతిరాజ్ భృకుటి ముడివడింది ఒక్కసారి. ఆలోచనా నిమగ్నుడై అలా తదేక దృష్టితో చూస్తూండి పోయాడు. ఆయనేం చెప్పబోతున్నాడో అని... మౌక్తిక ఉద్విగ్నతతోనూ, రమ్య ఉత్సుకతతోనూ చూస్తూండిపోయారు.

"కలలు-వాటి ఫలితాలు...దీనిగురించి తెలుసుకోవాలంటే ముందు మనం మూలాల్లోకి వెళ్ళాలి. జ్యోతిష్య శాస్త్రవేత్తలు, సిద్ధాంతులు... ఈ కలలనోరకంగా విశ్లేషిస్తే మనస్తత్వశాస్త్రం ఇంకోరకంగా విశ్లేషిస్తుంది. రెండూ విభిన్నకోణాలు. దేనినీ మనం తక్కువ అంచనా వేయకూడదు. దేన్ని నమ్మేవారు దాన్ని నమ్ముతారు.

మనిషి జీవితం ఎన్నోరకాల అనుభవాల సమాహారం. అనేకరకాలైన భావోద్వేగాల సమ్మేళనం. మనం నిరంతరం అనేకరకాలైన సమస్యలతో పోరాటం చేస్తూ అంతులేని సంఘర్షణకి లోనౌతూ ఉంటాము. ఆ ఘర్షణ ఫలితంగా అంతులేని మానసిక ఒత్తిడి ఏర్పడుతూ ఉంటుంది.

కొందరు తమ మనసులోని భావాలను, బాధలను సన్నిహితులతో పంచుకుని ఈ ఒత్తిడిని పారద్రోలుతారు. మరికొంతమంది మాత్రం మనసులోనే బలవంతంగా అదిమేసుకుని తమలోతామే నలిగిపోతూ ఉంటారు. ఫలితంగా ఆఒత్తిడి మరింత అధికమై రకరకాల శారీరిక మానసిక రుగ్మతలుఎదురౌతూ ఉంటాయి.

ఆకలి, నిద్ర కరువవుతాయి. తీవ్రమైన ఒత్తిడికి గురైనవారు ఎంతో ప్రయత్నిస్తేగాని నిద్రపోలేరు. ఒకవేళ నిద్రపట్టినా చప్పున మెలకువ వచ్చేస్తుంది. అటువంటి కలత నిద్రలోనే కలలు వస్తాయి. మన జీవితానికి, మనం కనే కలలకి సంబంధం ఉండి తీరాలన్న నిబంధనేమీలేదు.

కాని, చాలామంది అనుభవాలను, వారికొచ్చే కలలను బేరీజు వేసి చూస్తే ...జీవితంలో వారు చవిచూసిన చేదు అనుభవాలు మనసుపై చెరగని ముద్ర వేసినప్పుడు... ఆముద్రలోనుంచి ఉద్భవించాయి వారికొచ్చే కలలు.

సగం సుషుప్తావస్థ, సగం జాగృదావస్థ లో ఉన్నప్పుడు ఆ అనుభవాలు కలిగించే వేదన కలలరూపంలో వచ్చి వారిని వెంటాడుతూనే ఉంటుంది."

యతిరాజ్ కంఠస్వరం మెస్మరైజ్ చేస్తున్నట్లుగా ఉంది. ఆయన చెబుతున్న విధానం ఎదుటి వ్యక్తులని ఆకట్టుకునేలా ఉంది.

"నీకొస్తున్న కలనే తీసుకుందాం. అందమైన పువ్వులతోటలో ఉయ్యాలలూగుతున్నావు. హాయిగా విహరిస్తున్నావు. నిన్ను ఆ ఆనందానికి దూరం చేస్తూ...కొన్ని పాములు నీమెడ చుట్టూ అల్లుకుని నిన్ను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. వాటినుంచి విడిపించుకోవడానికి నువ్వు శతవిధాల ప్రయత్నిస్తున్నావు. అంతలో...అందమైన పారిజాతపూలమాలిక తనంత తానుగా నిన్ను చేరడానికి వస్తోంది. నువ్వు ఆనందంతో పులకించిపోయావు.కాని, ఆపాములు ఆ విరిదండని నీదగ్గరకి రానీయక తమ తోకలతో దూరంగా విసిరికొడుతున్నాయి. ఇదేగా... నీకల సారాంశం." మౌక్తికను ప్రశ్నించాడు యతిరాజ్.

అంతేనన్నట్లుగా తలూపింది మౌక్తిక.ఆమెకి చాలా కుతూహలంగా ఉంది... ఆయన తన కలని ఏరకంగా విశ్లేషిస్తాడోనని.

ఇంతలో పనిమనిషి ఒక ట్రేలో ఫ్రూట్ జ్యూస్ లున్న గ్లాసులని తీసుకొచ్చి వాళ్ళకి అందించింది. యతిరాజ్ కోరికమేరకు స్నేహితురాళ్ళిద్దరూ జ్యూస్ తీసుకుని సిప్ చేయసాగారు.

"చూడమ్మా మౌక్తికా...నీ కలలో పాములు కనబడ్డాయంటే దానికి గల కారణాన్ని జ్యోతిష్యశాస్త్రం

వేరేగా చెబుతుంది. ఎవరికైనా కలలో పాములు కనబడితే... ఆవ్యక్తికి ఏదో కీడు జరుగుతుందని భావిస్తారు సిద్ధాంతులు. ఆవ్యక్తి జాతకచక్రంలో ' కాలసర్పదోషం' కనుక ఉండి ఉంటే కూడా పాములిలా పదేపదే కలలో కానవస్తాయని చెబుతారు. ఏ శ్రీకాళహస్తిలోనో, లేకపోతే సుబ్రహ్మణ్యేశ్వర స్వామి గుడిలోనో అభిషేకం జరిపించుకుంటే ఆకీడు తొలగిపోతుందని సూచిస్తారు.

అంతేకాదు... ఆ పారిజాత సుమమాలిక కలలో కనిపించడానికి కూడా అర్థాన్ని వారు చెబుతారు. తెల్లని పూలదండ కలలో కనిపిస్తే వారి సమీప భవిష్యత్తులో వాళ్లకేదో మంచి జరగబోతోందని అర్థం అంటారు.

కాని, పాములు కలలో వస్తే...మనస్తత్వశాస్త్రం ఏమని చెబుతుందో తెలుసా!?

మనమదిలో అల్లకల్లోలమైన ఆలోచనలు కలిగినప్పుడు, మనిషి మానసికంగా శాంతిగా ఉన్నప్పుడు... ఆశాంతిని పారద్రోలే ఔట్ లెట్ గా అటువంటి కలలు వస్తాయని చెబుతుంది.

మనిషిలో తీరని కోరికలు ఏమన్నా ఉన్నప్పుడు...ముఖ్యంగా సెక్సువల్ డిసైర్స్ కలిగినప్పుడు... అవి తీర్చుకోలేని మార్గం మనిషికి లేనప్పుడు... ఆ కోరికలు అలా పాముల రూపంలో కలలో వచ్చి మానసికంగా వేధిస్తాయి.''

యతిరాజ్ మాటలకి మౌక్తిక ఇబ్బందిగా కదిలింది కూర్చున్నచోటే. అది ఆయన దృష్టిపథాన్ని దాటిపోలేదు.

"సెక్సువల్ డిజైర్స్ కలగడం ఏమీ తప్పుకాదు మౌక్తికా...పైపెచ్చు అలా కలగలేదంటే ఆమనిషి ఆరోగ్యం సరిగ్గా లేదేమోనని అనుమానించాల్సి వస్తుంది. యుక్తవయసులో ఉన్న స్త్రీపురుషులెవరికైనా అది సహజ పరిణామం. దాన్ని నేరంగానో, ఘోరంగానో పరిగణించాల్సిన పనిలేదు.'' సున్నితంగా ఉన్న యతిరాజ్ స్వరం మౌక్తికలోని భయాందోళనలను, సంకోచాలను పటాపంచలు చేసింది.

" సైకాలజీ అనేది ఓ గొప్ప శాస్త్రం. దీని సహాయంతో మనుషుల మనస్తత్వాలను, వారి బాహ్య ప్రవర్తనను బట్టి కొంతవరకు అంచనా వేయవచ్చును. నీకొచ్చిన కలలో పూలతోట దేనికి చిహ్నమో తెలుసా?... యవ్వనం... అవును...యవ్వనమే. ప్రతి మనిషి జీవితంలోనూ నాలుగు ముఖ్యమైన దశలుంటాయి.

అవి...బాల్యం, కౌమారం, యవ్వనం, వృద్ధాప్యం. అన్నింటికన్నా అపురూపమైన దశ బాల్యం. బాల్యం ఇచ్చే ఆనందాన్ని, అనుభూతులని మరే దశా ఇవ్వలేదన్నది నిర్వివాదాంశం.

బాల్యాన్ని, కౌమారాన్ని దాటి యవ్వన దశలోకి ప్రవేశించిన మనిషికి వర్ణించనలవి కాని వింత అనుభూతులేవో జనిస్తాయి. ఈ ప్రపంచమంతా సుగంధభరిత పుష్పాలతో నిండిన నందనవనంలాగానూ, వయస్సు వన్నెల ఇంద్రధనుసు లాగానూ అనిపిస్తూ ఉంటుంది.

తమని తాము మరచి స్వేచ్ఛగా విహరించాలని అనిపిస్తుంది.

అటువంటి ఉరకలెత్తే ఉడుకువయసులో... ఉన్నట్లుండి...ఏదో ఒకబంధం... ఏర్పడితే! అకస్మాత్తుగా మనిషికి కళ్ళాలుపట్టి లాగి, కాళ్లకు సంకెళ్ళు వేసినట్లనిపిస్తుంది. మనిషి జీవితం హాయిగా సాగిపోవడానికి కూడు, గూడు, గుడ్డ లాంటి ప్రధానావసరాలు తీరడంతో పాటు, స్వేచ్ఛ స్వతంత్రం కూడా కావాలి. వాటిని హరించేబంధం ఏదో బిగుసుకున్ననాడు, మనిషి మనసులో విస్తృతంగా ఉత్పన్నమయ్యే భావపరంపరలకి అవరోధం ఏర్పడిననాడు...భరించలేనంత ఒత్తిడి మనిషిలో ఏర్పడుతుంది.

నీ విషయంలో ఇలాంటిదేదైనా జరిగి ఉండాలని నా అభిప్రాయం.ఫ్రీబర్డ్ లా ఏబాదరబందీలు

లేకుండా హాయిగా గడిపే నిన్ను ఏదో బంధం, గట్టిగా పట్టి నీ అడుగులు ముందుకు పడకుండా వెనక్కు లాగుతోంది. ఆబంధానికీ, నీ మనసుకీ అనునిత్యం సంఘర్షణ.. ఆసంఘర్షణకి ప్రతిఫలం ఒత్తిడి... ఆ ఒత్తిడి బయటకుపోయే గవాక్షం పదేపదే నీకొచ్చే స్వప్నం.

నువ్వు వదల్చుకోలేని ఆబంధం పాములరూపంలో నీమెడకి చుట్టుకుంటోంది.నిన్ను అశాంతిపాలు చేస్తోంది.

యతిరాజ్ మాటలు మౌక్తికను తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యేలా చేశాయి. ఆయన పలికే ప్రతి అక్షరం కాదనలేని తిరుగులేని వాస్తవం.

రమ్య ఒరకంట ఆమెనే గమనిస్తోంది. మౌక్తిక వదనంలో చకచకా మారే రంగులు ఆమెను తీవ్ర ఆశ్చర్యంలో కూరుకుపోయేలా చేస్తున్నాయి.

మౌక్తిక నిస్సత్తువగా సోఫాలో చేరబడిపోయింది. మనస్తత్వశాస్త్రం అంటే ఇదేనా? తన మనసులోని అణువణువు చదివేసినట్లుగా చెబుతున్నాడీయన. అతడిలోని ఈ జ్ఞానమంతా ఆశాస్త్రాన్ని అధ్యయనం చేయడం వలన వచ్చిన ఫలితమేనా! మనిషికొచ్చే కలలకి...వారి వ్యక్తిగత జీవితానికి ఇంత దగ్గర సంబంధముందా!




మౌక్తిక ముఖ కవళికలను పసిగట్టిన యతిరాజ్ అన్నాడు "రిలాక్స్ మౌక్తికా... ప్లీజ్ రిలాక్స్ . నిన్ను హర్ట్ చేయడానికో, ఇబ్బంది పెట్టడానికో నేనివన్నీ చెప్పడంలేదు.ఇవన్నీ హండ్రడ్ పర్సెంట్ నిజాలు కావాలని కూడా లేదు. నీమనసులో పేరుకుపోతున్న ఒత్తిడిని తగ్గించుకుని, నిన్ను నువ్వు కంట్రోల్ చేసుకుంటావని చెబుతున్నాను.''

అప్పుడు కల్పించుకుంది రమ్య. "అదిసరే అంకుల్...మౌక్తికకి వచ్చే కలలో ఈమధ్య కొత్తగా

కనిపిస్తున్న పూలమాలకి అర్థం ఏమిటి?''

"అక్కడికే వస్తున్నాను. మౌక్తిక తనను అంటిపెట్టుకుని ఉన్న పాతబంధాలను వదల్చుకుని, తన జీవితంలోకి సరికొత్త బంధాన్ని స్వాగతించాలని అనుకుంటూ ఉండి ఉండవచ్చును. ఆసరికొత్త బంధానికి అర్థమే ఆపూలమాల.

తనని బలంగా అంటిపెట్టుకున్న పాత బంధాలను వదిలించుకోలేక, ఈసరికొత్త బంధానికి స్వాగతం పలకలేక ఆమె మానసికంగా ఎంతో చిత్రహింస అనుభవిస్తూ ఉండిఉండాలి.''

ముక్కుమీదకు జారిపోతున్న కళ్ళద్దాలను పైకి తోసుకుంటూ మాట్లాడుతున్న యతిరాజ్ వైపు విస్మయంగా చూసింది మౌక్తిక. ఇంత సామాన్యంగా కనిపిస్తున్న ఇఅతడిలో ఎంత జ్ఞానం దాగుంది! ఎంత చక్కని విశ్లేషణ. ఇంతటి అద్భుతమైన వ్యక్తిని పరిచయం చేసిన రమ్యమీద అంతులేని కృతజ్ఞతాభావం మొలకెత్తింది మౌక్తిక మదిలో.

"చూడమ్మా మౌక్తికా...నే చెప్పిన ప్రతివిషయమూ నీ జీవితంలో యధాతధంగా జరగాలని రూలేమీలేదు. ఒక వ్యక్తికి తరచుగా వచ్చే కలల వివరాలను రాబట్టి, వాటిని విశ్లేషించడాన్ని డ్రీమ్ అనాలిసిస్ అంటారు. నిజానికి ఈ సంభాషణా చికిత్సకి ఆద్యుడు ' సిగ్మండ్ ఫ్రాయిడ్'

మాటలతో మనసుని శోధించి, తద్వారా మానసిక సమస్యలను పరిష్కరించవచ్చునని గుర్తించి ఆ దిశగా కృషిచేసిన మొట్టమొదటి మహనీయుడాయన.

మనిషి ప్రవర్తన మీద చేతనావస్థలోని ఊహలకంటే, అంతర్లీనంగా ఉండిపోయిన కోరికలు, భావనల ప్రభావమే ఎక్కువన్నది ఆయన ప్రతిపాదన.

ఒక మనిషి తనకంటూ ఒక వ్యక్తిత్వాన్ని ఏర్పాటు చేసుకుని, దాన్ని అలాగే నిలబెట్టుకోవడానికి ఎంతో శ్రమించాలి. మనచుట్టూ ఎన్నో సంప్రదాయాలు, కట్టూబాట్లు అల్లుకుని ఉంటాయి. వాటికి, మనసుకి అనునిత్యం సంఘర్షణ జరుగుతూనే ఉంటుంది.

మనకేం కావాలో తేల్చుకుని, కావలసినదాన్ని అందుకోవాలనే ప్రయత్నంలో అవసరమైతే...ఈ సాంఘిక ఆచారాలకి ఎదురీదవలసిన పరిస్థితి ఏర్పడుతుంది.

మనసుని మభ్యపెట్టుకుంటూ, మనకు మనమే అన్యాయం చేసుకుంటూ మనుగడ సాగించడం దాదాపు అసాధ్యమనే చెప్పాలి.

మనసు...చాలా తేలికైన పదం. కాని, ఎంతో లోతైనది. వింతైనది. ఇంతకీ ఈ మనసు ఎలా ఉంటుంది?

భౌతికమైన రూపం అంటూ లేని మనసు...రంగు, రుచి, వాసన లేని మనసు... ఒక మనిషి లోని ఆలోచనలని నియంత్రిస్తూ ముందుకు నడిపించడం నిజంగా ఒక అద్భుతమైన విషయం.

మనసుకెదురీది మనుగడ సాగించడం వలన ఎన్నో అనర్థాలు జరుగుతాయి. ఆరోగ్యం పాడౌతుంది. మానసిక అశాంతి వలన శరీరంలో పలుమార్పులు చోటు చేసుకుంటాయి. మానవశరీరంలో కనిపించని మనసే కీలకం. మనసు చేసే గారడీలు, గమ్మత్తులు, చిత్ర విచిత్రాలుఎన్నో... ఎన్నెన్నో... కాబట్టి, నువ్వు ఆత్మ పరిశీలన చేసుకుని, నీకేది మంచిది అనిపిస్తే అలాచేయి.'' చెప్పాడు యతిరాజ్ సుదీర్ఘమైన తన ప్రసంగాన్ని ముగిస్తూ.

"థాంక్యూ అంకుల్...మా మౌక్తిక మనసు తేలికపడేలా చేశారు.ఆమె రిలాక్స్ అయ్యేందుకు ఏమైనా...'' అంది రమ్య.

"ఇట్స్ మై ప్లెజర్ రమ్యా...'' అంటూ "చూడమ్మా మౌక్తికా... నీ మనసులోని కల్లోలం తగ్గేందుకు నేను

కొన్ని చిట్కాలు చెబుతాను. శారీరిక మానసిక ఆరోగ్యాలు మెరుగు పడేందుకు ' యోగా' ని మించిన ఔషధంలేదు. క్రమంతప్పక మెడిటేషన్ చేస్తూ, యోగాసనాలు, సూర్యనమస్కారాలు ప్రాక్టీస్ చేశావంటే నీలోని డిప్రెషన్ తగ్గి, మెంటల్ బ్యాలెన్స్ వస్తుంది. నీ మనసులోని బాధను గాని, సంతోషాన్ని కాని, ఆప్తుల ముందు పంచుకో...

ఒత్తిడి తగ్గడానికిఇది ఒక తారకమంత్రం. అయితే... ఇదంతా క్షణాలమీద చక్కబడే వ్యవహారం కాదు.కాస్త సహనంతో వేచిచూడాలి. అప్పుడే తగిన ఫలితం కనబడుతుంది. ఇంకో మాట... నీకు జ్యోతిష్యంలమీద నమ్మకం గనక ఓమారు నీ జాతకచక్రం ఎవరైనా పండితులకి చూపించుకుని ఏమైనా దోషాలుంటే గనుక గ్రహశాంతులు చేయించుకో." సూచించాడు యతిరాజ్.

ఆయనకు ఇతరశాస్త్రాలు, సంప్రదాయాల పట్ల ఉన్న గౌరవానికి ముగ్ధురాలైపోయింది మౌక్తిక.

"థాంక్యూ సార్...మీరు చెప్పినదాన్ని తప్పక ఆచరిస్తాను. థాంక్యూ వెరీమచ్..." నమస్కరించింది వినమ్రంగా.

"ఆఁ...అంకుల్... అడగడమే మరచా...ఆంటీ ఏదీ... కనబడడం లేదూ?'' ప్రశ్నించింది రమ్య చుట్టూ చూస్తూ.

"మీ ఆంటీకి కొడుకుమీదకు గాలి మళ్లిందమ్మా... ఢిల్లీ వెళ్ళింది.'' చెప్పాడు యతిరాజ్ నవ్వుతూ.

" ఓహో... ఆంటీ వచ్చాక మళ్ళీ వస్తాను.    వన్సెగైన్ థాంక్యూ అంకుల్. తనకి మెడికేషన్ ఏమన్నా అవసరం పడుతుందా?'' మౌక్తిక లేచి బయటకు వెళ్ళగానే అడిగింది రమ్య నెమ్మదిగా.

"ప్రస్తుతానికి మందుల అవసరం లేదనే నా అభిప్రాయం. చూద్దాం... నా కౌన్సిలింగ్ ఎంతవరకూ పని చేస్తుందో!'' సాలోచనగా అన్నాడు యతిరాజ్.

తను కూడా బయటకొచ్చేసి స్కూటీ స్టార్ట్ చేసింది రమ్య.. ఇల్లు చేరేవరకూ పెదవి విప్పి ఒక్కమాట కూడా మాట్లాడుకోలేదు ఇద్దరూ. యతిరాజ్ మాటలకి మౌక్తిక మనసు పూలరెక్కల్లాగా తేలికగా మారింది. ఆమె ఆటో దిగి, తన వాటావైపు అడుగులేస్తూ ఉండగా, రమ్య గొంతు వినిపించింది.

"హాయిగా రెస్ట్ తీసుకో ముక్తా...రేపెటూ ఆదివారమే కదా! సావకాశంగా మాట్లాడుకుందాము.''

అలాగేనంటూ తలూపి, రమ్య తనవాటాలోకి వెళ్ళిపోయేవరకు ఉండి లోపలికి వెళ్ళింది మౌక్తిక.

------------------------------          ---------------------------
----------------

"నేను నిన్నేమీ బలవంతం చేయడం లేదు ముక్తా...నువ్వు అలా లోలోపలే కుమిలిపోతూ ఉంటే దాని ప్రభావం నీ శరీరం మీద పడి, నీ ఆరోగ్యం చెడుతుందేమోనని భయపడి అడుగుతున్నాను. తెల్లారితే మనం టి.వి. ఛానల్స్లో చూస్తున్నాం. పేపర్లలో చదువుతూనే ఉన్నాం. ' డిప్రెషన్ అన్ని వ్యాధులకి ముఖద్వారంలాంటిది 'అని. మన పెద్దలేనాడో చెప్పారు... 'ఆరోగ్యమే మహాభాగ్యం' అని.

ఈరోజులను బట్టి బతికినంతకాలం ఆరోగ్యంగా ఉన్న మనుషులు దాదాపు అరుదనే చెప్పాలి. ప్రతిమనిషీ కూడా ఏవేవో భయాలు, ఒత్తిళ్ళతో సతమమవుతూ రోగాలబారిన పడుతూనే ఉన్నాడు. ఆ దౌర్భాగ్యం నీకు పట్టకూడదన్నదే నాబాధ. నీకు ఏదైనా బాధాకరమైన గతం ఉందా? చెప్పు ప్లీజ్...'' మౌక్తిక పక్కనే కూర్చున్న రమ్య అడిగింది చనువుగా.

ఏనాడూ తన వ్యక్తిగత విషయాలలోకి తొంగిచూడని రమ్య అంతలా అడుగుతూ ఉంటే కాదనాలనిపించలేదు మౌక్తికకి.

రమ్యలాంటి నెచ్చెలితో తన భయాలను, బాధలను, భావోద్వేగాలను పంచుకుంటే... అది తనకెంతో ఉపశాంతినిస్తుందని ఆమెకిప్పుడిప్పుడే తెలిసొస్తోంది.

ఆలోచనలో మునిగిపోయి తనమాటలకి స్పందించని మౌక్తికవైపు ఓపంగా చూస్తూ "నేను నిజంగా చాలా పొరబడ్డాను ముక్తా...ఇన్నాళ్ళూ నీ మనసుకి చేరువగా రాగలిగాను ... అని ఒకటే మురిసిపోయాను. అది అబద్ధమని ఇవాళ తేలిపోయింది. ఒక్క విషయం గుర్తు పెట్టుకో... ఎల్లవేళాలా అంతర్ముఖంగా ఉండడం అంత మంచిపని కాదు.'' విసురుగా లేవబోయింది రమ్య.

చప్పున ఆమె చేయిపట్టుకుని ఆపింది మౌక్తిక. ఆమె కళ్లలోకి చూసి నవ్వింది రమ్య. స్వచ్ఛమైన స్నేహబంధానికి నిర్వచనం పలికే నిలువుటద్దాల్లా ఉన్నాయామె కళ్ళు.

ఆ చూపులలోని చల్లదనం...తన గుండెలలో రగిలే కార్చిచ్చుని ఆర్పివేస్తుంది. ఆమె ఆప్యాయతలోని తీయదనం మండే తన మనసుకి ఓదార్పునిస్తుంది. ఇక తానీ భారం మోయలేదు. తన మదిని జ్వలింపజేసే ఈ దావానలాన్ని, ఇలాగే గుండెల్లో అదిమేసుకుంటే తాను డిప్రెషన్ లోకి వెళ్ళడం ఖాయం.

అందుకే... తన బతుకుచిత్రాన్ని రమ్యముందు ఆవిష్కరించాలి అనుకుంది మౌక్తిక.

మేఘావృతమైన ఆకాశం మౌక్తిక హృదయంలాగే భారంగా ఉంది. నిండా నీటిని నింపుకుని, చిరుగాలి స్పర్శకే వర్షించేటట్లుగా ఉన్న మేఘాలు...కాస్త లాలన లభించగానే కురవడానికి సిద్ధంగా ఉన్న ఆమె నయనాల్లా ఉన్నాయి.

"చెప్పు ముక్తా... యతిరాజ్ అంకుల్ నీ కలల గురించి అనలైజ్ చేస్తూ, విడదీసుకోలేంత పెద్దబంధం ఏదో నీ జీవితంలో ఉండి ఉండచ్చును అని అన్నారు. అది... నిజమేనా?'' ప్రశ్నించింది రమ్య మూసుకుపోయిన మౌక్తిక మదిగది తలుపులు తెరవాలని యత్నిస్తూ.

తిరువనంతపురంలో కొలువుదీరిన ' అనంత పద్మనాభస్వామి' ఆలయంలోని రహస్యమాళిగలను తెరిస్తే అపారమైన సంపదలు బయటపడ్డాయట! కాని, మౌక్తిక హృదయాంతరాళాలలో ఉన్న ఆరహస్య మందిరపు తలుపులు తెరిస్తే బయటపడేదేమిటి! అనంతమైన ఆవేదనతప్ప!


"నిజమే రమ్యా...ఆయన అన్నట్లుగా ' వదిలించుకోలేని అతి పెద్ద బంధం' నాకుంది. నిజానికి ఆ బంధాన్ని నేను సులువుగానే వదిలించుకోగలిగాను. కాని, అదిమి మిగిల్చిపోయిన చేదు జ్ఞాపకాలను, అది నా బ్రతుకుపై ఏర్పరచిన మరకలను మాత్రం నేను పోగొట్టుకోలేకపోతున్నాను. ఆ బంధం నన్ను వీడిపోయినా... దాని గుర్తులు సశేషంగా మిగిలి, నాతో చెలగాటమాడుతూనే ఉన్నాయి.'' మౌక్తిక విరక్తిగా నవ్వింది.

రమ్య నొసలు ముడివడింది. మౌక్తిక మాటలామెకి అర్థం కావడంలేదు. ఒకపక్క వదిలించుకోలేని బంధం ఉందంటుంది...మరోపక్క ఆబంధం ఏర్పరచిన గుర్తులు వీడిపోలేదంటుంది! ఏమిటి ఆమె మాటల్లోని అంతరార్థం!?

రమ్యలోని విచికిత్స గమనించినట్లుగా చిన్నగా నవ్వింది మౌక్తిక. తుఫాను ముందర ప్రశాంతత అలముకుందా ప్రదేశంలో.

"నేను... పెళ్ళై... విడాకులు పొందిన ఆడదాన్ని"

రమ్య నోరెళ్ళబెట్టి మౌక్తికవైపు చూస్తూ ఉండిపోయింది.




ఆ తరువాత జరగాల్సినవన్నీ చకచకా జరిగిపోయాయి. పెద్దక్క ద్వారా విషయం తెలుసుకున్న చిన్నక్క నాకు ధైర్యం నూరిపోస్తూ పెద్ద మెయిల్ పెట్టింది.

"జరిగినదేదో జరిగిపోయింది ముక్తా... దాని గురించి ఆలోచిస్తూ మనసు పాడుచేసుకోకు.పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తిచేసి నీ కాళ్లమీద నువ్వు నిలబడు. నీకే సహాయం కావాలన్నా అందించడానికి నీ అక్క ఉందన్న విషయం మరచిపోకు.'' అంటూ ఎన్నో హిత వచనాలు రాసింది.

ఆ మెయిల్ నాలో ఆత్మవిశ్వాసం నింపింది. సరిగ్గా అప్పుడే నాకు పిజిలో సీట్ వచ్చింది. పెళ్లికి ముందు ఆ.సెట్ రాశాను. అప్పుడు మంచి రాంకే వచ్చినా సీట్ కన్ఫర్మ్ కాలేదు. కాని, ఫైనల్ లిస్ట్ లో నాకు సీటు లభించింది. ఉన్న ఊరిలో ఉన్న పి.జి. సెంటర్ లోనే నాకు అడ్మిషన్ దొరికింది.

బావ , నేను కలిసి మాట్లాడుకున్న పదిరోజులకి కాబోలు... అత్తయ్య మా ఇంటికి వచ్చింది.మనిషిలో కళాకాంతులు కొరవడ్డాయి. అత్తయ్యే నాన్నను పలకరించింది మొదట. నాన్న గంభీరంగా తలాడించారు. అమ్మ ముఖం తిప్పుకుంది ఆడపడుచుని చూసి.

"అన్నయ్యా... అదీ...'' ఏదో చెప్పబోతున్న అత్తయ్యని వారిస్తూ "వద్దమ్మా సావిత్రీ... సంజాయిషీలేమీ చెప్పద్దు... నువ్వు, నీ కొడుకు కలిసి నా బిడ్డ జీవితంలో నిప్పులు పోశారు. దయచేసి ఇకమీద నువ్వు ఈ ఇంటిగుమ్మం తొక్కద్దు... నిన్ను చూశానంటే నా బంగారుతల్లికి జరిగిన అన్యాయం గుర్తొస్తుంది. ఇకపై ఈ ఇంటిఛాయలకి కూడా రావద్దు.'' కరాకండిగా చెప్పేశారు నాన్న.

గుడ్లనీరు కుక్కుకుంది అత్తయ్య .అమ్మకాని, బామ్మకాని ఆమెని ఓదార్చే ప్రయత్నం చేయలేదు. ఇంట్లోని వారికి ఇష్టంలేని పెళ్లి చేసుకుని ఓసారి పుట్టింటికి దూరమైన అత్తయ్య... కొడుక్కి ఇష్టంలేని పెళ్లిచేసి శాశ్వతంగా దూరమైంది. ఆ బంధం అతుక్కుంటుందన్న నమ్మకం

ఎవరికీలేదు.

అత్తయ్య కళ్ళు తుడుచుకుంది. నేను లోపలికి వెళ్లి పెళ్లిలో ఆవిడ నాకు పెట్టిన నగలని బాక్స్ తో సహా తెచ్చి ఆమె ముందుంచాను.

"ఇవెందుకు ముక్తా... అవి నీకోసం చేయించినవే..'' అంది అత్తయ్య విస్తుపోతూ.

"కాదత్తయ్యా... ఇవి నీ కోడలికోసం చేయించినవి. వీటిని పెట్టుకునే యోగం, యోగ్యత రెండూ నాకులేవు.'' నా కంత తొణికిన నీరు చూసి అత్తయ్య ముఖం పాలిపోయింది.

"అలా అనకు ముక్తా...ఇవి నీవే. నా మేనకోడలికి కానుక ఇచ్చే అదృష్టానికి నన్ను దూరం చేయకు.'' అంది అత్తయ్య భారంగా.

"ప్లీజ్ అత్తయ్యా... నన్ను బలవంతం చేయకు.'' అన్నాను పదునుగా.

అత్తయ్య మరేమీ మాట్లాడకుండా బ్యాగ్ తెరచి సరికొత్త ఐదువందల రూపాయల నోట్లకట్ట తీసి నా చేతిలో పెడుతూ "నేను చేసిన తప్పునెలాగూ సరిదిద్దుకోలేను. కనీసం... ఇదన్నా తీసుకో'' అంది వణుకుతున్న గొంతుతో.

"బండలైపోయిన నా బతుక్కి మూల్యం కడుతున్నావా అత్తయ్యా?'' బాధగా అన్నాను.

"అపార్థం చేసుకోకు ముక్తా... దేనికైనా పనికి వస్తుంది'' అనునయంగా అంది అత్తయ్య.

"వద్దు... ఈ డబ్బు తీసుకోవడానికి నాకు మనసు రావడంలేదు.'' సున్నితంగా తిరస్కరించాను.

చేసేదేంలేక అత్తయ్య వెనుదిరిగింది. నేను బండబారిన హృదయంతో అలా నిశ్చేష్టనై చూస్తూ ఉండిపోయాను.




-------------------

----------------------  -------------------

అనుకున్నట్లుగానే నేను పి.జి.లో చేరిపోయాను మా ఊరిలోనే. పరస్పరం ఇష్టంలేకపోవడం వలన నాకు, బావకి విడాకులు సులభంగానే లభించాయి.

ఇద్దరం ఇప్పుడు స్వేఛ్ఛాజీవులం. కోర్టు తీర్పు లభించాక బావ నాకు కృతజ్ఞతలు చెప్పాడు. నేను దేవతనని, నా సహకారంవల్లనే ఇప్పుడు తన బతుకులో ఆనందం చోటుచేసుకుంటోందని, తన ప్రేమనర్ధం చేసుకుని పక్కకు తప్పుకున్నందుకు జీవితాంతం ఋణపడి ఉంటానని... ఇలా... నా పైన ప్రశంసలజల్లు కురిపించాడు.

వాటికి నేను పొంగిపోలేదు. ఈ విడాకుల వలన నాకు కూడా విముక్తి దొరికింది. ఆత్మాభిమానం చంపుకుని జీవించడమంత హీనం మరొకటి లేదు. అందుకే... నేను కూడా అతడినుండి విడిపోవాలని కోరుకున్నాను.

బావ నాకు భరణం ఇస్తానన్నాడు. అవసరం లేదని నిరాకరించాను.

అలా... ఒక ప్రహసనంలా సాగిన నా పరిణయఘట్టానికి ముగింపు దొరికింది.

అయితే... నా సమస్య అక్కడితో తీరిపోలేదు. నిజానికి నా బతుకులో కొత్తమలుపు మొదలైనదప్పుడే.

------------------  -----------------------

--------------------------

ఆరోజు సాయంత్రం కాలేజ్ నుంచి ఇంటికి వచ్చాక ఫ్రెష్ అయ్యి అక్కవాళ్ళింటికి బయలుదేరాను. నేనిలా సందుమలుపు తిరిగానో లేదో... సర్రున ఓ మోటార్‌బైక్ వచ్చి నాముందు ఆగింది.

దానిమీద వెంకటేష్... అదే... శ్రీధర్ కూర్చుని ఉన్నాడు. అతడికి డబ్బుమత్తు బాగా ఒంటపట్టినట్లుంది... ఒళ్ళుచేసి పచ్చగా, దబ్బపండులా మెరిసిపోతున్నాడు.

నేను అతడివైపు ప్రశ్నార్థకంగా చూస్తూ నుదురు చిట్లించాను.

"నీతో మాట్లాడాలి ముక్తా..'' అన్నాడు.

నాకర్థం కాలేదు. సరిగ్గా రెండేళ్ల క్రితమూ ఇదే మాటన్నాడు. అప్పుడంటే ఇద్దరం అవివాహితులం. కాని, ఇప్పుడు... మా ఇద్దరికీ పెళ్లిళ్ళైనాయి. పైగా అతడో బిడ్డకు తండ్రి కూడానూ.

"నాతోనా! ఏం మాట్లాడుతావు?'' అడిగాను ఆశ్చర్యంగా.

అతడు దూరంగా వేలుచూపిస్తూ "అలా వెళ్ళి మాట్లాడుకుందాం.'' అన్నాడు.

మా వీధికి ఎదురుగా పెద్ద మర్రిచెట్టు ఉందక్కడ. దాని చుట్టూ కట్టబడి ఉన్న పెద్ద రాతి అరుగుమీద అందరూ కూర్చుని కబుర్లు చెప్పుకోవడం పరిపాటి. ఆరోజు కాస్త మబ్బుగా ఉండడం మూలాన ఎవరూ లేరక్కడ.

"సరే పద" అటువైపు అడుగులు వేశాను.

ఇద్దరం ఓ వారగా కూర్చున్నాం. మబ్బుతెరలను తొలగించుకుని అప్పుడప్పుడు పలకరించిపోతున్ననారింజరంగు సాయంకాలపు నీరెండ అద్భుతంగా ఉంది.

"చెప్పు'' అన్నాను ఎటోచూస్తూ.

"ఏమీలేదు ముక్తా... అప్పుడూ ఇప్పుడూ... ఎప్పుడూ కూడా నువ్వంటే నాకు అభిమానమే. పెళ్లంటే వేరే అమ్మాయిని చేసుకున్నాను గాని, నా మనసంతా నీమీదే'' చేతులు నులుముకున్నాడు శ్రీధర్.

"అయితే?'' అతడి మాటల్లో గూఢార్థం నాకు బోధపడలేదు.

"మనిద్దరం ...ఒక్కటైతే బాగుంటుందనీ...''

"ఎలా? నీకూ పెళ్లైంది... నాకూ పెళ్లైంది.'' అయోమయంగా అడిగాను.

" ఒక్కటవడానికి... పెళ్లికి సంబంధం ఏమిటి ముక్తా?'' ఫెళ్ళున నవ్వాడు శ్రీధర్ నా అమాయకత్వానికి.

" ఏం మాట్లాడుతున్నావో తెలుస్తోందా?' అరిచాను గట్టిగా.

అతడదేమీ పట్టించుకోకుండా "నిజానికి నీ జీవితం చాలా దయనీయంగా తయారైంది. పెళ్లయ్యిందన్నమాటే కానీ, ఏం సుఖపడ్డావు? నీకు నచ్చితే, అభ్యంతరం లేకపోతే... ఆ సుఖం నేనందిస్తాను.'' చెప్పుకుపోయాడు వంకరగా నవ్వుతూ.

అతడి ఆంతర్యం అర్థమై గజగజ వణికిపోయాను తుఫాను గాలికి అల్లాడిన చిగురుటాలా. నా కళ్ళకి అతడు అమాయక మేకను వేటాడడానికి అవకాశం కోసం పొంచిఉన్న పెద్దపులిలా కనబడ్డాడు.

"నువ్వు ఒక పెళ్ళైన అమ్మాయితో మాట్లాడుతున్నానని మరచిపోతున్నావు.'' కోపంతో ఊగిపోయాను.

అతడు ఇసుమంతైనా చలించలేదు.

"పెళ్లైనా నువ్వింకా కన్యవేనని నాకు తెలుసు ముక్తా... నీ మొగుడుట్టి మూర్ఖుడు. ఇంత అందాన్ని ఎదురుగా పెట్టుకుని ఎంజాయ్ చేయకుండా వదిలేసిన ప్రవరాఖ్యుడు. అదే నేనైతేనా?'' కవ్వింపుగా అన్నాడు శ్రీధర్.

నాకు నసాళమంటింది. ఇరుగమ్మ పొరుగమ్మల సానుభూతి పొందడం కోసం నా ఆంతరంగిక విషయాలని సినిమా కథలా మా వీధంతా టాంటాం వేసిన అమ్మని తలచుకుంటే మండిపోయింది.

వీడింత ధైర్యంగా నేను కావాలని అడుగుతున్నాడంటే దానికి కారణమేమిటి? నా సొంత సంగతులు బహిరంగమైపోవడం వల్లనే కదా!

వాడి రెండుచెంపలూ పేలగొట్టాలన్నంత ఆవేశం కలిగింది. అది నడిరోడ్డు కావడం వలన నన్ను నేనే కంట్రోల్ చేసుకున్నాను.

" ఇంకొక్క మాట మాట్లాడినా ఊరుకునేది లేదు శ్రీధర్. మరొక్కసారి ఇలాంటి ఛండాలం ప్రపోజల్ తో నా ముందుకి వస్తే మర్యాద దక్కదు జాగ్రత్త'' భద్రకాళిలా విరుచుకు పడ్డాను.

వాడు నన్ను ఎగాదిగా చూసి, పెదవి విరిచి " ప్చ్... పోనీపాపం వయసు పోరు పెడుతూ ఉంటుంది... కాస్త తాపం తీరుద్దామనుకున్నాను. నీకు అదృష్టం లేదు. నీ అందాన్ని ఆస్వాదించే యోగం నాకులేదు. ఏం చేస్తాం! బ్యాడ్‌లక్. ఎప్పుడైనా నీ మనసు మార్చుకుంటే కాకితో కబురుపెట్టు. క్షణాల్లో నీ ముందు వాలిపోతాను.'' అనుకుంటూ వెళ్ళి బైక్ స్టార్ట్ చేశాడు వాడు.

వాడు వెళ్లినవైపు అసహ్యంగా చూస్తూ "డర్టీ రాస్కెల్... సుఖాలందిస్తాడట...సుఖాలు. వీడందించే ఆ దరిద్రపు సుఖాలకోసం ఎవరూ కూడా వెంపర్లాడిపోవడం లేదిక్కడ.'' అనుకున్నాను కసిగా.

మొగుడొసిలేసిన ఆడపిల్ల అంటే ఈ మగాళ్ళకి ఎంత చిన్నచూపో అర్థమైంది తొలిసారిగా. ఆ సంఘటన తరువాత నా మనసంతా చిరాగ్గా తయారైంది. ఇక అక్కవాళ్లింటికి వెళ్ళే మూడ్‌లేక తిరిగి ఇంటికేసి బయలుదేరాను.

-------------------- --------------------

----------------------

కాలగతిలో మరో రెండేళ్ళకాలం పరుగులు తీసింది. నా పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తయింది. ఉద్యోగంకోసం వెతుకులాట మొదలైంది.

ఈలోపు ఇంట్లో చెప్పుకోదగిన మార్పులే వచ్చాయి.నాన్న అనారోగ్యంతో నానాటికీ కృశించిపోసాగారు.

జబ్బు చేసింది ఆయన శరీరానికి కాదు. మనోవ్యాధే ఆయన్ను లొంగదీసుకుంది.

బామ్మకి ఏదో... పేరు తెలియనిజబ్బు వచ్చి నెలరోజులపాటు మంచంలో తీసుకుని. తీసుకుని కన్నుమూసింది. ఆ ఇంటికి పెద్దదిక్కుగా నిలిచిన ఆమె ప్రాణం అనంతవాయువుల్లో లీనమైన తరువాత మాకు దుఃఖం ఆగలేదు.

వృద్ధాప్యం... ఆపైన వచ్చిన మాయదారి జబ్బు ఆమెని కడతేర్చాయి.

దినేశః ఇంజనీరింగ్ చదువు పూర్తయ్యింది. వాడికి ఎలక్ట్రిసెటీ బోర్డ్ లో జె.యి.గా ఉద్యోగం వచ్చింది. నాకు కూడా ఒక డిగ్రీ కాలేజీ లో ఉద్యోగం వచ్చింది. కాని, మేముంటున్న ఊళ్లోకాదు.

ఏం చేయాలోనని విపరీతంగా ఆలోచించాను.

ఆరోగ్యం సరిగ్గా లేని నాన్నని, మనశ్శాంతి లేక అలమటించె అమ్మని విడిచిపెట్టి ఉద్యోగం పేరిట వాళ్లకి దూరంగా వెళ్లడానికి మనస్కరించలేదు.


కాని, తప్పదు. ఈ ఊళ్లో... ఈ వీధిలో... పరిచయస్తుల జాలి చూపులు,కొంటెకుర్రాళ్ళ ఆకలిచూపులు, ఇరుగుపొరుగుల ఉచిత సలహాలు...ఇవన్నీ భరింపశక్యం కాకుండా ఉన్నాయి.

అందుకే...నేనెవరో తెలియని చోటుకి, నా గతం గురించి ఎవరికీ పరిచయం లేని ప్రదేశానికి వెళ్లిపోవాలని నిశ్చయించుకుని ఇక్కడికొచ్చి ఈ ఉద్యోగంలో చేరాను.

నేను ఉద్యోగంలో చేరకముందే...నాకు బాగా సన్నిహితులైన ఒకరిద్దరు నన్ను మళ్లీ పెళ్లి చేసుకోమని సూచించారు. రెండు మూడు మంచి సంబంధాలు కూడా చూపించారు.

యాధాలాపంగా ఆ విషయాన్ని ఇంట్లో చెప్పిననాడు అమ్మ పెద్ద గాలి దుమారమే లేపింది.

' మొగుడొదిలేసిన దానికి మళ్ళీ పెళ్ళేమిటని, ఆడదానికి ఒకే పెళ్లి, ఒకే మొగుడు ఉండాలని' ఇంకా ఇలాంటివే చాలా చెప్పి నా ఆలోచనకి అడ్డుకట్ట వేసింది.




అంతేకాదు... నేను ఇక్కడికొచ్చేముందు నా చేత తన మీద ప్రమాణం చేయించుకుంది. అదీ ఆ దేముడి సమక్షంలో.

' రెండో పెళ్లి' అన్న ఊహను పొరబాటున కూడా నా మెదడులోకి రానివ్వద్దని నా చేత ఒట్టు పెట్టించుకుంది. ఈ తతంగమంతా నాన్నకి తెలియకుండా అతి రహస్యంగా జరిగింది.

ఆ పరిస్థితుల్లో... ఆమె చెప్పినదానికి 'సై' అనకపోతే ఆమె మానసికంగా ఇంకా క్షోభ పడుతుందని నేనలా ఒట్టు పెట్టాను.

అయితే... నాదీ ఉప్పూకారం తింటున్న శరీరమే. నాకూ అందరిలాగే సుఖప్రదమైన దాంపత్యజీవితాన్ని అనుభవించాలని, ముద్దులొలికే బిడ్డలకి తల్లినై బతుకు పండించుకోవాలని మరీమరీ అనిపిస్తుంది.

కాని, అమ్మమీద వేసిన ఆ ఒట్టు ఆ కోరికను మొదలంటా నరికేస్తుంది..

ప్రకృతిసిద్ధంగా నా మనసులో పుట్టే కోరికలను చంపుకోలేక, అమ్మ మీద చేసిన ప్రమాణం మీరలేక ఎంతో నరకం అనుభవిస్తున్నాను.

--------------------- ------------------------ -----------------------

" ఆ తరువాత సంగతులు నీకు తెలిసినవే. నీతో పరిచయం స్నేహానికి సరికొత్త భాష్యం చెప్పింది. నా జీవితంలో నిండిన శూన్యాన్ని నీ చెలిమి ద్వారా భర్తీ చేసుకుంటున్నాను.'' దీర్ఘంగా నిట్టూర్చింది

మౌక్తిక తన గతచరిత్రనంతా చెప్పాక.

అప్పటికి బాగా చీకటి పడిపోయింది. నక్షత్రసమూహాలని కూడగట్టుకుని నెలరాజు రంగప్రవేశం చేస్తున్నాడు. రమ్య మౌక్తిక దగ్గరగా వచ్చి ఆమె తల నిమిరింది. ఆ లాలనకి మౌక్తికలో ప్రజ్వరిల్లిన దుఃఖాగ్ని కాస్త ఉపశమించింది.

" రియల్లీ అయాం వెరీసారీ ముక్తా... నీ జీవితంలో ఇంతటి విషాదం ఉందని ఊహించలేదు ముక్తా. ' ఇంతటి అందగత్తెకి, బుద్ధిమంతురాలికి ఇంకా పెళ్లెందుకు అవలేదు చెప్మా' అనుకునేదాన్ని. నిజం తెలిశాక నాకు చాలా బాధగా ఉంది. మీ అమ్మగారు నీకు విధించిన ఆంక్షలు మాత్రం అమానుషం. నువ్వు కూడా ఆవిడమాటకి కట్టుబడి నీ జీవితాన్ని అడవికాచిన వెన్నెలలా చెసుకోవడం విచారకరం.

"ఏం చేయను రమ్యా?ఆవిడ సంతృప్తికోసమని , నాన్న ఆరోగ్యం దృష్టిలో పెట్టుకుని నేను చేసిన ప్రమాణం అనుక్షణం నన్ను వెంటాడుతోంది. ఒట్టుతీసి గట్టున పెట్టి నా స్వార్ధం చూసుకుంటే ఏమౌతుందోనన్న భయం నన్ను మళ్ళీపెళ్ళి గురించి ఆలోచించనివ్వడం లేదు.

నేనూ మనిషినే. నాకూ కోరికలున్నాయి. ఆశలున్నాయి.కాని, అవి నెరవేరే భాగ్యం మాత్రం నాకులేదు. తోడుకావాలంటూ నా మనసు, వయసు చేసే అల్లరి తట్టుకోలేక, తెగించి అడుగు ముందుకేయలేక నాలో నేనే నలిగిపోతూ నరకమనుభవిస్తున్నాను.'' మొట్టమొదటిసారి మనసు తలుపులు తెరచి తనివితీరా ఏడిచింది మౌక్తిక.

రమ్య కళ్లలో కూడా నీళ్ళు తిరిగాయి. చప్పున మౌక్తికను గుండెలకి హత్తుకుని "ఊరుకో ముక్తా... రిలాక్స్. ఈ పెద్దవాళ్లంత మూర్ఖులు మరొకరుండరు. మీ అమ్మగారు సంఘంలో పరువు-ప్రతిష్ఠ వీటన్నింటి గురించే ఆలోచించారు గాని, నీ సుఖసంతోషాల గురించి పట్టించుకోలేదు. ఈ రోజుల్లో కూడా ఇలాంటి ఛాందస భావాలున్నవాళ్లు ఉన్నారంటే ఆశ్చర్యంగా అనిపిస్తోంది.

దీన్నిబట్టి చూస్తే... ఆ రోజుల్లో మన సమాజంలో వేళ్లూనుకుని ఉన్న సాంఘికదురాచారాలను రూపుమాపడానికి ' ఆ రాజారామ మోహన్ రాయ్, వీరేశలింగం పంతులుగారు' లాంటి సంఘ సంస్కర్తలు ఎంతగా కృషిచేశారో, ఈ సమాజానికి ఎంతగా ఎదురీదారో బోధపడుతోంది.'' ఆవేశంగా అంది రమ్య.


"అమ్మనేమీ అనకు రమ్యా... చెప్పాను కదా...ఆవిడవన్నీ పురాతనభావాలు. బామ్మ బతికుంటే నా సంగతి ఎలా ఉండేదోమరి!'' వెక్కుతూనే వారించింది మౌక్తిక.

"అదే చెప్తున్నా...ఈ సమాజం ఒంటరి ఆడదాన్ని ఎంత చిన్నచూపు చూస్తుందో ఆవిడ ఎరుగనిది కాదు. ఎల్లకాలమూ నువ్విలా మోడువారిన చెట్టులా బతుకునీడవడం అంటే మాటలుకాదు! జీవితాంతం తోడుగా నడవాల్సిన సహచరుడు లేక, కడుపునపుట్టిన బిడ్డల ఆదరణలేక సాగే స్త్రీ జీవితం ఎంత దుర్భరంగా ఉంటుందో ఆవిడకి తెలియదా!?'' పూనకం వచ్చినట్లుగా ఊగిపోయింది రమ్య.

మౌక్తిక మాట్లాడలేదు.

"పోనీ... అదంతా పక్కనపెట్టు. ఇప్పుడు నీకు మంచి అవకాశం వచ్చింది. నువ్వు ' ఊఁ' అనాలేగాని మధుకిరణ్ నిన్ను పెళ్లిచేసుకునేందుకు సుముఖంగా ఉన్నాడు. నువ్వు ' యస్' అని ఒక్కమాటంటే చాలు... మీ అమ్మగారిని నేను ఒప్పిస్తాను. ' నౌ బాల్ ఈజ్ ఇన్ యువర్ కోర్ట్' '' అంది రమ్య.

మౌక్తిక ముఖం అంతా రక్తం ఇంకిపోయినట్లుగా పాలిపోయింది. ఎప్పుడో ఒకప్పుడు మధుకిరణ్ తన ప్రేమను వ్యక్తపరుస్తాడని ఆమెకూ తెలుసును కాని, అతడినేరకంగా ఎదుర్కోవాలో మాత్రం తోచలేదు.




మధుకిరణ్ లాంటి జీవిత భాగస్వామి దొరకాలంటే ఏ జన్మలోనో బంగారుపూలతో పూజలు చేసుండాలి. కాని, తాను చేసిన పూజలు, నోచిన నోములు అన్నీ అసంపూర్ణమైనవి అయ్యుంటాయి. ఆ కొరనోముల ఫలితంగానే మేనబావతో పెళ్లైకూడా అతడికి దూరమైంది. ఆ నోముల కారణంగానే ఇవాళ ఆణిముత్యంలాంటి మధుకిరణ్ తనను వలచి వస్తే నిరాకరించ వలసిన దౌర్భాగ్యస్థితి ఎదురైంది.

ఎవరో అన్నట్లు' అదృష్టవంతుడిని చెరిపేవాడు లేడు. నిర్భాగ్యుడిని బాగు చేసేవాడు లేడు' అని... నేను దౌర్భాగ్యురాలుని. ఎవరు చక్కదిద్దాలనుకున్నా తనబతుకు బాగుపడదు.అది అంతే.

"ఏమిటాలోచిస్తున్నావు? ఏం చెప్పాలా అనా? మీ అమ్మనాన్నలు ఎల్లకాలమూ నీకోసం కూర్చోరు. నీ జీవితానికి స్థిరమైన ఆలంబనను నువ్వే వెతుక్కోవాలి.'' హితబోధ చేసింది రమ్య.

"లేదు రమ్యా...అమ్మ మాటను మీరేంతటి మానసిక ధైర్యం నాకులేదు. ఈ జీవితం ఇలా గడచిపోవాలని రాసుంది. అలాగే జరగనీ. ఈ విషయంలో నేను అశక్తురాలిని. అయాం హెల్ప్‌లెస్'' భోరుమంది మౌక్తిక.

"నువ్వింక పిరికిదానివనుకోలేదు ముక్తా...కోరి నీ జీవితం పాడు చేసుకుంటున్నావు'' కిందపెదవిని పంటికింద అదిమిపెట్టింది రమ్య.

"ఎలాగైనా అనుకో... నేను మాత్రం అమ్మమాట జవదాటే సాహసం చేయలేను. అయినా మధుకిరణ్‌కి నా గతం గురించి తెలియదు. అందుకే నన్ను ప్రేమించాడు. నా గురించిన నిజాలు తెలిస్తే మరిక నా జోలికి రాడు.'' విరక్తిగా నవ్వింది మౌక్తిక కళ్లుతుడుచుకుని.

"అతడంత సంకుచితుడు కాదనే నా అభిప్రాయం. అతడు నిన్ను డైరెక్ట్‌గా కలిసిఈ విషయం గురించి ప్రస్తావిస్తే మాత్రం కాస్త వివేకంతో బదులియ్యి. ఇది జీవితం... మంచి అవకాశం ఒక్కసారి మాత్రమే తలుపు తడుతుంది.'' చెప్పింది రమ్య అదే ఆఖరుమాట అయినట్లుగా.

అప్పటికే ఆ పరిసరాలలో చిక్కటి చీకటి అలుముకుని ఉంది. ఆకాశమంతా నిండిన చంద్రకాంతి ధగధగాయమానంగా వెలిగిపోతూ ఆ చీకటిని తరిమికొడుతోంది. చంద్రుని చల్లదనం మౌక్తిక మనసులో చెలరేగే జ్వాలలను ఏ మాత్రం చల్లార్చలేకపోతోంది.

"ఇందాక అంకుల్ ఏం చెప్పారో విన్నావు కదా! రేపటినుండి నువ్వు యోగా క్లాసులకెళ్లు.'' చెప్పింది రమ్య.

అలాగేనన్నట్లుగా తలూపింది మౌక్తిక.

"కిందకెళదాం పద... శరత్ వచ్చే వేళయ్యింది.'' మెట్లవైపుగా నడిచింది రమ్య.

అనుసరించింది మౌక్తిక.

-------------------- -------------------- ----------------------

రమ్య చెప్పినట్లే యోగా క్లాసులకి వెళ్తోంది మౌక్తిక. ఇప్పుడిప్పుడే ఆమె మనసు కుదుటపడుతోంది. ధ్యానం చేయడం వలన ఆమె మనసులో కల్లోలం తగ్గి ప్రశాంతత చేకూరుతోంది. యోగాసనాలు వేయడం, ధ్యానంలో కూర్చోవడం...ఇత్యాది సాధనల వలన ఆమె మానసిక, శారీరక ఆరోగ్యాలు మెరుగుపడ్డాయి.

పదేపదే ఆమెను వేధించి, కలవరపెట్టే ఆకల మరిరావడం లేదిప్పుడు.

అంతర్ముఖంగా ఉండడం మానేసి, రమ్యముందు తన మనసు విప్పిచెప్పుకోవడం మూలాన ఒత్తిడితగ్గి, హృదయభారం తీరింది.

నిజమే... ఆనందమైనా , ఆవేదనైనా ఆప్తులతో పంచుకుంటే కలిగే ఊరటే వేరు. ఆవిషయం మౌక్తికకు అనుభవైకవేద్యమైంది .

కాని, అప్పుడప్పుడు... ఆమె మదిలో అనేకానేక భావాల మధ్యన అంతర్యుద్ధం జరుగుతోంది. మధుకిరణ్ తనని ప్రేమిస్తున్నాడని తెలిసినప్పటినుంచీ తన మదిలో చెలరేగే భావసంచలనాన్ని అదుపులో పెట్టలేక ఆమె సతమతమౌతూనే ఉంది.

ఏం చేయగలదు! ఏమీ చేయలేని అసహాయత ఆమెది. కొన్ని చిక్కుముడులను కాలమే విప్పాలి. మానవుడు పరిష్కరించలేని కొన్ని క్లిష్టసమస్యలను... విసుగు విరామంలేక, అలుపుసొలుపు ఎరగక ముందుకు సాగిపోయే కాలమే పరిష్కరించాలి.

-----------------

--------------------------            ----------------------

దినేష్ దగ్గరనుంచి ఫోన్‌కాల్ వస్తూండడంతో క్లాస్ లో ఉన్న మౌక్తిక దాన్ని కట్ చేస్తూ వస్తోంది. కాని, మళ్ళీమళ్ళీ ఆ కాల్ వస్తూనే ఉండడంతో "ఎక్స్‌క్యూజ్ మి మై డియర్ స్టూడెంట్స్..'' అని చెప్పి ఫోన్ ఆన్సర్ చేసింది.

ఫోన్లో దినేష్ చెప్పిన విషయం వింటూంటే మెదడు మొద్దుబారిపోయిందొక్కసారిగా. కాళ్లుచేతులు గడగడ వణికాయి.

"ఏ... ఏమైంది దినేష్... నాన్న కేమైంది?'' స్వరం కంపించింది.

"వివరాలు నేను చెప్పలేనక్కా... నువ్వు వెంటనే బయలుదేరి రా" అనేసి ఫోన్ కట్‌చేశాడు దినేష్.

మౌక్తికకు దుఃఖం పొంగుకొస్తోంది గట్టు తెగిన వాగులా.

" మై డియర్ బాయ్స్ అండ్ గర్ల్స్ ...సారీ ఫర్ ది డిస్ట్రబెన్స్...''అని చెప్పేసి ఉధృతంగా ఉబికివస్తున్న ఏడుపుని అణిచిపెట్టాలని ప్రయత్నిస్తూ ప్రిన్సిపాల్ రూమ్‌వైపు దూసుకుపోయింది మౌక్తిక.

ఆయనకి విషయం వివరించి వారం రోజుల పాటు సెలవు కోరింది. పరిస్థితిలోని తీవ్రతను అర్థం చేసుకున్న ఆయన మరేమీ అనకుండా సెలవు మంజూరు చేశారు. అప్పుడే పీరియడ్ బెల్ మోగడంతో రమ్య క్లాసునుంచి ఇవతలకి వచ్చింది ఆమెతో సంగతిని క్లుప్తంగా చెప్పేసి తాను ఊరికి వెళ్తున్నట్లుగా చెప్పింది మౌక్తిక.

ప్రిన్సిపాల్ గారి దగ్గర పర్మిషన్ తీసుకుని ఆమెను ఆర్టీసీ కాంప్లెక్స్ లో డ్రాప్ చేసింది రమ్య. అప్పటికి తాను ఎక్కాల్సిన బస్ రెడీగా ఉండడంతో నిశ్చింతగా ఊపిరితీసుకుంది మౌక్తిక.

"చేరగానే ఫోన్ చేయి ముక్తా...నాన్నగారికేమీ కాదులే... నువ్వు ధైర్యంగా ఉండు.''బస్ కదిలేవరకు ఏవేవో జాగ్రత్తలు చెబుతూనే ఉంది రమ్య.

బస్‌లో కూర్చున్నదన్న మాటేగాని మనసు అలలతాకిడికి కల్లోలమైన కడలిలాగా ఉంది.

'అసలు... నాన్నకేమై ఉంటుంది! దినేష్ ఎందుకు వెంటనే రమ్మని ఫోన్ చేశాడు?' అని ఒకటే కంగారుగా ఉంది ఆమెకి.

దినేష్ ఆమెకు వివరాలేమీ చెప్పలేదు. తండ్రికి బాగాలేదని ఆసుపత్రిలో చేర్చామని మాత్రమే చెప్పాడు. బస్ విజయనగరం చేరేసరికి తెల్లవారుఝామున నాలుగైంది. మౌక్తికను తీసుకెళ్లేందుకు దినేష్ వచ్చాడు.

"నాన్నకెలా ఉంది?'' అంటూ మౌక్తిక ఆదుర్దాగా అడిగినా సమాధానం చెప్పకుండా మౌనంగా ఉండిపోయాడు.

'భయపడ్డాడు కాబోలు!' అనుకుంది మౌక్తిక. ఇంటికి చేరగానే తలుపుతీసిన శకుంతల కూతురిని చూస్తూనే భోరుమంది. ఏడ్చి ఏడ్చి ఆమెకళ్లు ఎర్రగా మారి, ఉబ్బిపోయి మంకెనపూవులని తలపింపజేస్తున్నాయి.

దినేష్ ఏమీ మాట్లాడకుండా గదిలోకెళ్లి తలుపేసుకున్నాడు. మౌక్తికకు అతడి వైఖరి అంతుచిక్కలేదు. ఏ భావమూ లేకుండా అతడంత నిర్లిప్తంగా ఎందుకున్నాడో ఆమెకి బోధపడలేదు.

"ఇంతకీ నాన్నకేమైందమ్మా?'' ఆదుర్దాగా అడిగింది మౌక్తిక.

శకుంతల జిర్రున ముక్కు చీది " హార్ట్అటాక్... ఇరవైనాలుగ్గంటలసేపు అబ్జర్వేషన్‌లో పెట్టాలని డాక్టర్స్ చెప్పారు'' చెప్పింది వెక్కిళ్ళుపెడుతూ.

"మరి హాస్పిటల్‌లో ఎవరున్నారు?''

"పెద్దక్క, బావగారు ఉన్నారు. రాత్రి పదకొండింటివరకు నేనక్కడే ఉన్నాను. ఎక్కువమంది ఉండకూడదని అక్కడి నర్సులు కోప్పడితే పెద్దక్కే... బలవంతంగా నన్ను ఇంటికి పంపింది. నాన్న ఐసియు లో ఉన్నారు. నాకెందుకో భయంగా ఉందే ముక్తా...'' మరోసారి ఘొల్లుమంది శకుంతల.

"ఏం ఫరవాలేదమ్మా... ఇప్పుడు వైద్యరంగం చాలా అడ్వాన్స్ అయ్యింది. మంచి మందులొచ్చాయి. నాన్న క్షేమంగాఇంటికొస్తారు. నువ్వేమీ భయపడకు.'' గుండెపోటు అంటే సామాన్యమైన విషయం కాదని తెలిసినా తల్లికి ధైర్యం చెప్పింది మౌక్తిక.

"ఏమోనే... ఆయన క్షేమంగా ఇంటికొస్తే ఆ ఏడుకొండలూ నడిచొస్తానని మొక్కుకున్నాను.'' శకుంతల పలికింది వణికేస్వరంతో.

"అలాగే చేద్దూగాని ... తమ్ముడేంటీ అలా మూడీగా ఉన్నాడూ...'' అడిగింది మౌక్తిక.

"వెధవ... వాడూసు ఎత్తకు... వాడివలనే ఈ ఉపద్రవం వచ్చిపడింది.'' అంతవరకు ఏడుపుతో ఎర్రబడిన శకుంతల కళ్లు అప్పుడు కోపంతో రక్తారుణిమ నింపుకున్నాయి.

"వాడివలనా! అంత కాని పని వాడేం చేశాడమ్మా?'' ఆశ్చర్యపోయింది మౌక్తిక.

"ఏం చేశాడమ్మా? అంటూ అంత నెమ్మదిగా ఆడుగుతావేం... వాడు మా కొంపముంచాడు. మీ నాన్నగారి పరువు నిలువునా తీశాడు. ఎవరో అమ్మాయిని ప్రేమించానని మోసం చేయబోయాడుట...

వాళ్ల వాళ్లందరూ ఇంటి మీదకొచ్చి నానా గలాభాచేసి గందరగోళం సృష్టించారు. ఆ గొడవకే మీ నాన్నకి గుండెపోటొచ్చింది.'' ఆగ్రహంగా చెప్పింది శకుంతల కొడుకుపైన గల కినుకను వ్యక్తపరుస్తూ.

చేష్టలుదక్కి నిలబడిపోయింది మౌక్తిక. నిజంగా... దినేష్ ఇంతటి గ్రంధసాంగుడైనాడా!?

" నువ్వు చెప్పేది నిజమేనా అమ్మా?'' బలవంతాన నోరు పెగుల్చుకుంది మౌక్తిక.

" బాగుందే... అబద్ధం చెప్పాల్సిన అవసరం నాకేముంది? వాడిని చూస్తే ఆయనకి మళ్ళీ తిరగబెడుతుందని మేమే హాస్పిటల్ కి రావద్దన్నాం.'' విసురుగా పలికింది శకుంత.

"మరి ఆ అమ్మాయి?''

"తగుల్చుకున్నాక తప్పుతుందా! ఆ గదిలో వాడితో పాటే ఏడిసింది.'' నిరసన గళం వినిపించింది శకుంతల.

మౌక్తిక గదిలోకి వెళ్లింది. తప్పుచేసిన వాడిలాగా తల దించుకుని కూర్చున్నాడు దినేష్.

"రా అక్కా...'' అన్నాడు మౌక్తికను చూస్తూనే.

"అమ్మ ఏదో చెబుతోంది...''

"నువ్వు ప్రయాణం చేసి బాగా అలసిపోయావు. రెస్ట్ తీసుకో... తెల్లారాక మాట్లాడుకుందాం.'' అన్నాడు దినేష్ నిర్వేదంగా.

" అలాకాదులే... విషయమేమిటో చెప్పు...'' ఖచ్చితంగా ఆడిగాను.

వాడు నిస్సహాయంగా చూస్తూ " ప్రీతి నేను ఇంజనీరింగ్ లో క్లాస్‌మేట్స్... ఇద్దరం మనస్ఫూర్తిగా ప్రేమించుకున్నాం. నాన్నగారితో ఈ విషయం చెప్పి ఆయన ఆమోదం పొందాక ప్రీతి వాళ్ల వాళ్లకి కూడా చెబుదాం అనుకున్నాం. ఈ లోపే ఈ విషయం వాళ్లింట్లో తెలిసి పెద్ద రభస అయ్యింది.

ప్రీతి అన్నయ్యలు నన్ను అపార్థం చేసుకుని, నేను తనని ఛీట్ చేశానేమోనని భావించి, ఇంటిమీదకు వచ్చి నానాగొడవా చేశారు.వాళ్ళని వారించాలని ప్రయత్నంచేసి అశక్తుడనైనాను. పరిస్థితి నాచేయి దాటిపోయిందని అర్థమైంది. అందుకే... అప్పటికప్పుడు ప్రీతిమెళ్లో తాళి కట్టాల్సివచ్చింది.

ఈ అల్లరంతా నాన్నను మానసికంగా చాలా డిస్టర్బ్ చేసింది. నా వలన పదిమందిలో ఆయన పరువు మంటకలిసిపోయింది. ఆ బెంగతోనే ఆయనకు స్ట్రోక్ వచ్చింది. ఈపనివలన అమ్మ దృష్టిలో దోషిగా మిగిలిపోయాను. ఇప్పుడు నాన్న ఉన్న దుస్థితికి ఒకవిధంగా నేనే కారణం అక్కా...''

పశ్చాత్తాపం నిండిన దినేష్ స్వరంలో నిజాయితీ కనిపించింది మౌక్తికకు. బరువుగా వెలువడుతున్న అతడి మాటలు, అతడి మనోభారాన్ని సూచిస్తున్నాయి. అప్పుడు గమనించింది మౌక్తిక అతడిపక్కనే నిలబడి, భీతహరిణలా బితుగ్గా చూస్తున్న అమ్మాయిని.

అనుకోని విఘాతం ఎదురైనప్పుడు తల్లడిల్లే పసిపిల్లలాగా ఉందామె వాలకం.

"దీనికంతటికీ కారణ్ నేను. మా వాళ్లు మిస్ అండర్‌స్టాండ్ చేసుకుని తొందరపడడం వల్లనే ఈ ముప్పు వచ్చింది. దయచేసి దిన్నూని ఏమీ అనకండి.'' ఏడుపుగొంతుతో పలికింది ప్రీతి.

దీనంగా ఉన్న ఆ అమ్మాయి వదనం చూస్తే జాలి ముంచుకొచ్చింది. నిజమే... దినేష్ చెప్పినదాన్ని బట్టి చూస్తే జరిగినదానిలో ఆ అమ్మాయి ప్రమేయమూ ఉన్నట్లూ తోచలేదు.ఆమె నిమిత్తమాత్రురాలు మాత్రమే.ఏదైనా సంఘటన జరగడానికి కార్యకారణ సంబంధం అంటూ ఒకటుంటుందని బామ్మ అనేది. ఇప్పటి ఈ సంఘటనకి ఆమె అనుకోని కారణమైంది.

చేసేదీ... చేయించేదీ... ఆ జగన్నాటక సూత్రధారి.

"జరిగిందేదో జరిగింది...నాన్నకిప్పుడు మానసిక ప్రశాంతత ఎంతో అవసరం. ఆయన మనసు కుదుటపడేవరకు నువ్వాయనకి ఎదురుపడకు. నేను ఆయనకి నచ్చ చెబుతాను. అన్నీ అవే సర్దుకుంటాయి.'' చెప్పింది మౌక్తిక దినేష్ భుజంతట్టి.

జరిగిన పరిణామాలన్నీ చూస్తూఉంటే సినిమాల్లో సంఘటనల్లా అనిపిస్తున్నాయామెకి.ఎవరో పనిగట్టుకుని డైరెక్ట్ చేసినట్లుగా సీన్లన్నీ అత్యంత నాటకీయంగా జరిగిపోతున్నాయి.

అంతలోనే నవ్వుకుంది విషాదంగా. అవును... ఆ దేముడిని మించిన ఎఫిషియెంట్ డైరెక్టర్ ఎవరుంటారు! మానవ జీవితానికి సంబంధించిన ప్రతి సంఘటనకూ పకడ్బందీయైన స్క్రీన్‌ప్లేని రాసుకుంటాడాయ. మనిషి మనుగడకి చెందిన స్క్రిప్ట్‌ని పక్కాగా తయారుచేసుకుంటాడు.

ఆ పైనుంచే మానవుని జీవితదశలను నిర్దేశ్యించి, రిమోట్ తన చేతిలో ఉంచుకుని ఆటాడిస్తాడు.

"థాంక్యూ ముక్తక్కా... థాంక్యూ వెరీమచ్. కనీసం నువ్వైనా నా హృదయఘోషను అర్థం చేసుకున్నావు. అంతేచాలు.'' దినేష్ కళ్ళు సజలమైనాయి.

పొరపాటు చేశానేమోనన్న అపరాధభావన నిండిన వాడి వదనంలోకి కాస్తంత వెలుగు చిమ్మింది.

"వెళ్ళి పడుకోరా... అమ్మా ప్రీతీ... నువ్వు కూడా వెళ్ళి రెస్ట్ తీసుకో...'' అనేసి బయటపడింది మౌక్తిక ఆ గదిలోనుంచి.

"నువ్వేమిటే... వాడికి నాలుగు చీవాట్లువేసి, ఇంత గడ్డి పెడతావనుకుంటే... అలా వెనకేసుకొస్తున్నావేంటి?'' చాటుగా నిలబడి అంతా వింటున్న శకుంతల కూతురిమీద విరుచుకుపడింది.

తల్లి ధోరణి మౌక్తికకు చిరాకు తెప్పించింది. చిన్నప్పటినుంచీ చూస్తోంది. అదే స్వభావం. ఎంతసేపూ తన సొద అతనదేగాని, ఎదుటివ్యక్తి అభిప్రాయాలని, ఉద్దేశ్యాలని, ఉద్వేగాలని అర్థం చేసుకునే ప్రయత్నమే చేయదు. కనీసం... అవతలవాళ్ళేం చెబుతున్నారో వినేందుకు కూడా మొగ్గుచూపదు. అందుకే కాబోలు... ఆవిడకి, బామ్మకి నిరంతరం వాగ్యుద్ధాలు జరుగుతూ ఉండేవి.

"ఏంటమ్మా... వచ్చినదగ్గరనుంచీ చూస్తున్నాను. నీ గోల నీదేగాని ఎదుటివాళ్ళనసలు పట్టించుకోవు. ప్రతీ విషయాన్నీ భూతద్దంలోనుంచి చూసి గగ్గోలుపెడతావు.అసలు... నాన్నకి నీమూలంగానే వచ్చుంటుంది గుండెపోటు. కనీసం తమ్ముడి విషయంలోనైనా సర్దుకుపోవడానికి ప్రయత్నించు.''ఎప్పుడూ తల్లి మాటలకి ఎదురాడని మౌక్తిక అలా కసురుకుంటున్నట్లుగా మాట్లాడడంతో అవాక్కయి నిలబడిపోయింది శకుంతల.

"అనవే అను... మీ అందరూ మంచివాళ్ళే. ఎదుటివారిని అర్థం చేసుకునే ఉత్తమోత్తములే. నేనే దుర్మార్గురాలిని. పగదాన్ని, పరాయిదాన్ని'' మళ్ళీ ముక్కుచీదింది శకుంతల ఏడుపు మొదలెడుతూ.

ఆవిడని ఓదార్చడానికి తాతలు దిగి వచ్చినంత పనైంది మౌక్తికకు. అప్పుడప్పుడే తెల్లారుతోంది. అరుణభానుడి ఆగమనానికి మురిసిన తూరుపుకాంత ఆయనకు స్వాగతగీతి పాడడానికి సమాయత్తమవుతున్నట్లుగా కెంజాయవర్ణపు వస్త్రాన్ని చుట్టుకుంటోందా అన్నట్లుగా ఆకాశం అంతా ఎర్రబడింది. ఆ ప్రశాంత ప్రభాతంలో... పక్షుల కిలకిలారావాలు అనేక రకాలైన వాయిద్యాల సమ్మేళనంలా ధ్వనిస్తున్నాయి.

రాత్రంతా ప్రయాణం...ఎడతెరిపిలేని ఉద్విగ్నత... వీటన్నింటితో అలసిపోయిన మౌక్తిక కళు మూతలుపడ్డాయి ఆమె ప్రమేయం లేకుండానే. అలా హాల్లోనే ఓ మూలకి ఒరిగిపోయింది.

----------------- ---------------------
-------------------------

"ముక్తా లేమ్మా... లే..'' శకుంతల తట్టిలేపడంతో మౌక్తికకు మెలకువ వచ్చింది. బద్ధకంగా కళ్ళు తెరిచి , కిటికీలోనుంచి బయటకు చూసింది. బయట ఎర్రని ఎండ కాస్తోంది.తరణి తన తీక్షణతతో పరిసరాలను మండిస్తున్నాడు.

"ముక్తా బారెడు పొద్దెక్కింది లేమ్మా..టైమ్ ఎనిమిది దాటుతోంది. ఆ వేడి డబ్బాలో ఇడ్లీలు, ఫ్లాస్కోలో కాఫీ అన్నీ రెడీ చేసి పెట్టాను.చూసుకో. నేను హాస్పిటల్ కి వెళ్లొస్తాను. అక్కావాళ్ళు కాఫీ అయినా తాగారో లేదో..''కూతురి ముఖం మీదకు వంగి నిద్రలేపింది శకుంతల.

భర్త ఆరోగ్యం సరిగా లేదన్న బెంగ ఆమెను డీలాపడేలా చేస్తోంది. రెండురోజులుగా పడుతున్న టెన్షన్, నిద్రలేకుండా చేస్తున్న జాగరణ ఫలితంగా ముఖమంతా పీక్కుపోయి, కళ్లు లోతుకిపోయి నీరసంగా ఉంది ఆమె వాలకం.

తల్లిని చూస్తే జాలి ముంచుకొచ్చింది మౌక్తికకు.

చటుక్కున లేచి కూర్చుంటూ...''ఛ...ఛ...మొద్దునిద్ర పట్టేసిందదేమిటోగాని...కాస్సేపాగు అమ్మా... నేను తీసుకెళ్తాను అక్కవాళ్లకి టిఫిన్, కాఫీ. నాకు కూడా నాన్నగారిని ఎంత త్వరగా చూస్తానని ఒకటే ఆత్రంగా ఉంది.'' అంది మౌక్తిక.

"తొందరేమీలేదు... నువ్వు తాపీగా రా. రాత్రనగా వచ్చేశాను.ఆయనెలా ఉన్నారో ఏంటో!నేను వెళ్తాను... నువ్వు తరువాత రా...'' అంది శకుంతల హడావుడి పడుతూ.

మరి తర్కించలేదు మౌక్తిక. ఆవిడ ఆదుర్దాని అర్థం చేసుకున్నదానిలా మౌనంగా ఉండిపోయింది.

"సరే... నువ్వొక్కదానివీ వెళ్లగలవా మరి!'' అడిగింది.

"ఆ(...మరేం ఫరవాలేదు. తెలిసిన రిక్షావాడున్నాడుగా. వాడిని రమ్మన్నాను.'' చెప్పింది శకుంతల కంగారుగా అన్నీ సర్దుకుంటూ.

మౌక్తిక లెచి స్నానపానాలు పూర్తిచేసుకుని తయారయ్యేసరికి పదిదాటింది. ప్రీతికి, దినేష్‌కి జాగ్రత్తలుచెప్పి ఆదరాబాదరా హాస్పిటల్‌కి బయలుదేరింది. ఆమె వెళ్ళేసరికి విద్యాధరరావు పరిస్థితి ఏమంత ఆశాజనకంగాలేదు. శకుంతల విషణ్నవదనంతో దీనంగా కూర్చుని ఉంది. కార్తిక, ఆమె భర్త కూడా ఆందోళన చెందుతున్నారు.


కూతుర్ని చూస్తూనే" ముక్తా" అంటూ బావురుమంది శకుంతల. ఆ స్థితిలో ఆమె అవధులుదాటి పొంగుతున్న శోకసంద్రంలా ఉంది.

ఊరుకోమన్నట్లుగా తల్లి భుజాలమీద చేతులు వేసి పొదివిపట్టుకుంది మౌక్తిక.

ఆమెకళ్ళు కూడా సజలమైనాయి. ముక్కుకి ఏవేవో గొట్టాలు, నోటికి ఆక్సిజన్ మాస్క్... ఇవన్నీ తగిలించబడి అపస్మారకంగా పడి ఉన్న తండ్రిని చూస్తే ఆమెకు దుఃఖమాగడంలేదు.

ఆ మధ్యాహ్నం విద్యాధరరావుకి మరోమారు స్ట్రోక్ వచ్చింది. అది ఈసారి ఆయన ప్రాణాలను తనతోపాటుగా పట్టుకుపోయింది. మృత్యువుతో పోరాడేశక్తిని కోల్పోయిన ఆయన దాన్ని స్వాగతించారు సంతోషంగా.

శకుంతలని ఆపడం ఎవరివల్లనా కావడంలేదు.గుండెలు బాదుకుంటూ, దుఃఖభారంతో నిలువెల్లా కంపించిపోతూ ఆక్రోశిస్తున్న ఆమెను చూస్తే కడుపు తరుక్కుపోతోంది.




ఫార్మాలిటీస్ పూర్తయినాక విద్యాధరరావు పార్ధివదేహాన్ని ఇంటికి తీసుకొచ్చారు.

ఆడపిల్లలందరిలోకీ చిన్నదైన మౌక్తిక అంటే ఆయనకు అపరిమితమైన వాత్సల్యం.

"ముక్తమ్మా... ముక్తమ్మా..."అంటూ ఆప్యాయంగా పిలుస్తూ తనను సమర్ధిస్తూ వచ్చిన ఆయన...భర్తను కాదని వచ్చిన తన తప్పులెంచక, ఆప్యాయంగా గుండెల్లో పొదువుకుని తనకు ఓదార్పునిచ్చిన ఆయన మరిలేరంటే దుఃఖం ముంచుకొస్తోంది మౌక్తికకు.

తాను తమ్ముడు కీచులాడుకుంటే... తమ మధ్యన సయోధ్య కుదర్చలేక చిరునవ్వుతో తలపట్టుకునే తండ్రి...సాత్విక మతాంతర వివాహం చేసుకుంటే చిన్నబుచ్చుకుని ఆమెతో తెగతెంపులు చేసుకున్న తండ్రి...తల్లి-బామ్మల తగాదాల్లో ఎటూ వాలిపోక, మౌనప్రేక్షక పాత్ర వహించి ఎంతో సంయమనంతో వ్యవహరించిన తండ్రి...మరలిరాని లోకాలకి తరలిపోయాడంటే ... నమ్మశక్యంగా లేదు మౌక్తికకు.

ఆ ఆవేదనని తట్టుకోవడం వాళ్లవలన కావడంలేదు. పుట్టిన ఏ జీవికైనా మరణం అనివార్యం. దాన్ని ఆపే శక్తి మనుషులను పుట్టించిన ఆ పరమాత్మకి కూడాలేదు.

గుండె రాయి చేసుకుని జరగవలసిన తతంగమంతా జరిపించేశారు. వాళ్ళ ధర్మంగా సావిత్రికి, సాత్వికకి కూడా ఆయన మరణవార్త తెలియజేశారు. సావిత్రి వెంటనే పతీసమేతంగా వచ్చి శకుంతలని పలకరించి వెళ్ళిపోయింది. సాత్విక మాత్రం ఆ టైమ్‌కి ఢిల్లీలో ఉండడంచేత దశాహంనాటికి వచ్చింది.

శకుంతల ఆమెను కౌగిలించుకుని ఒకటే ఏడిచింది. చిన్నారి ' విద్యాధర్' ని ఎత్తుకుని

'మావారం'టూ    వదలడంలేదు.

విద్యాధరరావు బతికి ఉన్నన్నినాళ్ళూ సాత్వికను ఇంటిగడప తొక్కద్దని శాశించాడు. ఆయన మాటలని అక్షరాలా అమలుపరిచిన సాత్విక ఆయన కర్మకాండలకి హాజరవడం అందరినీ విచారసాగరంలో ముంచివేసింది.

అంత బాధలోనూ శకుంతల దినేష్‌ని తూలనాడడం మానలేదు. అతడిని తన అగర్భశత్రువులా చూస్తూ, తన మాంగల్యాన్ని లాగేసుకున్నాడంటూ ఒకటే శాపనార్థాలు పెడుతోంది. దినేష్ వెర్రివాడిలా చూస్తూ అలా మౌనంగా ఉండిపోయాడే గాని, నోరుతెరచి తల్లిని వారించలేదు.

ప్రీతి సంగతి సరేసరి...జరిగిన ఘోరానికి తానే కారణం కాబోలు... అనుకుని బిక్కచచ్చిపోయి ఓ వారగా ఒదిగిపోయింది.

అన్ని కార్యక్రమాలు ముగిశాయి. తండ్రి ఆత్మశాంతి కోసమని అన్నిరకాలు దానాలు చేసి, తంతంతా ఎంతో ఘనంగా జరిపించాడు దినేష్.

తన సెలవును మరొక నాలుగురోజులకి పొడిగించింది మౌక్తిక. కన్నతండ్రిని కోల్పోయిన లోటు ఎవరూ భర్తీ చేయలేరు. శకుంతలకి కష్టాన్ని ఎవరూ తీర్చలేరు. పోయినవాళ్ళని మరచిపోక తప్పదు. ఆ మరుపు మనిషికి భగవంతుడిచ్చిన అమూల్యవరం.

జరిగిన ఘోరాన్ని నెమరు వేసుకుంటూ, కృంగిపోయి కూర్చుంటే మనుగడ అసాధ్యం అవుతుంది.

అక్కలిద్దరూ వెళ్లిపోయాక ఇల్లు ఖాళీ అయ్యింది. తల్లిని తనతోపాటుగా తీసుకెళ్దామని అనుకుంది మౌక్తిక. కాని, శకుంతల రావడానికి ఒప్పుకోలేదు. తాను ఇప్పుడు ప్రయాణాలేమీ చేసే స్థితిలో లేనని, కాస్తంత మానసిక ప్రశాంతత చిక్కగానే వస్తానని చెప్పేసింది.

మనసునిండా అంతులేని విషాదం నింపుకుని మౌక్తిక ఊరికి బయలుదేరింది.

--------------------                                        --------------------
----------------------

"సారీ ముక్తా...నాన్నగారు పోయారని తెలిసినా నేను రాలేకపోయాను. " రమ్య పలకరించింది ప్రియసఖిని.

ఆమె పలకరింపులోని ఆత్మీయత మౌక్తిక హృదయాన్ని తాకగానే ఆమె నయనాలు జలజల వర్షించాయి.శరత్ కూడా ఆమెను పరామర్శించి తన సంతాపాన్ని తెలియజేశాడు. కాలేజ్‌లో స్టాఫందరూ కూడా విద్యాధరరావు కి నివాళులు అర్పించారు. మధుకిరణ్ ప్రత్యేకంగా వచ్చి ఆమె వేదనను పంచుకునే ప్రయత్నం చేశాడు. అతడు అలా... అంత చేరువగా వచ్చి తనను సాంత్వన పరుస్తూ ఉంటే తన స్వంతమనిషే తనను ఓదారుస్తున్నట్లుగా ఫీలైంది మౌక్తిక.

అతడు తనపట్ల కనబరుస్తున్న శ్రద్ధకి తన మనసెక్కడ అతడి వశమైపోతుందోనని ఆ కళ్లలోకి చూడడానికే భయపడింది మౌక్తిక.

నెమ్మదినెమ్మదిగా తండ్రిపోయిన దుఃఖంనుంచి తేరుకుని రొటీన్‌కి అలవాటుపడసాగింది.

---------------------- ----------------------------

------------------------

ఆ రోజు ఉదయాన్నే ఆరున్నరకి యోగాక్లాసునుంచి తిరిగివస్తున్న మౌక్తికకు తోవలో కనిపించాడు మధుకిరణ్.

ట్రాక్‌సూట్ వేసుకుని, జాగింగ్ చేసుకుంటూ వస్తున్న అతడిని చూసి మంత్రముగ్ధలా ఆగిపోయింది మౌక్తిక.

తెల్లని చుడీదార్, పైజమాలో అప్పుడే విరిసిన నందివర్ధనంలా తాజాగా కనిపిస్తున్న మౌక్తికను చూస్తూనే, అకస్మాత్తుగా కాళ్ళకెవరో సంకెలలు బిగించినట్లుగా నిలబడిపోయాడు మధుకిరణ్ కూడా.

"గుడ్ మార్నింగ్ ముక్తాగారూ...ఏమిటి సంగతి... ఇంత పొద్దున్నే ఇలా దర్శనమిచ్చారు.?'' చొరవగా తనే ముందు పలకరించాడు మధుకిరణ్.

అతడంత సమీపంగా మాట్లాడుతూంటే మౌక్తికకు ఏదోలా ఉంది.

"యోగాక్లాసుకెళ్లి వస్తున్నాను. మీరెక్కడినుంచి?'' సమాధానం చెప్పకుండా ఉండడమ్ సభ్యత కాదని అడిగింది మౌక్తిక.

"నేను జాగింగ్ చేసి వస్తున్నానండీ...'' చెప్పాడు మధుకిరణ్.

అంత సున్నితంగా మాట్లాడే మగవాడిని ఆమె ఇంతవరకు చూసి ఉండలేదు. ఏదో... మృదుమధుర పరిమళం తనను చుట్టుముట్టినట్లుగా అనుభూతి చెందిందామె. మందగతిన వీచే మలయానిలం అలా...అలా... తనను స్పృశిస్తూ వెళ్ళి, తన మదిగది మూలలను ఆప్యాయంగా తడిమినట్లుగా ఉన్నాయతడి చూపులు.


ఇదేమిటి! అతడికి తానింతలా లోబడిపోతోందేమిటి! అతడి సమక్షంలో ఏమీ గుర్తుకురావడం లేదెందుకు! ఎవరి ఆంక్షలు, తానుచేసిన ప్రమాణాలు తనని బాధించనట్లుగా ఉంది అతడి సాన్నిధ్యం.

"ఏమిటీ... అలోచిస్తున్నారు?'' చిత్తరువై తనముందు నిలచిన మౌక్తికను వింతగా చూస్తూ ప్రశ్నించాడు మధుకిరణ్.

"అబ్బే..ఏమీలేదండీ... మీరు వెళ్ళేది ఇంటికేగా?'' అసంబద్ధమైన ప్రశ్న అని తెలిసినా అడగక తప్పలేదు మౌక్తికకు.

"అప్పుడేనా! ఎనిమిదింటివరకు ట్యూషన్స్ చెప్పి అప్పుడింటికెళ్తా. బ్రహ్మచారిగాడిని కదండీ... అప్పుడెళ్లి స్వయంపాకం చేసుకోవాలి.'' నవ్వాడు మధుకిరణ్.

మల్లెమొగ్గల్లాంటి పలువరస మెరిసింది తళుక్కున.




'కాలేజ్ లో వస్తున్న జీతం సరిపోలేదు కాబోలు...ట్యూషన్స్ చెప్పి ఇంకా నొర్లేసుకుంటున్నాడు.' కినుకగా అనుకుంది మౌక్తిక.

చాలామంది అధ్యాపకులు కాలేజ్ లో పాఠాలు సరిగ్గా చెప్పకుండా, ఇంటిదగ్గర ట్యూషన్స్ చెప్పి డబ్బులు వెనకేసుకోవడం ఆమెకి తెలుసు. అలాంటి వాటికి ఆమె చాలా దూరం.

"బాగానే సంపాదిస్తున్నారనుకుంటా'' కాస్తంత వ్యంగ్యంగా అడిగింది మౌక్తిక.

అతడు ఆమెవైపు ఆశ్చర్యంగా చూసి "సంపాదనా! కొంపదీసి నేను డబ్బుకోసం ట్యూషన్లు చెబుతున్నాననుకుంటున్నారా!'' అడిగాడు నొచ్చుకుంటున్నట్లుగా ముఖంపెట్టి.

"మరి!"

"నేను ట్యూషన్లు చెప్పేది డబ్బుకోసం కాదండీ... నా ఆత్మతృప్తికోసం. మా ఇంటికి దగ్గరలో బీదసాదా ఉండేటువంటీ బస్తీ ఒకటి ఉంది. అక్కడ ఉండేవాళ్లంతా రోజుకూలి చేసుకుని జీవనం సాగించే కార్మికులు, తాపీపనివాళ్లు. వాళ్లపిల్లలలో కొందరు చాలా తెలివైనవాళ్లు. సానపడితే ఒక్కొక్కరు ఒక్కో వజ్రాల్లా తయారౌతారు. కాని, వాళ్లకి ట్యూషన్ సెంటర్లలో చేరే ఆర్ధికస్తోమతలేదు.

మట్టిలో మాణిక్యాల్లా మెరిసిపోయే అటువంటి విద్యార్థులకి కోచింగ్ ఇచ్చి మెరికల్లా తయారు చేయాలన్నదే నా ఆకాంక్ష."చెప్పాడు మధుకిరణ్.

కళ్లు విప్పార్చుకుని వింటోంది మౌక్తిక. మధుకిరణ్ వ్యక్తిత్వంలో ఇంకో పార్శ్వం ఆవిష్కృతమౌతూంటే సంభ్రమంతో చూస్తూ ఉండిపోయింది ఆమె.

మధుకిరణ్ చాలా సమర్ధుడైన అధ్యాపకుడు అని ఆమెకి తెలుసు. అటువంటివాడు ఏ కోచింగ్ సెంటర్ పెట్టుకున్నా వేలకివేలు సంపాదించుకోవచ్చును. కాని, అతడలా ప్రతిఫలాపేక్ష లేకుండా పేదపిల్లలకి విద్యాదానం చేయడంతో ఆమె మనసులో అతడికున్న స్థానం ఇంకా పదిలమై నిలిచింది.

ఆమె దృష్టిలో అతడు హిమవన్నగమంత ఎత్తుకి ఎదిగిపోయాడు.

"గ్రేట్ మధుకిరణ్ గారూ...మీరు చేస్తున్న ఈ మంచిపని వలన ఎందరో పేదపిల్లల జీవితాలలో వెలుగులు నిండుతాయి.

ఈసారి మధుకిరణ్ విస్మయంగా చూశాడు ఆమెవైపు.

మౌక్తిక అతడితో అంత ఫ్రీగా మాట్లాడడం అదే మొదటిసారి మరి! ఎప్పుడూకూడా అత్తిపత్తిలా తనలోకి తానే ముడుచుకుపోతూ, బిడియంగా ఉండే మౌక్తిక అలా మనసువిప్పి తనతో మాట్లాడడం అతడికి అంతులేని సంతోషాన్ని కలుగజేసింది.

ఆమె సమక్షం ఏదో వింతభావనని రేకెత్తిస్తోంది. మాట్లాడుతున్నప్పుడు చిన్నగా మూసుకుంటూ, విచ్చుకుంటున్న ఆమె పలుచని పెదవులు, ఏదో తత్తరపాటుతో చంచలంగా కదులుతున్న ఆమె కనుగుడ్లు ఇవన్నీ అతడికి ఎంతో అపురూపంగా అనిపిస్తున్నాయి.

అలా ఆమెనే చూస్తూ యుగాలకొద్దీ ఉండిపోవాలనిపిస్తోంది. అతడికి స్పష్టంగా తెలుసు... తాను వెదికే అమ్మాయి ఆమేనని. కాని, ఆమె మనసులో ఏముందో తెలియడంలేదు. తాను తారసపడినప్పుడు ఆమెలో కనిపించే భావావేశాలకి అర్ధమేమిటో అతడు కనుక్కోలేకపోతున్నాడు.

ఆమె నయనాలలో తనపట్ల వ్యతిరేకతైతే కనబడదు. కాని, ముఖంలో ఏదో... కంగారు, ఇదీ అని చెప్పలేని తడబాటు.

ఆమె హృదయాన్ని చేరే మార్గం ఆ కాలమే చూపాలి తనకు.

"వస్తా ముక్తాగారూ...నా క్లాసులకి టైమౌతోంది.'' ఆమెను వీడివెళ్లడం తప్పనిసరి అన్నట్లు కదిలాడు మధుకిరణ్.

"అలాగే... బై...'' అంది మౌక్తిక అతడు వెళ్తున్నవైపే చూస్తూ.


------------------------ --------------------------- ---------------------

"అక్కా...నువ్వొక్కసారి అర్జెంటుగా ఇంటికి రా...నీతో ఎన్నో మాట్లాడాలి.'' దినేష్ దగ్గరనుంచి ఫోన్ రాగానే ఆదరాబాదరా బయలుదేరిపోయింది మౌక్తిక.

వెళ్లేముందు రమ్యతో ఓమాట చెప్పిపోదామని వాళ్ళింట్లోకి వెళ్లింది. బెడ్‌మీద నిస్త్రాణంగా పడుకుని ఉంది రమ్య. పక్కనే ఉన్న శరత్ ఆమెచేత పళ్లరసం తాగించడానికి నానా తంటాలూ పడుతున్నాడు.

మౌక్తికను చూస్తూనే "చూడండి ముక్తా...జ్యూస్ తాగకుండా చిన్నపిల్లలా ఎలా మారాం చేస్తోందో... రెండురోజులై ఒకటే వామిటింగ్స్. ఎంత నీరసంగా అయిపోయిందో చూశారా... మీరన్నా మీఫ్రెండ్‌కి నచ్చచెప్పి ఈ జ్యూస్ తాగించండి....ప్లీజ్..." పక్కకు తప్పుకుంటూ చేతిలోని గ్లాసుని టీపాయ్ మీద ఉంచాడు శరత్.

రమ్యకి వాంతులవుతున్నాయా!? ఎందుకు? పైత్యంచేసిందా? రెండురోజులై లీవ్ లో ఉంది తను. ఫీవర్ అని చెప్పింది. ఇంకా తగ్గలేదా!?




"ఏమిటి రమ్యా? వాంతులవుతున్నాయా? నాతో అననేలేదూ..." గ్లాసు రమ్య నోటికి అందించింది మౌక్తిక.

"ప్లీజ్ ముక్తా... తాగాలనిలేదు.నన్ను ప్రెస్‌చేయకు..." అయిష్టంగా ముఖం తిప్పుకుంది రమ్య.

'పోనీలే... నీకు సహించకపోతే వద్దు. డాక్టర్ దగ్గరకన్నా వెళ్తావా!?" గట్టిగా నిలదీసింది మౌక్తిక.

"అన్నీ అయ్యాయి... మొదట్లో ఇలాగే ఉంటుందని చెప్పిందావిడ..." చిరాగ్గా అంటూ నాలిక్కరుచుకుంది రమ్య.

'మొదట్లో ఇలాగే ఉంటుందా!' అంటే! మౌక్తికకు అర్థం అయ్యీ...కానట్లుగా ఉంది.

" అసలే...క్యారీయింగ్... సహించినా సహించకపోయినా ఆరారా ఏదో ఒకతి తినాలని, తాగాలని చెప్పింది డాక్టర్...కాని, తనేమో మొండికేస్తోంది..." తెగ హడావుడి పడిపోతున్న శరత్‌ని చూస్తే ఆమెకో సంగతి స్ఫురించింది.

రమ్య చెవిలో తానడగాలనుకున్నది అడిగేసింది గుసగుసగా.

ఆమె సిగ్గుగా నవ్వి మూడువేళ్ళు చూపించింది కళ్లు అరమోడ్పులవ్వగా.

అంతే... విషయం మొత్తం బోధపడిపోయింది. తన అల్లరి స్నేహితురాలు అమ్మ కాబోతోందన్న శుభవార్త తెలిసి ఎంతో సంతోషమనిపించింది మౌక్తికకు.

వెంటనే పరుగున వెళ్లి...రివ్వున వీస్తున్న చల్లగాలికి, ఆకాశంలో పరుగులు తీస్తున్న నీలిమబ్బులకి, స్వేచ్ఛగా రెక్కలు 'టపటప' లాడించుకుంటూ ఎగిరిపోతున్న పక్షిసమూహాలకి ఈ శుభవర్తమానం చెప్పేసి రావాలి అనిపించింది.

అమ్మతనం పొందడంకన్నా అమూల్యవరం ఇంకేం కావాలి ఆడదానికి. స్త్రీత్వానికి సార్ధకత చేకూరేది ఇక్కడే. పురుషుడు తలకిందులుగా తపస్సుచేసినా అనుభవించలేని మహత్తరమైన ఆనందం మగువకి లభించేది ఈ ఒక్కవిషయంలోనే.

తన ప్రాణాలను పణంగా పెట్టి , మృత్యువుతో పోరాడి ఒక జీవికి ఊపిరిపోసే అద్భుతశక్తి కేవలం స్త్రీమూర్తికే ఉంది.

ఆడపుట్టుక పుట్టినందుకు ఆక్షణాన ఎంతో గర్వంగా అనిపించింది మౌక్తికకు. అంతలోనే మనసంతా పిచ్చిపిచ్చిగా తయారైంది.

రమ్య నెలతప్పితే తనకెందుకు ఇంతసంబరం!? ఆమెతో తనకి పోలికేమిటి!?

అడవిలో పూసిన పిచ్చిపూవుకి, సుందరనందనోద్యానవనంలో ముద్దుగా విరిసిన గులాబిబాలకి సాపత్యం ఏమిటి?

అందం, యవ్వనం అంతా కూడా అడవికాచిన వెన్నెలలా వ్యర్ధంగా ఉండిపోయి ఏ అనుభూతికీ నోచుకోని తనకి, అనాఘ్రాత పుష్పంలా మిగిలిపోయిన తనకి...

తన స్త్రీత్వాన్ని, సౌందర్యాన్ని మనసైన ప్రాణనాధునికి అంకితంచేసి, అతడినుంచి అపురూపమైన అమ్మతనాన్ని కానుకగా పొందిన రమ్యకి సామ్యమా!?

అనుకుందికే ఏదోలా ఉంది. ఆడపుట్టుక పుట్టగానే సరా! అనుభవించే రాతుండద్దూ... ఒక శుష్కహాసం మెదిలింది మౌక్తిక పెదవులమీద. తన భావావేశాన్ని బహిర్గతం కానివ్వకుండా జాగ్రత్తపడుతూ... రమ్యని, శరత్ ని మనస్ఫూర్తిగా అభినందించి తాను ఊరికి వెళుతున్న విషయం చెప్పి బయలుదేరింది మౌక్తిక.

"నా బంగారుతల్లికదూ...నువ్విలా అల్లరిపెడితే..నీ కడుపులో పెరుగుతున్న బుజ్జిగాడికి బలం ఎలా వస్తుందిచెప్పు!? నా మాట విని ఒక్క సిప్...''గారం చేస్తూ బతిమలాడుతున్నాడు శరత్ మళ్ళీ.

"ఇదంతా బుజ్జిగాడిమీద ప్రేమే కాని, నామీద కాదన్నమాట!'' అలిగినట్లుగా అంటోంది రమ్య.

కిలకిల నవ్వులు వినబడ్డాయి ఒక్కసారిగా. తానేమి కోల్పోయిందో... మౌక్తికకు గుర్తు చేశాయి ఆనవ్వులు. భారమైన మనసుతో గేటుదాటింది.

-------------------                                                                    -----------------

-------------------

ఇల్లుచేరిన మౌక్తిక ప్రీతిని చూస్తూనే నిర్ఘాంతపోయింది. తండ్రికి ఒంట్లో బాగాలేనప్పుడు తాను తొలిసారిగా చూసిన ప్రీతికి, ఈ ప్రీతికి అస్సలు పోలికేలేదు.

బొద్దుగా, ముద్దుగా ముద్దబంతిలా మిసిమివన్నెలొలుకుతూ ఎంతో ఆకర్షణీయంగా ఉన్న ఆనాటి ప్రీతివేరు.

శరీరమంతా శుష్కించి, వన్నెతగ్గి, వసివాడి కళ్లకిందుగా పాకిన నల్లని చారలతో వడలిపోయిన గులాబీలా ఉన్న ఇప్పటి ప్రీతి వేరు.

కేవలం రెండు... రెండంటే రెండే నెలల్లో మనిషిలో ఇంతటి మార్పు రావడం సాధ్యమా!

దానికి సాక్ష్యంగా కనబడుతున్న ప్రీతిని చూస్తే మౌక్తిక కడుపు తరుక్కుపోయింది.

"ఏంటి ప్రీతీ... ఇలా అయిపోయావు? ఒంట్లో బాగాలేదా?'' కళ్లలో ప్రాణాలు నిలబెట్టుకున్నట్లుగా ఉన్న ప్రీతిని ఆప్యాయంగా దగ్గరకు తీసుకుంది మౌక్తిక.

దినేష్ ముఖం గంభీరంగా మారిపోయింది.

"ప్రీతీ... నువ్వు లోపలికి వెళ్ళి అక్కకి కావలసినవి చూడు..'' అని ఆమెకి పురమాయించి, "అక్కా... నువ్వు స్నానంచేసి రెస్ట్ తీసుకో...తరువాత మాట్లాడుకుందాం.'' అన్నాడు.

ప్రీతి లోపలికి వెళ్ళిపోయింది. దినేష్ వైఖరికి, ప్రీతి అలా నీరసించిపోవడానికి కారణం ఏమైఉంటుందో మౌక్తికకు అంతుచిక్కడంలేదు.

ఇంట్లో శకుంతల అలికిడి వినబడలేదు. ఆమె ఏమైనట్లు!?

"అమ్మేది దినేష్?'' అడిగింది మౌక్తిక బ్యాగ్ లోనుంచి ఇస్త్రీ చీర, జాకెట్ తీసుకుంటూ.

"అమ్మ...పెద్దక్క వాళ్ళింట్లో ఉందక్కా...'' దినేష్ స్వరం నూతిలోనుంచి వస్తున్నంత నీరసంగా ఉంది.

"అక్క తీసుకెళ్లిందా?'' తండ్రి పోయి, మూడోనెల నడుస్తోంది కాబట్టి లాంఛనం కోసం కార్తిక తల్లిని తీసుకెళ్లిందేమోనని అడిగింది మౌక్తిక.

"లేదక్కా''.

"మరి! " ఆశ్చర్యపోయింది మౌక్తిక.

"అమ్మ నామీద అలిగి వెళ్ళిందక్కా.'' ఆ విషయం చెప్పడానికి అతడు ఎంతో వేదనను, మానసిక సంఘర్షణని అనుభవించాడని అతడి వాలకమే చెబుతోంది.

"అదేంటి దినేష్... అమ్మ నీమీద అలగడం ఏమిటి?'' నమ్మలేనట్లుగా చూసింది మౌక్తిక.

దినేష్ శకుంతలకి గారాల పుత్రుడు. ఒక్కగానొక్క మగపిల్లాడని ఆమెకు అతడిమీదే పంచప్రాణాలూనూ. భర్త ఎప్పుడైనా మందలించబోతే 'పసివాడం'టూ వెనకేసుకొచ్చేది. అందుకే అక్కచెల్లెళ్లందరూ కూడా దినేష్‌ని ' అమ్మకూచి' అని వెక్కిరిస్తారు.

అటువంటి దినేష్ మీద తల్లి అలగడమేమిటి... వింత కాకపోతేనూ!

"నువ్వు చెప్పేది నిజమేనట్రా!'' విస్మయంగా అడిగింది మౌక్తిక.

విరక్తిగా నవ్వాడు దినేష్.

"ఏ ముహూర్తాన నేను ప్రీతిని పెళ్ళి చేసుకున్నానో గాని, అప్పటినుంచీ ఈ ఇంట్లో అన్నీ అరిష్టాలే. అల్లారుముద్దుగ పెరిగిన ఆమెకు నా వలన ఎటువంటి సుఖమూ చేకూరకపోగా, ఆమె బతుకు మరింత నరకమైంది. ప్రీతిని ఈ ఇంటికోడలిగా తెచ్చి నేను చాలా పెద్ద తప్పు చేశానక్కా'' బాధగా పలికాడు దినేష్.

"దినేష్... ఏమంటున్నావురా?'' నిర్ఘాంతపోయింది మౌక్తిక.


అతడు నిస్పృహగా చూస్తూ "అవునక్కా... ప్రీతిని చూస్తేనే అమ్మకెందుకో కోపం. నేను, ప్రీతి సరదాగా మాట్లాడుకుంటే చూడలేదు. నాకు సంబంధించినంత వరకు అన్నిపనులూ తానే చేయాలి అనుకుంటుంది ప్రీతి జోక్యాన్ని అస్సలు సహించలేకపోతోంది.

ప్రీతి గట్టిగా మాట్లాడినా, నవ్వినా, ఆఖరుకి శుభ్రంగా తయారై మంచిచీర కట్టుకున్నా అమ్మ భరించలేకపోతోంది. ప్రతి విషయంలో ఆమెను తప్పుపడుతోంది. పని చేయడానికి ముందుకొస్తే నీ సహాయం అక్కరలేదంటోంది. అలాగని దూరంగా మెలిగితే 'దున్నపోతులా తిని కూర్చుంటే ఇంటి చాకిరీ అంతా చేసే ఓపిక తనకు లేదని తగువాడుతోంది.'' గాఢంగా నిట్టూర్చాడు దినేష్.

"నువ్వు చిన్న సమస్యను పెద్దది చేసి చూస్తున్నావేమో దినేష్. నాన్నపోయి ఇంకా మూడునెలలు కూడా కాలేదు. బహుశా అమ్మ... ఆ డిప్రెషన్‌లో...'' ఖండించింది మౌక్తిక.

దినేష్ అడ్డంగా తలూపుతూ "అలా అనుకునే నేనూ ఓపిక పట్టానక్కా... కాని,అమ్మ విపరీత ధోరణి రోజురోజుకీ ఎక్కువౌతోంది. నేను ప్రేమించానని చెప్పడం లేదు కాని, ప్రీతి చాలా మంచి అమ్మాయి. ఎవరినీ నొప్పించే మనస్తత్వం కాదు. ఎందుకో గాని, అమ్మ ప్రీతి ఉనికిని ద్వేషించేంతటి రాక్షసత్వం ప్రదర్శిస్తోంది. ప్రీతి పడే మానసిక క్షోభ నేను చూడలేకున్నాను. నా మీద ఇష్టంకొద్దీ తను ఇదంతా భరిస్తోంది. తన పుట్టింట్లో విషయం తెలిస్తే... మళ్లీ ఏం గొడవలౌతాయోనని పళ్ల బిగువున భరిస్తోంది. చివరికి... అమ్మ... ఎంతలా తయారైందంటే...'' దినేష్ స్వరం గద్గదమైంది.

"ఏమైందిరా?'' ఆరాటంగా అడిగింది మౌక్తిక.




అతడు ఇబ్బందిగా కదులుతూ" నాలుగురోజుల కిందట రాత్రి పదకొండు గంటలప్పుడు...నేను, ప్రీతి ఏకాంతంలో ఉండగా... హఠాత్తుగా గది తలుపులు తట్టి, లోపలికి వచ్చి తనకు భయంగా ఉందంటూ మా ఇద్దరి మధ్యనా పడుకుంది...'' చెప్పలేక చెప్పలేక చెప్పాడు.

తీవ్ర దిగ్భ్రమకి లోనైంది మౌక్తిక. తల్లి ఇంత సంస్కారహీనంగా తయారైంది అంటే ఆమెకి నమ్మశక్యం కావడంలేదు. అసలు... ఆమె ఎందుకింత దిగజారి ప్రవర్తించినట్లు!? మిలియన్ డాలర్ల క్వశ్చన్.

నిజంగానే భయపడిందనుకోవడానికి లేదు. ఆమెకి భయమంటే ఏమిటో తెలియదు. ఇంట్లోని వాళ్లందరూ ఎటైనా వెళ్లినా సరే... ఎవరి సాయమూ లేకుండా అదే ఇంట్లో ఎన్నోసార్లు గడిపిన ఆమె భయమంటూ వెళ్ళి, భార్యాభర్తలని అసౌకర్యానికి గురిచేసిందా!?

"నమ్మలేకపోతున్నావు కదూ! కాని, ఇదంతా నిజమక్కా. మరునాడు ఉదయాన అకారణంగా ప్రీతిమీద విరుచుకుపడిన అమ్మని' నీ ఉద్దేశమేమిటని' నిలదీశాను. అంతే...నన్ను నానా మాటలాడి అలిగి, అక్కవాళ్ళింటికి వెళ్లిపోయింది'' దినేష్ కళ్లు సజలమైనాయి.

తనకన్నా రెండేళ్ళు చిన్నవాడైన అతడి కళ్లలో చెమ్మని చూసి తట్టుకోలేకపోయింది మౌక్తిక. తల్లి అతడినెంతో గారం చేసేది.

"మగపిల్లాడిని అంతలా నెత్తెక్కించుకోవద్దే శకుంతలా...గారాబం ఎక్కువైతే చెడిపోతారంటూ' నెత్తినోరు కొట్టుకుని గోలపెట్టేది బామ్మ.

అయినాసరే... అతడి ఒంటిమీద ఈగ కూడా వాలనిచ్చేదికాదు తల్లి. అటువంటి తల్లి ...ఇప్పుడు

కొడుకు సుఖసంతోషాలకి అడ్డుతగులుతోందెందుకు? అనురాగమయమైన అతడి సంసారానికి విఘాతం కలిగిస్తోందెందుకు?

మౌక్తిక బుర్రంతా గజిబిజిగా తయారైంది.

"వదినా... స్నానానికి నీళ్ళు పెట్టాను. మీరు ఫ్రెష్ అయితే టిఫిన్ చేద్దురుగాని..."చెప్పింది ప్రీతి వంటింటి గడపలో నిలబడి.

ఆమెవైపు తదేకంగా చూసింది మౌక్తిక. కల్లాకపటం తెలియని అమాయకపు పసిదనం తొంగిచూస్తోంది ఆమె వదనంలో. ఆ కళ్ళు... మంచులో తడిసిన మరుమల్లెల్లా వింత ధవళిమతో మెరుస్తున్నాయి. ఆ ముఖంలో ఎక్కడాకూడా జాణతనం కాని, జట్టీలుపెట్టే మనస్తత్వం కాని కనబడడంలేదు.

ఇంతటి సౌజన్యమూర్తిని తల్లి అంతలా ఆరడి పెడుతోందెందుకు!?

స్నానం చేసొచ్చి ప్రీతి పెట్టిన టిఫిన్ తినేసి బయలుదేరింది మౌక్తిక.

"అక్కా" గడప దాటుతూంటే పిలిచాడు దినేష్.

"ఏంటిరా?" ఆప్యాయంగా అడిగింది మౌక్తిక.

"అమ్మతో అనవసరంగా గొడవ పడకక్కా... నీతో చెప్పుకుంటే, నిన్నోసారి చూస్తే నా గుండెబరువు తీరి కాస్త మనశ్శాంతిగా ఉంటుందని నిన్ను రమ్మన్నాను." ఏడ్చేశాడు దినేష్.

చూడలేకపోయింది మౌక్తిక. తనతో ఏదైనా గొడవ పడినప్పుడు ఎప్పుడూ తనదే పైచేయిగా ఉండాలని మొండిగా వాదించే దినేష్... ఇలా పిరికివాడిలా ఏడుస్తూ ఉంటే మౌక్తిక గుండె తరుక్కుపోయింది.

తనకే ఇంత బాధగా ఉందే!మరి... తల్లి గుండెల్లో జాలి, దయ ఇంకిపోయి ఆమె అంత మొరటుగా తయారైందేమిటి!?

"నువ్వు గాబరాపడకు. నేను అంతా సెట్‌రైట్ చేస్తానుగా." అతడికి అభయం ఇచ్చి వీధిలోకి కాలుపెట్టింది మౌక్తిక.

-------------------

-------------------------- -------------------

మౌక్తికను చూడగానే శకుంతల ఆశ్చర్యపడింది. కూతురంత హఠాత్తుగా ఎందుకు ఊడిపడిందో అర్థంకాక సంశయంగా చూడసాగింది.

"ఎప్పుడొచ్చావే ముక్తా..." కూతురుని పలకరించింది.

తనకేమీ తెలియనంత అమాయకంగా ముఖం పెడుతూ " ఇప్పుడే వచ్చాలే...నువ్వేంటిక్కడా?" అడిగింది మౌక్తిక.

అంతే... శకుంతల ముఖం కళతప్పింది. ఎందుకంటే శకుంతల ఇల్లువిడిచి ఎవరింట్లోనూ ఒక్కక్షణం ఉండదు. ఎప్పుడైనా కార్తిక వచ్చి తనింట్లో నాలుగురోజులు ఉండమంటే" ఆడపిల్ల సొమ్ము మాకెందుకు?'' అంటూ రానుపొమ్మని నిరాకరించేది.

"అంతా నా ఖర్మ తల్లీ...ఏ ముహూర్తాన ఆ మహాతల్లి ఇంట్లో పాదం మోపిందో నా కొడుకు నాకు కాకుండా పోయాడు.వన్నెల విసనకర్రలా వగలుపోయి వాడికి వల విసిరింది. వాడికేదో మందుపెట్టి తన వశం చేసుకుంది. నా కొడుకుని నా నుంచి దూరంచేసింది.'' కళ్లు-ముక్కు ఎర్రగా చేసుకుని ఆవేశపడింది శకుంతల.

నువ్వు సమస్యను నీ కోణంలోనుంచే చూస్తున్నావు. వాడింకా పసిపిల్లాడు కాదు. పెళ్లైనవాడు. వాడికీ వ్యక్తిగత జీవితం ఉంటుంది. మనమే సర్దుకుపోవాలి.'' వ్యర్థమని తెలిసినా శకుంతలని శాంతపరచాలని చూసింది మౌక్తిక.

ఆవిడ తన ముఖాన్ని కందగడ్డలా చేసుకుని "ఏమిటే సర్దుకుపోయేదీ... గాడిదగుడ్డు. నేననేదాన్ని జన్మనివ్వకపోతే వాడెలా వచ్చాడటా! అలాంటి కన్నతల్లిని ...పెళ్లవగానే పనికిమాలినదానిలా చూస్తాడా? ఆ ఇనపగజ్జెలతల్లి ని ఇంట్లోకి తెచ్చి నా పసుపుకుంకాలు లాగేసుకున్నాడు. అది చాలనట్లు నన్ను చులకన చేసి చూస్తాడా?'' ముక్కుచీదింది జిర్రున.

తల్లి ఆక్రోశానికి అర్థం తెలిసింది మౌక్తికకు. పొసిసివ్‌నెస్...

తనది అనుకున్న వస్తువు వేరొకరి స్వంతం అయితే చూసి ఓర్వలేని ఉడుకుమోత్తనం. కొడుకు కోడలికి తనతో సమానస్థానమిచ్చి ఆదరిస్తే భరించలేని అసూయ.

తన మనిషి కేవలం తన సొత్తు మాత్రమే కావాలని ఆశించే స్వార్థపరత్వం.

అత్తకోడళ్లకి అభిప్రాయబేధాలు తలెత్తేదిక్కడే. అన్నాళ్ళూ ' అమ్మా...అమ్మా...' అంటూ తన కొంగుపట్టుకుని తిరిగే ముద్దులకొడుకు..., కోడలు రాగానే ఆమె కొంగుచాటు కృష్ణుడల్లే మారిపోవడం చూసి సహించలేనితనంతో కొందరు తల్లులు వారిని విడదీసేందుకు సైతం వెనుకాడరని తల్లిని చూస్తే తెలిసింది మౌక్తికకు.




తన తల్లి కూడాఈ రకమైన భావనకి అతీతురాలు కాదన్న సత్యం అవగతమైన మౌక్తిక డీలాపడిపోయింది.

ఇంతలో కార్తిక వచ్చి "ఇలారా ముక్తా" అంటూ మౌక్తిక చేయిపట్టుకుని గదిలోకి తీసుకెళ్ళి తలుపు మూసింది.

"ముక్తా... ఇక్కడ నూటికి నూరుపాళ్ళు అమ్మదే తప్పు. ప్రీతి మెతకపిల్ల అని నాకు తెలుసు. కాని, తనను దోషి చేసి నిలదీస్తే అమ్మ తట్టుకోలేదు. అందుకే... నీకు ఫోన్ చేయమని తమ్ముడితో చెప్పాను. ఏం చేయాలో కాస్త ఆలోచించు.'' చెప్పింది కార్తిక.

ఆమె సంయమనానికి, వ్యవహార దక్షతకు అబ్బురపడింది మౌక్తిక. నిజమే... పీకలు తెగ్గోసేంత కర్కోటకుడిని కూడా డైరెక్ట్‌గా నువ్వు ' నేరస్తుడివి' అంటే మండిపడతాడు.

'నీదేతప్పు...' అని నేరుగా చెబితే తల్లికి కోపం రావచ్చును.

"ఏమే సావిత్రీ... పిల్లలు రాలేదేం? ఆరాగా అడిగింది బామ్మ.

"నాకు ఒక్కడే కొడుకమ్మా... ముంబైలో సాఫ్ట్ వేర్ ఇంజనీర్ గా పని చేస్తున్నాడు.'' గొప్పగా చెప్పింది అత్తయ్య.

"అంతటి వాడున్నాడే నీ కొడుకూ!'' బామ్మ అనుకుంది తనలో తానే అనుకున్నట్లుగా.

కుశలప్రశ్నలయ్యాక మా పిల్ల జట్టందరినీ పరిచయం చేశారు నాన్న. నన్ను చూసిన తరువాత అత్తయ్య కళ్ళు ఒకింత సంభ్రమంతో మెరవడం నేను గమనించకపోలేదు.

"అన్నయ్యా... నీ కూతురు బంగారుబొమ్మలా ఉంది." మెచ్చుకుంది అత్తయ్య నా అందాన్ని ప్రశంసిస్తూ.

బిడియంగా తల దించుకున్నాను.

చిన్నత్తయ్య రాక ఆపెళ్ళికి నిండుదనాన్ని తెచ్చింది. ఎన్నో సంబరాలు, సంరంభాల నడుమ పెళ్ళితంతు అట్టహాసంగా ముగిసింది. పెళ్ళికి వచ్చిన బంధువులందరికీ బట్టలుపెట్టారు పెద్దత్తయ్య వాళ్ళు.

నవ్యకి ఎవరి స్తోమతను బట్టి వారు కానుకలు చదివించారు. నవ్య భర్త ఆమెకి తగినట్లే పొడుగ్గా-అందంగా ఉన్నాడు,

పెళ్లిసందడి కాస్త సద్దుమణగగానే చిన్నత్తయ్య బయలుదేరిపోయింది. వెళ్ళేముందు అందరినీ కౌగలించుకుని బావురుమంది.

ఎందుకో అర్ధంకాలేదు గాని... చూపులతోనే ఎంతో ఇష్టంగా తడిమింది నన్ను.

"వీలు చూసుకుని ఓసారి రండి శేఖరం...'' అన్నారు నాన్న కంఠం రుద్ధమవ్వగా.

"అలాగే బావగారూ... ఇన్నేళ్ళూ సావిత్రి ఈ రోజుకోసమే ఎదురు చూస్తూ తపించిపోయింది..నాకు రావడానికి కుదరకపోయినా మీ చెల్లెలిని మాత్రం తప్పక పంపుతాను.'' అన్నాడు మామయ్య.

నా దగ్గరకొచ్చి బుగ్గలు రెంటినీ పుణికి ముద్దాడింది అత్తయ్య.

వాళ్ళ కారు కనుమరుగయ్యేవరకూ చూస్తూండిపోయాము అందరం కూడా.

''అన్నీ మంచి రోజులే' అని నాన్న ఎందుకన్నారో గాని, ఇకముందు నా జీవితంలో అన్నీ దుర్దినాలే. ఈ రోజు ఆ ప్రళయానికి నాంది'' అని ఆరోజు నాకు తెలియదు. తెలిసుంటే ఆరోజు చిన్నత్తయ్యను కలిసి ఉండేదాన్నేకాదు.

అత్తయ్యను తొలిసారి చూసినప్పుడు మదిలో ఉత్పన్నమైన ఆనందహేల... నా మది రగిల్చే దుఃఖాగ్నికీలగా మారనుందని ఎవ్వరమూ ఊహించలేదు ఆక్షణం.

పెళ్ళి హడావుడి సద్దుమణిగి , నవ్య అత్తవారింటికి వెళ్ళిపోయేవరకు ఉండి బామ్మ కోరిక మేరకు చుట్టుపక్కల చూడవలసిన ప్రదేశాలన్నీ చూసేసి బయలుదేరాం మేము.

---------------------

---------------------------                                                                    -------------------

రోజులన్నీ అతి సాధారణంగా గడచిపోతున్నాయి. మేము ఇంటికి వచ్చేసిన పదిరోజుల తరువాత చిన్నత్తయ్య ఫోన్ చేసింది... తొందరలోనే తాను మా ఊరు రాబోతున్నానని చెప్పింది. ఆమె అంత హఠాత్తుగా ఎందుకు వస్తోందో నాకైతే బోధపడలేదు. ఆమాటే అమ్మతో అంటే" పుట్టింటికి వచ్చి ఏళ్ళైపోయింది కదమ్మా... అందుకే రావాలనుకుంటోందేమో!'' అంది అమ్మ నవ్వుతూ.

'అంతే అయ్యుంటుంది' అనుకున్నాను.

మరి నాలుగు రోజులకి వచ్చిన చిన్నత్తయ్యని సాదరంగా ఆహ్వానించారు నాన్న. అమ్మ

ఆప్యాయంగా పలకరించింది.

మామయ్యకి ఏవో ముమ్మరమైన పనులున్నందువలన రాలేదని చెప్పింది చిన్నత్తయ్య. ఆవిడ దిగి ఇంట్లోకి రాగానే డ్రైవర్ అరటిపళ్ళగెల, ద్రాక్షపళ్ళ బుట్ట ఓ రెండు సూట్‌కేసులు తెచ్చి లోపల పెట్టాడు.

బామ్మ కూతురిని చూసి పదహారేళ్ళ పడుచుపిల్లలా ఎగురుకుంటూ వచ్చి ఆమెని కౌగలించుకుంది. ఆడపడుచుకోసం ఏవేవో ప్రత్యేకమైన వంటకాలు చేసింది అమ్మ. చిన్నత్తయ్యకి పెరుగు గారెలంటే ఇష్టమని అప్పుడెప్పుడో బామ్మ అందట... అది గుర్తుంచుకుని మినప్పప్పు నానేసి , పెరుగ్గారెలు చేసింది అమ్మ.

అత్తయ్య కళ్ళు సంతోషంతో చెమ్మగిల్లాయి. ఎంత వయసొచ్చినా...పుట్టింట్లో లభించే అవ్యాజమైన ఆత్మీయతానురాగాలు ఆడపిల్లలకి వెలకట్టలేని ఆభరణాలతో సమానం కాబోలు! దానిముందు ఎన్ని ఆస్తిపాస్తులున్నా దిగదుడుపే.

మా అందరికీ కొత్తబట్టలు తెచ్చింది అత్తయ్య. నాన్నకి మంచి వాచ్ బహుమతిగా ఇచ్చింది. ఆయనకి ఇప్పటికీ వాచ్ లేదు. కొనుక్కోమని అమ్మ ఎన్నోసార్లు పోరినా అశ్రద్ధ వలన కొనుక్కోలేదు.

కాని, చెల్లెలు అంత ప్రేమగా వాచ్ ప్రెజెంట్ చేసేసరికి నాన్న సంతోషసంద్రమే అయ్యారు. ఎంతో బాగుందని ఒకటికి పదిసార్లు చూసుకుని మురిసిపోయారు.

సాయంత్రం కాఫీలయ్యాక ఏదో విషయం గురించి మాట్లాడాలని అందరినీ రమ్మని పిలిచింది అత్తయ్య.

ఇంటిల్లిపాదీ పెరటివరండాలో సమావేశమయ్యాము. ఆవిడ మాట్లాడబోయే విషయం ఏమై ఉంటుందోనని అందరిలోనూ ఒకటే ఉత్కంఠ.

శీతాకాలం పొద్దు కావడంతో అయిదోగంటకే వాతావరణం చల్లగా అయిపోయింది. రివ్వున వీస్తూ, చాచికొడుతున్నట్లుగా తగులుతున్న చలిగాలి శరీరాలని వణికిస్తోంది.

ఆకాశంలో ఎగురుతూ తమతమ నెలవులకి సాగిపోతూ పక్షులు చేస్తున్న కలకూజితాలు, గాలిలో కలిసిపోయి నలుదెసలా వ్యాపిస్తున్న జాజిపూల సుగంధాలు, వాతావరణం... చాలా ఆహ్లాదంగా ఉంది.

"ఏమిటమ్మా సావిత్రీ... ఏదో మాట్లాడాలన్నావు?'' నాన్నే కదిపారు.

మా అందరివైపు ఓసారి చూసింది అత్తయ్య. ఆమె వాలకం చూస్తే దేనికో సంకోచిస్తోందనిపిస్తోంది.

"చెప్పమ్మా... జంకెందుకు?'' నాన్న ఆమెని ఉత్తేజ పరిచారు.

మరి...మరి... ముక్తని...నా కోడలిగా చేసుకోవాలని ఉందన్నయ్యా...''

చిన్నత్తయ్య మాటలకి నాన్న తీవ్రమైన సంభ్రమానికి గురయ్యారు.

అత్తయ్య అకస్మాత్తుగా ఊడిపడి, ఆ ప్రస్తావన తేవడం మా అందరికీ ఆశ్చర్య హేతువైంది. సుదీర్ఘమైన విరామానంతరం కలిసిన ఆమె ఈ ప్రపోజల్ పెట్టడం వింతకాక మరేమిటి!

నాన్న కేమనాలో తోచినట్లులేదు. మౌనంగా ఉండిపోయారు.


ఆయన సందిఘావస్థని అర్థం చేసుకున్నదానిలా చిరునవ్వు నవ్వి"

ఏంటన్నయ్యా...ఉన్నట్లుండి సావిత్రి ఇలాంటి కోరిక కోరిందేమిటా! అనుకుంటున్నావా!?'' అంది చిన్నత్తయ్య.

"అబ్బే... అదేమీ లేదమ్మా...'' తడబడ్డారు నాన్న.

"నీకు ఆశ్చర్యం కలగడంలో అర్థం లేకపోలేదులే అన్నయ్యా... సడన్ గా ఇన్నేళ్ళ తరువాత వచ్చి నేనీ ప్రసక్తి తెస్తే మీకు వింతగానే ఉంటుంది. కాని, ఆలస్యం అమృతం విషం అన్నారు కదా! మొన్న నవ్య పెళ్లిలో ముక్తను చూసిన దగ్గరనుంచీ నాకు చాలా ఆరాటంగా ఉంది. మీ బావగారికి కూడా ముక్త తెగ నచ్చేసింది.

ఇక నా కొడుకు ఎలా ఉంటాడో, ఎలాంటి వాడో నన్న సందేహం మీకుంటే కనక... అవన్నీ తీసి పక్కన పెట్టేయండి. మీకటువంటి భయాలే అక్కరలేదు. నా కొడుకు మేలిమి బంగారం. ఏ ఒక్క చెడు అలవాటూ లేని సుగుణాల రాశి. ఇక మనిషంటావా! అచ్చం నాలాగానే ఉంటాడు.'' సుదీర్ఘంగా చెప్పేసి, ' ఇంకా ఏమన్నా డౌట్స్ ఉంటే అడుక్కోండి.' అన్నట్లు ముఖం పెట్టింది అత్తయ్య.




తన పెంపకంమీద ఎనలేని నమ్మకం ఉన్నట్లుగా అనిపించింది ఆవిడ మాటలు వింటే. అసలా మాటకొస్తే ప్రతి తల్లికీ తన కొడుకు మంచివాడిలాగానే అనిపిస్తాడు...వాడు ఎంత దుర్గుణాల పుట్టైనా సరే.

అమ్మ, బామ్మ అపనమ్మకంగా చూస్తున్నారు. దివి నుంచి భువికి దిగివచ్చి, అడగకుండానే వరాలు ప్రసాదించే దేవతను చూస్తున్నంత భక్తిభావన వారి చూపులలో.

కాస్సేపు తీవ్ర యోచనలో కొట్టుమిట్టాడాక ఒక నిర్ణయానికి వచ్చినట్లుగా నిట్టూర్చారు నాన్న.

"ముక్తని నీ కొడుక్కిచ్చి పెళ్ళి చేయడానికి నాకేమీ అభ్యంతరం లేదమ్మా... కాకపోతే వాడికి ఇష్టముందో లేదో తెలుసుకోకుండా..'' అర్ధోక్తిలో ఆగారు నాన్న.

ఆయన మాటలు అంగీకార సూచకాలై ధ్వనించాయో ఏమో..." రోహిత్ నా మాట జవదాటడన్నయ్యా... నేనెంత చెబితే అంత.'' అంది చిన్నత్తయ్య గర్వంగా.

"మంచిదమ్మా... నీకు, శేఖరానికీ కూడా ఇష్టమైతే ఇక అడ్డేముంది''

" అసలు ముక్తని చూసి నాకన్నా ఆయనే ఎక్కువగా సంబరపడ్డారన్నయ్యా... ఆయన అంగీకారం తెలిపాకే నేను నిన్ను అడగడానికి వచ్చాను.'' నన్ను దగ్గరగా పొదివి పట్టుకుని, నా నుదురు ముద్దాడింది అత్తయ్య.

" నేను ఈ సంబంధం కలుపుకోవాలనుకోవడానికి ఇంకో కారణం కూడా ఉంది అన్నయ్యా...''

"ఇంకో కారణమా! '' నాన్న- అమ్మ, బామ్మ ముక్తకంఠంతో అడిగారు అయోమయంగా చూస్తూ.

వారి కంగారును గమనించిన అత్తయ్య పెదవులు చిరునవ్వుతో విచ్చుకున్నాయి.

"ఎప్పుడో... నా కారణంగా తెగిపోయిన మన బాంధవ్యాన్ని...ముక్తని కోడలిగా చేసుకోవడం ద్వారా తిరిగి కలుపుకోవాలన్న స్వార్ధం తో ఇలా అడుగుతున్నాను అన్నయ్యా... ఒక విధంగా ముక్త మన రెండు కుటుంబాల మధ్యన వారధి అనుకో...'' చెప్పింది చిన్నత్తయ్య.

నాన్న నవ్వారు ఆనందంగా. అమ్మ- బామ్మల ముఖాలు ఆనందంతో దేదీప్యమానంగా వెలిగిపోయాయి. ఈ లోకంలో మనుషుల నడుమగల బంధుత్వాలు, సంబంధాలు పటిష్టంగా మారాలంటే ఎంతో కృషి, సహనం, సంయమనం కావాలి. ఎన్నో ఏళ్ల సాహచర్యం మాత్రమే ఆ బంధాలను దృఢపరచగలదు. అప్పుడే అవి ఫెవికాల్ బంధాలై వర్ధిల్లుతాయి.

ఎంతో పెద్దదైన దూదికుప్ప క్షణాల్లో త్గగలబడడానికి ఒకేఒక్క నిప్పురవ్వ చాలును. ఎంతో శ్రమించి అల్లుకున్న పూపొదరిల్లు కూలిపోయి చెదిరిపోవడానికి ఒక్క పెనుతుఫాను చాలును.

అలాగే... ఎన్నో ఏళ్లుగా పెనవేసుకుపోయిన బంధాలు పుటుక్కున తెగిపోవడానికి మనసుని బాధపెట్టే ఒక్క చిన్న చాలును. కేవలం ఒక్క చిన్నికారణం రక్తసంబంధీకుల మధ్యన అగాధాలు సృష్టించగలదు. అంతరాలు పెంచగలదు.

మా విషయంలో జరిగినదదే. ఒకసారి తెగిపోయిన బంధాలను తిరిగి ఏర్పరచుకోవడం అంత సులువైన వ్యవహారం కాదు. ఆ బంధం తిరిగి అతుక్కోవడానికి కాలం కలిసిరావాలి...దైవం సహాయపడాలి. అప్పుడే ఆబంధం తిరిగి అతుక్కుంటుంది.

నన్ను వారధిగా చేసుకుని చిన్నత్తయ్య అప్పుడెప్పుడో తాను కోల్పోయిన పుట్టింటి మమతానురాగాలని తిరిగి పొందాలని అనుకుంది. కాని,దాని ద్వారా తన పుట్టింటితో తనకు గల అనుబంధాన్ని శాశ్వతంగా పోగొట్టుకుంటుందని ఎంత మాత్రం ఊహించి ఉండదు ఆక్షణం.

ఆవిడ అలా ఊహిస్తే... ఈ కథ ఇంత దూరం వచ్చి ఉండేదేకాదు.

"ఇంతకీ ముక్తకి ఇష్టం ఉందో, లేదో కనుక్కున్నారా?''

వయసులో పెద్దదైన బామ్మకి నా అభిప్రాయం కనుక్కోవాలన్న ఆలోచన వచ్చినందుకు చాలా సంతోషించాను. అదే సమయంలో... ఇంకెవరికీ రానందుకు చింతించాను కూడా.

అయితే... నాన్న ఎవరిని తెస్తే వారినే పెళ్లాడాలన్న నిర్ణయానికి నేనెప్పుడో వచ్చేశాను కనుక... ఈ విషయంలో అభ్యంతరం చెప్పడానికేమీ లేక తల వంచుకుని లోపలికి వెళ్ళిపోయాను.

"అబ్బో! ఇదంతా సిగ్గే?'' అంది అత్తయ్య నవ్వుతూ.

నాన్న మీసాలు దువ్వారు' నీ పెంపకం మీద నీకెంత నమ్మకమో... నాకూ అంతే ఉంది.' అన్నట్లుగా.

అందరి వదనాలు వికసిత జలజాల్లా వింతకళతో విరాజిల్లాయి. నిశ్చితార్థానికి ముహూర్తం చూపించమని నాన్నకి పురమాయించింది అత్తయ్య.

"ఇన్నేళ్ళుగా నా బుర్ర అప్పడంలా నమిలేసి, నన్నల్లరి పెట్టావు. ఇప్పుడు చూడు... నీ పాల పడడానికి మరొక బకరా దొరుకుతున్నాడు... ఓ గాడ్... సేవ్ హిమ్...'' ఆకాశంలోకి చూస్తూ ప్రార్థించాడు దినేష్.

వాడి వేళాకోళానికి నేను మనసారా నవ్వేశాను. ఎందుకో... ఆక్షణం వాడిమీద కోపం రాలేదసలు. ఆ మరునాడు ఉదయాన్నే నాన్న పంతులుగారి దగ్గరకెళ్ళి ముహూర్తం పెట్టించుకొచ్చారు.

నిశ్చితార్థానికింకా పదిరోజుల సమయముందని అత్తయ్య ఆ సాయంత్రమే బయలుదేరి వెళ్ళిపోయింది.

ఆ రోజునుండీ... నా కలల నిండా నాకు ఎంతమాత్రం పరిచయంలేని బావే కదిలాడు. ఇంతకీ బావ ఎలా ఉంటాడు!?

బావకంతా తన పోలికేనంది అత్తయ్య. అంటే... అత్తయ్యంత అందంగా ఉంటాడా?

నా ఆత్రానికి నాకే నవ్వొచ్చింది. తినబోతూ రుచెందుకు? నిశ్చితార్థం నాడు బావనెలాగూ చూడబోతున్నానుగా!

అయినా... ఈ మనసుకెందుకో అంత తొందర! ఆగడాల మనసు... ఆగనంటూంది. బావ గురించిన ఊహలతో నిద్ర కూడా పట్టడంలేదు. భవిష్యత్తులో నాకు నిద్ర కంకా కరువైపోతుందని తెలియక... అసలు నిద్రపోయే ప్రయత్నం కూడా చేయలేదు.

--------------- ------------------------- ----------------------

"ఉభయులూ తాంబూలాలు మార్చుకోండి...'' నాన్నకి- మామయ్యకి చెప్పారు పంతులుగారు.

నిశ్చితార్థం జరిగిపోయింది. పెళ్ళిముహూర్తం కూడా పెట్టేస్తున్నారు.


అయితే... ఆ ప్రదానానికి ఎంతో ముఖ్యమైన, తప్పని సరిగా రావాల్సిన అసలువ్యక్తి...బావ మాత్రం రాలేదు.

వినసొంపుగా...చక్కగా సాగిపోతున్న రాగాలాపనలో ధ్వనించిన అపశ్రుతిలా అనిపించింది నాకీ సంగతి.

జీవితంలో అతి ప్రాముఖ్యతని సంతరించుకునే ఘట్టం వివాహం. దానికి నాందిగా జరిగే ప్రదానానికి కూడా బావ రాలేదంటే ఏమనుకోవాలి!

నా మనసెందుకో కలుక్కుమంది.

"ఆఫీసులో పని ఎక్కువగా ఉందటన్నయ్యా...వాళ్ళ మానేజర్ సెలవిచ్చేది లేదని చెప్పేశాడట...'' అత్తయ్య సంజాయిషీ నాన్నని సంతృప్తి పరచలేదని ఆయన ముఖ కవళికలే చెబుతున్నాయి.




"రేపొద్దున్న పెళ్లి వేళకైనా వస్తాడా? పూర్వం క్షత్రియులలో కత్తికి బాసికం కట్టేవారట... నీ కొడుకు అక్కడే ఏ కత్తికైనా తాళి కట్టేస్తాడా?'' మేలమాడింది అమ్మ.

" అదేం మాటొదినా...ఎంత ప్రయత్నించినా సెలవు దొరకలేదు. అయినా నిశ్చయ తాంబూలాలు పుచ్చుకోవలసింది పెద్దలేగా!'' నొచ్చుకుంది అత్తయ్య.

నాకు మాత్రం ఎనలేని నిరాశగా అనిపించింది. రెండువైపుల వాళ్ళూ తాంబూలాలు మార్చుకున్నారు.

అత్తయ్య నాకు రాణీ కలర్ ప్యూర్ సిల్క్ చీర,మామిడిపిందెల నెక్లెస్, అందె ఉంగరం తెచ్చింది. వాటిని నాకలంకరించి, నా బుగ్గలు పుణికి ముద్దాడి, మురిసిపోయింది అమితంగా.

"నీకోసం... ఓ స్పెషల్ గిఫ్ట్...'' అంటూ ఎవరూ చూడకుండా నా చేతికో కవర్ ఇచ్చింది.

దాన్ని చీరచెంగు మాటున దాచేసి, గదిలోకి పరుగెత్తి మంచం మీద వెల్లకిలా పడుకుని కవర్ లో ఉన్న బావ ఫోటోని బయటకు తీశాను.

ని...జం...గానే బావ చాలా అందంగా ఉన్నాడు. తుమ్మెదరెక్కలని అవహేళన చేసేంత నల్లటి ఉంగరాల జుట్టు, పచ్చని పసిమిఛాయ, తీరైన ముఖ కవళికలు...ఆ వయసులో ఉండేటప్పుడు నాన్న ఇలాగే ఉండి ఉంటారనిపించింది.

నా మది పరవళ్ళు తొక్కే నదీప్రవాహంలా తుళ్ళిపడింది. ప్రవాహంలో కొట్టుకుపోయే చెత్త-చెదారంలా నా మదిలో ఉద్భవించిన శంకలు, సందేహాలు, అన్నీ బావ సుందరరూపం చూడగానే ఏర్పడిన ఆనందవాహినిలో కొట్టుకుపోయాయి.

నా పెళ్లి విషయంలో నా పెద్దలదే తుదినిర్ణయం కావాలని నేననుకోవడం వలన నాకు మంచే జరిగిందనిపించింది.

బావలాంటి అందగాడు, మంచి హోదాలో ఉన్నవాడు నన్ను వెతుక్కుని మరీ వచ్చి నా మెడలో వరమాల వేయాలనుకోవడం నేనీ జన్మలో పొందుతానని అనుకోలేని అదృష్టంగా భావించాను.

మా పెళ్ళికి ఇంకా న...ల...భై... రోజులుంది. అంతవరకూ ఎలా నిరీక్షించాలో మరి!

" ఇంకెన్నాళ్లు డియర్... మనిద్దరం కలిసి పెళ్ళిపల్లకీలో ఊరేగే శుభతరుణం దగ్గరలోనే ఉంది.'' ఫోటో లో ఉన్న బావ కొంటెగా చూస్తూ అన్నట్లనిపించింది.

పరవశంగా ఫోటోని నా గుండెలకి హత్తుకున్నాను.

------------------------

------------------ ------------------

అనుకున్నట్లుగానే పెళ్ళికి అన్ని ఏర్పాట్లూ చకచక సాగిపోతున్నాయి. చిన్నక్కని నా పెళ్ళికి ఆహ్వానించాలని బలంగా అనిపించింది నాకు.

కాని, నాన్న మనసు బాధపడుతుందని వెనుకంజ వేశాను.

పల్లెలో మాకు మిగిలిన రెండెకరాల పొలాన్ని బేరం పెట్టారు నాన్న. నాకు చాలా బాధనిపించింది. నా పెళ్ళి చేయడం కోసమని ఆయన ఉన్న అతి కొద్ది స్థిరాస్తిని పోగొట్టుకోవడం నన్నెంతో వేదనకి గురిచేసింది.

నాన్నే నన్ను ఊరడించారు. " అమ్మా ముక్తా... కడుపున పుట్టిన కూతురికి పెళ్ళిచేసి, ఆమె అచ్చట-ముచ్చట తీర్చడం తండ్రిగా నా బాధ్యత. నీ పెళ్ళై నువ్వు అత్తవారింటికి వెళ్ళాక నేను నా బాధ్యతల నుంచి విముక్తుడనౌతాను. ఇంకా నా రెక్కల్లో సత్తువుంది. ఈ లోపు తమ్ముడు ప్రయోజకుడైతే నన్ను, అమ్మని సుఖపెడతాడు.'' అన్నారు గద్గదమైన స్వరంతో.

'ఆడపిల్ల పుట్టిందా!' అంటూ పెద్దవాళ్ళు పెదవి విరిచేదిందుకేనేమో! పుట్టింది మొదలు మట్టిలో కలిసిపోయే వరకు ఆడదానికి ఎన్నో అవసరాలు.

మెడలో మాంగల్యం పడబోయే ముందు నేనిలా వేదాంత ధోరణిలో కూరుకుపోవడం నాకే నవ్వు తెప్పిస్తోంది.

పెళ్ళికి కావలసిన బట్టలు, నగలు అన్నీ కొనేశారు. ' నాకు కావలసిన నగలన్నీ తానే పెడతానని, పుట్టింటివారిగా మీకేమైనా ముచ్చట్లుంటే తీర్చుకోమని' అమ్మతో చెప్పింది అత్తయ్య.

మూడు కాసులతో సూత్రాల గొలుసు, ఓ జత గాజులు చేయించారు నాన్న. పనిలో పని అమ్మకి కూడా నానుతాడు చేయించమని శతపోరు పెట్టి మరీ సాధించింది బామ్మ.

మెడలో కొత్తగా అమరిన హంగుతో ఎంతో విలక్షణంగా ఉంది అమ్మ. ఇంత సంబరం జరుగుతున్నా నన్నో సందేహం పట్టి పీడించడం మాత్రం మానలేదు.

ఇంతవరకూ బావ నన్ను చూడాలని కాని, నాతో మాట్లాడాలని కాని, ప్రయత్నించలేదు. కనీసం ఫోన్ లో కూడా కాంటాక్ట్ లో లేడు. పక్కింటి పరంజ్యోతి వాళ్ళక్కకి పెళ్ళి కుదిరింది మొదలు... ఆమెకి కాబోయేవాడు ఫోన్లమీద ఫోన్లు చేసి ఊదరగొట్టేసే వాడు. తెల్లారి లేచి ఏదో ఒక మిష పెట్టుకుని తనని చూడడానికి పరుగెత్తుకు వచ్చేసేవాడు.

పెళ్ళయ్యేంతవరకూ కూడా ఆమెను అంటిపెట్టుకు తిరిగే అవకాశం కోసం గోతికాడ నక్కలా కాచుక్కూచునే వాడు. అలాంటిది... నాకు- బావకి నిశ్చితార్థం జరిగి నెలపైనే కావస్తోంది. పెళ్ళిముహూర్తమూ పెట్టేశారు. అయినా సరే... అతడు నాకోసం తపించకపోవడం నాకు వింతగా


అనిపిస్తోంది.

ఎన్నో రకాల సందేహాలు మదిని చెద పురుగుల్లా కొరికిపోస్తున్నా... చీరలు నాక్కావలసిన వస్తువులు అమర్చుకునే సందడిలో ఆ సందేహాలని తాత్కాలికంగా పక్కకి నెట్టేశాను.

పెళ్ళి దగ్గరపడింది.బంధువులందరూ వచ్చారు. చిన్నక్క నాకు యాభైవేల రూపాయలకి చెక్ పంపింది పెళ్లికానుకగా ఏదన్నా కొనుక్కోమని.

దాన్ని నా అకౌంట్ లో వేసుకున్నాను.

ఆ నాలుగురోజులూ అమ్మలక్కలందరూ కలిసి నలుగు పేరిట నా ఒళ్ళు హూనం చేసి పారేశారు. ఒంటి మెరుపు మాటేమో గాని, వాళ్ళు చేసిన మసాజ్ పుణ్యమా అని ఒళ్ళు తెలియని నిద్ర పట్టేసింది.




పెద్దక్క కూతురు హారతి నా చేతులకి, పాదాలకి గోరింటాకు తీర్చిదిద్దింది.

పెళ్ళికి ముందురోజు నన్ను పెళ్ళికూతురిని చేశారు.తలంటుకున్న జుట్టూ, నువ్వా-నేనా అని నా ఒంటిరంగుతో పోటీ పడుతున్నట్లుగా పూసుకున్న పసుపు, వదులుగా అల్లిన జడలో తురిమిన కదంబమాల, కోలకళ్లకి తీర్చిదిద్దిన కాటుకరేఖలు, నుదుట కళ్యాణ తిలకం, మెడలో ముత్యాలు-పగడాలతో కలిపి చేసిన అక్క నెక్లెస్, నా ఒంటిని చుట్టుకున్నానన్న గర్వంతో మిడిసిపడుతూ, మెరిసిపోతున్న ఆరెంజ్ కలర్ పట్టుచీర...

అద్దంలో కనబడుతున్న నా ప్రతిబింబం నాకే ముద్దొచ్చింది. ఇంత అందాన్ని ముడుపు గట్టి ఎవరో ముక్కు,మొహం తెలియని మగాడికి అప్పగించాలా!

అంతలోనే నా మనసు నన్ను గదిమింది' ముక్కుమొహం తెలియక పోవడమేమిటే...నీకు వరసైన వాడేగా!. నీ సొగసుల ఖజానాని అతడికేగా సమర్పించవల్సిందీ... నీ సౌందర్య

సామ్రాజ్యాన్ని ఏకఛత్రాధిపత్యంగా ఏలే వేలుపు అతడేగా!

'నువ్వూరుకోవే పిచ్చి మనసా! ఎంత వరసైన వాడైనా పరిచయం లేని వ్యక్తేగా!?'

అద్దంలో కనబడుతున్న నా ప్రతిబింబంతో మాట్లాడుకుంటూ నాలో నేనే మురిసిపోతూండగా...

"అబ్బ! ఎంత ముద్దొస్తున్నావే ముక్తా... మావాడు చూస్తేనా! మరి ఒక్క క్షణం కూడా ఆగడు.'' పెద్దత్తయ్య అంది నా బుగ్గ గిల్లుతూ.

ఏమూలో దాక్కున్న సిగ్గు నేనున్నానంటూ, వచ్చేసి ఒళ్లంతా పాకి గిలిగింతలు పెట్టింది. కర్ణుడికి కవచకుండల్లాగా ఆడపిల్లలకి సిగ్గు సహజాభరణమేమో!

అసలు... నన్ను చూడగానే బావ ఎలా స్పందిస్తాడు! నవలలలో, కథల్లో వర్ణించినట్లుగా అతడి కళ్లు నక్షత్రాలా మెరుస్తాయా? నన్ను చూడగానే చిలిపిగా నవ్వుతూ, కొంటెగా కన్ను గీటుతాడా!

ఏవేవో ఊహాగానాలు నన్ను భూమ్మీద నిలవనీయడం లేదు. మనసు , తనువు కూడా గాల్లో తేలిపోతున్నట్లుగా ఉన్నాయి.

అయినా... ఈ నిరీక్షణ ఎంత సేపు! ఈ సాయంత్రానికే కరిగిపోదూ!

సాయంత్రం ఎప్పుడౌతుందా అని... కళ్లలో వత్తులు వేసుకుని ఎదురుచూశాను. ఇంట్లో ఉన్న అందరిదీ ఒకరకం హడావుడైతే... నా మనసు చేస్తున్న హడావుడి ఇంకో రకం.

నేనెంతగానో ఎదురుచూస్తున్న సాయంత్రం రానే వచ్చింది.

"పార్వతీ... వాళ్లొచ్చే వేళైంది. ఎదురుకోలు సన్నాహానికి అన్నీ సిద్ధం చేశావా?'' ఆదుర్దా పడుతోంది అమ్మ.

ఎంత ఆడపడుచు కొడుకైనా...వియ్యాలవారికి ఏలోటూ రాకుండా చూసుకోవాలన్న తాపత్రయం ఆవిడది.

అత్తయ్య వాళ్ళు పానకం బిందెలు, బుక్క-బలగుండ, పన్నీరుబుడ్డి, పూలదండలు అన్నీ సిద్ధం చేశారు.

ఇంతలో తమ్ముడు పరుగెత్తుకుని వచ్చి" అమ్మా...పెళ్ళివారొచ్చేశారు.'' అన్నాడు ఆయాసపడుతూ.

వీధివైపునున్న కిటికీలోనుంచి తొంగి చూశాను. సందు మలుపు తిరుగుతూ కనిపించింది అత్తయ్య వాళ్ళొస్తున్న క్వాలిస్.

అమ్మవాళ్ళు మంగళ వాయిద్యాలతో ఎదురెళ్ళారు. మా ఎదురింటినే విడిదిగా ఇవ్వడంతో క్వాలిస్ వచ్చి మా ఇంటికెదురుగా ఆగింది.

కారులోనుంచి ముందు అత్తయ్య దిగింది. ఆమె వెనుకాతలే మామయ్య, ఇంకా ఎవరెవరో దిగారు. బావ దిగగానే చూడాలన్న ఆత్రంతో కిటికీ దగ్గర మునివేళ్ళ మీద నిలబడి ఎగిరెగిరి చూశాను.

అందరూ చుట్టుముట్టేయడం నుంచి బావ తల తప్ప మరేమీ కనిపించడంలేదు.

ఛీ... వీళ్ళకి బొత్తిగా మానర్స్ లేదు.అలా ఊపిరాడకుండా మొహరించేస్తే ఎలా? పాపం బావ...ఎంతగా ఇబ్బంది పడుతున్నాడో కదా!

“ఒసేయ్ ముక్తా... తొందరెందుకే...రేపు పెళ్లి పీటల మీద చూస్తావుగా మీ బావని’’ వెనక నుంచి బామ్మ కేకేయగానే లోపలికి తుర్రుమన్నాను.

పెళ్ళి ముహూర్తం వరకు వధూవరులు ఒకరినొకరు చూసుకోకూడదట... బామ్మ చెప్పింది.

ఎంతకీ తెల్లారని రాతిరిని తిట్టుకుంటూ గడిపేశాను. చీకటితోనే నన్ను నిద్రలేపి తలంటి, ముస్తాబు చేశారు. గదిలోకి లాక్కెళ్ళి పడేసి “ పెళ్ళికూతురు స్నాతకం చూడకూడదు. పొరబాటున కూడా గదిలోనుంచి బయటకు రాకు...’’ అంటూ దివ్యను నాకు కాపలా పెట్టేసి చక్కాపోయారు.

ఎందుకో.... మనసులో ఏదో తెలియని ఉద్విగ్నత. పెళ్ళంటే ప్రతి ఆడపిల్ల మనసూ... ఇలాగే అల్లకల్లోలంగా ఉంటుందా! ఎన్నాళ్ళుగానో ఒకేచోట పాతుకుపోయిన మొక్కను పెకిలించి తీసుకెళ్ళి ఇంకో చోట నాటితే, అది ఆ కొత్త చోట వేళ్ళూనుకోవడానికి ఎంత సమయం పడుతుంది! అసలలా స్థానచలనం జరిగితే అది బతికి బట్ట కడుతుందా!

ఆడపిల్లా అంతే... పుట్టిన దగ్గరనుంచీ అలవాటైన పరిసరాలని విడిచిపెట్టి వేరే ఇంట్లో తన అస్తిత్వాన్ని నిలుపుకునేందుకు ఆమె ఎంతగా శ్రమించాలో!

ఆ ప్రయత్నంలో ఆమె మనుగడే ప్రశ్నార్ధకమైతే!?

అర్థం పర్థం లేని ఆలోచనలు వేధిస్తున్నాయి గుబులు నిండిన నా మనసుని.

ఆ రాత్రికే ముహూర్తం కాబట్టీ, భోజనాలైనాక నాకు మళ్ళీ మంగళాస్నానం చేయించి, అలంకరణ ప్రారంభించారు.

నేను తయారవ్వగానే పంతులుగారు గౌరీ పూజ చేయించారు.

బజారంతా గాలించి మరీతెచ్చుకున్న ఎర్రని పట్టుచీర- జాకెట్ కట్టుకుని, చేతులనిండా ఎర్రని పెట్టెగాజులతో పాటు నాన్న చేయించిన బంగారు గాజులు వేసుకుని, జాజిపూల జడతో, బుగ్గన కాటుక చుక్కతో, నుదుట కల్యాణ తిలకం దిద్దుకుని, చేతిలో కొబ్బరిబోండాంతో, మనసులో శతకోటి ఆశలతో కల్యాణ వేదికపైకి అడుగుపెట్టాను.

ఇంటిముందున్న ఖాళీ జాగాలోనే పందిరి వేసి వేదికను నిర్మించారు. నాకు మేనమామలు లేకపోవడం నుంచి మామయ్య వరసయ్యేవాళ్ళందరూ కలిసి నన్ను బుట్టలో కూర్చోబెట్టి పెళ్లి పందిరిలోకి తీసుకొచ్చారు.

బంధువుల ఛలోక్తులు, కేరింతలు... అన్నింటి మధ్యనా, అవ్యక్తానుభూతి ఏదో మదినిండగా అతడికెదురుగా పీటమీద కూర్చున్నాను .

చిన్నక్క కొని ఇచ్చిన నీలం పట్టుచీర, మెడలో కొత్త నానుతాడుతో అమ్మ కుందనపుబొమ్మలా ఉంది. పక్కనే పట్టుపంచే- ధోవతి లో నాన్న వెలిగిపోతున్నారు.

పురోహితుడు పెళ్ళి మంత్రాలు చదువుతున్నాడు. సుముహూర్తం సమీపించింది. మా ఇద్దరి చేతుల్లో ఉన్న జీలకర్ర –బెల్లాన్ని ఒకరి తలమీద ఒకరం ఉంచుకున్నాం.

మా నడుమ ఉన్న తెరసెల్లా తొలగిపోయింది. సిగ్గు-బిడియాల తాకిడికి కనురెప్పలు భారంగా వాలిపోతూండగా... అతికష్టం మీద మెల్లగా కళ్ళెత్తి బావను చూశాను.

అంతే...నా గుండె లయతప్పింది.

ఎదురుగా బావ...నేనిన్నాళ్ళుగా చూడాలని ఎంతగానో తపించిన నా ప్రాణ నాధుడు.అతడు జగన్మోహనాకారుడు.నారీజన హృదయాలను అమాంతం కొల్లగొట్టే సుందరుడు.


నాలాగే బావ కూడా నాకేసి దొంగచూపులు చూస్తూ ఉంటాడని అనుకున్నాను. కాని, బావ తలవంచుకుని కూర్చున్నాడు. అతడి ముఖంలో కదలాడే భావాలు నాకు తెలియడంలేదు. ఆ తరువాత కూడా నన్ను తాకితే ఎక్కడ మైల పడిపోతాడో... అన్నట్లుగా కూర్చున్నాడు.

పెళ్ళికూతురు తనా? నేనా! సందేహం కలిగింది.

వఠ్ఠి పప్పుసుద్ధ! అసలు పీటల మీద కూర్చున్న పెళ్ళికొడుకెలా ఉంటాడో నేను చాలా సినిమాల్లో చూశాను. పుస్తకాలలో కూడా చదివాను.

ఏ కాస్త సందు దొరికినా వధువువైపు ఓరచూపులు చూస్తాడని, అవకాశమొస్తే చాలు ఆమెను తాకడానికి తహతహలాడతాడని నేనంతగానో విని ఉన్నాను.

కాని, బావేమిటీ...ఇలా బుద్ధావతారంలా?




మా ఫ్రెండ్ సుబ్బలక్ష్మి పెళ్ళికి వెళ్ళినప్పుడు ఆమె భర్త వాలకం చూసి మొద్దబ్బాయిలా ఉన్నాడంటూ మేము తెగ ఏడిపించేశాము. ఆ తరువాత సుబ్బలక్ష్మి చెప్పింది... అతడు చూపులకి మాత్రమే మొద్దబ్బాయి... చేతల్లో యమా ఫాస్టనీ.

బావకూడా అంతేనా! దొరికిపోతే అందరూ ఆటపట్టిస్తారేమోనన్న భయంతోనే నాకు దూరంగా మసలుకుంటున్నాడా?

ఇలా 'బుద్ధావతారం'లా కనిపించి, ఆ పైన కవ్వించి, మా తొలిరాత్రి నాడు విజృంభిస్తాడా?

ఆ ఊహకే ఒళ్ళు ఝల్లుమంది. నేనిలా ఆలోచనల్ దొంతరల నడుమ ఉక్కిరిబిక్కిరి అవుతూండగానే బావ నా మెడలో మూడుముళ్ళూ వేసేశాడు.

అలా... నా పెళ్ళి అత్యంత నాటకీయమైన పరిస్థితులలో జరిగిపోయింది.

--------------------- -------------------------- ---------------------------

"ఏమిటమ్మా... సావిత్రీ... నువ్వనేది?" నాన్న అడిగారు కాస్త అయోమయంగా.

"అవునన్నయ్యా... వెంటనే రమ్మనమని ఆఫీసునుంచి ఫోన్ వచ్చింది. అందుకే వాడు హడావుడిగా బయలుదేరాడు.'' సంజాయిషీ చెప్పుకున్నట్లుగా అంది చిన్నత్తయ్య.

పెళ్ళికి ముందు ఆమె స్వరంలో చిందులేసిన ఉత్సాహం ఇప్పుడు చప్పబడినట్లనిపించింది.

"పెళ్లవ్వగానే ముక్తను మీ ఇంత గృహప్రవేశం చేయించి, అక్కడ సత్యనారాయణ వ్రతం, శుభకార్యం వగైరాలన్నీ జరిపించాక, మళ్ళీ మా ఇంటికి తీసుకొచ్చి, ఇక్కడకూడా ఆమూడునిద్రల తతంగం అయిందనిపించాక ముక్తను కాపురానికి దిగబెడదామనుకున్నాం కదమ్మా...'' అనుకున్న కార్యక్రమంలో మళ్ళీ ఈ మార్పేమిటో అర్థంకాని నాన్న వదనం వెలవెలబోయింది.

"నిజమే అన్నయ్యా... అందరం అలానే ప్లాన్ చేసుకున్నాం.కాని, ఉన్నట్లుండి రమ్మనమని వాళ్ళ మానేజర్ ఫోన్ చేశాడు మరి! వెళ్ళకపోతే వాడి ఉద్యోగానికే ఎసరొచ్చే ప్రమాదంఉంది. అసలే... రెసిషన్ పిరియడ్ కూడానూ!'' చెప్పింది అత్తయ్య.

ఆ సాఫ్ట్‌వేర్ రంగం గురించి అసలేమీ తెలియని నాన్న తెల్లముఖం వేశారు చెల్లెలి మాటలకి.

" మరో పదిరోజులలో భాద్రపదమాసం వచ్చేస్తోంది. అంత ఆదరాబాదరా మనం అన్నీ జరిపించుకోవలసిన అవసరం ఏముంది? చక్కగా ఆశ్వయుజ మాసం రాగానే అనుకున్న ప్రకారం కార్యక్రమాలన్నీ జరిపించుకుందాం. ఈ లోపు రోహిత్ సెలవు పక్కాగా ఏర్పాటు చేసుకుంటాడు.'' అత్తయ్యే అంది మళ్ళీ.

ఈ విషయంలో అన్నీ అత్తయ్యే మాట్లాడుతోంది గాని, మామయ్య గాని, బావ కానీ, నోరు మెదపడంలేదు.

నాన్న నిస్సహాయంగా చూశారున్ అమ్మవైపు. అమ్మ ముఖం కూడా వాడిపోయింది.

బామ్మ మనవడి వైపు కొరకొరా చూసింది." అవునొరేయ్ ...మీ మానేజర్ కి ఇల్లు-పెళ్ళి , పెళ్ళాం-పిల్లలు వగైరాలేమీ లేవట్రా?అలా ఫోన్లు చేసేస్తున్నాడూ... అయినా నాకు తెలియకడుగుతాను...పెళ్ళికి ఇన్ని రోజుల సెలవు కావాలని ముందే అడుక్కోరట్రా!?'' దులిపేసింది.

బావ ఆమె వైపు చిరాగ్గా చూశాడు. అసలే... అతడికి మేమందరం కొత్త. ఉన్న కొద్దిపాటి పరిచయానికి తనని పట్టుకుని ఝాడించేస్తోంది... ఈముసల్ది అనుకుంటున్నాడేమో!

"మనం సడన్ గా ముహూర్తాలు పెట్టుకున్నాం కదమ్మా... ఆ ప్రోజెక్ట్ లేవో ముందునుంచీ ప్లాన్ చేసుకున్నవి. అసలు పెళ్ళికే సెలవిచ్చేది లేదని మానేజర్ భీష్మించుకుని కూర్చుంటే...ఈయన వెళ్ళి కాళ్ళ-వేళ్ళ పడి ఒప్పించుకొచ్చారు.అయినా ... అన్నీ మనం అనుకున్నట్లే జరుగుతాయా ఏమిటి!?'' సమర్థించుకొచ్చింది చిన్నత్తయ్య.

బావేమన్నా మూగవాడా! అన్నింటికీ ఈవిడే సమాధానం చెబుతోంది. లేకపోతే... అతడింకా తల్లి చాటు బిడ్డేనా!?

ఎంత తల్లిచాటు పిల్లాడైనా... తన జీవితం గురించిన చర్చ జరుగుతున్నప్పుడు కూడా... అలా బెల్లం కొట్టినరాయిలా...ఉలకక-పలకక నిలబడతాడేమిటి?

నాన్న అలా నిస్త్రాణంగా కుర్చీకి చారబడిపోయారు. అనుకున్నది అనుకున్నట్లుగా జరిగితే

ఎవరికైనా సంతోషంగా ఉంటుంది.ఇలా అనుకోని అవాంతరాలెదురైతే మాత్రం ఆశాభంగం కలుగుతుంది.

"నెలరోజుల కాలం ఎంతలో తిరగాలి బావగారూ...అంతా సవ్యంగానే జరుగుతుంది. మీరు అనవసరంగా బెంగపడకండీ.'' అనునయించారు మామయ్య.

నాన్న ముఖంలోకి కాస్త వెలుగొచ్చింది. చేసేదేం లేనట్లుగా వాళ్ళని సాగనంపారు.

వెళ్తున్నప్పుడు బావ నావైపు చూశాడు తొలిసారిగా. ఆ చూపుల్లో నా పట్ల ప్రేమ కనబడలేదు. ఆత్రం అంతకన్నా లేదు. ఎవరో... అపరిచిత వ్యక్తిని చూస్తున్నట్లుగా నిర్లిప్తంగా, అభావంగా... గతంలో నాకు- అతడికి పరిచయం లేనిమాట వాస్తవమే అయినా... ఇప్పుడు నేనతడికి అర్ధాంగిని. అతడి జీవితంలో పాలు పంచుకోబోతున్న సహధర్మచారిణిని.

అటువంటి భార్యతో జరపబోయే ముద్దుముచ్చట్లకి ఆటంకం ఏర్పడబోతున్న బాధగాని, నిరాశ గాని అతడి ముఖంలో మచ్చుకైనా కనబడలేదు నాకు.అది నా చిత్తభ్రమా! లేకా...

అటుపైన ఆలోచించలేకపోయాను. వాళ్ళ కారు వెళ్ళేదాకా చూసి లోపలికి నడిచాం అందరం. కనీసం బావ నా ఫోన్ నంబరైనా అడిగి తీసుకోలేదని, మనసుకేదో వెలితిగా అనిపించింది.

నా జీవితనౌక ఎటువైపు పయనించనుందో!

---------------------

-----------------------------                                        -----------------------

"మనం తొందర పడ్డామేమో శకూ...'' అర్ధరాత్రి మంచినీళ్ళకని లేచినప్పుడు నాన్న గదిలోనుంచి మాటలు వినబడడంతో ఆగిపోయాను.

"ఎందుకలా అనుకుంటున్నారు?'' అమ్మ అడుగుతోంది ఆశ్చర్యంగా.

"ఏమీలేదు... సావిత్రి వచ్చి పిల్లనివ్వమని అడగగానే ముందు వెనకలాలోచించకుండా ఈ సంబంధానికి సై అన్నాము. అబ్బాయి ఎలాంటివాడో ఏమిటో... అని కూడా వాకబు చేయలేదు.

"మీ రక్తం అయిన మీ చెల్లెలినే సందేహిస్తున్నారా?''

"సందేహం నా చెల్లెలి మీద కాదు శకూ...మన అల్లుడిమీద. వచ్చినప్పటినుంచీ చూస్తున్నాను. తుమ్మల్లో పొద్దుగూకినట్లు ముఖం ముటముటలాడించుకుంటు ఉన్నాడుఓ నవ్వు లేదు ఓ మాటాపలుకూ లేదు. అసలు వాడిలో కొత్త పెళ్ళికొడుకు కళ ఏమన్నా కనబడుతోందా! ! ఏదో పోగొట్టుకున్నవాడిలా... అనాసక్తంగా... నాకెందుకో అనుమానంగా ఉంది.'' నాన్న గొంతు వణికింది.


"మీవన్నీ అర్ధం పర్ధం లేని భయాలే. రోహిత్ కి మనందరమూ కొత్త. కనీసం ముఖ పరిచయమన్నా లేదు. వాళ్ళమ్మ ఉన్నట్లుండి పెళ్ళి చేసేస్తే అతడెలా అడ్జస్ట్ కాగలడు! ప్రతీదీ భూతద్దం లోనుంచి చూడక కాస్త స్తిమితంగా ఆలోచించండి.'' అల్లుడిని వెనకేసుకుని వచ్చింది అమ్మ.

"అంతేనంటావా!?' నాన్న అన్నారు.

"ముమ్మాటికీ అంతే...మీరనవసరంగా కంగారు పడక హాయిగా నిద్రపొండి.'' తెగేసి చెప్పింది అమ్మ.

అటుపైన అంతా నిశ్శబ్దం. మెల్లగా వెళ్ళి నా పడక మీద పడుకున్నాను. నాకెందుకో...నాన్న అనుమానమే నిజమనిపిస్తోంది. చిన్నత్తయ్య అదాటున వచ్చి పెళ్ళి అనగానే

ఎగిరి గంతేసి మరీ సిద్ధపడ్డామే గాని, ఎవరం కూడా బావ గురించి ఆలోచించలేదు.




ఒకవేళ బావకి... నేనంటే... అటుపైన ఆలోచించడానికి సాహసించలేకపోయాను.

వద్దు... వద్దు... ఇలాంటి నెగిటివ్ థాట్స్ కి నా మనసులో తావివ్వకూడదు. 'యద్భావం తద్భవతి' అన్నారు. అంతా మంచే జరుగుతుందని అనుకుంటేనే సుఖంగా ఉండగలము...

మనసులో మొలకెత్తుతున్న ప్రతికూల ఆలోచనలని అక్కడే అదిమేసే ప్రయత్నం చెశాను.

------------------------- -------------------------
---------------------

" ఏం వదినగారూ... పెళ్లైన వెంటనే ముక్తని కాపురానికి పంపేస్తారనుకున్నాను. ఇంకా అట్టే పెట్టుకున్నారేమిటి? '' పరంజ్యోతి వాళ్ళమ్మ, సీతారామయ్య గారి భార్యా అయిన సుందరమ్మ ఆరాలు తీసింది మాకు వాళ్ళకి మధ్యనున్న గోడ దగ్గర నిలబడి.

అక్కడే కూర్చు బట్టలుతుకుతున్న నాకు ఆవిడ ప్రశ్నలకి ఒళ్ళు మండింది.

"ఏదీ వదినగారూ... ఇలా పుస్తెముడి పడిందో లేదో... అలా శూన్యమాసం వచ్చింది. పెళ్లైన వెంటనే కాపురానికి పంపేయాలనే అనుకున్నాం. కాని, మా అల్లుడికి ఆఫీసులో తీరికలేనంత పని పడడంతో ఆ ప్రయత్నం వాయిదా పడింది.'' సంజాయిషీ ఇచ్చినట్లుగా చెప్పుకు పోతోంది.

" అయినాసరే... ఓమారు తీసుకెళ్లి ఇల్లుమట్టించి తీసుకొచ్చేయవలసింది. వెంటనే ఆ ముచ్చటేదో తీరిపోతే అదో తీరుగా ఉంటుంది. ఇలా వాయిదా పడితే ఏదో... వెలితిగా అనిపిస్తుంది.'' సుందరమ్మ మాటలు నాలో రేగుతున్న మంటలను ఎగసం తోశాయి.

ఆవిడమీద కోపాన్ని బట్టలమీద చూపిస్తూ బండకేసి దబదబ బాదసాగాను.

అసలీవిడకి ఈ కబుర్లన్నీ దేనికీ! వాళ్లింట సంగతులు మేమేమన్నా అడుగుతున్నామా...పెడుతున్నామా! ఆ మధ్యన పరంజ్యోతికి ఒక సంబంధం కుదిరినట్లే కుదిరి తప్పిపోయింది. ఆ విషయం కర్ణాకర్ణిగా మాకు తెలిసినా సరే... వివరమేమిటని అడగలేదు.

జరిగినదానికి వాళ్లు కుమిలిపోతూ ఉంటే ' పుండుమీద కారం చల్లినట్లుగా' ఆ సంగతులని కెలికి మరింత నొప్పించడం ఎందుకని ఊరుకున్నాం.

కాని, ఈవిడలా ఊరుకునే రకంకాదు. బాధ ఎవరికైనా బాధే అన్న ఆలోచన లేకపోగా... నేను కాపురానికి వెళ్ళకపోవడమేదో ఘోరమైన విషయం అన్నట్లుగా వ్యాఖ్యానాలు చేసి పొడుచుకు తింటోంది.

'ఎద్దుపుండు కాకికి నొప్పా!' అని ఇందుకే అంటారేమో!

నా పిచ్చి గాని, ఎదుటివ్యక్తి స్వవిషయాలలోకి చొచ్చుకుని వెళ్ళి, వాళ్ళ మనసులని కష్టపెట్టకూడదన్న ఇంగింతం అవతల వాళ్ళకి ఉండద్దూ!

అయినా ఈ అమ్మ మరీనూ... ఏదో పొడిగా జవాబిచ్చేసి ఊరుకోకుండా, ఏ రామాయణమో మహాభారతమో వినిపించినట్లుగా అన్నీ పూస గుచ్చి మరీ చెబుతోంది.

సుందరమ్మ ప్రశ్నావళి అలా సాగిపోతూనే ఉంది.అమ్మ విసుక్కోకుండా చెబుతూనే ఉంది.

నాకు నసాళమంటింది. విసవిస నడుచుకుంటూ లోపలికి వెళ్ళి, అక్కడనుంచే అరిచాను “అమ్మా...బామ్మ రమ్మంటోంది.''

పెరటి వసారాలో గడపమీద తల పెట్టుకుని కునుకు తీస్తున్న బామ్మ “ నేనెప్పుడు పిలిచానే?'' అంది తెల్లబోతూ.

“ష్...ఊరుకో బామ్మా...అలా పిలవకపోతే ఆవిడకి లోపలకి రావాలన్న స్పృహే ఉండదు.ఆ సుందరమ్మ ఏవేవో అడుగుతూనే ఉంటుంది... ఈవిడ హరికథలు వినిపిస్తూనే ఉంటుంది.'' అన్నాను ఉక్రోషంగా.

బామ్మకి విషయం బోధపడింది. సాలోచనగా తలపంకించి, “మీ అమ్మకి లౌక్యం తెలియదే...ఏదో దాటవేసి తప్పించుకోవాలి గాని, ఇలా ఇంటి విషయాలు చెప్పుకుంటారా! వట్టి వెర్రిబాగులది. ' సుబ్బీ... అంటే ఉబ్బిపోతుంది.'' అమ్మమీద జాలి కురిపించింది బామ్మ.

“ఎందుకత్తయ్యా పిలిచారు...'' అమ్మ వచ్చింది తడిచేతులను కొంగుతో తుడుచుకుంటూ.

“ఏమీలేదే శకుంతలా... నీరసంగా ఉంది కాస్త బార్లీజావ కాచిస్తావని...'' బామ్మ నర్మగర్భంగా నవ్వింది నా వైపు చూసి.

“అలాగే అత్తయ్యా'' అంటూ నా వైపు తిరిగి “ఏమే ముక్తా... మీ బామ్మకి కాసిని బార్లీనీళ్ళు కాచివ్వలేవే?'' అంది అమ్మ.

“ ఏం నువ్వేం చేస్తావు? గోడ దగ్గర నిలబడి మరిన్ని పోచుకోలు కబుర్లు చెప్పుకునే అవకాశం పోయిందనా నీబాధ!'' హేళనగా అన్నాను.

అమ్మ నా వైపు మింగేసేలా చూసి “ బాగుందే నీవరసా! ఆవిడకన్నీ తెలుసు... కొత్తగా నేను చెప్పేదేం'ఉంది?'' కోపంగా అంది.

“ఆహా! అన్నీ తెలిసినావిడకి నువ్వు కొత్తగా సెలవిచ్చేదేమిటి!? “ ఎంత వద్దనుకున్నా నాస్వరంలో వ్యంగ్యం పలకనే పలికింది.

"ఏమిటే ఆ పెడసరం! ఇరుగు-పొరుగు అన్నాక ఆమాత్రం కష్టసుఖాలు కలబోసుకోమా ఏం?'' అమ్మ అంది గద్దింపుగా.

"ఎంత ఇరుగు-పొరుగులైతే మాత్రం మన పర్సనల్ విషయాలన్నీ వాళ్ళతో చెప్పాలా? ఆవిడలాగే చెప్తోందా అన్నీనూ... అమ్మా నీకిదే చెప్తున్నా... మరొకసారి నా సంగతులు ఆవిడముందు ప్రస్తావిస్తే ఊరుకునేది లేదు.'' గఁయ్ మన్నాను గొంతుపెంచి.

"ఇప్పుడేమైందని అత్తయ్యా... అదలా నా మీద విరుచుకు పడుతోంది!'' అంది అమ్మ ముఖం మాడ్చుకుంటూ.

"అది అన్నదని కాదు కాని, నువ్వత్తి అమాయకురాలివే శకుంతలా...దేనికీ గుట్టుగోప్యం లేదు. మన కుటుంబ విషయాలు నలుగురితోటీ చెప్పుకుంటే పలచనైపోతామని దాని బాధ." బామ్మ అంది నచ్చచెబుతున్నట్లుగా.

" మీరుకూడా నన్నే అంటున్నారూ...అనండి...అనండి...అందరిచేతా మాటలు తినడం నా బతుకైపోయింది." ముక్కు చీదింది అమ్మ.

ఆక్షణాన అమ్మని చూస్తే జాలి కలిగింది. కాని, ఆపాటి డోస్ పడితే గాని, ఆవిడ మాట వినదు. అసలు నేనేనాడూ అమ్మనంతలా కసురుకోలేదు. నామీద నాకే కోపం, అసహ్యం కలిగాయి.

నేనున్న మానసిక స్థితి అటువంటిది. బావ మీద కలుగుతున్న సందేహాలు నా మనసుని కకావికలు చేస్తూంటే, ఏదో తెలియని ఆందోళన నా మదిని పట్టి కుదిపేస్తూంటే నాకు తెలియకుండానే నాలో కరుకుదనం చోటు చేసుకుంది.

అయితే... నావి సందేహాలు కావని, అవన్నీ వాస్తవాలేనని నాకు తెలిసే రోజు అతి తొందరలో వచ్చింది.

------------------

----------------------------     -------------------------

"కమ్మనీ ఈప్రేమలేఖనీ రాసింది హృదయమే...'' నా కిష్టమైన రింగ్‌టోన్ వినపడగానే సెల్ తీసి చూశాను.

ఏదో అన్‌నోన్ నంబర్. 'ఎవరై ఉంటారబ్బా...' అనుకుంటూ ఆన్సర్ చేశాను.

"హలో... ముక్తేనా మాట్లాడేది?'' అవతల నుంచి ఒక అపరిచిత పురుషస్వరం వినిపించింది.

"ఆఁ...నేను ముక్తనే...మీరెవరో తెలుసుకోవచ్చా?'' మర్యాదపూర్వకంగా అడిగాను.

"నేను... నేను... రోహిత్ ని" తటపటాయిస్తూనే చెప్పాడతడు.

"రోహితా! '' ఆలోచించబోతే అప్పుడు వెలిగింది...బావ అని.

అంతే గొంతు వెళ్ళి కడుపులోకి జారిపోయినట్లనిపించింది. మాట పెగలలేదు. నేనెప్పటినుంచో ఎదురు చూస్తున్న నా బావ పిలుపు...ఈనాడు ...ఇలా... గాలి అలలమీద... తేలితేలి...

నాకేదో గమ్మత్తుగా అనిపించింది.


తొలిసారి బావ గొంతు చెవులపడగానే ఏవేవో... అనుభూతులు మూకుమ్మడిగా దాడి చేశాయి.

"గాల్లో తేలినట్లుందే...గుండె పేలినట్లుందే...'' అంటూ పిచ్చిపిచ్చిగా హమ్

చేయాలనిపించింది.

"హలో... ముక్తా... వింటున్నావా?'' నా నుంచి ఏ రెస్పాన్సూ లేకపోవడంతో బావకి కంగారు కలిగినట్లుంది.

ఒక్కక్షణంలో తేరుకుని "ఆఁ...వింటున్నాను. చెప్పండి.'' నేను స్పందించకపోతే బావ ఎక్కడ ఫోన్ పెట్టేస్తాడోనని భయపడ్డాను.




"నీతో మాట్లాడాలి ముక్తా...'' బావ స్వరంలో ఏ భావాలూ వినబడలేదు. ఆ గొంతు పొడిగా, అభావంగా ఉంది.

"మాట్లాడండి...'' అన్నాను. ' నీ మాటల కోసమే ఈ పిచ్చిముక్త... పడిగాపులు పడుతూ కూర్చుందిక్కడ' అనుకుంటూ.

"ఫోన్‌లో కాదు. పర్సనల్ గా...''

"అదెలా? మీరుండేది ముంబై లో కదా!'' అయోమయంగా అడిగాను.

"లేదు... ప్రస్తుతం నేను వైజాగ్ లో ఉన్నాను.''

"అయితే ఇంటికి రండి... నాన్న వాళ్ళు కూడా సంతోషిస్తారు.'' అన్నాను.

"అయ్యో! అలాంటివేమీ పెట్టకు... అసలు... నేనిక్కడికి వచ్చినట్లు అమ్మావాళ్ళకి కూడా తెలియదు.'' అన్నాడు బావ కంగారుగా.

నాకర్థమైంది బావ ఆంతర్యం... తాను ఇక్కడికి వచ్చిన విషయం అత్తయ్యా వాళ్ళకి, మావాళ్ళకి ఎవరికి తెలిసినా...శూన్యమాసంలో వచ్చావెందుకని చీవాట్లు పెడతారేమోనని బావ భయపడుతున్నాడులా ఉంది. అందుకే... తన రాకని రహస్యంగా ఉంచుదామనుకుంటున్నాడు

కాబోలు!

నాలో నేనే ఏవో ఊహాగానాలు చేసేసుకుంటున్నాను.

"ముక్తా... నువ్వేమీ అనుకోనంటే... ఇంట్లో ఏదోకటి సర్దిచెప్పి సింహాచలం రాగలవా? అక్కడ మనం అన్నీ డిటైల్డ్ గా మాట్లాడుకుందాము.'' ప్రాధేయంగా అడిగాడు బావ.

అతడు నన్ను అంతగా బతిమలాడాల్సిన పనిలేదు. అతడు ఆజ్ఞాపిస్తే...అతడి వెంట నరకానికి వెళ్ళడానికైనా నేను సిద్ధం.

పెళ్ళైన తరువాత మేము కలుసుకోబోయేది ఇదే మొదటిసారి. ఆ కలయిక దైవసన్నిధిలో అయితే బాగుంటుందని ఇలా సింహాచలం ప్రిఫర్ చేశాడేమో! ఏమో అనుకున్నాను గాని, బావ తెలివైన వాడే.

"ఏం ముక్తా... మాట్లాడవూ...ఎనీ ప్రాబ్లం?ప్లీజ్...రేపుదయాన్నే బయలుదేరి వచ్చెయ్. ఎవ్వరికీ చెప్పద్దు...''

"అలాగే వస్తాను...'' మనసులో ఏదో బితుగ్గా ఉన్నా మాటైతే ఇచ్చేశాను. అమ్మనాన్నల అనుమతి లేకుండా నేనింతవరకు స్వతంత్రంగా గడపదాటింది లేదు. అందుకే... ఏదో సంకోచం.

అంతలోనే మనసు గదమాయించింది ... నువ్వేమీ చాటు-మాటు ప్రేమాయణాలు సాగించడానికి వెళ్లడంలేదు కదా! నీ మెడలో తాళికట్టినవాడి కోరికమేరకు అతడిని కలుసుకోవడానికి వెళ్తున్నావు. దీనికింత కంగారెందుకు?

అంతరాత్మ ఉపదేశించింది. ఉలికిపడే మనసుని జోకొట్టాను. ఆ రాత్రంతా నాకు కంటిమీద కునుకులేదు.

---------------------- ----------------------- -------------------

"అమ్మా... నేను సింహాచలం వెళ్ళొస్తాను.'' తెల్లవారి పెరటివాకిలి ఊడుస్తున్న అమ్మతో చెప్పాను.

చేతిలోని చీపురుని పక్కన పడేసి "సింహాచలమా? ఇప్పుడెందుకు?'' ఆశ్చర్యంగా అడిగింది అమ్మ.

నిజంగానే నాకు చాలా గిల్టీగా అనిపిస్తోంది. అలవాటు లేకపోతే అబద్ధాలు ఆడడం చాలా కష్టమైన పని. ఏ మాత్రం తేడా వచ్చినా ఇట్టే దొరికిపోతాం.

నేనలా దొరికిపోకూడదని సింహాద్రప్పన్నకి మనసులోనే మొక్కుకుంటూ..." మా ఫ్రెండ్ మంజూష లేదూ...'' ఉపోద్ఘాతం ప్రారంభించాను.

"ఆఁ... ఉందీ... మొన్న నీ పెళ్ళికి కూడా వచ్చిందికదా! ఏమైంది ఆ అమ్మాయికి?'' అడిగింది అమ్మ ఆదుర్దాగా.

"తనకేమీ అవలేదమ్మా...వాళ్ళక్క కొడుక్కి సింహాచలంలో పుట్టు వెంట్రుకలు తీయిస్తారట...నిన్న రాత్రి ఫోన్ చేసి రమ్మని పిలిచింది. అందుకే... వెళ్లాలనుకుంటున్నాను. స్వామి కార్యం- స్వకార్యం... రెండూ కలిసొస్తాయి.'' ఠక్కున చెప్పేశాను.

"అలాగా... అయ్యో... ఈ విషయం నిన్నరాత్రే అనుంటే నేను, మీ నాన్న కూడా వచ్చుండేవాళ్ళం కదా!'' అంది అమ్మ ఆ వరాహ నరసింహ స్వామి దర్శనభాగ్యానికి తాను

నోచుకోనందుకు చింతిస్తూ.

"అవుననుకో... కాని, తను నన్నొకర్తినే కదా రమ్మంది?'' అన్నాను కంగారుగా అమ్మ నాతోపాటుగా ఎక్కడ ప్రయాణం కడుతుందోనని.

"బాగుందిలేవే... దేముడి దగ్గరకు రమ్మనమని ఒకరు పిలవాలా ఏమిటి?'' కొరకొరా చూసింది అమ్మ నావైపు.

గుండెల్లో దడ మొదలైంది నాకు. అప్పుడు వీళ్ళు నాతో పాటు బయలుదేరితే... కథ మొత్తం అడ్డం తిరుగుతుంది. అందరికీ ' టాం...టాం' చేసినందుకు బావ కోపగించుకుంటాడు ఖచ్చితంగా.

ఏం చెప్పి ఆవిడని ఆపాలా అని ఆలోచిస్తున్నలోపే "అయినా మాకు రావడానికి కుదరదులే...లేడికి లేచిందే పయనమని' ఉన్నపళంగా నేనెలా రాగలను! బామ్మకి- తమ్ముడికి వంటచేసి పెట్టాలి. ఇప్పటికిప్పుడు కుదిరేపని కాదులే... దేనికైనా ప్రాప్తం ఉండాలి. నువ్వు నాన్నగారి తో ఓ మాట చెప్పేది వెళ్ళు.'' పక్కన పడేసిన చీపురందుకుని మళ్ళీ తుడవసాగింది అమ్మ.

నాన్నగారితో చెబుతున్నప్పుడు కూడా అదే గిల్ట్ నాలో.ఆయన ఏమీ అనకుండా వెళ్లిరమ్మని డబ్బులిచ్చారు.

చకచక తయారైపోయి, నా పెళ్లికి పెద్దక్క కొనిపెట్టిన లేత అరిటాకు రంగు ఆర్గంజా చీర కట్టుకున్నాను. నా ఒంటిమీద చేరాక ఆచీర అందం రెట్టింపైంది. మెడలో పెళ్లికి అత్తయ్య పెట్టిన పచ్చలసెట్ పెట్టుకున్నాను. ఎన్నడూ కూడా నేనింత శ్రద్ధగా అలంకరించుకోలేదు. కాని, తొలిసారి నా ప్రాణానాధుని కలుసుకోబోతున్నాను. సాదాసీదాగా వెళ్తే ఏం బాగుంటుంది! అందుకే ఈ అలంకరణ అంతా. దినేష్ కాంప్లెక్స్ కి వచ్చి నన్ను బస్ ఎక్కించేసి వెళ్ళిపోయాడు.

మనసంతా ఏదో గుబులుగా ఉంది. సంకేతస్థలంలో ప్రియుడిని రహస్యంగా కలుసుకోబోయే ప్రేయసిలా ఉంది నా మనస్థితి. అగ్నిసాక్షిగా నా మెడలో తాళికట్టిన మొగుడిని ఇలా దొంగచాటుగా కలుసుకోవాల్సిన అగత్యం పట్టింది.

ఏమిటో! నా పెళ్ళిమొదలు... నా జీవితంలో ముఖ్యమైన ఘట్టాలన్నీ అత్యంత నాటకీయంగా జరుగుతున్నాయి.

మనసులో ఆలోచనలు రొదపెడుతున్నాయి. అసలు... బావ... నన్నెందుకు రమ్మన్నాడు?నాతో ఏం మాట్లాడాలట! నాకు, అతడికి పెళ్లి... అని అనుకున్న దగ్గరనుంచీ నాతో ఒక్కమాట కూడా మాట్లాడనివాడు... ఇలా మాట్లాడాలి రమ్మని అంటే దాని అంతరార్థం ఏమై ఉంటుంది!

అసలు... పెళ్లిలో కాబోయే బావ్గారిని ఆట పట్టించాలని దినేష్ ఒకటే ఆరాటపడిపోయాడు.

ఎన్నో రకాల స్కెచ్ లు గీశాడు.

కాని, ఏ సరదాలకి-సరసాలకి తావివ్వని విధంగా గంభీరంగా ఉన్న బావని చూస్తే వాడికి హడలు పుట్టి, కనీసం మాట్లాడడానికి కూడా మొహమాటపడ్డాడు. కనీసం కాశీయాత్ర జరుగుతున్నప్పుడు సైతం బావ ముఖంలో సంబరం కనబడలేదట. పైగా ఉల్లి-బెల్లం రాసినందుకు చిరాగ్గా ముఖం పెట్టాడట.

మా పెద్ద బావగారు అలా ఉండరు. వాడితో చాలా క్లోజ్ గా మూవ్ అవుతారు. చిన్న బావగారు జోసెఫ్ అయితే చెప్పనే అక్కరలేదు. ఇక రక్తసంబంధీకుడైన ఈ బావ ఇలా... అపరిచితుడిలా మిగిలిపోవడం వాడికి నచ్చలేదు.

"మీ ఆయనేమిటే అక్కా...అంత సీరియస్ గా ఉన్నాడు? అత్తకొడుకని రెచ్చిపోదామనున్నాను. కాని, బావ ఫేస్ చూస్తే...దగ్గరకే పోబుద్ధి కావడంలేదు. వట్టి మూడీఫెలోలా అనిపిస్తున్నాడు.'' దినేష్ వాపోయాడు నాదగ్గర.

ఆ క్షణానికి వాడికేదో సర్ది చెప్పాను కాని, బావ వాలకానికి నా మనసూ చివుక్కుమంది.

ఆలోచనల మధ్యన సింహాచలం ఎప్పుడొచ్చిందో గమనించనే లేదు. ఇప్పుడు బస్సులు డైరెక్ట్‌గా కొండమీదకే వేయడం వలన దిగి మళ్లీ వేరే బస్ ఎక్కాలన్న టెన్షన్ లేదు. బస్ నేరుగా కొండమీదకి వెళ్లి ఆగింది. నెమ్మదిగా బస్ దిగి బావకోసం దిక్కులు చూస్తూ నిలబడ్డాను.

"వచ్చావా ముక్తా?'' బావస్వరం వినబడగానే వెనక్కి తిరిగిచూశాను.


ఆరడుగుల అందమైన విగ్రహం. పెళ్ళిలో సిగ్గునుంచి అంతగా గమనించలేకపోయాను. బావ అందం అనిర్వచనీయం.

ఏదో... బిడియం నన్ను పట్టి వెనక్కి లాగుతూ ఉంటేతల దించుకుని వచ్చానన్నట్లుగా తలూపాను.

"పద... అలా కూర్చుని మాట్లాడుకుందాం.'' అంటూ మళ్లీ కిందికి వెళ్ళే తోవంట కిందికి దిగడం ప్రారంభించాడు నావైపన్నా చూడకుండా.

"ముందు దర్శనం...'' అంటున్న నాకేసి అదోలా చూసి "ముందు మాట్లాడుకుందాం...అప్పుడే మిగతావి...'' అంటూ కాస్త దూరం నడిచి రోడ్డు పక్కనున్న గోడమీద కూర్చున్నాడు.

బావ వైఖరి నాకు వింతగొలుపుతూ ఉండగా మౌనంగా అనుసరించాను. ఇంతటి అందాలరాశిని... నన్ను చూడగానే బావ ముఖం వెలిగిపోతుందనుకున్నాను. కాని, బావలో ఆ భావనలేమీ కనబడలేదు. ఆ చూపులు ఏవో దూరాలను కొలుస్తున్నంత దీర్ఘంగా ఉన్నాయి.



నేనూ వెళ్ళి అదే గోడమీద బావకి కాస్త దూరంగా కూర్చున్నాను. కొండపైకి వెళ్తున్న వాహనాలలోనున్న మనుషులు మావైపు విచిత్రంగా చూస్తున్నారేమోనిపించింది.

కాసేపు మాట్లాడకుండా కూర్చున్నాడు బావ.

గాలిలో తేలితేలి వ్యాపిస్తున్నాయి సంపెంగల సువాసనలు. సింహాచలం సంపెంగలంటే నాకెంతో ఇష్టం. అసలు... ఈకొండ మీద ఉన్న వృక్షసంపద అపారం.

నాన్నకి అక్క వరసయ్యే ఒకావిడ ఇక్కడే ఉండేది.అప్పుడప్పుడు చుట్టపు చూపుగా మా ఇంటికి వచ్చిపోయేది. ఆవిడ వచ్చిందంటే మాకు పండగే. పనసపళ్ళు, అనాసపళ్ళు, సంపెంగలు, కనకాంబరాలు, గోరింటాకు ఇవన్నీ మాకోసం తీసుకొచ్చేది. ఆ పనసపళ్ళ రుచే వేరు. అమృతోపమానంగా ఉండేది ఆ పనసతొనల రుచి.

ఇదేమిటి! రామాయణంలో పిడకల వేటలా నేనెక్కడికో వెళ్ళిపోతున్నాను...నవ్వుకుంటూ బావ ముఖంలోకి చూశాను.

బావ ముఖం సీరియస్ గా ఉంది. నాకెందుకో భయమేసింది. ఇదేమిటి! బావ ఇలా ఉన్నాడు! అతడి నిశ్చలత చూస్తే తుఫాను ముందరి ప్రశాంతతలా ఉంది.

"అసలు... నిన్ను... ఎందుకు రమ్మన్నానంటే..'' గొంతు సవరించుకున్నాడు బావ.

నేను తదేకంగా అతడి ముఖంలోకే చూస్తూ కూర్చున్నాను. అతడేం చెప్పబోతున్నాడో నా ఊహకి కూడా అందడంలేదు.

"నిజానికి...నేనీ విషయం మన పెళ్ళికి ముందే చెప్పుండాల్సింది. కాని, అప్పుడు నాకా ఛాన్స్ దొరకలేదు. ఇప్పుడు చెప్పచ్చో చెప్పకూడదో కూడా నాకు తెలియదు. కాని, ఇప్పుడు కూడా చెప్పకపోతే నీకు అన్యాయం చేసినవాడినౌతాను.'' బావ స్వరం మృదువుగా ఉంది.

అయోమయంగా చూశాను. అతడేం చెప్పబోతున్నాడో నాకు బోధపడడంలేదు. కొంపదీసి నేనంటే... అతడికి ఇష్టంలేదని చెబుతాడా !

ఆ ఆలోచనకే గుండె గుభిల్లుమంది.

నిస్సత్తువగా అతడివైపు చూశాను. "మీరేమంటున్నారో నాకు అర్థంకావడంలేదు. మీరు నాకు అన్యాయం చేయడమేమిటి? మీకు... మీకు... నేనంటే ఇష్టంలేదా" నా స్వరం ఏ అగాధాలలోతులనుంచో వెలువడుతున్నంత పీలగా ధ్వనించింది.

ఓసారి నావైపు చూసి " నిన్ను ఇష్టపడడం- పడకపోవడం అన్న ప్రశ్నే లేదు. ఎందుకంటే ఇదివరకు మనం అపరిచితులం. మన రెండు కుటుంబాల మధ్యన రాకపోకలు లేవు. నీ పట్ల నాకే రకమైన భావమూలేదు.'' అన్నాడు బావ తల దించుకుని.

ఇతడేం తప్పు చేశాడనీ... అలా తల దించుకుంటున్నాడూ!

"మరి!'' ప్రశ్నార్థకంగా చూశాను.

"నాకు కీర్తన అంటే ఇష్టం... చెప్పలేనంత ఇష్టం."

తెల్లబోయాను నేను.

"కీర్తనా ? ఆమె ఎవరు?''

"నా హృదయాధిదేవత. నా ప్రేమ మనోహరి.'' తన్మయత్వంగా అంటున్నాడు బావ.

ఇంతటి అందగత్తెను, పైగా కట్టుకున్నదాన్ని. నన్ను చూసినప్పుడు బావలో కాస్తంత చలనం కూడా కలుగలేదు.

అలాంటిది...కీర్తన పేరు పలుకుతున్నప్పుడు బావ లో ఎనలేని మైమరపు. ఆ వదనంలో శతకోటి తారకల తళుకు. ఆ స్వరంలో ఆమెపట్ల అంతులేని ఆరాధన. పరవశంతో బావకళ్ళు అరమోడ్పులైనాయి.

బావ నన్ను లక్ష్యపెట్టలేదంటే మా ఇద్దరి మధ్యా అసలు పరిచయమే లేదని సర్దుకుపోయాను. ఇప్పుడు నన్ను మాట్లాడడానికి పిలిచి, విషయం మొదలెడితే నా మీద ఇష్టం లేదేమోనని అపోహ చెందాను.

కాని, ఇంతకు ముందే బావ ఎవరినో ప్రేమించి ఉండచ్చునేమోనన్న ఆలోచన పొరబాటున కూడా రాలేదు.

ఎందుకు!? తన కొడుకు తాను గీచిన గీటు దాటడని అత్తయ్య నొక్కి వక్కాణించడం వల్లనే కదా!

"నేను కీర్తనని ప్రాణం కన్నా ఎక్కువగా ప్రేమించాను. ఆమెతోటిదే నా జీవితం అని భావించాను.'' బావ చెప్పుకుపోతున్నాడు.

నేను నిశ్చేష్టనై అతడు చెప్పేది వింటున్నాను. ఇంత ప్రేమగ్రంథం నెరపి అతడు నామెడలో ఎందుకు తాళి కట్టినట్లు! ఉక్రోషం ముంచుకొచ్చింది నాలో.

ఉన్నట్లుండి బావ కళ్ళు ఎరుపెక్కాయి. ఆవేశంతో పిడికిళ్ళు బిగుసుకున్నాయి.

"జరిగిన అనర్థానికి కారణం అమ్మ... యస్... అమ్మే. కీర్తనని మనసారా ప్రేమించాననీ, ఆమెనే నా లైఫ్ పార్ట్‌నర్‌గా చేసుకోవాలనుకుంటున్నానని చెప్పేలోపే... అమ్మ నీతో పెళ్లికి ప్రపోజల్ పెట్టింది. అయినా సరే... నేను నా మనసులోని మాట నిర్భయంగా చెప్పేశాను.

అమ్మ నా మాటలు పెడచెవిన పెట్టింది. తను ఆనాడు చేసిన పని వలన తన వాళ్ళందరితోనూ సంబంధాలు తెగిపోయాయని, తిరిగి ఇన్నేళ్ల తరువాత పుట్టింటితో తిరిగి సంబంధం కలిసిందని పొంగిపోయిందమ్మ.

తన వాళ్ళతో ఏర్పడిన బంధం కలకాలం కొనసాగాలంటే... నిన్ను కోడలిగా తెచ్చుకోవడమొక్కటే మార్గం అని అనుకుంది. కాని, అందుకు నేను వ్యతిరేకించాను.'' ఊపిరి తీసుకునేందుకు ఆగాడు బావ.

నా మనసు మొద్దుబారిపోతూన్నట్లుగా ఉంది. ఏదో తెలియని నిస్సత్తువ నన్ను ఆవరించుకుని లోబరచుకుంటోంది.

ఆ గోడమీదనుంచి కిందనున్న లోయలోకి పడిపోతానేమోనని భయమేసింది. ఆసరా కోసమని గోడ అంచులని గట్టిగా పట్టుకున్నాను.

"నిన్ను చేసుకోనని చెప్పగానే అమ్మ మొదట ఆవేశపడింది. అరిచింది. అల్లరిచేసింది. అయినా నేను ఆవిడ మాట వినలేదు. ఆవిడ నా మీద ఆఖరి అస్త్రం ప్రయోగించింది. నేనీ పెళ్ళికి ఒప్పికోకపోతే తాను చస్తానని బెదిరించింది. బెదిరించడమే కాదు. ఆత్మహత్యాప్రయత్నం కూడా చేసింది.'' బావ కంఠం రుద్ధమైంది.

నేను అప్రతిభురాలనైనాను. నా పెళ్ళి కోసం ఇంత తతంగం జరిగిందా!? ఇంతా చేసి అత్తయ్య ఏం సాధించాలనుకుంది! పుట్టింటి మమకారాన్ని నిలబెట్టుకోవడం కోసం కన్నబిడ్డ ప్రేమని

బలిపెట్టిందా!?

ఈ సంబంధం కలుపుకోకపోయినా ఆవిడకి తన కన్నవారింట గల స్థానం చెక్కు చెదిరేది కాదు. ఆవిడ మంకుతనం ఎంతటి అనర్ధానికి హేతువైందీ!

"మీరు పెళ్లికి ముందే ఈ విషయం నాకు చెప్పుండాల్సింది.'' నా గొంతు నాకే బలహీనంగా వినిపించింది.

బావ విరక్తిగా నవ్వాడు. వేదన నింపుకున్న కన్నులతో దీనంగా చూశాడు. చెట్టంత మగాడి కళ్ళలో కొండంత దైన్యాన్ని నేను భరించలేకపోయాను.

" ఆ ప్రయత్నమూ అయింది. నిన్ను కలిసి నా ప్రేమసంగతి చెప్పాలనీ, కనీసం ఫోన్‌లోనైనా నీతో మాట్లాడాలనీ ఎంతగానో ట్రై చేశాను. అమ్మ పడనివ్వలేదు. అటువంటి ప్రయత్నాలేం చేసినా తాను విషం తాగి చస్తానని హెచ్చరించింది. అందుకే... తప్పనిసరి పరిస్థితుల్లో నీకు తాళి కట్టాల్సి వచ్చింది.'' బావ గొంతు గద్గదమైంది.




సినిమాలలో ఇటువంటి సీన్లు చూసి తెగ నవ్వుకునేదాన్ని. పెద్దవాళ్ళు చస్తామని బెదిరించినంత మాత్రాన మనసుకెదురీది ఇష్టంలేని పెళ్లిళ్ళు ఎలా చేసుకుంటారా! అని విపరీతంగా ఆలోచించేదాన్ని. కాని, అదే సన్నివేశం ... నా జీవితంలో ఎదురయ్యేసరికి మాత్రం నాకు గట్టి షాకే తగిలింది.

తాను చస్తానని బెదిరించి, కొడుకుని నొప్పించి-ఒప్పించి... నాతో పెళ్లిచేసి నా జీవితాన్ని నరకం చేసింది అత్తయ్య. నా భవిష్యత్తుని అంధకారంలోకి నెట్టేసింది.

ఎంతకీ సాల్వ్ కాని ఒక పజిల్‌లా మిగిలింది నా బతుకు.

"నన్ను క్షమించు ముక్తా...నేను నీకే విధంగానూ న్యాయం చేయలేను. నా మనసునిండా కీర్తనే

నిండి ఉంది. ఆమెను హృదయంలో ఉంచుకుని నీతో అయిష్టంగా కాపురం చేయలేను. నా మనసుతో పాటు నేను కూడా ఆమెకే అంకితం కావాలనుకుంటున్నాను.'' బాధగా కణతలు నొక్కుకున్నాడు బావ.

కాళ్ళకింద భూమి కంపించినట్లయింది. ఏమంటున్నాడితడు! అతడి జీవితంలో నాకు స్థానం లేదనేగా ఆ మాటలకర్థం!

నా కళ్ళు తిరుగుతున్నాయి. క్రమంగా స్పృహ తప్పుతోంది.

నాకు తెలివొచ్చేసరికి బావ కార్లో ఉన్నాను. నా వైపే ఆతృతగా చూస్తూ బావ. నాకెందుకో అమితమైన దుఃఖం పొంగుకొచ్చింది. ఆహ్లాదంగా వీస్తున్న పిల్లగాలు... మండువేసవి లో మధ్యాహ్న సమయంలో వీచే వడగాడ్పుల్లా అనిపిస్తున్నాయి.

వాతావరణం అంత ప్రశాంతగా ఉన్నా సరే... నా మనసులో పిడుగులు పడుతున్నాయి. ఉగ్రమూర్తియైన నారసింహుని శాంతింపచేయడానికి మణుగుల కొద్దీ మంచిగంధాన్ని తెచ్చి పూస్తారట!

మండుతున్న నా మనసుని చల్లార్చడానికి ఏ చందనపు పూతలు పనికొస్తాయి.

"రియల్లీ అయాం వెరీసారీ ముక్తా...నీ పరిస్థితికి ఒక విధంగా నేనే కారణం. నా అసమర్ధత వలన నీ జీవితం పాడైంది.'' ఆవేదన తొణికిసలాడింది బావస్వరంలో.

నేనలా వెర్రిదానిలా చూస్తూండిపోయాను. ఇన్నేళ్లుగా నాశరీరంతో పాటు మనసుని కూడా ఏ కల్మషమూ సోకకుండా ఉంచుకున్నాను.అమ్మ-నాన్నలు ఎంపిక చేసిన వ్యక్తికే అర్ధాంగినై, ఒక పూజాపుష్పంలా ఆ వ్యక్తికే అర్పితమౌదామనుకున్నాను.

ఏ లవ్‌వైరస్సూ సోకకుండా, నా మనసుకి ఎంగిలి అంటకుండా నన్ను నేను నియంత్రించుకున్నాను.

దానికి ప్రతిఫలం ఇంత చేదుగా ఉంటుందా! పర్యవసానం ఇంత దారుణమా!

నా జీవితంతో ఆడుకునే హక్కు ఈ తల్లీకొడుకులకి ఎవరిచ్చారు? ఆవిడగారు చస్తానని బెదిరించిందట... ఇతగాడు వణికిపోయి 'సై' అన్నాడుట!

భేష్! ఎంతబాగుంది! భోరుమని ఏడవాలనిపిస్తోంది.

అత్తయ్య ఈ పెళ్ళి కావడానికి చస్తానని బెదిరించింది. నేను ఈ వివాహబంధాన్ని నిలుపుకునేందుకు అదేపని చేస్తేనో!

"ఇంత సేపూ మీరు చెప్పినదంతా విన్నాను. ఎలా జరిగినా, ఎందుకు జరిగినా పెళ్ళి జరిగిపోయింది. స్త్రీ జీవితంలో పెళ్ళి అనేది ఒకే ఒక్కసారి వచ్చే మధురమైన, మరపురాని ఘట్టం. వివాహితయైన ఆడది భర్త తోడు లేనిదే మనుగడ సాగించలేదు. అందుకే సిగ్గు విడిచి చెబుతున్నాను. మీరు నాతో కాపురం చేయకపోతే నేను ఉరిపోసుకుని చస్తాను.'' నాలో అంత మొండితనం ఎక్కడినుంచి వచ్చిందో నాకే తెలియలేదు.

నేననుకున్నట్లుగా బావ బెదిరిపోలేదు. పసిపిల్ల అమాయకత్వం చూసి నవ్వినవాడిలా నవ్వాడు. అతడి మదిలోని విషాదంలో నుంచి పుట్టిన నవ్వు అది.

"మనసులేని మనువు నరకమైతే... ఇష్టంలేని కాపురం వ్యభిచారంతో సమానం. అలాచేసి నా స్థాయిని దిగజార్చుకోలేను. జీవితాంతం నిన్నుసురు పెట్టలేను. ఒకసారి అమ్మ బెదిరింపుకి భయపడి జీవితంలో అతి ముఖ్యమైన విషయంలో నిర్ణయం తీసుకోవడంలో విఫలమైనాను. మళ్లీ

మళ్ళీ అదే తప్పు చేయడానికి నేను సిద్ధంగా లేను.'' నిష్కర్షగా చెప్పాడు బావ.

'నీ ఇష్టమొచ్చినట్లుగా చావు' అని ఎంత కూల్ గా చెప్పేశాడు! శిలలా బిగుసుకుపోయాను. నా భావాలు నన్నే పరిహసిస్తున్న అనుభూతి కలిగింది. అయిపోయింది...ఎన్నో సుందరస్వప్నాలతో వైవాహిక జీవితంలోకి అడుగుపెట్టిన నా బతుకు చీకటైపోయింది. ముచ్చటపడి నిర్మించుకున్న జీవనరమ్యహర్మ్యాలు కుప్పకూలిపోయాయి.

ఆ శిథిలాల కింద సమాధి అయిన నా జీవనశకలాలను వెదుకుతూ మిగిలిన నా బతుకు ప్రయాణాన్ని కొనసాగించవలసిందేనా!?

అంతకన్నా ఇంకేం మిగిలింది నాకు! ఇప్పుడు నేనేం చేయాలి?

కటువుగా బావ పలికిన మాటలే నా చెవిలో మారుమ్రోగుతున్నాయి. వీళ్ళంతా కలిసి నాకు ఏ విధమైన న్యాయం చేస్తారు? గుర్రాన్ని అదిలించి ఏటిదాకా తీసుకురాగలరు. కాని, బలిమిన ఒక్క చుక్క నీరైనా తాగించగలరా!

ఎవరో పనిగట్టుకుని సమ్మెటలతో నా తల మీద బాదుతున్నట్లుగా అనిపించింది. దిక్కుతోచని స్థితిలో కాసేపు ఉండిపోయాను. కాసేపటికి నా ఆలోచనలు ఓ కొలిక్కి వచ్చాయి.

"చెప్పు ముక్తా... నా మనసులోని మాట నీకు స్పష్టంగా చెప్పేశాను.నువ్వు ఎన్నాళ్లు వేచి చూసినా ఫలితం ఉండదు. ఇది నాకు నేనే వేసుకుంటున్న శిక్ష.'' అన్నాడు బావ అసహనంగా.

శిక్షా! ఎవరికీ! అతడికేం మగమహారాజు. హాయిగా దులిపేసుకుంటాడు.

కాని, నేను...అతడివలన ఏ ఆదరణకీ నోచుకోకుండా మోడులా పడుండాలి. ఇప్పుడు నేను తీసుకోబోయే నిర్ణయం వలన అమ్మ-నాన్నలు బాధ పడతారని తెలుసు. కాని, తప్పదు!


పరిస్థితి నా చేతుల్లో లేదు. ఈ సమయంలో నా ఆలోచనే సరైనది అనిపిస్తోంది.

"మీరు బలవంతంగా నన్నేలుకోవలసిన పనిలేదు. నా జీవితం ఎటూ నాశనమైపోయింది... కనీసం మీరన్నా సుఖంగా ఉండండి.'' ఈ మాటలంటున్నప్పుడు ఉబికివస్తున్న కన్నీళ్ళని విశ్వప్రయత్నం మీద అపుకోగలిగాను.

"అంటే...'' బావ నిటారుగా అయ్యాడు కూర్చున్నచోటే.

"మనం విడాకులు తీసుకుందాం.'' తడారిపోతున్న గొంతుతో పలికాను.

"వి...డాకులా?'' విస్మయంచెందాడు బావ.




"అవును ...విడాకులే... మీరే నన్ను కాదన్నాక..నేను ఏ అర్హతతో మీ భార్యగా మిగలగలను! మనం లీగల్ గా విడిపోదాం.''

బహుశా... వివాహమై నెలరోజులు కూడా కాకుండా విడాకుల గురించి మాట్లాడిన తొలి దురదృష్టపు ఆడపిల్లను నేనేనేమో!

బావ నవ్వాడు. ఆ నవ్వు నా అజ్ఞానాన్ని చూసి నవ్వినట్లుంది.

"పిచ్చి ముక్తా...అవేమన్నా తమలపాకులనుకున్నావా? విడాకులు... అంత సులభం కాదు. అయినా అమ్మ ఇంకెంత అల్లరి చేస్తుందో ఈ మాట వింటే!''

"అయితే నన్నేలుకోండి...''

బావ నిస్సహాయంగా చూశాడు.

" మీకు కుదరదు కదా! అలాంటప్పుడు ఈ మెతకదనం దేనికి! మీ పిరికితనమే ఈనాడు మన జీవితాలని బలిపీఠం మీద నిలుచుండబెట్టింది. మీ అమ్మ బెదిరించిందని ఆలోచించి నా మెడలో మూడుముళ్ళు వేశారే కాని, మీ నిరాకరణ వలన ఒక ఆడపిల్ల జీవితం ఎన్ని ఇక్కట్లకు లోనౌతుందో ఊహించలేకపోయారు.

మీరు మీ మనసుకెదురీది నాతో కాపురం చేయలేరు. నాకు కూడా అది నరకంతో సమానం. అందుకే... ఇద్దరం చట్టబద్ధంగా విడిపోయి ఎవరిదారి వారు చూసుకోవడం మంచిది.'' మనసులో జ్వాలలు రగులుకుంటున్నా నా పెదవుల మీద చిరునవ్వు పులుముకునే చెప్పాను.

నాలో ఇంతమంచి నటి దాగుందని నాకే తెలియదు.

' మహానటీ... మహానటీ...' అంటూ ఎవరో ఆర్. ఆర్. వేసినట్లుగా అనిపించింది.

బావ ఆలోచనలో పడ్డాడని ముడుచుకున్న అతడి నుదురు చెబుతోంది.

"ఆల్‌రైట్ ముక్తా... నువ్వన్నదీ నిజమే. ఇద్దరమూ ఇలా మానసికంగా నలిగిపోయేకంటే, సరైన నిర్ణయం తీసుకుని చేసిన పొరపాట్లని సరిదిద్దుకోవడమే మేలు. కాని,''

"కాని!?''

" దీనికి అమ్మ ఎలా రియాక్టౌతుందోనని భయంగా ఉంది.''

' అమ్మ... అమ్మ... ఇంత అమ్మకూచివేంట్‌రా బాబూ... అమ్మ గురించి ఆలోచించేవాడివే అయితే... ఆ కీర్తనను మరచిపోయి నాతో హాయిగా కాపురం చేసి ఉండేవాడివి. కాని, నాతో కాపురం చేసేటప్పుడు మాత్రం ఆ కీర్తన, ఆమెతో ప్రేమ వ్యవహారం అన్నీ గుర్తొస్తాయి.' కసిగా పెదవి కొరుక్కున్నాను.

ఆ కీర్తన ఎవరోగాని, నాకు చాలా అసూయ కలిగింది. అవకాశం దొరికితే, సందుకో చిన్నిల్లు మెన్‌టెయిన్ చేసే పురుషపుంగవులున్న మన సమాజంలో... ప్రేమికురాలినే మనసులో నింపుకుని, కట్టుకున్నదాని వైపు కన్నెత్తైనా చూడని బావని చూస్తే గౌరవం కూడా కలిగింది ఆక్షణంలో.

బావ ప్రేమలో నిజాయితీ ఉంది. అది ఏ ప్రలోభాలకీ లొంగదు.

"వద్దు బావా... అత్తయ్య గురించి ఆలోచించవద్దు. ఆవిడ ప్రేమలో స్వార్థం ఉంది. కాని, నీ ప్రేమ ఈ స్వార్థాలకి అతీతంగా సాగాలని నా భావన. మా ఇంట్లోని వాళ్లకి నేను నచ్చచెప్పుకుంటాను.అత్తయ్యకి ఏం చెప్పాలో, ఎలా ఒప్పించాలో నువ్వు చూసుకో. నువ్వు ఏ లాయర్ దగ్గరకి రమ్మంటావో, ఎక్కడ సంతకాలు పెట్టమంటావో చెప్పు. నేను రెడీ.'' నిర్వికారంగా చెప్పాను.

చిత్రంగా ఇందాక నన్ను పట్టి కుదిపేసిన బాధ తీవ్రత తగ్గింది. మనది కాని వస్తువు మీద ఆశలు పెంచుకోవడమన్నది ఎంత తెలివితక్కువ తనమో తెలిసి వచ్చింది.

బావ మీద నాకు ప్రత్యేకించి ఒక నిర్దుష్టమైన భావమేదీ లేదు. పెద్దలు అతడిని నాకు కాబోయే భర్తగా ఎంపిక చేసినకొద్దీ ఆశలు పెంచుకున్నాను. అతడు లేకపోతే నేను బతకలేను అన్నంత అనుబంధమేదీ మా మధ్యలేదు.

నా మెడలో తాళికట్టిన వాడిగా అతడిని కోరుకున్నాను. మొగుడు వదిలేసిన ఆడదానిగా పడుండడం ఇష్టంలేక నాతో కాపురం చేయమని వేడుకున్నాను.

కాని, కట్టుకున్న దానిమీద ఏ రకమైన భావమూ... అది ఇష్టం, కోరిక, బాధ్యత... ఏదన్నా కావచ్చు... లేనివాడితో నేనెలా కలిసుండగలను!

"రియల్లీ అయాం వెరీసారీ ముక్తా... నా చేతకాని తనం వలన నీ బతుకు బలి అయింది. ఏదైతే అదయ్యిందని పెళ్లికి ముందే ఈ విషయం నీతో చెబితే పరిస్థితి వేరేలా ఉండేది. ఆడపిల్లవైన నీకున్న ధైర్యం నాకు లేనందుకు సిగ్గు పడుతున్నాను.నా మెతకదనానికి నా మీద నాకే అసహ్యంగా ఉంది. నన్ను క్షమించు ముక్తా...'' బావ కళ్లలో కృతజ్ఞతాభావం, స్వరంలో గాధ్గద్యం చోటు చేసుకున్నాయి.

ఈ ' క్షమించు' అన్న పదం వినివినీ అసహ్యం వేస్తోంది. చిరంజీవిలా' తెలుగుభాషలో నాకు నచ్చని ఒకేఒక పదం 'క్షమించు' అని గంభీరంగా అనాలనిపిస్తోంది.

పదేపదే క్షమించమని కోరినంత మాత్రాన నేను మళ్లీ పెళ్లికాని పాత ముక్తలా మారిపోగలనా!? వేదమంత్రాల నడుమ, అగ్నిసాక్షిగా నా మెడలో ముడివడిన ఈ బంధం నన్ను ఇలా అపహాస్యం చేయకుండా ఉండేదా!

గడచినకాలం గుప్పిటసందుల్లోని ఇసుకలాగా జారిపోయింది. దాన్ని వెనక్కి తిరిగి తీసుకొచ్చే శక్తి మనకిలేదు. ఆ పాటిదానికి ఇన్ని సార్లు క్షమాపణలు కోరడం దేనికి!

'వస్తాను బావా'' కారు డోర్ తీసుకుని దిగబోయాను.

"ఆగు ముక్తా... దైవదర్శనం చేసుకోవద్దూ...'' ఆపాడు బావ.

పగలబడి నవ్వాలనిపించింది. అది నడిరోడ్డు కాబట్టి బలవంతాన ఆపుకున్నాను. నాకు తెలియకుండానే నా కళ్లలో నీళ్ళు తిరిగాయి. అప్పుడే అర్థమైంది... నా మనసు బాగా గాయపడిందని.

విరక్తిగా నవ్వి కారు దిగిపోయి "థాంక్స్ బావా... నువ్వు, కీర్తన కలిపి చేసుకోండి దైవదర్శనం' అనేసి , కిందికి వెళ్ళే బస్సులు ఆగి ఉన్న చోటుకి వెళ్లి నిలబడ్డాను.

నా వెనుకే వచ్చాడు బావ.

"పద ముక్తా... నిన్ను కార్లో డ్రాప్ చేస్తాను.'' అన్నాడు అపరాధ భావన నిండిన స్వరంతో.

" వద్దు బావా... నేను బస్ లో వెళ్లిపోతాలే.'' చెప్పాను పొడిగా.

"ముక్తా... ఇఫ్ యు డోంట్ మైండ్...'' పర్స్ లో నుంచి ఐదువందల నోట్లు తీశాడు బావ.

చురుగ్గా చూశాను. ' ఏ అధికారంతో, ఏ హక్కుతో ఆడబ్బు తీసుకోను!' అని ఆ చూపులు అతడిని నిలదీశాయేమో!...మాట్లాడకుండా జేబులో పెట్టేసుకున్నాడు.

"వస్తాను బావా... ఏం జరగాలో త్వరగా ఆలోచించు. అది నీకు, నాకు చాలా మంచిది.'' బస్ కదులుతూండగా చెప్పాను.

తల దించుకున్నాడు బావ. అతడిని చూస్తే బాధనిపించింది.

' ఒక చిన్న ప్రతిఘటన' మా ఇద్దరి జీవితాలనూ నాశనం కాకుండా కాపాడేది కదా! మూలిగింది హృదయం. కన్నీటిపొరల మధ్యన బావ రూపం అస్పష్టంగా కనిపించింది. బస్ కదిలింది నెమ్మదిగా. కర్చీఫ్ తో కళ్లు తుడుచుకుని, బావకి చేయూపాను .

---------------------- --------------------
--------------------

" నీకోసం మంజూష వచ్చింది.'' ఇంటికి వచ్చి ఫ్రెష్ అయ్యాక, అమ్మచేసిన ఉప్మాని తింటున్న నాకు పొలమారి, ముద్ద గొంతుకి అడ్డపడింది. నెత్తిమీద అరచేత్తో కొట్టుకుని చెంబెడునీళ్ళు గటగటమని తాగేశాను.

అమ్మ ముఖం అప్రసన్నంగా ఉంది. నేను అబద్ధం చెప్పి వెళ్ళానని ఆవిడకి కోపమొచ్చిందని బోధపడింది.

మాటలకోసం తడుముకుంటూ "అదీ...అదీ" అంటూ నీళ్ళు నమిలాను.

"ఎప్పుడూ అబద్ధం చెప్పని నువ్వు, ఏనాడూ మా అనుమతి లేకుండా గడపదాటి వెళ్ళడం అలవాటు లేని నువ్వు అలా వెళ్లావంటే ఏదో కారణం ఉండే ఉంటుందని నాకు తెలుసు. ఆ కారణం ఏమిటని నిన్ను నిలదీయను. నీకు చెప్పాలనిపిస్తే చెప్పు.'' ఎప్పుడొచ్చారో... వంటగది గుమ్మంలో నిలబడిన నాన్న అన్నారు.

ఆయన ముందు దోషిలా తలదించుకుని నిలవాల్సి వచ్చినందుకు నాకు చాలా ఇబ్బందిగా ఉంది. అవనీ... నేను అలా ఎందుకు వెళ్లాల్సి వచ్చిందో చెప్పడానికి తగిన సందర్భం వెతుక్కోకుండా

కాలం కలిసివచ్చింది. ఎప్పటికైనా ఈ విషయం వాళ్ళకి తెలియాల్సిందే.

తింటున్న కంచాన్ని అలాగే వదిలేసి నాన్న దగ్గరకి వచ్చి విషయమంతా పూస గుచ్చినట్లుగా వివరించాను.

నాన్న కళ్లలో ఆశ్చర్యం...ముఖంలో అపనమ్మకం. తన తోడబుట్టిన చెల్లెలు స్వార్థంతో ఇంత దగా చేసిందంటే ఆయనకి నమ్మబుద్ధి కావడం లేదు. మాటరానట్లుగా అలా కుర్చీలో కూలబడిపోయారు.

"నీసలు బుద్ధుందే... వాడేదో చెప్పాడుట... 'తగుదునమ్మా' అంటూ ఈవిడగారు 'తందానతాన' అని వచ్చేసిందట. ఏమనుకుంటున్నారే పెళ్లంటే! బొమ్మలాట అనుకుంటున్నారా? అగ్నిసాక్షిగా నిన్ను పెళ్లాడి ఇప్పుడు నట్టేట ముంచేసి పోతాననడానికి వాడికి మనసెలా వచ్చింది? వాడిమీద నీకు సర్వాధికారాలూ ఉన్నాయి. వాడు నీ మెడలో తాళి కట్టాడే... ఆ అధికారం చాలు వాడిని నిలదీయడానికి. ఏమండీ... అలా చూస్తూ కూర్చున్నారేమిటి? పదండి మీ చెల్లెలిని అడగాల్సిన నాలుగూ అడిగేసి, కడిగేసి పారేద్దాం." అమ్మ ఆపకుండా అరుస్తూనే ఉంది.

నాన్న మౌన మహర్షిలా కూర్చున్నారు.నేను కూడా సమాధానం చెప్పకుండా అలా బొమ్మలా కూర్చుండిపోయాను ఇంటిచూరులో ' కిచకిచ'మంటూన్న పిచికపిల్లలను చూస్తూ. అరచి అరచి అమ్మ అలసిపోయింది.

ఎప్పుడు కబురు వెళ్లిందో గాని పెద్దక్క , బావగారు వచ్చేశారు.

అందరూ కలిసి ఏం చేయాలా అని తర్జనభర్జనలు పడుతున్నారు.

"నాన్నా ముక్తా... తొందరపడ్డావేమోరా?" కాస్సేపటిగా అన్నారు నాన్న శాంతంగా.

నేను ఒక్క ఉదుటున ఆయన దగ్గరకి వెళ్ళిపోయి ఆయన ఒడిలో ముఖం దాచుకున్నాను. ఇందాకటినుంచీ నా గుండెల్లో అణగదొక్కి ఉంచి ఆక్రోశమంతా బద్దలైన క్షణం అది. నిజానికి నా బాధ తగ్గుముఖం పట్టిందనుకున్నాను ఇందాక. కాని, అది తాత్కాలికమని నేను భోరుమన్నప్పుడు తెలిసింది.

"తల్లీ...వద్దురా... ఏడవకు. నీకిష్టం లేకపోతే నువ్వక్కడికి వెళ్లద్దు. కాని, సావిత్రి ఇలా ఎందుకు చేసిందో నాకు అర్థం కావడంలేదు. పుట్టింటి అనుబంధం శాశ్వతం కావాలంటే ఇలానే చేయనక్కరలేదు. అది నిలబెట్టుకోవడానికి మా మధ్య రక్తసంబంధమే చాలును." అన్నారు ఓదార్పుగా నా వెన్ను నిమురుతూ.

చాలు... నాన్న నన్ను అర్థం చేసుకున్నారు. నా మనసులో రగులుతున్న అగ్నిగుండాన్ని ఆర్పేశక్తి కేవలం నాన్న పలికే ప్రియవచనాలకే ఉంది.

"ఏంటండీ మీరు కూడానూ...అదేదో తలతిక్కగా వాగితే మీరు సమర్థిస్తారేమిటి! అసలు... సంబంధం కలుపుకుందామని మనమేమన్నా దేవురించామా!తనంత తానుగా వచ్చి పిల్లనిమ్మని అడిగి దాని బతుకు నట్టేట్లో ముంచింది మీ చెల్లెలు.పదండి...వెళ్ళి ముఖంకాల్చి మంగళహారతి పాడుదాం." అమ్మ అంది ఆగ్రహంగా.

"అవును మామయ్యగారూ...ఇప్పుడు అతడు ముక్తకి విడాకులిస్తే తన బతుకు ఏమౌతుంది? నలుగురిలో నవ్వులపాలవదూ! ఆడపిల్లకి పెళ్ళైన తరువాత అత్తవారిల్లే శాశ్వతస్థానం కావాలి. అదే ఆమెకి గౌరవం కూడానూ." బావగారు సలహా ఇచ్చారు.




"ఏం గౌరవం బావగారూ... నేనక్కడే ఉంటే వాళ్లింట్లో షోకేసులో అందాన్ని పెంచే బొమ్మకీ నాకూ తేడా ఏముంటుంది! నాతో కాపురం చేసేది లేదని అతడు తెగేసి చెప్పిన తరువాత నేను అతడి నీడకోసం పాకులాడితే అది ఆత్మవంచనే అవుతుంది. నా వలన మీ అందరి పరువూ పోతుందంటే చెప్పండి... ఏ నూతిలోనో దూకుతాను..."స్థిరంగా చెప్పాను.

అక్క ఏదో అనడానికి నోరు తెరిచింది.

"ఇక ఈ విషయంలో వాదోపవాదాలు అనవసరం.ఇప్పటికే దాని జీవితం గాడి తప్పింది. ఇంకా ముందుకుపోయి దాన్ని మరింత రవ్వలపాలు చేయలేను.దాని ముఖాన ఇంతే రాసుందనుకుందాం. దాని మనసెంతో కష్టపడితే గాని, ఇలాంటి నిర్ణయానికి రాదు. నా బిడ్డ నాకు బరువుకాదు. నేను బతికున్నన్నినాళ్ళూ దానికింత ముద్ద పెట్టలేకపోను " విసురుగా అన్నారు నాన్న.

ఎన్నడూ ఎవరినీ కూడా పరుషంగా ఒక్క మాటకూడా అనని నాన్న... అలా...కర్కశంగా మాట్లాడడంతో బిత్తరపోయి చిత్తరువులై నిలిచిపోయారందరూ. ఆయన స్వరంలోని తీవ్రతకి కుక్కిన పేలకి మల్లే ఉండిపోయారు. బావగారు ముఖం గంటుపెట్టుకున్నారు.

అమ్మ మరేమీ అనలేక" బాగుంది వరస.. పిల్లదేదో తొందరపాటు నిర్ణయం తీసుకుంటే నాలుగు మంచిమాటలు చెప్పి కాపురం చక్కదిద్దాలి కాని, గుండెలమీద కుంపటిలా అట్టిపెట్టుకుంటాననంటారేమిటీ..." సణుక్కుంటూ లోపలికి పోయింది.

బామ్మ నన్ను కౌగిలిచుకుని "ముక్తమ్మా... నీకెంత కష్టం వచ్చిందే! అసలే... నోరు-వాయి లేని పిల్లవి.పెద్దవాళ్లందరం కలిసి నీ బతుకు బుగ్గి చేసి పారేశాము కదే." అంటూ ఉసూరుమని ఏడ్చింది.

తమ్ముడు అభావంగా చూసి బయటకుపోయాడు. నాన్నన్న మాటలకి చిన్నబుచ్చుకున్న పెద్దక్క, బావగారు మరే వ్యాఖ్యానాలూ చేయక నిష్క్రమించారు.

సర్వం కోల్పోయిన బికారిలా అలా... శూన్యంలోకి చూస్తూండిపోయాను. నా జీవితంలో మిగిలింది

శూన్యం కాక మరేమిటి!?

-------------------                                        --------------------

---------------------

ఆ తరువాత జరగాల్సినవన్నీ చకచకా జరిగిపోయాయి. పెద్దక్క ద్వారా విషయం తెలుసుకున్న చిన్నక్క నాకు ధైర్యం నూరిపోస్తూ పెద్ద మెయిల్ పెట్టింది.


“జరిగినదేదో జరిగిపోయింది ముక్తా... దాని గురించి ఆలోచిస్తూ మనసు పాడుచేసుకోకు.పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తిచేసి నీ కాళ్లమీద నువ్వు నిలబడు. నీకే సహాయం కావాలన్నా అందించడానికి నీ అక్క ఉందన్న విషయం మరచిపోకు.'' అంటూ ఎన్నో హిత వచనాలు రాసింది.

ఆ మెయిల్ నాలో ఆత్మవిశ్వాసం నింపింది. సరిగ్గా అప్పుడే నాకు పిజిలో సీట్ వచ్చింది. పెళ్లికి ముందు ఆ.సెట్ రాశాను. అప్పుడు మంచి రాంకే వచ్చినా సీట్ కన్ఫర్మ్ కాలేదు. కాని, ఫైనల్ లిస్ట్ లో నాకు సీటు లభించింది. ఉన్న ఊరిలో ఉన్న పి.జి. సెంటర్ లోనే నాకు అడ్మిషన్ దొరికింది.

బావ , నేను కలిసి మాట్లాడుకున్న పదిరోజులకి కాబోలు... అత్తయ్య మా ఇంటికి వచ్చింది.మనిషిలో కళాకాంతులు కొరవడ్డాయి. అత్తయ్యే నాన్నను పలకరించింది మొదట. నాన్న గంభీరంగా తలాడించారు. అమ్మ ముఖం తిప్పుకుంది ఆడపడుచుని చూసి.

“అన్నయ్యా... అదీ...'' ఏదో చెప్పబోతున్న అత్తయ్యని వారిస్తూ “వద్దమ్మా సావిత్రీ... సంజాయిషీలేమీ చెప్పద్దు... నువ్వు, నీ కొడుకు కలిసి నా బిడ్డ జీవితంలో నిప్పులు పోశారు. దయచేసి ఇకమీద నువ్వు ఈ ఇంటిగుమ్మం తొక్కద్దు... నిన్ను చూశానంటే నా బంగారుతల్లికి జరిగిన అన్యాయం గుర్తొస్తుంది. ఇకపై ఈ ఇంటిఛాయలకి కూడా రావద్దు.'' కరాకండిగా చెప్పేశారు నాన్న.

గుడ్లనీరు కుక్కుకుంది అత్తయ్య .అమ్మకాని, బామ్మకాని ఆమెని ఓదార్చే ప్రయత్నం చేయలేదు. ఇంట్లోని వారికి ఇష్టంలేని పెళ్లి చేసుకుని ఓసారి పుట్టింటికి దూరమైన అత్తయ్య... కొడుక్కి ఇష్టంలేని పెళ్లిచేసి శాశ్వతంగా దూరమైంది. ఆ బంధం అతుక్కుంటుందన్న నమ్మకం ఎవరికీలేదు.




అత్తయ్య కళ్ళు తుడుచుకుంది. నేను లోపలికి వెళ్లి పెళ్లిలో ఆవిడ నాకు పెట్టిన నగలని బాక్స్ తో సహా తెచ్చి ఆమె ముందుంచాను.

"ఇవెందుకు ముక్తా... అవి నీకోసం చేయించినవే..'' అంది అత్తయ్య విస్తుపోతూ.

"కాదత్తయ్యా... ఇవి నీ కోడలికోసం చేయించినవి. వీటిని పెట్టుకునే యోగం, యోగ్యత రెండూ నాకులేవు.'' నా కంఠ తొణికిన నీరు చూసి అత్తయ్య ముఖం పాలిపోయింది.

"అలా అనకు ముక్తా...ఇవి నీవే. నా మేనకోడలికి కానుక ఇచ్చే అదృష్టానికి నన్ను దూరం చేయకు.'' అంది అత్తయ్య భారంగా.

"ప్లీజ్ అత్తయ్యా... నన్ను బలవంతం చేయకు.'' అన్నాను పదునుగా.

అత్తయ్య మరేమీ మాట్లాడకుండా బ్యాగ్ తెరచి సరికొత్త ఐదువందల రూపాయల నోట్లకట్ట తీసి నా చేతిలో పెడుతూ "నేను చేసిన తప్పునెలాగూ సరిదిద్దుకోలేను. కనీసం... ఇదన్నా తీసుకో'' అంది వణుకుతున్న గొంతుతో.

"బండలైపోయిన నా బతుక్కి మూల్యం కడుతున్నావా అత్తయ్యా?'' బాధగా అన్నాను.

"అపార్థం చేసుకోకు ముక్తా... దేనికైనా పనికి వస్తుంది'' అనునయంగా అంది అత్తయ్య.

"వద్దు... ఈ డబ్బు తీసుకోవడానికి నాకు మనసు రావడంలేదు.'' సున్నితంగా తిరస్కరించాను.


చేసేదేంలేక అత్తయ్య వెనుదిరిగింది. నేను బండబారిన హృదయంతో అలా నిశ్చేష్టనై చూస్తూ

ఉండిపోయాను.

-------------------

----------------------                                                            -------------------

అనుకున్నట్లుగానే నేను పి.జి.లో చేరిపోయాను మా ఊరిలోనే. పరస్పరం ఇష్టంలేకపోవడం వలన నాకు, బావకి విడాకులు సులభంగానే లభించాయి.




ఇద్దరం ఇప్పుడు స్వేచ్ఛాజీవులం. కోర్టు తీర్పు లభించాక బావ నాకు కృతజ్ఞతలు చెప్పాడు. నేను దేవతనని, నా సహకారంవల్లనే ఇప్పుడు తన బతుకులో ఆనందం చోటుచేసుకుంటోందని, తన ప్రేమనర్థం చేసుకుని పక్కకు తప్పుకున్నందుకు జీవితాంతం ఋణపడి ఉంటానని... ఇలా... నా పైన ప్రశంసలజల్లు కురిపించాడు.

వాటికి నేను పొంగిపోలేదు. ఈ విడాకుల వలన నాకు కూడా విముక్తి దొరికింది. ఆత్మాభిమానం చంపుకుని జీవించడమంత హీనం మరొకటి లేదు. అందుకే... నేను కూడా అతడినుండి విడిపోవాలని కోరుకున్నాను.

బావ నాకు భరణం ఇస్తానన్నాడు. అవసరం లేదని నిరాకరించాను.

అలా... ఒక ప్రహసనంలా సాగిన నా పరిణయఘట్టానికి ముగింపు దొరికింది.

అయితే... నా సమస్య అక్కడితో తీరిపోలేదు. నిజానికి నా బతుకులో కొత్తమలుపు మొదలైనదప్పుడే.

------------------ ----------------------- -------------------------

ఆరోజు సాయంత్రం కాలేజ్ నుంచి ఇంటికి వచ్చాక ఫ్రెష్ అయ్యి అక్కవాళ్ళింటికి బయలుదేరాను. నేనిలా సందుమలుపు తిరిగానో లేదో... సర్రున ఓ మోటార్‌బైక్ వచ్చి నాముందు ఆగింది.

దానిమీద వెంకటేష్... అదే... శ్రీధర్ కూర్చుని ఉన్నాడు. అతడికి డబ్బుమత్తు బాగా ఒంటపట్టినట్లుంది... ఒళ్ళుచేసి పచ్చగా, దబ్బపండులా మెరిసిపోతున్నాడు.

నేను అతడివైపు ప్రశ్నార్థకంగా చూస్తూ నుదురు చిట్లించాను.

"నీతో మాట్లాడాలి ముక్తా..'' అన్నాడు.

నాకర్థం కాలేదు. సరిగ్గా రెండేళ్ల క్రితమూ ఇదే మాటన్నాడు. అప్పుడంటే ఇద్దరం అవివాహితులం. కాని, ఇప్పుడు... మా ఇద్దరికీ పెళ్లిళ్ళైనాయి. పైగా అతడో బిడ్డకు తండ్రి కూడానూ.

"నాతోనా! ఏం మాట్లాడుతావు?'' అడిగాను ఆశ్చర్యంగా.

అతడు దూరంగా వేలుచూపిస్తూ "అలా వెళ్ళి మాట్లాడుకుందాం.'' అన్నాడు.

మా వీధికి ఎదురుగా పెద్ద మర్రిచెట్టు ఉందక్కడ. దాని చుట్టూ కట్టబడి ఉన్న పెద్ద రాతి అరుగుమీద అందరూ కూర్చుని కబుర్లు చెప్పుకోవడం పరిపాటి. ఆరోజు కాస్త మబ్బుగా ఉండడం మూలాన ఎవరూ లేరక్కడ.

"సరే పద" అటువైపు అడుగులు వేశాను.

ఇద్దరం ఓ వారగా కూర్చున్నాం. మబ్బుతెరలను తొలగించుకుని అప్పుడప్పుడు పలకరించిపోతున్న నారింజరంగు సాయంకాలపు నీరెండ అద్భుతంగా ఉంది.

"చెప్పు'' అన్నాను ఎటోచూస్తూ.

"ఏమీలేదు ముక్తా... అప్పుడూ ఇప్పుడూ... ఎప్పుడూ కూడా నువ్వంటే నాకు అభిమానమే. పెళ్లంటే వేరే అమ్మాయిని చేసుకున్నాను గాని, నా మనసంతా నీమీదే'' చేతులు నులుముకున్నాడు శ్రీధర్.

"అయితే?'' అతడి మాటల్లో గూఢార్థం నాకు బోధపడలేదు.

"మనిద్దరం ...ఒక్కటైతే బాగుంటుందనీ...''

"ఎలా? నీకూ పెళ్లైంది... నాకూ పెళ్లైంది.'' అయోమయంగా అడిగాను.

" ఒక్కటవడానికి... పెళ్లికి సంబంధం ఏమిటి ముక్తా?'' ఫెళ్ళున నవ్వాడు శ్రీధర్ నా అమాయకత్వానికి.

“ ఏం మాట్లాడుతున్నావో తెలుస్తోందా?’ అరిచాను గట్టిగా.

అతడదేమీ పట్టించుకోకుండా “నిజానికి నీ జీవితం చాలా దయనీయంగా తయారైంది. పెళ్లయ్యిందన్నమాటే కానీ, ఏం సుఖపడ్డావు? నీకు నచ్చితే, అభ్యంతరం లేకపోతే... ఆ సుఖం నేనందిస్తాను.’’ చెప్పుకుపోయాడు వంకరగా నవ్వుతూ.

అతడి ఆంతర్యం అర్థమై గజగజ వణికిపోయాను తుఫాను గాలికి అల్లాడిన చిగురుటాలా. నా కళ్ళకి అతడు అమాయక మేకను వేటాడడానికి అవకాశం కోసం పొంచిఉన్న పెద్దపులిలా కనబడ్డాడు.

“నువ్వు ఒక పెళ్ళైన అమ్మాయితో మాట్లాడుతున్నానని మరచిపోతున్నావు.’’ కోపంతో ఊగిపోయాను.

అతడు ఇసుమంతైనా చలించలేదు.

“పెళ్లైనా నువ్వింకా కన్యవేనని నాకు తెలుసు ముక్తా... నీ మొగుడుట్టి మూర్ఖుడు. ఇంత అందాన్ని ఎదురుగా పెట్టుకుని ఎంజాయ్ చేయకుండా వదిలేసిన ప్రవరాఖ్యుడు. అదే నేనైతేనా?’’ కవ్వింపుగా అన్నాడు శ్రీధర్.

నాకు నసాళమంటింది. ఇరుగమ్మ పొరుగమ్మల సానుభూతి పొందడం కోసం నా ఆంతరంగిక విషయాలని సినిమా కథలా మా వీధంతా టాంటాం వేసిన అమ్మని తలచుకుంటే మండిపోయింది.

వీడింత ధైర్యంగా నేను కావాలని అడుగుతున్నాడంటే దానికి కారణమేమిటి? నా సొంత సంగతులు బహిరంగమైపోవడం వల్లనే కదా!

వాడి రెండుచెంపలూ పేలగొట్టాలన్నంత ఆవేశం కలిగింది. అది నడిరోడ్డు కావడం వలన నన్ను నేనే కంట్‌రోల్ చేసుకున్నాను.

“ ఇంకొక్క మాట మాట్లాడినా ఊరుకునేది లేదు శ్రీధర్. మరొక్కసారి ఇలాంటి ఛండాలం ప్రపోజల్ తో నా ముందుకి వస్తే మర్యాద దక్కదు జాగ్రత్త’’ భద్రకాళిలా విరుచుకు పడ్డాను.

వాడు నన్ను ఎగాదిగా చూసి, పెదవి విరిచి “ ప్చ్... పోనీపాపం వయసు పోరు పెడుతూ ఉంటుంది... కాస్త తాపం తీరుద్దామనుకున్నాను. నీకు అదృష్టం లేదు. నీ అందాన్ని ఆస్వాదించే యోగం నాకులేదు. ఏం చేస్తాం! బ్యాడ్‌లక్. ఎప్పుడైనా నీ మనసు మార్చుకుంటే కాకితో కబురుపెట్టు. క్షణాల్లో నీ ముందు వాలిపోతాను.’’ అనుకుంటూ వెళ్ళి బైక్ స్టార్ట్ చేశాడు వాడు.

వాడు వెళ్లినవైపు అసహ్యంగా చూస్తూ “డర్టీ రాస్కెల్... సుఖాలందిస్తాడట...సుఖాలు. వీడందించే ఆ దరిద్రపు సుఖాలకోసం ఎవరూ కూడా వెంపర్లాడిపోవడం లేదిక్కడ.’’ అనుకున్నాను కసిగా.

మొగుడొసిలేసిన ఆడపిల్ల అంటే ఈ మగాళ్ళకి ఎంత చిన్నచూపో అర్థమైంది తొలిసారిగా. ఆ సంఘటన తరువాత నా మనసంతా చిరాగ్గా తయారైంది. ఇక అక్కవాళ్లింటికి వెళ్ళే మూడ్‌లేక తిరిగి ఇంటికేసి బయలుదేరాను.

--------------------- ---------------------
-----------------------

కాలగతిలో మరో రెండేళ్ళకాలం పరుగులు తీసింది. నా పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తయింది. ఉద్యోగంకోసం వెతుకులాట మొదలైంది.

ఈలోపు ఇంట్లో చెప్పుకోదగిన మార్పులే వచ్చాయి.నాన్న అనారోగ్యంతో నానాటికీ కృశించిపోసాగారు.

జబ్బు చేసింది ఆయన శరీరానికి కాదు. మనోవ్యాధే ఆయన్ను లొంగదీసుకుంది.

బామ్మకి ఏదో... పెరు తెలియనిజబ్బు వచ్చి నెలరోజులపాటు మంచంలో తీసుకుని. తీసుకుని కన్నుమూసింది. ఆ ఇంటికి పెద్దదిక్కుగా నిలిచిన ఆమె ప్రాణం అనంతవాయువుల్లో లీనమైన తరువాత మాకు దుఃఖం ఆగలేదు.

వృద్ధాప్యం... ఆపైన వచ్చిన మాయదారి జబ్బు ఆమెని కడతేర్చాయి.

దినేశః ఇంజనీరింగ్ చదువు పూర్తయ్యింది. వాడికి ఎలక్ట్రిసిటీ బోర్డ్ లో జె.యి.గా ఉద్యోగం వచ్చింది. నాకు కూడా ఒక డిగ్రీ కాలేజీ లో ఉద్యోగం వచ్చింది. కాని, మేముంటున్న ఊళ్లోకాదు.

ఏం చేయాలోనని విపరీతంగా ఆలోచించాను.

ఆరోగ్యం సరిగ్గా లేని నాన్నని, మనశ్శాంతి లేక అలమటించె అమ్మని విడిచిపెట్టి ఉద్యోగం పేరిట వాళ్లకి దూరంగా వెళ్లడానికి మనస్కరించలేదు.

కాని, తప్పదు. ఈ ఊళ్లో... ఈ వీధిలో... పరిచయస్తుల జాలి చూపులు,కొంటెకుర్రాళ్ళ ఆకలిచూపులు, ఇరుగుపొరుగుల ఉచిత సలహాలు...ఇవన్నీ భరింపశక్యం కాకుండా ఉన్నాయి.

అందుకే...నేనెవరో తెలియని చోటుకి, నా గతం గురించి ఎవరికీ పరిచయం లేని ప్రదేశానికి వెళ్లిపోవాలని నిశ్చయించుకుని ఇక్కడికొచ్చి ఈ ఉద్యోగంలో చేరాను.

నేను ఉద్యోగంలో చేరకముందే...నాకు బాగా సన్నిహితులైన ఒకరిద్దరు నన్ను మళ్లీ పెళ్లి చేసుకోమని సూచించారు. రెండు మూడు మంచి సంబంధాలు కూడా చూపించారు.

యాధాలాపంగా ఆ విషయాన్ని ఇంట్లో చెప్పిననాడు అమ్మ పెద్ద గాలి దుమారమే లేపింది.

' మొగుడొదిలేసిన దానికి మళ్ళీ పెళ్ళేమిటని, ఆడదానికి ఒకే పెళ్లి, ఒకే మొగుడు ఉండాలని' ఇంకా ఇలాంటివే చాలా చెప్పి నా ఆలోచనకి అడ్డుకట్ట వేసింది.

అంతేకాదు... నేను ఇక్కడికొచ్చేముందు నా చేత తన మీద ప్రమాణం చేయించుకుంది. అదీ ఆ దేముడి సమక్షంలో.

' రెండో పెళ్లి' అన్న ఊహను పొరబాటున కూడా నా మెదడులోకి రానివ్వద్దని నా చేత ఒట్టు పెట్టించుకుంది. ఈ తతంగమంతా నాన్నకి తెలియకుండా అతి రహస్యంగా జరిగింది.

ఆ పరిస్థితుల్లో... ఆమె చెప్పినదానికి 'సై' అనకపోతే ఆమె మానసికంగా ఇంకా క్షోభ పడుతుందని నేనలా ఒట్టు పెట్టాను.

అయితే... నాదీ ఉప్పూకారం తింటున్న శరీరమే. నాకూ అందరిలాగే సుఖప్రదమైన దాంపత్యజీవితాన్ని అనుభవించాలని, ముద్దులొలికే బిడ్డలకి తల్లినై బతుకు పండించుకోవాలని మరీమరీ అనిపిస్తుంది.

కాని, అమ్మమీద వేసిన ఆ ఒట్టు ఆ కోరికను మొదలంటా నరికేస్తుంది..


ప్రకృతిసిద్ధంగా నా మనసులో పుట్టే కోరికలను చంపుకోలేక, అమ్మ మీద చేసిన ప్రమాణం మీరలేక ఎంతో నరకం అనుభవిస్తున్నాను.

--------------------- ------------------------ -----------------------

" ఆ తరువాత సంగతులు నీకు తెలిసినవే. నీతో పరిచయం స్నేహానికి సరికొత్త భాష్యం చెప్పింది. నా జీవితంలో నిండిన శూన్యాన్ని నీ చెలిమి ద్వారా భర్తీ చేసుకుంటున్నాను.'' దీర్ఘంగా నిట్టూర్చింది మౌక్తిక తన గతచరిత్రనంతా చెప్పాక.

అప్పటికి బాగా చీకటి పడిపోయింది. నక్షత్రసమూహాలని కూడగట్టుకుని నెలరాజు రంగప్రవేశం చేస్తున్నాడు. రమ్య మౌక్తిక దగ్గరగా వచ్చి ఆమె తల నిమిరింది. ఆ లాలనకి మౌక్తికలో ప్రజ్వరిల్లిన దుఃఖాగ్ని కాస్త ఉపశమించింది.

" రియల్లీ అయాం వెరీసారీ ముక్తా... నీ జీవితంలో ఇంతటి విషాదం ఉందని ఊహించలేదు ముక్తా. ' ఇంతటి అందగత్తెకి, బుద్ధిమంతురాలికి ఇంకా పెళ్లెందుకు అవలేదు చెప్మా' అనుకునేదాన్ని. నిజం తెలిశాక నాకు చాలా బాధగా ఉంది. మీ అమ్మగారు నీకు విధించిన ఆంక్షలు మాత్రం అమానుషం. నువ్వు కూడా ఆవిడమాటకి కట్టుబడి నీ జీవితాన్ని అడవికాచిన వెన్నెలలా చెసుకోవడం విచారకరం.




“ఏం చేయను రమ్యా?ఆవిడ సంతృప్తికోసమని , నాన్న ఆరోగ్యం దృష్టిలో పెట్టుకుని నేను చేసిన ప్రమాణం అనుక్షణం నన్ను వెంటాడుతోంది. ఒట్టుతీసి గట్టున పెట్టి నా స్వార్థం చూసుకుంటే ఏమౌతుందోనన్న భయం నన్ను మళ్ళీపెళ్ళి గురించి ఆలోచించనివ్వడం లేదు.

నేనూ మనిషినే. నాకూ కోరికలున్నాయి. ఆశలున్నాయి.కాని, అవి నెరవేరే భాగ్యం మాత్రం నాకులేదు. తోడుకావాలంటూ నా మనసు, వయసు చేసే అల్లరి తట్టుకోలేక, తెగించి అడుగు ముందుకేయలేక నాలో నేనే నలిగిపోతూ నరకమనుభవిస్తున్నాను.'' మొట్టమొదటిసారి మనసు తలుపులు తెరచి తనివితీరా ఏడిచింది మౌక్తిక.

రమ్య కళ్లలో కూడా నీళ్ళు తిరిగాయి. చప్పున మౌక్తికను గుండెలకి హత్తుకుని “ఊరుకో ముక్తా... రిలాక్స్. ఈ పెద్దవాళ్లంత మూర్ఖులు మరొకరుండరు. మీ అమ్మగారు సంఘంలో పరువు-ప్రతిష్ఠ వీటన్నింటి గురించే ఆలోచించారు గాని, నీ సుఖసంతోషాల గురించి పట్టించుకోలేదు. ఈ రోజుల్లో కూడా ఇలాంటి ఛాందస భావాలున్నవాళ్లు ఉన్నారంటే ఆశ్చర్యంగా అనిపిస్తోంది.

దీన్నిబట్టి చూస్తే... ఆ రోజుల్లో మన సమాజంలో వేళ్లూనుకుని ఉన్న సాంఘికదురాచారాలను రూపుమాపడానికి ' ఆ రాజారామ మోహన్ రాయ్, వీరేశలింగం పంతులుగారు' లాంటి సంఘ సంస్కర్తలు ఎంతగా కృషిచేశారో, ఈ సమాజానికి ఎంతగా ఎదురీదారో బోధపడుతోంది.'' ఆవేశంగా అంది రమ్య.

“అమ్మనేమీ అనకు రమ్యా... చెప్పాను కదా...ఆవిడవన్నీ పురాతనభావాలు. బామ్మ బతికుంటే నా సంగతి ఎలా ఉండేదోమరి!'' వెక్కుతూనే వారించింది మౌక్తిక.

“అదే చెప్తున్నా...ఈ సమాజం ఒంటరి ఆడదాన్ని ఎంత చిన్నచూపు చూస్తుందో ఆవిడ ఎరుగనిది కాదు. ఎల్లకాలమూ నువ్విలా మోడువారిన చెట్టులా బతుకునీడవడం అంటే మాటలుకాదు! జీవితాంతం తోడుగా నడవాల్సిన సహచరుడు లేక, కడుపునపుట్టిన బిడ్డల ఆదరణలేక సాగే స్త్రీ జీవితం ఎంత దుర్భరంగా ఉంటుందో ఆవిడకి తెలియదా!?'' పూనకం వచ్చినట్లుగా ఊగిపోయింది రమ్య.

మౌక్తిక మాట్లాడలేదు.

“పోనీ... అదంతా పక్కనపెట్టు. ఇప్పుడు నీకు మంచి అవకాశం వచ్చింది. నువ్వు ' ఊఁ' అనాలేగాని మధుకిరణ్ నిన్ను పెళ్లిచేసుకునేందుకు సుముఖంగా ఉన్నాడు. నువ్వు ' యస్' అని ఒక్కమాటంటే చాలు... మీ అమ్మగారిని నేను ఒప్పిస్తాను. ' నౌ బాల్ ఈజ్ ఇన్ యువర్ కోర్ట్' '' అంది రమ్య.

మౌక్తిక ముఖం అంతా రక్తం ఇంకిపోయినట్లుగా పాలిపోయింది. ఎప్పుడో ఒకప్పుడు మధుకిరణ్ తన ప్రేమను వ్యక్తపరుస్తాడని ఆమెకూ తెలుసును కాని, అతడినేరకంగా ఎదుర్కోవాలో మాత్రం తోచలేదు.

మధుకిరణ్ లాంటి జీవిత భాగస్వామి దొరకాలంటే ఏ జన్మలోనో బంగారుపూలతో పూజలు చేసుండాలి. కాని, తాను చేసిన పూజలు, నోచిన నోములు అన్నీ అసంపూర్ణమైనవి అయ్యుంటాయి. ఆ కొరనోముల ఫలితంగానే మేనబావతో పెళ్లైకూడా అతడికి దూరమైంది. ఆ నోముల కారణంగానే ఇవాళ ఆణిముత్యంలాంటి మధుకిరణ్ తనను వలచి వస్తే నిరాకరించ వలసిన దౌర్భాగ్యస్థితి ఎదురైంది.

ఎవరో అన్నట్లు' అదృష్టవంతుడిని చెరిపేవాడు లేడు. నిర్భాగ్యుడిని బాగు చేసేవాడు లేడు' అని... నేను దౌర్భాగ్యురాలుని. ఎవరు చక్కదిద్దాలనుకున్నా తనబతుకు బాగుపడదు.అది అంతే.

“ఏమిటాలోచిస్తున్నావు? ఏం చెప్పాలా అనా? మీ అమ్మనాన్నలు ఎల్లకాలమూ నీకోసం కూర్చోరు. నీ జీవితానికి స్థిరమైన ఆలంబనను నువ్వే వెతుక్కోవాలి.'' హితబోధ చేసింది రమ్య.

“లేదు రమ్యా...అమ్మ మాటను మీరేంతటి మానసిక ధైర్యం నాకులేదు. ఈ జీవితం ఇలా గడచిపోవాలని రాసుంది. అలాగే జరగనీ. ఈ విషయంలో నేను అశక్తురాలిని. అయాం హెల్ప్‌లెస్'' భోరుమంది మౌక్తిక.

“నువ్వింక పిరికిదానివనుకోలేదు ముక్తా...కోరి నీ జీవితం పాడు చేసుకుంటున్నావు'' కిందపెదవిని పంటికింద అదిమిపెట్టింది రమ్య.

“ఎలాగైనా అనుకో... నేను మాత్రం అమ్మమాట జవదాటే సాహసం చేయలేను. అయినా మధుకిరణ్‌కి నా గతం గురించి తెలియదు. అందుకే నన్ను ప్రేమించాడు. నా గురించిన నిజాలు తెలిస్తే మరిక నా జోలికి రాడు.'' విరక్తిగా నవ్వింది మౌక్తిక కళ్లుతుడుచుకుని.

“అతడంత సంకుచితుడు కాదనే నా అభిప్రాయం. అతడు నిన్ను డైరెక్ట్‌గా కలిసిఈ విషయం గురించి ప్రస్తావిస్తే మాత్రం కాస్త వివేకంతో బదులియ్యి. ఇది జీవితం... మంచి అవకాశం ఒక్కసారి

మాత్రమే తలుపు తడుతుంది.'' చెప్పింది రమ్య అదే ఆఖరుమాట అయినట్లుగా.


అప్పటికే ఆ పరిసరాలలో చిక్కటి చీకటి అలుముకుని ఉంది. ఆకాశమంతా నిండిన చంద్రకాంతి ధగధగాయమానంగా వెలిగిపోతూ ఆ చీకటిని తరిమికొడుతోంది. చంద్రుని చల్లదనం మౌక్తిక మనసులో చెలరేగే జ్వాలలను ఏ మాత్రం చల్లార్చలేకపోతోంది.

"ఇందాక అంకుల్ ఏం చెప్పారో విన్నావు కదా! రేపటినుండి నువ్వు యోగా క్లాసులకెళ్ళు.'' చెప్పింది రమ్య.

అలాగేనన్నట్లుగా తలూపింది మౌక్తిక.

"కిందకెళదాం పద... శరత్ వచ్చే వేళయ్యింది.'' మెట్లవైపుగా నడిచింది రమ్య.

అనుసరించింది మౌక్తిక.




-------------------- -------------------- ----------------------

రమ్య చెప్పినట్లే యోగా క్లాసులకి వెళ్తోంది మౌక్తిక. ఇప్పుడిప్పుడే ఆమె మనసు కుదుటపడుతోంది. ధ్యానం చేయడం వలన ఆమె మనసులో కల్లోలం తగ్గి ప్రశాంతత చేకూరుతోంది. యోగాసనాలు వేయడం, ధ్యానంలో కూర్చోవడం...ఇత్యాది సాధనల వలన ఆమె మానసిక, శారీరక ఆరోగ్యాలు మెరుగుపడ్డాయి.

పదేపదే ఆమెను వేధించి, కలవరపెట్టే ఆకల మరిరావడం లేదిప్పుడు.

అంతర్ముఖంగా ఉండడం మానేసి, రమ్యముందు తన మనసు విప్పిచెప్పుకోవడం మూలాన ఒత్తిడితగ్గి, హృదయభారం తీరింది.

నిజమే... ఆనందమైనా , ఆవేదనైనా ఆప్తులతో పంచుకుంటే కలిగే ఊరటే వేరు. ఆవిషయం మౌక్తికకు అనుభవైకవేద్యమైంది .

కాని, అప్పుడప్పుడు... ఆమె మదిలో అనేకానేక భావాల మధ్యన అంతర్యుద్ధం జరుగుతోంది. మధుకిరణ్ తనని ప్రేమిస్తున్నాడని తెలిసినప్పటినుంచీ తన మదిలో చెలరేగే భావసంచలనాన్ని అదుపులో పెట్టలేక ఆమె సతమతమౌతూనే ఉంది.

ఏం చేయగలదు! ఏమీ చేయలేని అసహాయత ఆమెది. కొన్ని చిక్కుముడులను కాలమే విప్పాలి. మానవుడు పరిష్కరించలేని కొన్ని క్లిష్టసమస్యలను... విసుగు విరామంలేక, అలుపుసొలుపు ఎరగక ముందుకు సాగిపోయే కాలమే పరిష్కరించాలి.

-----------------

--------------------------                                        ----------------------

దినేష్ దగ్గరనుంచి ఫోన్కాల్ వస్తూండడంతో క్లాస్ లో ఉన్న మౌక్తిక దాన్ని కట్ చేస్తూ వస్తోంది. కాని, మళ్ళీమళ్ళీ ఆ కాల్ వస్తూనే ఉండడంతో “ఎక్స్క్యూజ్ మి మై డియర్ స్టూడెంట్స్...’’ అని చెప్పి ఫోన్ ఆన్సర్ చేసింది.

ఫోన్లో దినేష్ చెప్పిన విషయం వింటూంటే మెదడు మొద్దుబారిపోయిందొక్కసారిగా. కాళ్లుచేతులు గడగడ వణికాయి.

“ఏ... ఏమైంది దినేష్... నాన్నకేమైంది?’’ స్వరం కంపించింది.

“వివరాలు నేను చెప్పలేనక్కా... నువ్వు వెంటనే బయలుదేరి రా” అనేసి ఫోన్ కట్చేశాడు దినేష్.

మౌక్తికకు దుఃఖం పొంగుకొస్తోంది గట్టు తెగిన వాగులా.

“ మై డియర్ బాయ్స్ అండ్ గర్ల్స్ ...సారీ ఫర్ ది డిస్ట్రబెన్స్...’’అని చెప్పేసి ఉధృతంగా ఉబికివస్తున్న ఏడుపుని అణిచిపెట్టాలని ప్రయత్నిస్తూ ప్రిన్సిపాల్ రూమ్వైపు దూసుకుపోయింది మౌక్తిక.

ఆయనకి విషయం వివరించి వారం రోజుల పాటు సెలవు కోరింది. పరిస్థితిలోని తీవ్రతను అర్థం చేసుకున్న ఆయన మరేమీ అనకుండా సెలవు మంజూరు చేశారు. అప్పుడే పీరియడ్ బెల్ మోగడంతో రమ్య క్లాసునుంచి ఇవతలకి వచ్చింది ఆమెతో సంగతిని క్లుప్తంగా చెప్పేసి తాను ఊరికి వెళ్తున్నట్లుగా చెప్పింది మౌక్తిక.

ప్రిన్సిపాల్ గారి దగ్గర పర్మిషన్ తీసుకుని ఆమెను ఆర్టీసీ కాంప్లెక్స్ లో డ్రాప్ చేసింది రమ్య.

అప్పటికి తాను ఎక్కాల్సిన బస్ రెడీగా ఉండడంతో నిశ్చింతగా ఊపిరితీసుకుంది మౌక్తిక.

"చేరగానే ఫోన్ చేయి ముక్తా...నాన్నగారికేమీ కాదులే... నువ్వు ధైర్యంగా ఉండు.''బస్ కదిలేవరకు ఏవేవో జాగ్రత్తలు చెబుతూనే ఉంది రమ్య.

బస్‌లో కూర్చున్నదన్న మాటేగాని మనసు అలలతాకిడికి కల్లోలమైన కడలిలాగా ఉంది. 'అసలు... నాన్నకేమై ఉంటుంది! దినేష్ ఎందుకు వెంటనే రమ్మని ఫోన్ చేశాడు?' అని ఒకటే కంగారుగా ఉంది ఆమెకి.

దినేష్ ఆమెకు వివరాలేమీ చెప్పలేదు. తండ్రికి బాగాలేదని ఆసుపత్రిలో చేర్చామని మాత్రమే చెప్పాడు. బస్ విజయనగరం చేరేసరికి తెల్లవారుఝామున నాలుగైంది. మౌక్తికను తీసుకెళ్ళేందుకు దినేష్ వచ్చాడు.

"నాన్నకెలా ఉంది?'' అంటూ మౌక్తిక ఆదుర్దాగా అడిగినా సమాధానం చెప్పకుండా మౌనంగా ఉండిపోయాడు.

'భయపడ్డాడు కాబోలు!' అనుకుంది మౌక్తిక. ఇంటికి చేరగానే తలుపుతీసిన శకుంతల కూతురిని చూస్తూనే భోరుమంది. ఏడ్చి ఏడ్చి ఆమెకళ్ళు ఎర్రగా మారి, ఉబ్బిపోయి మంకెనపూవులని తలపింపజేస్తున్నాయి.

దినేష్ ఏమీ మాట్లాడకుండా గదిలోకెళ్ళి తలుపేసుకున్నాడు. మౌక్తికకు అతడి వైఖరి అంతుచిక్కలేదు. ఏ భావమూ లేకుండా అతడంత నిర్లిప్తంగా ఎందుకున్నాడో ఆమెకి బోధపడలేదు.

"ఇంతకీ నాన్నకేమైందమ్మా?'' ఆదుర్దాగా అడిగింది మౌక్తిక.

శకుంతల జిర్రున ముక్కు చీది " హార్ట్అటాక్... ఇరవైనాలుగ్గంటలసేపు అబ్జర్వేషన్‌లో పెట్టాలని డాక్టర్స్ చెప్పారు'' చెప్పింది వెక్కిళ్ళుపెడుతూ.

"మరి హాస్పిటల్‌లో ఎవరున్నారు?''

"పెద్దక్క, బావగారు ఉన్నారు. రాత్రి పదకొండింటివరకు నేనక్కడే ఉన్నాను. ఎక్కువమంది ఉండకూడదని అక్కడి నర్సులు కోప్పడితే పెద్దక్కే... బలవంతంగా నన్ను ఇంటికి పంపింది. నాన్న ఐసియు లో ఉన్నారు. నాకెందుకో భయంగా ఉందే ముక్తా...'' మరోసారి ఘొల్లుమంది శకుంతల.

"ఏం ఫరవాలేదమ్మా... ఇప్పుడు వైద్యరంగం చాలా అడ్వాన్స్ అయ్యింది. మంచి మందులొచ్చాయి. నాన్న క్షేమంగాఇంటికొస్తారు. నువ్వేమీ భయపడకు.'' గుండెపోటు అంటే సామాన్యమైన విషయం కాదని తెలిసినా తల్లికి ధైర్యం చెప్పింది మౌక్తిక.

"ఏమోనే... ఆయన క్షేమంగా ఇంటికొస్తే ఆ ఏడుకొండలూ నడిచొస్తానని మొక్కుకున్నాను.'' శకుంతల పలికింది వణికేస్వరంతో.

"అలాగే చేద్దూగాని ... తమ్ముడేంటీ అలా మూడీగా ఉన్నాడూ...'' అడిగింది మౌక్తిక.

"వెధవ... వాడూను ఎత్తుకు... వాడివలనే ఈ ఉపద్రవం వచ్చిపడింది.'' అంతవరకు ఏడుపుతో

ఎర్రబడిన శకుంతల కళ్లు అప్పుడు కోపంతో రక్తారుణిమ నింపుకున్నాయి.

"వాడివలనా! అంత కాని పని వాడేం చేశాడమ్మా?'' ఆశ్చర్యపోయింది మౌక్తిక.

"ఏం చేశాడమ్మా? అంటూ అంత నెమ్మదిగా అడుగుతావేం... వాడు మా కొంపముంచాడు. మీ నాన్నగారి పరువు నిలువునా తీశాడు. ఎవరో అమ్మాయిని ప్రేమించానని మోసం చేయబోయాడుట... వాళ్ల వాళ్లందరూ ఇంటి మీదకొచ్చి నానా గలాభాచేసి గందరగోళం సృష్టించారు. ఆ గొడవకే మీ నాన్నకి గుండెపోటొచ్చింది.'' ఆగ్రహంగా చెప్పింది శకుంతల కొడుకుపైన గల కినుకను వ్యక్తపరుస్తూ.

చేష్టలుదక్కి నిలబడిపోయింది మౌక్తిక. నిజంగా... దినేష్ ఇంతటి గ్రంధసాంగుడైనాడా!?

" నువ్వు చెప్పేది నిజమేనా అమ్మా?'' బలవంతాన నోరు పెగుల్చుకుంది మౌక్తిక.

" బాగుందే... అబద్ధం చెప్పాల్సిన అవసరం నాకేముంది? వాడిని చూస్తే ఆయనకి మళ్ళీ తిరగబెడుతుందని మేమే హాస్పిటల్ కి రావద్దన్నాం.'' విసురుగా పలికింది శకుంత.

"మరి ఆ అమ్మాయి?''

"తగుల్చుకున్నాక తప్పుతుందా! ఆ గదిలో వాడితో పాటే ఏడిసింది.'' నిరసన గళం వినిపించింది శకుంతల.

మౌక్తిక గదిలోకి వెళ్లింది. తప్పుచేసిన వాడిలాగా తల దించుకుని కూర్చున్నాడు దినేష్.

"రా అక్కా...'' అన్నాడు మౌక్తికను చూస్తూనే.

"అమ్మ ఏదో చెబుతోంది...''

"నువ్వు ప్రయాణం చేసి బాగా అలసిపోయావు. రెస్ట్ తీసుకో... తెల్లారాక మాట్లాడుకుందాం.'' అన్నాడు దినేష్ నిర్వేదంగా.

" అలాకాదులే... విషయమేమిటో చెప్పు...'' ఖచ్చితంగా అడిగాను.

వాడు నిస్సహాయంగా చూస్తూ " ప్రీతి నేను ఇంజనీరింగ్ లో క్లాస్‌మేట్స్... ఇద్దరం మనస్ఫూర్తిగా ప్రేమించుకున్నాం. నాన్నగారితో ఈ విషయం చెప్పి ఆయన ఆమోదం పొందాక ప్రీతి వాళ్ల వాళ్లకి కూడా చెబుదాం అనుకున్నాం. ఈ లోపే ఈ విషయం వాళ్లింట్లో తెలిసి పెద్ద రభస అయ్యింది.

ప్రీతి అన్నయ్యలు నన్ను అపార్థం చేసుకుని, నేను తనని ఛీట్ చేశానేమోనని భావించి, ఇంటిమీదకు వచ్చి నానాగొడవా చేశారు.వాళ్ళని వారించాలని ప్రయత్నంచేసి అశక్తుడనైనాను. పరిస్థితి నాచేయి దాటిపోయిందని అర్థమైంది. అందుకే... అప్పటికప్పుడు ప్రీతిమెళ్లో తాళి కట్టాల్సివచ్చింది.

ఈ అల్లరంతా నాన్నను మానసికంగా చాలా డిస్టర్బ్ చేసింది. నా వలన పదిమందిలో ఆయన పరువు మంటకలిసిపోయింది. ఆ బెంగతోనే ఆయనకు స్ట్రోక్ వచ్చింది. ఈపనివలన అమ్మ దృష్టిలో

దోషిగా మిగిలిపోయాను. ఇప్పుడు నాన్న ఉన్న దుస్థితికి ఒకవిధంగా నేనే కారణం అక్కా...''

పశ్చాత్తాపం నిండిన దినేష్ స్వరంలో నిజాయితీ కనిపించింది మౌక్తికకు. బరువుగా వెలువడుతున్న అతడి మాటలు, అతడి మనోభారాన్ని సూచిస్తున్నాయి. అప్పుడు గమనించింది మౌక్తిక అతడిపక్కనే నిలబడి, భీతహరిణలా బితుగ్గా చూస్తున్న అమ్మాయిని.

అనుకోని విఘాతం ఎదురైనప్పుడు తల్లడిల్లే పసిపిల్లలాగా ఉందామె వాలకం.

"దీనికంతటికీ కారణ్ నేను. మా వాళ్లు మిస్ అండర్‌స్టాండ్ చేసుకుని తొందరపడడం వల్లనే ఈ ముప్పు వచ్చింది. దయచేసి దిన్నూని ఏమీ అనకండి.'' ఏడుపుగొంతుతో పలికింది ప్రీతి.

దీనంగా ఉన్న ఆ అమ్మాయి వదనం చూస్తే జాలి ముంచుకొచ్చింది. నిజమే... దినేష్ చెప్పినదాన్ని బట్టి చూస్తే జరిగినదానిలో ఆ అమ్మాయి ప్రమేయమూ ఉన్నట్లూ తోచలేదు.ఆమె నిమిత్తమాత్రురాలు మాత్రమే.ఏదైనా సంఘటన జరగడానికి కార్యకారణ సంబంధం అంటూ ఒకటుంటుందని బామ్మ అనేది. ఇప్పటి ఈ సంఘటనకి ఆమె అనుకోని కారణమైంది.

చేసేదీ... చేయించేదీ... ఆ జగన్నాటక సూత్రధారి.

"జరిగిందేదో జరిగింది...నాన్నకిప్పుడు మానసిక ప్రశాంతత ఎంతో అవసరం. ఆయన మనసు కుదుటపడేవరకు నువ్వాయనకి ఎదురుపడకు. నేను ఆయనకి నచ్చ చెబుతాను. అన్నీ అవే సర్దుకుంటాయి.'' చెప్పింది మౌక్తిక దినేష్ భుజంతట్టి.

జరిగిన పరిణామాలన్నీ చూస్తూఉంటే సినిమాల్లో సంఘటనల్లా అనిపిస్తున్నాయామెకి.ఎవరో పనిగట్టుకుని డైరెక్ట్ చేసినట్లుగా సీన్లన్నీ అత్యంత నాటకీయంగా జరిగిపోతున్నాయి.

అంతలోనే నవ్వుకుంది విషాదంగా. అవును... ఆ దేముడిని మించిన ఎఫిషియెంట్ డైరెక్టర్ ఎవరుంటారు! మానవ జీవితానికి సంబంధించిన ప్రతి సంఘటనకూ పకడ్బందీయైన స్క్రీన్‌ప్లేని రాసుకుంటాడాయ. మనిషి మనుగడకి చెందిన స్క్రిఫ్ట్‌ని పక్కాగా తయారుచేసుకుంటాడు.

ఆ పైనుంచే మానవుని జీవితదశలను నిర్దేశ్యించి, రిమోట్ తన చేతిలో ఉంచుకుని ఆటాడిస్తాడు.

"థాంక్యూ ముక్తక్కా... థాంక్యూ వెరీమచ్. కనీసం నువ్వైనా నా హృదయఘోషను అర్థం చేసుకున్నావు. అంతేచాలు.'' దినేష్ కళ్ళు సజలమైనాయి.

పొరపాటు చేశానేమోనన్న అపరాధభావన నిండిన వాడి వదనంలోకి కాస్తంత వెలుగు చిమ్మింది.

"వెళ్ళి పడుకోరా... అమ్మా ప్రీతీ... నువ్వు కూడా వెళ్ళి రెస్ట్ తీసుకో...'' అనేసి బయటపడింది మౌక్తిక ఆ గదిలోనుంచి.

"నువ్వేమిటే... వాడికి నాలుగు చీవాట్లువేసి, ఇంత గడ్డి పెడతావనుకుంటే... అలా వెనకేసుకొస్తున్నావేంటి?'' చాటుగా నిలబడి అంతా వింటున్న శకుంతల కూతురిమీద

విరుచుకుపడింది.

తల్లి ధోరణి మౌక్తికకు చిరాకు తెప్పించింది. చిన్నప్పటినుంచీ చూస్తోంది. అదే స్వభావం. ఎంతసేపూ తన సొద అతనదేగాని, ఎదుటివ్యక్తి అభిప్రాయాలని, ఉద్దేశ్యాలని, ఉద్వేగాలని అర్థం చేసుకునే ప్రయత్నమే చేయదు. కనీసం... అవతలవాళ్ళేం చెబుతున్నారో వినేందుకు కూడా మొగ్గుచూపదు. అందుకే కాబోలు... ఆవిడకి, బామ్మకి నిరంతరం వాగ్యుద్ధాలు జరుగుతూ ఉండేవి.

"ఏంటమ్మా... వచ్చినదగ్గరనుంచీ చూస్తున్నాను. నీ గోల నీదేగాని ఎదుటివాళ్ళనసలు పట్టించుకోవు. ప్రతీ విషయాన్నీ భూతద్దంలోనుంచి చూసి గగ్గోలుపెడతావు.అసలు... నాన్నకి నీమూలంగానే వచ్చుంటుంది గుండెపోటు. కనీసం తమ్ముడి విషయంలోనైనా సర్దుకుపోవడానికి ప్రయత్నించు.''ఎప్పుడూ తల్లి మాటలకి ఎదురాడని మౌక్తిక అలా కసురుకుంటున్నట్లుగా మాట్లాడడంతో అవాక్కయి నిలబడిపోయింది శకుంతల.

"అనవే అను... మీ అందరూ మంచివాళ్ళే. ఎదుటివారిని అర్థం చేసుకునే ఉత్తమోత్తములే. నేనే దుర్మార్గురాలిని. పగదాన్ని, పరాయిదాన్ని'' మళ్ళీ ముక్కుచీదింది శకుంతల ఏడుపు మొదలెడుతూ.

ఆవిడని ఓదార్చడానికి తాతలు దిగి వచ్చినంత పనైంది మౌక్తికకు. అప్పుడప్పుడే తెల్లారుతోంది. అరుణభానుడి ఆగమనానికి మురిసిన తూరుపుకాంత ఆయనకు స్వాగతగీతి పాడడానికి సమాయత్తమవుతున్నట్లుగా కెంజాయవర్ణపు వస్త్రాన్ని చుట్టుకుంటోందా అన్నట్లుగా ఆకాశం అంతా ఎర్రబడింది. ఆ ప్రశాంత ప్రభాతంలో... పక్షుల కిలకిలారావాలు అనేక రకాలైన వాయిద్యాల సమ్మేళనంలా ధ్వనిస్తున్నాయి.

రాత్రంతా ప్రయాణం...ఎడతెరిపిలోఏని ఉద్విగ్నత... వీటన్నింటితో అలసిపోయిన మౌక్తిక కళు మూతలుపడ్డాయి ఆమె ప్రమేయం లేకుండానే. అలా హాల్లోనే ఓ మూలకి ఒరిగిపోయింది.

-----------------                    ---------------------

-------------------------

"ముక్తా లేమ్మా... లే..'' శకుంతల తట్టిలేపడంతో మౌక్తికకు మెలకువ వచ్చింది. బద్ధకంగా కళ్ళు తెరిచి , కిటికీలోనుంచి బయటకు చూసింది. బయట ఎర్రని ఎండ కాస్తోంది.తరణి తన తీక్షణతతో పరిసరాలను మండిస్తున్నాడు.

"ముక్తా బారెడు పొద్దెక్కింది లేమ్మా..టైమ్ ఎనిమిది దాటుతోంది. ఆ వేడి డబ్బాలో ఇడ్లీలు, ఫ్లాస్కోలో కాఫీ అన్నీ రెడీ చేసి పెట్టాను.చూసుకో. నేను హాస్పిటల్ కి వెళ్లొస్తాను. అక్కావాళ్ళు కాఫీ అయినా తాగారో లేదో..''కూతురి ముఖం మీదకు వంగి నిద్రలేపింది శకుంతల.

భర్త ఆరోగ్యం సరిగా లేదన్న బెంగ ఆమెను డీలాపడేలా చేస్తోంది. రెండురోజులుగా పడుతున్న టెన్షన్, నిద్రలేకుండా చేస్తున్న జాగరణ ఫలితంగా ముఖమంతా పీక్కుపోయి, కళ్లు లోతుకిపోయి నీరసంగా ఉంది ఆమె వాలకం.

తల్లిని చూస్తే జాలి ముంచుకొచ్చింది మౌక్తికకు.

చటుక్కున లేచి కూర్చుంటూ...''ఛ...ఛ...మొద్దునిద్ర పట్టేసిందదేమిటోగాని...కాస్సేపాగు అమ్మా... నేను తీసుకెళ్తాను అక్కవాళ్లకి టిఫిన్, కాఫీ. నాకు కూడా నాన్నగారిని ఎంత త్వరగా చూస్తానని ఒకటే ఆత్రంగా ఉంది.'' అంది మౌక్తిక.

"తొందరేమీలేదు... నువ్వు తాపీగా రా. రాత్రనగా వచ్చేశాను.ఆయనెలా ఉన్నారో ఏంటో!నేను వెళ్తాను... నువ్వు తరువాత రా...'' అంది శకుంతల హడావుడి పడుతూ.

మరి తర్కించలేదు మౌక్తిక. ఆవిడ ఆదుర్దాని అర్థం చేసుకున్నదానిలా మౌనంగా ఉండిపోయింది.

"సరే... నువ్వొక్కదానివే వెళ్లగలవా మరి!'' అడిగింది.

"ఆఁ...మరేం ఫరవాలేదు. తెలిసిన రిక్షావాడున్నాడుగా. వాడిని రమ్మన్నాను.'' చెప్పింది శకుంతల కంగారుగా అన్నీ సర్దుకుంటూ.

మౌక్తిక లెచి స్నానపానాలు పూర్తిచేసుకుని తయారయ్యేసరికి పదిదాటింది. ప్రీతికి, దినేష్‌కి జాగ్రత్తలుచెప్పి ఆదరాబాదరా హాస్పిటల్‌కి బయలుదేరింది. ఆమె వెళ్ళేసరికి విద్యాధరరావు పరిస్థితి ఏమంత ఆశాజనకంగాలేదు. శకుంతల విషణ్ణవదనంతో దీనంగా కూర్చుని ఉంది. కార్తిక, ఆమె భర్త కూడా ఆందోళన చెందుతున్నారు.

కూతుర్ని చూస్తూనే" ముక్తా" అంటూ బావురుమంది శకుంతల. ఆ స్థితిలో ఆమె అవధులుదాటి పొంగుతున్న శోకసంద్రంలా ఉంది.

ఊరుకోమన్నట్లుగా తల్లి భుజాలమీద చేతులు వేసి పొదివిపట్టుకుంది మౌక్తిక.

ఆమెకళ్ళు కూడా సజలమైనాయి. ముక్కుకి ఏవేవో గొట్టాలు, నోటికి ఆక్సిజన్ మాస్క్... ఇవన్నీ తగిలించబడి అపస్మారకంగా పడి ఉన్న తండ్రిని చూస్తే ఆమెకు దుఃఖమాగడంలేదు.

ఆ మధ్యాహ్నం విద్యాధరరావుకి మరోమారు స్ట్రోక్ వచ్చింది. అది ఈసారి ఆయన ప్రాణాలను తనతోపాటుగా పట్టుకుపోయింది. మృత్యువుతో పోరాడేశక్తిని కోల్పోయిన ఆయన దాన్ని స్వాగతించారు సంతోషంగా.

శకుంతలని ఆపడం ఎవరివల్లనా కావడంలేదు.గుండెలు బాదుకుంటూ, దుఃఖభారంతో నిలువెల్లా కంపించిపోతూ ఆక్రోశిస్తున్న ఆమెను చూస్తే కడుపు తరుక్కుపోతోంది.

ఫార్మాలిటీస్ పూర్తయినాక విద్యాధరరావు పార్థివదేహాన్ని ఇంటికి తీసుకొచ్చారు.

ఆడపిల్లలందరిలోకీ చిన్నదైన మౌక్తిక అంటే ఆయనకు అపరిమితమైన వాత్సల్యం.

"ముక్తమ్మా... ముక్తమ్మా..."అంటూ ఆప్యాయంగా పిలుస్తూ తనను సమర్థిస్తూ వచ్చిన ఆయన...భర్తను కాదని వచ్చిన తన తప్పులెంచక, ఆప్యాయంగా గుండెల్లో పొదువుకుని తనకు ఓదార్పునిచ్చిన ఆయన మరిలేరంటే దుఃఖం ముంచుకొస్తోంది మౌక్తికకు.

తాను తమ్ముడు కీచులాడుకుంటే... తమ మధ్యన సయోధ్య కుదర్చలేక చిరునవ్వుతో

తలపట్టుకునే తండ్రి...సాత్విక మతాంతర వివాహం చేసుకుంటే చిన్నబుచ్చుకుని ఆమెతో తెగతెంపులు చేసుకున్న తండ్రి...తల్లి-బామ్మల తగాదాల్లో ఎటూ వాలిపోక, మౌనప్రేక్షక పాత్ర వహించి ఎంతో సంయమనంతో వ్యవహరించిన తండ్రి...మరలిరాని లోకాలకి తరలిపోయాడంటే ... నమ్మశక్యంగా లేదు మౌక్తికకు.

ఆ ఆవేదనని తట్టుకోవడం వాళ్లవలన కావడంలేదు. పుట్టిన ఏ జీవికైనా మరణం అనివార్యం. దాన్ని ఆపే శక్తి మనుషులను పుట్టించిన ఆ పరమాత్మకి కూడాలేదు.

గుండె రాయి చేసుకుని జరగవలసిన తతంగమంతా జరిపించేశారు. వాళ్ళ ధర్మంగా సావిత్రికి, సాత్వికకి కూడా ఆయన మరణవార్త తెలియజేశారు. సావిత్రి వెంటనే పతీసమేతంగా వచ్చి శకుంతలని పలకరించి వెళ్ళిపోయింది. సాత్విక మాత్రం ఆ టైమ్‌కి ఢిల్లీలో ఉండడంచేత దశాహంనాటికి వచ్చింది.

శకుంతల ఆమెను కౌగిలించుకుని ఒకటే ఏడిచింది. చిన్నారి ' విద్యాధర్' ని ఎత్తుకుని 'మావారం'టూ వదలడంలేదు.

విద్యాధరరావు బతికి ఉన్నన్నినాళ్ళూ సాత్వికను ఇంటిగడప తొక్కద్దని శాశించాడు. ఆయన మాటలని అక్షరాలా అమలుపరిచిన సాత్విక ఆయన కర్మకాండలకి హాజరవడం అందరినీ విచారసాగరంలో ముంచివేసింది.

అంత బాధలోనూ శకుంతల దినేష్‌ని తూలనాడడం మానలేదు. అతడిని తన అగర్భశత్రువులా చూస్తూ, తన మాంగల్యాన్ని లాగేసుకున్నాడంటూ ఒకటే శాపనార్థాలు పెడుతోంది. దినేష్ వెర్రివాడిలా చూస్తూ అలా మౌనంగా ఉండిపోయాడే గాని, నోరుతెరచి తల్లిని వారించలేదు.

ప్రీతి సంగతి సరేసరి...జరిగిన ఘోరానికి తానే కారణం కాబోలు... అనుకుని బిక్కచచ్చిపోయి ఓ వారగా ఒదిగిపోయింది.

అన్ని కార్యక్రమాలు ముగిశాయి. తండ్రి ఆత్మశాంతి కోసమని అన్నిరకాలు దానాలు చేసి, తంతంతా ఎంతో ఘనంగా జరిపించాడు దినేష్.

తన సెలవును మరొక నాలుగురోజులకి పొడిగించింది మౌక్తిక. కన్నతండ్రిని కోల్పోయిన లోటు ఎవరూ భర్తీ చేయలేరు. శకుంతలకి కష్టాన్ని ఎవరూ తీర్చలేరు. పోయినవాళ్ళని మరచిపోక తప్పదు. ఆ మరుపు మనిషికి భగవంతుడిచ్చిన అమూల్యవరం.

జరిగిన ఘోరాన్ని నెమరు వేసుకుంటూ, కృంగిపోయి కూర్చుంటే మనుగడ అసాధ్యం అవుతుంది.

అక్కలిద్దరూ వెళ్లిపోయాక ఇల్లు ఖాళీ అయ్యింది. తల్లిని తనతోపాటుగా తీసుకెళ్దామని అనుకుంది మౌక్తిక. కాని, శకుంతల రావడానికి ఒప్పుకోలేదు. తాను ఇప్పుడు ప్రయాణాలేమీ చేసే స్థితిలో లేనని, కాస్తంత మానసిక ప్రశాంతత చిక్కగానే వస్తానని చెప్పేసింది.

మనసునిండా అంతులేని విషాదం నింపుకుని మౌక్తిక ఊరికి బయలుదేరింది.

--------------------        --------------------
----------------------

“సారీ ముక్తా...నాన్నగారు పోయారని తెలిసినా నేను రాలేకపోయాను. ’’ రమ్య పలకరించింది ప్రియసఖిని.

ఆమె పలకరింపులోని ఆత్మీయత మౌక్తిక హృదయాన్ని తాకగానే ఆమె నయనాలు జలజల వర్షించాయి.శరత్ కూడా ఆమెను పరామర్శించి తన సంతాపాన్ని తెలియజేశాడు. కాలేజ్‌లో స్టాఫందరూ కూడా విద్యాధరరావు కి నివాళులు అర్పించారు. మధుకిరణ్ ప్రత్యేకంగా వచ్చి ఆమె వేదనను పంచుకునే ప్రయత్నం చేశాడు. అతడు అలా... అంత చేరువగా వచ్చి తనను సాంత్వన పరుస్తూ ఉంటే తన స్వంతమనిషే తనను ఓదారుస్తున్నట్లుగా ఫీలైంది మౌక్తిక.

అతడు తనపట్ల కనబరుస్తున్న శ్రద్ధకి తన మనసెక్కడ అతడి వశమైపోతుందోనని ఆ కళ్లలోకి చూడడానికే భయపడింది మౌక్తిక.

నెమ్మదినెమ్మదిగా తండ్రిపోయిన దుఃఖంనుంచి తేరుకుని రొటీన్‌కి అలవాటుపడసాగింది.

----------------------        ----------------------------
------------------------

ఆ రోజు ఉదయాన్నే ఆరున్నరకి యోగాక్లాసునుంచి తిరిగివస్తున్న మౌక్తికకు తోవలో కనిపించాడు మధుకిరణ్.

ట్రాక్‌సూట్ వేసుకుని, జాగింగ్ చేసుకుంటూ వస్తున్న అతడిని చూసి మంత్రముగ్ధలా ఆగిపోయింది మౌక్తిక.

తెల్లని చుడీదార్, పైజమాలో అప్పుడే విరిసిన నందివర్ధనంలా తాజాగా కనిపిస్తున్న మౌక్తికను చూస్తూనే, అకస్మాత్తుగా కాళ్ళకెవరో సంకెలలు బిగించినట్లుగా నిలబడిపోయాడు మధుకిరణ్ కూడా.

“గుడ్ మార్నింగ్ ముక్తాగారూ...ఏమిటి సంగతి... ఇంత పొద్దున్నే ఇలా దర్శనమిచ్చారు.?’’ చొరవగా తనే ముందు పలకరించాడు మధుకిరణ్.

అతడంత సమీపంగా మాట్లాడుతూంటే     మౌక్తికకు ఏదోలా ఉంది.

“యోగాక్లాసుకెళ్లి వస్తున్నాను. మీరెక్కడినుంచి?’’ సమాధానం చెప్పకుండా ఉండడమ్ సభ్యత కాదని అడిగింది మౌక్తిక.

“నేను జాగింగ్ చేసి వస్తున్నానండీ...’’ చెప్పాడు మధుకిరణ్.

అంత సున్నితంగా మాట్లాడే మగవాడిని ఆమె ఇంతవరకు చూసి ఉండలేదు. ఏదో... మృదుమధుర పరిమళం తనను చుట్టుముట్టినట్లుగా అనుభూతి చెందిందామె. మందగతిన వీచే మలయానిలం అలా...అలా... తనను స్పృశిస్తూ వెళ్ళి, తన మదిగది మూలలను ఆప్యాయంగా తడిమినట్లుగా ఉన్నాయతడి చూపులు.

ఇదేమిటి! అతడికి తానింతలా లోబడిపోతోందేమిటి! అతడి సమక్షంలో ఏమీ గుర్తుకురావడం లేదెందుకు! ఎవరి ఆంక్షలు, తానుచేసిన ప్రమాణాలు తనని బాధించనట్లుగా ఉంది అతడి సాన్నిధ్యం.

"ఏమిటీ... అలోచిస్తున్నారు?" చిత్తరువై తనముందు నిలచిన మౌక్తికను వింతగా చూస్తూ ప్రశ్నించాడు మధుకిరణ్.

"అబ్బే..ఏమీలేదండీ... మీరు వెళ్ళేది ఇంటికేగా?" అసంబద్ధమైన ప్రశ్న అని తెలిసినా అడగక తప్పలేదు మౌక్తికకు.

"అప్పుడేనా! ఎనిమిదింటివరకు ట్యూషన్స్ చెప్పి అప్పుడింటికెళ్తా. బ్రహ్మచారిగాడిని కదండీ... అప్పుడెళ్లి స్వయంపాకం చేసుకోవాలి." నవ్వాడు మధుకిరణ్.

మల్లెమొగ్గల్లాంటి పలువరస మెరిసింది తళుక్కున.

'కాలేజ్ లో వస్తున్న జీతం సరిపోలేదు కాబోలు...ట్యూషన్స్ చెప్పు ఇంకా నొర్లేసుకుంటున్నాడు.' కినుకగా అనుకుంది మౌక్తిక.

చాలామంది అధ్యాపకులు కాలేజ్ లో పాఠాలు సరిగ్గా చెప్పకుండా, ఇంటిదగ్గర ట్యూషన్స్ చెప్పి డబ్బులు వెనకేసుకోవడం ఆమెకి తెలుసు. అలాంటి వాటికి ఆమె చాలా దూరం.

"బాగానే సంపాదిస్తున్నారనుకుంటా" కాస్తంత వ్యంగ్యంగా అడిగింది మౌక్తిక.

అతడు ఆమెవైపు ఆశ్చర్యంగా చూసి "సంపాదనా! కొంపదీసి నేను డబ్బుకోసం ట్యూషన్లు చెబుతున్నాననుకుంటున్నారా!" అడిగాడు నొచ్చుకుంటున్నట్లుగా ముఖంపెట్టి.

"మరి!"

"నేను ట్యూషన్లు చెప్పేది డబ్బుకోసం కాదండీ... నా ఆత్మతృప్తికోసం. మా ఇంటికి దగ్గరలో బీదసాదా ఉండేటువంటీ బస్తీ ఒకటి ఉంది. అక్కడ ఉండేవాళ్లంతా రోజుకూలి చేసుకుని జీవనం సాగించే కార్మికులు, తాపీపనివాళ్లు. వాళ్లపిల్లలలో కొందరు చాలా తెలివైనవాళ్లు. సానపడితే ఒక్కొక్కరు ఒక్కో వజ్రాల్లా తయారౌతారు. కాని, వాళ్లకి ట్యూషన్ సెంటర్లలో చేరే ఆర్థికస్తోమతలేదు.

మట్టిలో మాణిక్యాల్లా మెరిసిపోయే అటువంటి విద్యార్థులకి కోచింగ్ ఇచ్చి మెరికల్లా తయారు చేయాలన్నదే నా ఆకాంక్ష."చెప్పాడు మధుకిరణ్.

కళ్లు విప్పార్చుకుని వింటోంది మౌక్తిక. మధుకిరణ్ వ్యక్తిత్వంలో ఇంకో పార్శ్వం ఆవిష్కృతమౌతూంటే సంభ్రమంతో చూస్తూ ఉండిపోయింది ఆమె.

మధుకిరణ్ చాలా సమర్థుడైన అధ్యాపకుడు అని ఆమెకి తెలుసు. అటువంటివాడు ఏ కోచింగ్ సెంటర్ పెట్టుకున్నా వేలకివేలు సంపాదించుకోవచ్చును. కాని, అతడలా ప్రతిఫలాపేక్ష లేకుండా పేదపిల్లలకి విద్యాదానం చేయడంతో ఆమె మనసులో అతడికున్న స్థానం ఇంకా పదిలమై నిలిచింది.

ఆమె దృష్టిలో అతడు హిమవన్నగమంత ఎత్తుకి ఎదిగిపోయాడు.

"గ్రేట్ మధుకిరణ్ గారూ...మీరు చేస్తున్న ఈ మంచిపని వలన ఎందరో పేదపిల్లల జీవితాలలో వెలుగులు నిండుతాయి.

ఈసారి మధుకిరణ్ విస్మయంగా చూశాడు ఆమెవైపు.

మౌక్తిక అతడితో అంత ఫ్రీగా మాట్లాడడం అదే మొదటిసారి మరి! ఎప్పుడూకూడా అత్తిపత్తిలా తనలోకి తానే ముడుచుకుపోతూ, బిడియంగా ఉండే మౌక్తిక అలా మనసువిప్పి తనతో మాట్లాడడం అతడికి అంతులేని సంతోషాన్ని కలుగజేసింది.

ఆమె సమక్షం ఏదో వింతభావనని రేకెత్తిస్తోంది. మాట్లాడుతున్నప్పుడు చిన్నగా మూసుకుంటూ, విచ్చుకుంటున్న ఆమె పలుచని పెదవులు, ఏదో తత్తరపాటుతో చంచలంగా కదులుతున్న ఆమె కనుగుడ్లు ఇవన్నీ అతడికి ఎంతో అపురూపంగా అనిపిస్తున్నాయి.

అలా ఆమెనే చూస్తూ యుగాలకొద్దీ ఉండిపోవాలనిపిస్తోంది. అతడికి స్పష్టంగా తెలుసు... తాను వెదికే అమ్మాయి ఆమేనని. కాని, ఆమె మనసులో ఏముందో తెలియడంలేదు. తాను తారసపడినప్పుడు ఆమెలో కనిపించే భావావేశాలకి అర్ధమేమిటో అతడు కనుక్కోలేకపోతున్నాడు.

ఆమె నయనాలలో తనపట్ల వ్యతిరేకతైతే కనబడదు. కాని, ముఖంలో ఏదో... కంగారు, ఇదీ అని చెప్పలేని తడబాటు.

ఆమె హృదయాన్ని చేరే మార్గం ఆ కాలమే చూపాలి తనకు.

"వస్తా ముక్తాగారూ...నా క్లాసులకి టైమౌతోంది.'' ఆమెను వీడివెళ్లడం తప్పనిసరి అన్నట్లు కదిలాడు మధుకిరణ్.

"అలాగే... బై...'' అంది మౌక్తిక అతడు వెళ్తున్నవైపే చూస్తూ.

------------------------ --------------------------- ---------------------

"అక్కా...నువ్వొక్కసారి అర్జెంటుగా ఇంటికి రా...నీతో ఎన్నో మాట్లాడాలి.'' దినేష్ దగ్గరనుంచి ఫోన్ రాగానే ఆదరాబాదరా బయలుదేరిపోయింది మౌక్తిక.

వెళ్లేముందు రమ్యతో ఓమాట చెప్పిపోదామని వాళ్ళింట్లోకి వెళ్లింది. బెడ్మీద నిస్త్రాణంగా పడుకుని ఉంది రమ్య. పక్కనే ఉన్న శరత్ ఆమెచేత పళ్లరసం తాగించడానికి నానా తంటాలూ పడుతున్నాడు.

మౌక్తికను చూస్తూనే "చూడండి ముక్తా...జ్యూస్ తాగకుండా చిన్నపిల్లలా ఎలా మారాం చేస్తోందో... రెండురోజులై ఒకటే వామిటింగ్స్. ఎంత నీరసంగా అయిపోయిందో చూశారా... మీరన్నా మీఫ్రెండ్కి నచ్చచెప్పి ఈ జ్యూస్ తాగించండి....ప్లీజ్...'' పక్కకు తప్పుకుంటూ చేతిలోని గ్లాసుని టీపాయ్ మీద

ఉంచాడు శరత్.

రమ్యకి వాంతులవుతున్నాయా!? ఎందుకు? పైత్యంచేసిందా? రెండురోజులై లీవ్ లో ఉంది తను. ఫీవర్ అని చెప్పింది. ఇంకా తగ్గలేదా!?

"ఏమిటి రమ్యా? వాంతులవుతున్నాయా? నాతో అననేలేదూ...'' గ్లాసు రమ్య నోటికి అందించింది మౌక్తిక.

"ప్లీజ్ ముక్తా... తాగాలనిలేదు.నన్ను ప్రెస్‌చేయకు...'' అయిష్టంగా ముఖం తిప్పుకుంది రమ్య.

'పోనీలే... నీకు సహించకపోతే వద్దు. డాక్టర్ దగ్గరకన్నా వెళ్తావా!?'' గట్టిగా నిలదీసింది మౌక్తిక.

"అన్నీ అయ్యాయి... మొదట్లో ఇలాగే ఉంటుందని చెప్పిందావిడ...'' చిరాగ్గా అంటూ నాలిక్కరుచుకుంది రమ్య.

'మొదట్లో ఇలాగే ఉంటుందా!' అంటే! మౌక్తికకు అర్ధం అయ్యీ...కానట్లుగా ఉంది.

" అసలే...క్యారీయింగ్... సహించినా సహించకపోయినా ఆరారా ఏదో ఒకతి తినాలని, తాగాలని చెప్పింది డాక్టర్...కాని, తనేమో మొండికేస్తోంది...'' తెగ హడావుడి పడిపోతున్న శరత్‌ని చూస్తే ఆమెకో సంగతి స్ఫురించింది.

రమ్య చెవిలో తానడగాలనుకున్నది అడిగేసింది గుసగుసగా.

ఆమె సిగ్గుగా నవ్వి మూడువేళ్ళు చూపించింది కళ్లు అరమోడ్పులవ్వగా.

అంతే... విషయం మొత్తం బోధపడిపోయింది. తన అల్లరి స్నేహితురాలు అమ్మ కాబోతోందన్న శుభవార్త తెలిసి ఎంతో సంతోషమనిపించింది మౌక్తికకు.

వెంటనే పరుగున వెళ్లి...రివ్వున వీస్తున్న చల్లగాలికి, ఆకాశంలో పరుగులు తీస్తున్న నీలిమబ్బులకి, స్వేఛ్ఛగా రెక్కలు 'టపటప' లాడించుకుంటూ ఎగిరిపోతున్న పక్షిసమూహాలకి ఈ శుభవర్తమానం చెప్పేసి రావాలి అనిపించింది.

అమ్మతనం పొందడంకన్నా అమూల్యవరం ఇంకేం కావాలి ఆడదానికి. స్త్రీత్వానికి సార్ధకత చేకూరేది ఇక్కడే. పురుషుడు తలకిందులుగా తప్పస్సుచేసినా అనుభవించలేని మహత్తరమైన ఆనందం మగువకి లభించేది ఈ ఒక్కవిషయంలోనే.

తన ప్రాణాలను పణంగా పెట్టి , మృత్యువుతో పోరాడి ఒక జీవికి ఊపిరిపోసే అద్భుతశక్తి కేవలం స్త్రీమూర్తికే ఉంది.

ఆడపుట్టుక పుట్టినందుకు ఆక్షణాన ఎంతో గర్వంగా అనిపించింది మౌక్తికకు. అంతలోనే మనసంతా పిచ్చిపిచ్చిగా తయారైంది.

రమ్య నెలతప్పితే తనకెందుకు ఇంతసంబరం!? ఆమెతో తనకి పోలికేమిటి!?

అడవిలో పూసిన పిచ్చిపూవుకి, సుందరనందనోద్యానవనంలో ముద్దుగా విరిసిన

గులాబిబాలకి సాపత్యం ఏమిటి?

అందం, యవ్వనం అంతా కూడా అడవికాచిన వెన్నెలలా వ్యర్ధంగా ఉండిపోయి ఏ అనుభూతికీ నోచుకోని తనకి, అనాఘ్రాత పుష్పంలా మిగిలిపోయిన తనకి...

తన స్త్రీత్వాన్ని, సౌందర్యాన్ని మనసైన ప్రాణనాధునికి అంకితంచేసి, అతడినుంచి అపురూపమైన అమ్మతనాన్ని కానుకగా పొందిన రమ్యకి సామ్యమా!?


అనుకుందికే ఏదోలా ఉంది. ఆడపుట్టుక పుట్టగానే సరా! అనుభవించే రాతుండద్దూ... ఒక శుష్కహాసం మెదిలింది మౌక్తిక పెదవులమీద. తన భావావేశాన్ని బహిర్గతం కానివ్వకుండా జాగ్రత్తపడుతూ... రమ్యని, శరత్ ని మనస్ఫూర్తిగా అభినందించి తాను ఊరికి వెళుతున్న విషయం చెప్పి బయలుదేరింది మౌక్తిక.

"నా బంగారుతల్లికదూ...నువ్విలా అల్లరిపెడితే..నీ కడుపులో పెరుగుతున్న బుజ్జిగాడికి బలం ఎలా వస్తుందిచెప్పు!? నా మాట విని ఒక్క సిప్...''గారం చేస్తూ బతిమలాడుతున్నాడు శరత్ మళ్ళీ.

"ఇదంతా బుజ్జిగాడిమీద ప్రేమే కాని, నామీద కాదన్నమాట!'' అలిగినట్లుగా అంటోంది రమ్య.

కిలకిల నవ్వులు వినబడ్డాయి ఒక్కసారిగా. తానేమి కోల్పోయిందో... మౌక్తికకు గుర్తు చేశాయి ఆనవ్వులు. భారమైన మనసుతో గేటుదాటింది.

------------------- -----------------
-------------------



ఇల్లుచేరిన మౌక్తిక ప్రీతిని చూస్తూనే నిర్ఘాంతపోయింది. తండ్రికి ఒంట్లో బాగాలేనప్పుడు తాను తొలిసారిగా చూసిన ప్రీతికి, ఈ ప్రీతికి అస్సలు పోలికేలేదు.

బొద్దుగా, ముద్దుగా ముద్దబంతిలా మిసిమివన్నెలొలుకుతూ ఎంతో ఆకర్షణీయంగా ఉన్న ఆనాటి ప్రీతివేరు.

శరీరమంతా శుష్కించి, వన్నెతగ్గి, వసివాడి కళ్లకిందుగా పాకిన నల్లని చారలతో వడలిపోయిన గులాబీలా ఉన్న ఇప్పటి ప్రీతి వేరు.

కేవలం రెండు... రెండంటే రెండే నెలల్లో మనిషిలో ఇంతటి మార్పు రావడం సాధ్యమా!

దానికి సాక్ష్యంగా కనబడుతున్న ప్రీతిని చూస్తే మౌక్తిక కడుపు తరుక్కుపోయింది.

"ఏంటి ప్రీతీ... ఇలా అయిపోయావు? ఒంట్లో బాగాలేదా?'' కళ్లలో ప్రాణాలు నిలబెట్టుకున్నట్లుగా ఉన్న ప్రీతిని ఆప్యాయంగా దగ్గరకు తీసుకుంది మౌక్తిక.

దినేష్ ముఖం గంభీరంగా మారిపోయింది.

"ప్రీతీ... నువ్వు లోపలికి వెళ్ళి అక్కకి కావలసినవి చూడు..'' అని ఆమెకి పురమాయించి, "అక్కా... నువ్వు స్నానంచేసి రెస్ట్ తీసుకో...తరువాత మాట్లాడుకుందాం.'' అన్నాడు.

ప్రీతి లోపలికి వెళ్ళిపోయింది. దినేష్ వైఖరికి, ప్రీతి అలా నీరసించిపోవడానికి కారణం ఏమైఉంటుందో మౌక్తికకు అంతుచిక్కడంలేదు.

ఇంట్లో శకుంతల అలికిడి వినబడలేదు. ఆమె ఏమైనట్లు!?

"అమ్మేది దినేష్?'' అడిగింది మౌక్తిక బ్యాగ్ లోనుంచి ఇస్త్రీ చీర, జాకెట్ తీసుకుంటూ.

"అమ్మ...పెద్దక్క వాళ్ళింట్లో ఉందక్కా...'' దినేష్ స్వరం నూతిలోనుంచి వస్తున్నంత నీరసంగా ఉంది.

"అక్క తీసుకెళ్లిందా?'' తండ్రి పోయి, మూడోనెల నడుస్తోంది కాబట్టి లాంఛనం కోసం కార్తిక తల్లిని తీసుకెళ్లిందేమోనని అడిగింది మౌక్తిక.

"లేదక్కా''.

"మరి! " ఆశ్చర్యపోయింది మౌక్తిక.

"అమ్మ నామీద అలిగి వెళ్ళిందక్కా.'' ఆ విషయం చెప్పడానికి అతడు ఎంతో వేదనను, మానసిక సంఘర్షణని అనుభవించాడని అతడి వాలకమే చెబుతోంది.

"అదేంటి దినేష్... అమ్మ నీమీద అలగడం ఏమిటి?'' నమ్మలేనట్లుగా చూసింది మౌక్తిక.

దినేష్ శకుంతలకి గారాల పుత్రుడు. ఒక్కగానొక్క మగపిల్లాడని ఆమెకు అతడిమీదే పంచప్రాణాలూనూ. భర్త ఎప్పుడైనా మందలించబోతే 'పసివాడం'టూ వెనకేసుకొచ్చేది. అందుకే

అక్కచెల్లెళ్లందరూ కూడా దినేష్‌ని ' అమ్మకూచి' అని వెక్కిరిస్తారు.

అటువంటి దినేష్ మీద తల్లి అలగడమేమిటి... వింత కాకపోతేనూ!

"నువ్వు చెప్పేది నిజమేనట్రా!'' విస్మయంగా అడిగింది మౌక్తిక.

విరక్తిగా నవ్వాడు దినేష్.

"ఏ ముహూర్తాన నేను ప్రీతిని పెళ్ళి చేసుకున్నానో గాని, అప్పటినుంచీ ఈ ఇంట్లో అన్నీ అరిష్టాలే. అల్లారుముద్దుగ పెరిగిన ఆమెకు నా వలన ఎటువంటి సుఖమూ చేకూరకపోగా, ఆమె బతుకు మరింత నరకమైంది. ప్రీతిని ఈ ఇంటికోడలిగా తెచ్చి నేను చాలా పెద్ద తప్పు చేశానక్కా'' బాధగా పలికాడు దినేష్.

"దినేష్... ఏమంటున్నావురా?'' నిర్ఘాంతపోయింది మౌక్తిక.

అతడు నిస్పృహగా చూస్తూ "అవునక్కా... ప్రీతిని చూస్తేనే అమ్మకెందుకో కోపం. నేను, ప్రీతి సరదాగా మాట్లాడుకుంటే చూడలేదు. నాకు సంబంధించినంత వరకు అన్నిపనులూ తానే చేయాలి అనుకుంటుంది ప్రీతి జోక్యాన్ని అస్సలు సహించలేకపోతోంది.

ప్రీతి గట్టిగా మాట్లాడినా, నవ్వినా, ఆఖరుకి శుభ్రంగా తయారై మంచిచీర కట్టుకున్నా అమ్మ భరించలేకపోతోంది. ప్రతి విషయంలో ఆమెను తప్పుపడుతోంది. పని చేయడానికి ముందుకొస్తే నీ సహాయం అక్కరలేదంటోంది. అలాగని దూరంగా మెలిగితే 'దున్నపోతులా తిని కూర్చుంటే ఇంటి చాకిరీ అంతా చేసే ఓపిక తనకు లేదని తగువాడుతోంది.'' గాఢంగా నిట్టూర్చాడు దినేష్.

"నువ్వు చిన్న సమస్యను పెద్దది చేసి చూస్తున్నావేమో దినేష్. నాన్నపోయి ఇంకా మూడునెలలు కూడా కాలేదు. బహుశా అమ్మ... ఆ డిప్రెషన్‌లో...'' ఖండించింది మౌక్తిక.

దినేష్ అడ్డంగా తలూపుతూ "అలా అనుకునే నేనూ ఓపిక పట్టానక్కా... కాని,అమ్మ విపరీత ధోరణి రోజురోజుకీ ఎక్కువౌతోంది. నేను ప్రేమించానని చెప్పడం లేదు కాని, ప్రీతి చాలా మంచి అమ్మాయి. ఎవరినీ నొప్పించే మనస్తత్వం కాదు. ఎందుకో గాని, అమ్మ ప్రీతి ఉనికిని ద్వేషించేంతటి రాక్షసత్వం ప్రదర్శిస్తోంది. ప్రీతి పడే మానసిక క్షోభ నేను చూడలేకున్నాను. నా మీద ఇష్టంకొద్దీ తను ఇదంతా భరిస్తోంది. తన పుట్టింట్లో విషయం తెలిస్తే... మళ్లీ ఏం గొడవలౌతాయోనని పళ్ల బిగువున భరిస్తోంది. చివరికి... అమ్మ... ఎంతలా తయారైందంటే...'' దినేష్ స్వరం గద్గదమైంది.

"ఏమైందిరా?'' ఆరాటంగా అడిగింది మౌక్తిక.

అతడు ఇబ్బందిగా కదులుతూ" నాలుగురోజుల కిందట రాత్రి పదకొండు గంటలప్పుడు...నేను, ప్రీతి ఏకాంతంలో ఉండగా... హఠాత్తుగా గది తలుపులు తట్టి, లోపలికి వచ్చి తనకు భయంగా ఉందంటూ మా ఇద్దరి మధ్యనా పడుకుంది...'' చెప్పలేక చెప్పలేక చెప్పాడు.

తీవ్ర దిగ్భ్రమకి లోనైంది మౌక్తిక. తల్లి ఇంత సంస్కారహీనంగా తయారైంది అంటే ఆమెకి నమ్మశక్యం కావడంలేదు. అసలు... ఆమె ఎందుకింత దిగజారి ప్రవర్తించినట్లు!? మిలియన్ డాలర్ల క్వశ్చన్.

నిజంగానే భయపడిందనుకోవడానికి లేదు. ఆమెకి భయమంటే ఏమిటో తెలియదు. ఇంట్లోని వాళ్లందరూ ఎక్కడైనా వెళ్లినా సరే... ఎవరి సాయమూ లేకుండా అదే ఇంట్లో ఎన్నోసార్లు గడిపిన ఆమె భయమంటూ వెళ్ళి, భార్యాభర్తలని అసౌకర్యానికి గురిచేసిందా!?

"నమ్మలేకపోతున్నావు కదూ! కాని, ఇదంతా నిజమక్కా. మరునాడు ఉదయాన అకారణంగా ప్రీతిమీద విరుచుకుపడిన అమ్మని' నీ ఉద్దేశమేమిటని' నిలదీశాను. అంతే...నన్ను నానా మాటలాడి అలిగి, అక్కవాళ్ళింటికి వెళ్లిపోయింది'' దినేష్ కళ్లు సజలమైనాయి.

తనకన్నా రెండేళ్ళు చిన్నవాడైన అతడి కళ్లలో చెమ్మని చూసి తట్టుకోలేకపోయింది మౌక్తిక. తల్లి అతడినెంతో గారం చేసేది.

"మగపిల్లాడిని అంతలా నెత్తెక్కించుకోవద్దే శకుంతలా...గారాబం ఎక్కువైతే చెడిపోతారంటూ' నెత్తినోరు కొట్టుకుని గోలపెట్టేది బామ్మ.

అయినాసరే... అతడి ఒంటిమీద ఈగ కూడా వాలనిచ్చేదికాదు తల్లి. అటువంటి తల్లి ...ఇప్పుడు కొడుకు సుఖసంతోషాలకి అడ్డుతగులుతోందెందుకు? అనురాగమయమైన అతడి సంసారానికి విఘాతం కలిగిస్తోందెందుకు?

మౌక్తిక బుర్రంతా గజిబిజిగా తయారైంది.

"వదినా... స్నానానికి నీళ్ళు పెట్టాను. మీరు ఫ్రెష్ అయితే టిఫిన్ చేద్దురుగాని...''చెప్పింది ప్రీతి వంటింటి గడపలో నిలబడి.

ఆమెవైపు తదేకంగా చూసింది మౌక్తిక. కల్లాకపటం తెలియని అమాయకపు పసిదనం తొంగిచూస్తోంది ఆమె వదనంలో. ఆ కళ్ళు... మంచులో తడిసిన మరుమల్లెల్లా వింత ధవళిమతో మెరుస్తున్నాయి. ఆ ముఖంలో ఎక్కడాకూడా జాణతనం కాని, జట్టీలుపెట్టే మనస్తత్వం కాని కనబడడంలేదు.

ఇంతటి సౌజన్యమూర్తిని తల్లి అంతలా ఆరడి పెడుతోందెందుకు!?

స్నానం చేసొచ్చి ప్రీతి పెట్టిన టిఫిన్ తినేసి బయలుదేరింది మౌక్తిక.

"అక్కా'' గడప దాటుతూంటే పిలిచాడు దినేష్.

"ఏంటిరా?'' ఆప్యాయంగా అడిగింది మౌక్తిక.

"అమ్మతో అనవసరంగా గొడవ పడకక్కా... నీతో చెప్పుకుంటే, నిన్నోసారి చూస్తే నా గుండెబరువు తీరి కాస్త మనశ్శాంతిగా ఉంటుందని నిన్ను రమ్మన్నాను.'' ఏడ్చేశాడు దినేష్.

చూడలేకపోయింది మౌక్తిక. తనతో ఏదైనా గొడవ పడినప్పుడు ఎప్పుడూ తనదే పైచేయిగా ఉండాలని మొండిగా వాదించే దినేష్... ఇలా పిరికివాడిలా ఏడుస్తూ ఉంటే మౌక్తిక గుండె తరుక్కుపోయింది.

తనకే ఇంత బాధగా ఉందే!మరి... తల్లి గుండెల్లో జాలి, దయ ఇంకిపోయి ఆమె అంత

మొరటుగా తయారైందేమిటి!?

"నువ్వు గాబరాపడకు. నేను అంతా సెట్‌రైట్ చేస్తానుగా.'' అతడికి అభయం ఇచ్చి వీధిలోకి కాలుపెట్టింది మౌక్తిక.

------------------

------------------------- -------------------

మౌక్తికను చూడగానే శకుంతల ఆశ్చర్యపడింది. కూతురంత హఠాత్తుగా ఎందుకు ఊడిపడిందో అర్థంకాక సంశయంగా చూడసాగింది.

"ఎప్పుడొచ్చావే ముక్తా...'' కూతురుని పలకరించింది.

తనకేమీ తెలియనంత అమాయకంగా ముఖం పెడుతూ " ఇప్పుడే వచ్చాలే...నువ్వేంటిక్కడా?'' అడిగింది మౌక్తిక.

అంతే... శకుంతల ముఖం కళతప్పింది. ఎందుకంటే శకుంతల ఇల్లువిడిచి ఎవరింట్లోనూ ఒక్కక్షణం ఉండదు. ఎప్పుడైనా కార్తిక వచ్చి తనింట్లో నాలుగురోజులు ఉండమంటే" ఆడపిల్ల సొమ్ము మాకెందుకు?'' అంటూ రానుపొమ్మని నిరాకరించేది.

"అంతా నా ఖర్మ తల్లీ...ఏ ముహూర్తాన ఆ మహాతల్లి ఇంట్లో పాదం మోపిందో నా కొడుకు నాకు కాకుండా పోయాడు.వన్నెల విసనకర్రలా వగలుపోయి వాడికి వల విసిరింది. వాడికేదో మందుపెట్టి తన వశం చేసుకుంది. నా కొడుకుని నా నుంచి దూరంచేసింది.'' కళ్లు-ముక్కు ఎర్రగా చేసుకుని ఆవేశపడింది శకుంతల.

నువ్వు సమస్యను నీ కోణంలోనుంచే చూస్తున్నావు. వాడింకా పసిపిల్లాడు కాదు. పెళ్లైనవాడు. వాడికీ వ్యక్తిగత జీవితం ఉంటుంది. మనమే సర్దుకుపోవాలి.'' వ్యర్థమని తెలిసినా శకుంతలని శాంతపరచాలని చూసింది మౌక్తిక.

ఆవిడ తన ముఖాన్ని కందగడ్డలా చేసుకుని "ఏమిటే సర్దుకుపోయేదీ... గాడిదగుడ్డు. నేననేదాన్ని జన్మనివ్వకపోతే వాడెలా వచ్చాడటా! అలాంటి కన్నతల్లిని ...పెళ్లవగానే పనికిమాలినదానిలా చూస్తాడా? ఆ ఇనపగజ్జెలతల్లి ని ఇంట్లోకి తెచ్చి నా పసుపుకుంకాలు లాగేసుకున్నాడు. అది చాలనట్లు నన్ను చులకన చేసి చూస్తాడా?'' ముక్కుచీదింది జిర్‌రున.

తల్లి ఆక్రోశానికి అర్థం తెలిసింది మౌక్తికకు. పొసిసివ్‌నెస్...

తనది అనుకున్న వస్తువు వేరొకరి స్వంతం అయితే చూసి ఓర్వలేని ఉడుకుమోత్తనం. కొడుకు కోడలికి తనతో సమానస్థానమిచ్చి ఆదరిస్తే భరించలేని అసూయ.

తన మనిషి కేవలం తన సొత్తు మాత్రమే కావాలని ఆశించే స్వార్థపరత్వం.

అత్తకోడళ్లకి అభిప్రాయబేధాలు తలెత్తేదిక్కడే. అన్నాళ్ళు ' అమ్మా...అమ్మా...' అంటూ తన కొంగుపట్టుకుని తిరిగే ముద్దులకొడుకు..., కోడలు రాగానే ఆమె కొంగుచాటు కృష్ణుడల్లే మారిపోవడం

చూసి సహించలేనితనంతో కొందరు తల్లులు వారిని విడదీసేందుకు సైతం వెనుకాడరని తల్లిని చూస్తే తెలిసింది మౌక్తికకు.

తన తల్లి కూడాఈ రకమైన భావనకి అతీతురాలు కాదన్న సత్యం అవగతమైన మౌక్తిక డీలాపడిపోయింది.

ఇంతలో కార్తిక వచ్చి “ఇలారా ముక్తా” అంటూ మౌక్తిక చేయిపట్టుకుని గదిలోకి తీసుకెళ్ళి తలుపు మూసింది.

“ముక్తా... ఇక్కడ నూటికి నూరుపాళ్ళు అమ్మదే తప్పు. ప్రీతి మెతకపిల్ల అని నాకు తెలుసు. కాని, తనను దోషి చేసి నిలదీస్తే అమ్మ తట్టుకోలేదు. అందుకే... నీకు ఫోన్ చేయమని తమ్ముడితో చెప్పాను. ఏం చేయాలో కాస్త ఆలోచించు.'' చెప్పింది కార్తిక.

ఆమె సంయమనానికి, వ్యవహార దక్షతకు అబ్బురపడింది మౌక్తిక. నిజమే... పీకలు తెగ్గోసేంత కర్కోటకుడిని కూడా డైరెక్ట్‌గా నువ్వు ' నేరస్తుడివి' అంటే మండిపడతాడు.

'నీదేతప్పు...' అని నేరుగా చెబితే తల్లికి కోపం రావచ్చును.

ఆ తరువాత జరగాల్సినవన్నీ చకచకా జరిగిపోయాయి. పెద్దక్క ద్వారా విషయం తెలుసుకున్న చిన్నక్క నాకు ధైర్యం నూరిపోస్తూ పెద్ద మెయిల్ పెట్టింది.

“జరిగినదేదో జరిగిపోయింది ముక్తా... దాని గురించి ఆలోచిస్తూ మనసు పాడుచేసుకోకు.పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తిచేసి నీ కాళ్లమీద నువ్వు నిలబడు. నీకే సహాయం కావాలన్నా అందించడానికి నీ అక్క ఉందన్న విషయం మరచిపోకు.'' అంటూ ఎన్నో హిత వచనాలు రాసింది.

ఆ మెయిల్ నాలో ఆత్మవిశ్వాసం నింపింది. సరిగ్గా అప్పుడే నాకు పిజిలో సీట్ వచ్చింది. పెళ్లికి ముందు ఆ.సెట్ రాశాను. అప్పుడు మంచి రాంకే వచ్చినా సీట్ కన్‌ఫర్మ్ కాలేదు. కాని, ఫైనల్ లిస్ట్ లో నాకు సీటు లభించింది. ఉన్న ఊరిలో ఉన్న పి.జి. సెంటర్ లోనే నాకు అడ్మిషన్ దొరికింది.

బావ , నేను కలిసి మాట్లాడుకున్న పదిరోజులకి కాబోలు... అత్తయ్య మా ఇంటికి వచ్చింది.మనిషిలో కళాకాంతులు కొరవడ్డాయి. అత్తయ్యే నాన్నను పలకరించింది మొదట. నాన్న గంభీరంగా తలాడించారు. అమ్మ ముఖం తిప్పుకుంది ఆడపడుచుని చూసి.

“అన్నయ్యా... అదీ...'' ఏదో చెప్పబోతున్న అత్తయ్యని వారిస్తూ “వద్దమ్మా సావిత్రీ... సంజాయిషీలేమీ చెప్పద్దు... నువ్వు, నీ కొడుకు కలిసి నా బిడ్డ జీవితంలో నిప్పులు పోశారు. దయచేసి ఇకమీద నువ్వు ఈ ఇంటిగుమ్మం తొక్కద్దు... నిన్ను చూశానంటే నా బంగారుతల్లికి జరిగిన అన్యాయం గుర్తొస్తుంది. ఇకపై ఈ ఇంటిఛాయలకి కూడా రావద్దు.'' కరాకండిగా చెప్పేశారు నాన్న.

గుడ్లనీరు కుక్కుకుంది అత్తయ్య .అమ్మకాని, బామ్మకాని ఆమెని ఓదార్చే ప్రయత్నం చేయలేదు. ఇంట్లోని వారికి ఇష్టంలేని పెళ్లి చేసుకుని ఓసారి పుట్టింటికి దూరమైన అత్తయ్య... కొడుక్కి ఇష్టంలేని పెళ్లిచేసి శాశ్వతంగా దూరమైంది. ఆ బంధం అతుక్కుంటుందన్న నమ్మకం ఎవరికీలేదు.

అత్తయ్యి కళ్ళు తుడుచుకుంది. నేను లోపలికి వెళ్లి పెళ్లిలో ఆవిడ నాకు పెట్టిన నగలని బాక్స్ తో సహా తెచ్చి ఆమె ముందుంచాను.

"ఇవెందుకు ముక్తా... అవి నీకోసం చేయించినవే..'' అంది అత్తయ్య విస్తుపోతూ.

"కాదత్తయ్యా... ఇవి నీ కోడలికోసం చేయించినవి. వీటిని పెట్టుకునే యోగం, యోగ్యత రెండూ నాకులేవు.'' నా కంఠ తొణికిన నీరు చూసి అత్తయ్య ముఖం పాలిపోయింది.

"అలా అనకు ముక్తా...ఇవి నీవే. నా మేనకోడలికి కానుక ఇచ్చే అదృష్టానికి నన్ను దూరం చేయకు.'' అంది అత్తయ్య భారంగా.

"ప్లీజ్ అత్తయ్యా... నన్ను బలవంతం చేయకు.'' అన్నాను పదునుగా.

అత్తయ్య మరేమీ మాట్లాడకుండా బ్యాగ్ తెరచి సరికొత్త ఐదువందల రూపాయల నోట్లకట్ట తీసి నా చేతిలో పెడుతూ "నేను చేసిన తప్పునెలాగూ సరిదిద్దుకోలేను. కనీసం... ఇదన్నా తీసుకో'' అంది వణుకుతున్న గొంతుతో.

"బండలైపోయిన నా బతుక్కి మూల్యం కడుతున్నావా అత్తయ్యా?'' బాధగా అన్నాను.

"అపార్థం చేసుకోకు ముక్తా... దేనికైనా పనికి వస్తుంది'' అనునయంగా అంది అత్తయ్య.

"వద్దు... ఈ డబ్బు తీసుకోవడానికి నాకు మనసు రావడంలేదు.'' సున్నితంగా తిరస్కరించాను.

చేసేదేంలేక అత్తయ్య వెనుదిరిగింది. నేను బండబారిన హృదయంతో అలా నిశ్చేష్టనై చూస్తూ ఉండిపోయాను.

-------------------

----------------------   -------------------

అనుకున్నట్లుగానే నేను పి.జి.లో చేరిపోయాను మా ఊరిలోనే. పరస్పరం ఇష్టంలేకపోవడం వలన నాకు, బావకి విడాకులు సులభంగానే లభించాయి.

ఇద్దరం ఇప్పుడు స్వేఛ్ఛాజీవులం. కోర్టు తీర్పు లభించాక బావ నాకు కృతజ్ఞతలు చెప్పాడు. నేను దేవతనని, నా సహకారంవల్లనే ఇప్పుడు తన బతుకులో ఆనందం చోటుచేసుకుంటోందని, తన ప్రేమనర్థం చేసుకుని పక్కకు తప్పుకున్నందుకు జీవితాంతం ఋణపడి ఉంటానని... ఇలా... నా పైన ప్రశంసలజల్లు కురిపించాడు.

వాటికి నేను పొంగిపోలేదు. ఈ విడాకుల వలన నాకు కూడా విముక్తి దొరికింది. ఆత్మాభిమానం చంపుకుని జీవించడమంత హీనం మరొకటి లేదు. అందుకే... నేను కూడా అతడినుండి

విడిపోవాలని కోరుకున్నాను.

బావ నాకు భరణం ఇస్తానన్నాడు. అవసరం లేదని నిరాకరించాను.

అలా... ఒక ప్రహసనంలా సాగిన నా పరిణయఘట్టానికి ముగింపు దొరికింది.

అయితే... నా సమస్య అక్కడితో తీరిపోలేదు. నిజానికి నా బతుకులో కొత్తమలుపు మొదలైనదప్పుడే.

------------------ ----------------------- --------------------------

ఆరోజు సాయంత్రం కాలేజ్ నుంచి ఇంటికి వచ్చాక ఫ్రెష్ అయ్యి అక్కవాళ్ళింటికి బయలుదేరాను. నేనిలా సందుమలుపు తిరిగానో లేదో... సర్రున ఓ మోటార్‌బైక్ వచ్చి నాముందు ఆగింది.

దానిమీద వెంకటేష్... అదే... శ్రీధర్ కూర్చుని ఉన్నాడు. అతడికి డబ్బుమత్తు బాగా ఒంటపట్టినట్లుంది... ఒళ్ళుచేసి పచ్చగా, దబ్బపండులా మెరిసిపోతున్నాడు.

నేను అతడివైపు ప్రశ్నార్థకంగా చూస్తూ నుదురు చిట్లించాను.

"నీతో మాట్లాడాలి ముక్తా..'' అన్నాడు.

నాకర్థం కాలేదు. సరిగ్గా రెండేళ్ల క్రితమూ ఇదే మాటన్నాడు. అప్పుడంటే ఇద్దరం అవివాహితులం. కాని, ఇప్పుడు... మా ఇద్దరికీ పెళ్లిళ్ళైనాయి. పైగా అతడో బిడ్డకు తండ్రి కూడానూ.

"నాతోనా! ఏం మాట్లాడుతావు?'' అడిగాను ఆశ్చర్యంగా.

అతడు దూరంగా వేలుచూపిస్తూ "అలా వెళ్ళి మాట్లాడుకుందాం.'' అన్నాడు.

మా వీధికి ఎదురుగా పెద్ద మర్రిచెట్టు ఉందక్కడ. దాని చుట్టూ కట్టబడి ఉన్న పెద్ద రాతి అరుగుమీద అందరూ కూర్చుని కబుర్లు చెప్పుకోవడం పరిపాటి. ఆరోజు కాస్త మబ్బుగా ఉండడం మూలాన ఎవరూ లేరక్కడ.

"సరే పద" అటువైపు అడుగులు వేశాను.

ఇద్దరం ఓ వారగా కూర్చున్నాం. మబ్బుతెరలను తొలగించుకుని అప్పుడప్పుడు పలకరించిపోతున్ననారింజరంగు సాయంకాలపు నీరెండ అద్భుతంగా ఉంది.

"చెప్పు'' అన్నాను ఎటోచూస్తూ.

"ఏమీలేదు ముక్తా... అప్పుడూ ఇప్పుడూ... ఎప్పుడూ కూడా నువ్వంటే నాకు అభిమానమే. పెళ్లంటే వేరే అమ్మాయిని చేసుకున్నాను గాని, నా మనసంతా నీమీదే'' చేతులు నులుముకున్నాడు శ్రీధర్.

"అయితే?" అతడి మాటల్లో గూఢార్థం నాకు బోధపడలేదు.

"మనిద్దరం ...ఒక్కటైతే బాగుంటుందనీ..."

"ఎలా? నీకూ పెళ్లైంది... నాకూ పెళ్లైంది." అయోమయంగా అడిగాను.

" ఒక్కటవడానికి... పెళ్లికి సంబంధం ఏమిటి ముక్తా?" ఫెళ్ళున నవ్వాడు శ్రీధర్ నా అమాయకత్వానికి.

" ఏం మాట్లాడుతున్నావో తెలుస్తోందా?' అరిచాను గట్టిగా.

అతడదేమీ పట్టించుకోకుండా "నిజానికి నీ జీవితం చాలా దయనీయంగా తయారైంది. పెళ్లయ్యిందన్నమాటే కానీ, ఏం సుఖపడ్డావు? నీకు నచ్చితే, అభ్యంతరం లేకపోతే... ఆ సుఖం నేనందిస్తాను." చెప్పుకుపోయాడు వంకరగా నవ్వుతూ.

అతడి ఆంతర్యం అర్థమై గజగజ వణికిపోయాను తుఫాను గాలికి అల్లాడిన చిగురుటాలా. నా కళ్ళకి అతడు అమాయక మేకను వేటాడడానికి అవకాశం కోసం పొంచిఉన్న పెద్దపులిలా కనబడ్డాడు.

"నువ్వు ఒక పెళ్ళైన అమ్మాయితో మాట్లాడుతున్నానని మరచిపోతున్నావు." కోపంతో ఊగిపోయాను.

అతడు ఇసుమంతైనా చలించలేదు.

"పెళ్లైనా నువ్వింకా కన్యవేనని నాకు తెలుసు ముక్తా... నీ మొగుడుట్టి మూర్ఖుడు. ఇంత అందాన్ని ఎదురుగా పెట్టుకుని ఎంజాయ్ చేయకుండా వదిలేసిన ప్రవరాఖ్యుడు. అదే నేనైతేనా?" కవ్వింపుగా అన్నాడు శ్రీధర్.

నాకు నసాళమంటింది. ఇరుగమ్మ పొరుగమ్మల సానుభూతి పొందడం కోసం నా ఆంతరంగిక విషయాలని సినిమా కథలా మా వీధంతా టాంటాం వేసిన అమ్మని తలచుకుంటే మండిపోయింది.

వీడింత ధైర్యంగా నేను కావాలని అడుగుతున్నాడంటే దానికి కారణమేమిటి? నా సొంత సంగతులు బహిరంగమైపోవడం వల్లనే కదా!

వాడి రెండుచెంపలూ పేలగొట్టాలన్నంత ఆవేశం కలిగింది. అది నడిరోడ్డు కావడం వలన నన్ను నేనే కంట్రోల్ చేసుకున్నాను.

" ఇంకొక్క మాట మాట్లాడినా ఊరుకునేది లేదు శ్రీధర్. మరొక్కసారి ఇలాంటి ఛండాలం ప్రపోజల్ తో నా ముందుకి వస్తే మర్యాద దక్కదు జాగ్రత్త" భద్రకాళిలా విరుచుకు పడ్డాను.

వాడు నన్ను ఎగాదిగా చూసి, పెదవి విరిచి " ప్చ్... పోనీపాపం వయసు పోరు పెడుతూ ఉంటుంది... కాస్త తాపం తీరుద్దామనుకున్నాను. నీకు అదృష్టం లేదు. నీ అందాన్ని ఆస్వాదించే యోగం నాకులేదు. ఏం చేస్తాం! బ్యాడ్లక్. ఎప్పుడైనా నీ మనసు మార్చుకుంటే కాకితో కబురుపెట్టు. క్షణాల్లో నీ ముందు వాలిపోతాను." అనుకుంటూ వెళ్ళి బైక్ స్టార్ట్ చేశాడు వాడు.

వాడు వెళ్లినవైపు అసహ్యంగా చూస్తూ “డర్టీ రాస్కెల్... సుఖాలందిస్తాడట...సుఖాలు. వీడందించే ఆ దరిద్రపు సుఖాలకోసం ఎవరూ కూడా వెంపర్లాడిపోవడం లేదిక్కడ.'' అనుకున్నాను కసిగా.

మొగుడొసిలేసిన ఆడపిల్ల అంటే ఈ మగాళ్ళకి ఎంత చిన్నచూపో అర్థమైంది తొలిసారిగా. ఆ సంఘటన తరువాత నా మనసంతా చిరాగ్గా తయారైంది. ఇక అక్కవాళ్లింటికి వెళ్ళే మూడ్‌లేక తిరిగి ఇంటికేసి బయలుదేరాను.

---------------------                                                                         ---------------------
-----------------------

కాలగతిలో మరో రెండేళ్ళకాలం పరుగులు తీసింది. నా పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తయింది. ఉద్యోగంకోసం వెతుకులాట మొదలైంది.

ఈలోపు ఇంట్లో చెప్పుకోదగిన మార్పులే వచ్చాయి.నాన్న అనారోగ్యంతో నానాటికీ కృశించిపోసాగారు.

జబ్బు చేసింది ఆయన శరీరానికి కాదు. మనోవ్యాధే ఆయన్ను లొంగదీసుకుంది.

బామ్మకి ఏదో... పేరు తెలియనిజబ్బు వచ్చి నెలరోజులపాటు మంచంలో తీసుకుని. తీసుకుని కన్నుమూసింది. ఆ ఇంటికి పెద్దదిక్కుగా నిలిచిన ఆమె ప్రాణం అనంతవాయువుల్లో లీనమైన తరువాత మాకు దుఃఖం ఆగలేదు.

వృద్ధాప్యం... ఆపైన వచ్చిన మాయదారి జబ్బు ఆమెని కడతేర్చాయి.

దినేశః ఇంజనీరింగ్ చదువు పూర్తయ్యింది. వాడికి ఎలక్ట్రిసెటీ బోర్డ్ లో జె.యి.గా ఉద్యోగం వచ్చింది. నాకు కూడా ఒక డిగ్రీ కాలేజీ లో ఉద్యోగం వచ్చింది. కాని, మేముంటున్న ఊళ్లోకాదు.

ఏం చేయాలోనని విపరీతంగా ఆలోచించాను.

ఆరోగ్యం సరిగ్గా లేని నాన్నని, మనశ్శాంతి లేక అలమటించె అమ్మని విడిచిపెట్టి ఉద్యోగం పేరిట వాళ్లకి దూరంగా వెళ్లడానికి మనస్కరించలేదు.

కాని, తప్పదు. ఈ ఊళ్లో... ఈ వీధిలో... పరిచయస్తుల జాలి చూపులు,కొంటెకుర్రాళ్ళ ఆకలిచూపులు, ఇరుగుపొరుగుల ఉచిత సలహాలు...ఇవన్నీ భరింపశక్యం కాకుండా ఉన్నాయి.

అందుకే...నేనెవరో తెలియని చోటుకి, నా గతం గురించి ఎవరికీ పరిచయం లేని ప్రదేశానికి వెళ్లిపోవాలని నిశ్చయించుకుని ఇక్కడికొచ్చి ఈ ఉద్యోగంలో చేరాను.

నేను ఉద్యోగంలో చేరకముందే...నాకు బాగా సన్నిహితులైన ఒకరిద్దరు నన్ను మళ్లీ పెళ్లి చేసుకోమని సూచించారు. రెండు మూడు మంచి సంబంధాలు కూడా చూపించారు.

యాధాలాపంగా ఆ విషయాన్ని ఇంట్లో చెప్పిననాడు అమ్మ పెద్ద గాలి దుమారమే లేపింది.

' మొగుడొదిలేసిన దానికి మళ్ళీ పెళ్ళేమిటని, ఆడదానికి ఒకే పెళ్లి, ఒకే మొగుడు ఉండాలని'

ఇంకా ఇలాంటివే చాలా చెప్పి నా ఆలోచనకి అడ్డుకట్ట వేసింది.

అంతేకాదు... నేను ఇక్కడికొచ్చేముందు నా చేత తన మీద ప్రమాణం చేయించుకుంది. అదీ ఆ దేముడి సమక్షంలో.

' రెండో పెళ్లి' అన్న ఊహను పొరబాటున కూడా నా మెదడులోకి రానివ్వద్దని నా చేత ఒట్టు పెట్టించుకుంది. ఈ తతంగమంతా నాన్నకి తెలియకుండా అతి రహస్యంగా జరిగింది.

ఆ పరిస్థితుల్లో... ఆమె చెప్పినదానికి 'సై' అనకపోతే ఆమె మానసికంగా ఇంకా క్షోభ పడుతుందని నేనలా ఒట్టు పెట్టాను.

అయితే... నాదీ ఉప్పూకారం తింటున్న శరీరమే. నాకూ అందరిలాగే సుఖప్రదమైన దాంపత్యజీవితాన్ని అనుభవించాలని, ముద్దులొలికే బిడ్డలకి తల్లినై బతుకు పండించుకోవాలని మరీమరీ అనిపిస్తుంది.

కాని, అమ్మమీద వేసిన ఆ ఒట్టు ఆ కోరికను మొదలంటా నరికేస్తుంది..

ప్రకృతిసిద్ధంగా నా మనసులో పుట్టే కోరికలను చంపుకోలేక, అమ్మ మీద చేసిన ప్రమాణం మీరలేక ఎంతో నరకం అనుభవిస్తున్నాను.

--------------------- ------------------------ -----------------------

" ఆ తరువాత సంగతులు నీకు తెలిసినవే. నీతో పరిచయం స్నేహానికి సరికొత్త భాష్యం చెప్పింది. నా జీవితంలో నిండిన శూన్యాన్ని నీ చెలిమి ద్వారా భర్తీ చేసుకుంటున్నాను.'' దీర్ఘంగా నిట్టూర్చింది మౌక్తిక తన గతచరిత్రనంతా చెప్పాక.

అప్పటికి బాగా చీకటి పడిపోయింది. నక్షత్రసమూహాలని కూడగట్టుకుని నెలరాజు రంగప్రవేశం చేస్తున్నాడు. రమ్య మౌక్తిక దగ్గరగా వచ్చి ఆమె తల నిమిరింది. ఆ లాలనకి మౌక్తికలో ప్రజ్వరిల్లిన దుఃఖాగ్ని కాస్త ఉపశమించింది.

" రియల్లీ అయాం వెరీసారీ ముక్తా... నీ జీవితంలో ఇంతటి విషాదం ఉందని ఊహించలేదు ముక్తా. ' ఇంతటి అందగత్తెకి, బుద్ధిమంతురాలికి ఇంకా పెళ్లెందుకు అవలేదు చెప్మా' అనుకునేదాన్ని. నిజం తెలిశాక నాకు చాలా బాధగా ఉంది. మీ అమ్మగారు నీకు విధించిన ఆంక్షలు మాత్రం అమానుషం. నువ్వు కూడా ఆవిడమాటకి కట్టుబడి నీ జీవితాన్ని అడవికాచిన వెన్నెలలా చెసుకోవడం విచారకరం.

"ఏం చేయను రమ్యా?ఆవిడ సంతృప్తికోసమని , నాన్న ఆరోగ్యం దృష్టిలో పెట్టుకుని నేను చేసిన ప్రమాణం అనుక్షణం నన్ను వెంటాడుతోంది. ఒట్టుతీసి గట్టున పెట్టి నా స్వార్థం చూసుకుంటే ఏమౌతుందోనన్న భయం నన్ను మళ్ళీపెళ్ళి గురించి ఆలోచించనివ్వడం లేదు.

నేనూ మనిషినే. నాకూ కోరికలున్నాయి. ఆశలున్నాయి.కాని, అవి నెరవేరే భాగ్యం మాత్రం నాకులేదు. తోడుకావాలంటూ నా మనసు, వయసు చేసే అల్లరి తట్టుకోలేక, తెగించి అడుగు

ముందుకేయలేక నాలో నేనే నలిగిపోతూ నరకమనుభవిస్తున్నాను.'' మొట్టమొదటిసారి మనసు తలుపులు తెరచి తనివితీరా ఏడిచింది మౌక్తిక.

రమ్య కళ్లలో కూడా నీళ్ళు తిరిగాయి. చప్పున మౌక్తికను గుండెలకి హత్తుకుని "ఊరుకో ముక్తా... రిలాక్స్. ఈ పెద్దవాళ్లంత మూర్ఖులు మరొకరుండరు. మీ అమ్మగారు సంఘంలో పరువు-ప్రతిష్ఠ వీటన్నింటి గురించే ఆలోచించారు గాని, నీ సుఖసంతోషాల గురించి పట్టించుకోలేదు. ఈ రోజుల్లో కూడా ఇలాంటి ఛాందస భావాలున్నవాళ్లు ఉన్నారంటే ఆశ్చర్యంగా అనిపిస్తోంది.

దీన్నిబట్టి చూస్తే... ఆ రోజుల్లో మన సమాజంలో వేళ్లూనుకుని ఉన్న సాంఘికదురాచారాలను రూపుమాపడానికి ' ఆ రాజారామ మోహన్ రాయ్, వీరేశలింగం పంతులుగారు' లాంటి సంఘ సంస్కర్తలు ఎంతగా కృషిచేశారో, ఈ సమాజానికి ఎంతగా ఎదురీదారో బోధపడుతోంది.'' ఆవేశంగా అంది రమ్య.

"అమ్మనేమీ అనకు రమ్యా... చెప్పాను కదా...ఆవిడవన్నీ పురాతనభావాలు. బామ్మ బతికుంటే నా సంగతి ఎలా ఉండేదోమరి!'' వెక్కుతూనే వారించింది మౌక్తిక.

"అదే చెప్తున్నా...ఈ సమాజం ఒంటరి ఆడదాన్ని ఎంత చిన్నచూపు చూస్తుందో ఆవిడ ఎరుగనిది కాదు. ఎల్లకాలమూ నువ్విలా మోడువారిన చెట్టులా బతుకునీడవడం అంటే మాటలుకాదు! జీవితాంతం తోడుగా నడవాల్సిన సహచరుడు లేక, కడుపునపుట్టిన బిడ్డల ఆదరణలేక సాగే స్త్రీ జీవితం ఎంత దుర్భరంగా ఉంటుందో ఆవిడకి తెలియదా!?'' పూనకం వచ్చినట్లుగా ఊగిపోయింది రమ్య.

మౌక్తిక మాట్లాడలేదు.

"పోనీ... అదంతా పక్కనపెట్టు. ఇప్పుడు నీకు మంచి అవకాశం వచ్చింది. నువ్వు ' ఊఁ' అనాలేగాని మధుకిరణ్ నిన్ను పెళ్లిచేసుకునేందుకు సుముఖంగా ఉన్నాడు. నువ్వు ' యస్' అని ఒక్కమాటంటే చాలు... మీ అమ్మగారిని నేను ఒప్పిస్తాను. ' నౌ బాల్ ఈజ్ ఇన్ యువర్ కోర్ట్' '' అంది రమ్య.

మౌక్తిక ముఖం అంతా రక్తం ఇంకిపోయినట్లుగా పాలిపోయింది. ఎప్పుడో ఒకప్పుడు మధుకిరణ్ తన ప్రేమను వ్యక్తపరుస్తాడని ఆమెకూ తెలుసును కాని, అతడినేరకంగా ఎదుర్కోవాలో మాత్రం తోచలేదు.

మధుకిరణ్ లాంటి జీవిత భాగస్వామి దొరకాలంటే ఏ జన్మలోనో బంగారుపూలతో పూజలు చేసుండాలి. కాని, తాను చేసిన పూజలు, నోచిన నోములు అన్నీ అసంపూర్ణమైనవి అయ్యుంటాయి. ఆ కొరనోముల ఫలితంగానే మేనబావతో పెళ్లైకూడా అతడికి దూరమైంది. ఆ నోముల కారణంగానే ఇవాళ ఆణిముత్యంలాంటి మధుకిరణ్ తనను వలచి వస్తే నిరాకరించ వలసిన దౌర్భాగ్యస్థితి ఎదురైంది.

ఎవరో అన్నట్లు' అదృష్టవంతుడిని చెరిపేవాడు లేడు. నిర్భాగ్యుడిని బాగు చేసేవాడు లేడు' అని... నేను దౌర్భాగ్యురాలుని. ఎవరు చక్కదిద్దాలనుకున్నా తనబతుకు బాగుపడదు.అది అంతే.

“ఏమిటాలోచిస్తున్నావు? ఏం చెప్పాలా అనా? మీ అమ్మనాన్నలు ఎల్లకాలమూ నీకోసం కూర్చోరు. నీ జీవితానికి స్థిరమైన ఆలంబనను నువ్వే వెతుక్కోవాలి.'' హితబోధ చేసింది రమ్య.

“లేదు రమ్యా...అమ్మ మాటను మీరేంతటి మానసిక ధైర్యం నాకులేదు. ఈ జీవితం ఇలా గడచిపోవాలని రాసుంది. అలాగే జరగనీ. ఈ విషయంలో నేను అశక్తురాలిని. అయాం హెల్ప్‌లెస్'' భోరుమంది మౌక్తిక.

“నువ్వింక పిరికిదానివనుకోలేదు ముక్తా...కోరి నీ జీవితం పాడు చేసుకుంటున్నావు'' కిందపెదవిని పంటికింద అదిమిపెట్టింది రమ్య.

“ఎలాగైనా అనుకో... నేను మాత్రం అమ్మమాట జవదాటే సాహసం చేయలేను. అయినా మధుకిరణ్‌కి నా గతం గురించి తెలియదు. అందుకే నన్ను ప్రేమించాడు. నా గురించిన నిజాలు తెలిస్తే మరిక నా జోలికి రాడు.'' విరక్తిగా నవ్వింది మౌక్తిక కళ్ళుతుడుచుకుని.

“అతడంత సంకుచితుడు కాదనే నా అభిప్రాయం. అతడు నిన్ను డైరెక్ట్‌గా కలిసిఈ విషయం గురించి ప్రస్తావిస్తే మాత్రం కాస్త వివేకంతో బదులియ్యి. ఇది జీవితం... మంచి అవకాశం ఒక్కసారి మాత్రమే తలుపు తడుతుంది.'' చెప్పింది రమ్య అదే ఆఖరుమాట అయినట్లుగా.

అప్పటికే ఆ పరిసరాలలో చిక్కటి చీకటి అలుముకుని ఉంది. ఆకాశమంతా నిండిన చంద్రకాంతి ధగధగాయమానంగా వెలిగిపోతూ ఆ చీకటిని తరిమికొడుతోంది. చంద్రుని చల్లదనం మౌక్తిక మనసులో చెలరేగే జ్వాలలను ఏ మాత్రం చల్లార్చలేకపోతోంది.

“ఇందాక అంకుల్ ఏం చెప్పారో విన్నావు కదా! రేపటినుండి నువ్వు యోగా క్లాసులకెళ్ళు.'' చెప్పింది రమ్య.

అలాగేనన్నట్లుగా తలూపింది మౌక్తిక.

“కిందకెళదాం పద... శరత్ వచ్చే వేళయ్యింది.'' మెట్లవైపుగా నడిచింది రమ్య.

అనుసరించింది మౌక్తిక.

-------------------- -------------------
----------------------

రమ్య చెప్పినట్లే యోగా క్లాసులకి వెళ్తోంది మౌక్తిక. ఇప్పుడిప్పుడే ఆమె మనసు కుదుటపడుతోంది. ధ్యానం చేయడం వలన ఆమె మనసులో కల్లోలం తగ్గి ప్రశాంతత చేకూరుతోంది. యోగాసనాలు వేయడం, ధ్యానంలో కూర్చోవడం...ఇత్యాది సాధనల వలన ఆమె మానసిక, శారీరిక ఆరోగ్యాలు మెరుగుపడ్డాయి.

పదేపదే ఆమెను వేధించి, కలవరపెట్టే ఆకల మరిరావడం లేదిప్పుడు.

అంతర్ముఖంగా ఉండడం మానేసి, రమ్యముందు తన మనసు విప్పిచెప్పుకోవడం మూలాన ఒత్తిడితగ్గి, హృదయభారం తీరింది.

నిజమే... ఆనందమైనా , ఆవేదనైనా ఆప్తులతో పంచుకుంటే కలిగే ఊరటే వేరు. ఆవిషయం మౌక్తికకు అనుభవైకవేద్యమైంది .

కాని, అప్పుడప్పుడు... ఆమె మదిలో అనేకానేక భావాల మధ్యన అంతర్యుద్ధం జరుగుతోంది. మధుకిరణ్ తనని ప్రేమిస్తున్నాడని తెలిసినప్పటినుంచీ తన మదిలో చెలరేగే భావసంచలనాన్ని అదుపులో పెట్టలేక ఆమె సతమతమౌతూనే ఉంది.

ఏం చేయగలదు! ఏమీ చేయలేని అసహాయత ఆమెది. కొన్ని చిక్కుముడులను కాలమే విప్పాలి. మానవుడు పరిష్కరించలేని కొన్ని క్లిష్టసమస్యలను... విసుగు విరామంలేక, అలుపుసొలుపు ఎరగక ముందుకు సాగిపోయే కాలమే పరిష్కరించాలి.

-----------------

--------------------------                                  ----------------------

దినేష్ దగ్గరనుంచి ఫోన్‌కాల్ వస్తూండడంతో క్లాస్ లో ఉన్న మౌక్తిక దాన్ని కట్ చేస్తూ వస్తోంది. కాని, మళ్ళీమళ్ళీ ఆ కాల్ వస్తూనే ఉండడంతో "ఎక్స్క్యూజ్ మి మై డియర్ స్టూడెంట్స్...'' అని చెప్పి ఫోన్ ఆన్సర్ చేసింది.

ఫోన్లో దినేష్ చెప్పిన విషయం వింటూంటే మెదడు మొద్దుబారిపోయిందొక్కసారిగా. కాళ్లుచేతులు గడగడ వణికాయి.

"ఏ... ఏమైంది దినేష్... నాన్న కేమైంది?'' స్వరం కంపించింది.

"వివరాలు నేను చెప్పలేనక్కా... నువ్వు వెంటనే బయలుదేరి రా" అనేసి ఫోన్ కట్‌చేశాడు దినేష్.

మౌక్తికకు దుఃఖం పొంగుకొస్తోంది గట్టు తెగిన వాగులా.

" మై డియర్ బాయ్స్ అండ్ గర్ల్స్ ...సారీ ఫర్ ది డిస్టర్బెన్స్...''అని చెప్పేసి ఉధృతంగా ఉబికివస్తున్న ఏడుపుని అణిచిపెట్టాలని ప్రయత్నిస్తూ ప్రిన్సిపాల్ రూమ్‌వైపు దూసుకుపోయింది మౌక్తిక.

ఆయనకి విషయం వివరించి వారం రోజుల పాటు సెలవు కోరింది. పరిస్థితిలోని తీవ్రతను అర్థం చేసుకున్న ఆయన మరేమీ అనకుండా సెలవు మంజూరు చేశారు. అప్పుడే పీరియడ్ బెల్ మోగడంతో రమ్య క్లాసునుంచి ఇవతలకి వచ్చింది ఆమెతో సంగతిని క్లుప్తంగా చెప్పేసి తాను ఊరికి వెళ్తున్నట్లుగా చెప్పింది మౌక్తిక.

ప్రిన్సిపాల్ గారి దగ్గర పర్మిషన్ తీసుకుని ఆమెను ఆర్టీసీ కాంప్లెక్స్ లో డ్రాప్ చేసింది రమ్య. అప్పటికి తాను ఎక్కాల్సిన బస్ రెడీగా ఉండడంతో నిశ్చింతగా ఊపిరితీసుకుంది మౌక్తిక.

"చేరగానే ఫోన్ చేయి ముక్తా...నాన్నగారికేమీ కాదులే... నువ్వు ధైర్యంగా ఉండు.''బస్ కదిలేవరకు

ఏవేవో జాగ్రత్తలు చెబుతూనే ఉంది రమ్య.

బస్‌లో కూర్చున్నదన్న మాటేగాని మనసు అలలతాకిడికి కల్లోలమైన కడలిలాగా ఉంది. 'అసలు... నాన్నకేమై ఉంటుంది! దినేష్ ఎందుకు వెంటనే రమ్మని ఫోన్ చేశాడు?' అని ఒకటే కంగారుగా ఉంది ఆమెకి.

దినేష్ ఆమెకు వివరాలేమీ చెప్పలేదు. తండ్రికి బాగాలేదని ఆసుపత్రిలో చేర్చామని మాత్రమే చెప్పాడు. బస్ విజయనగరం చేరేసరికి తెల్లవారుఝామున నాలుగైంది. మౌక్తికను తీసుకెళ్లేందుకు దినేష్ వచ్చాడు.

"నాన్నకెలా ఉంది?'' అంటూ మౌక్తిక ఆదుర్దాగా అడిగినా సమాధానం చెప్పకుండా మౌనంగా ఉండిపోయాడు.

'భయపడ్డాడు కాబోలు!' అనుకుంది మౌక్తిక. ఇంటికి చేరగానే తలుపుతీసిన శకుంతల కూతురిని చూస్తూనే భోరుమంది. ఏడ్చి ఏడ్చి ఆమెకళ్లు ఎర్రగా మారి, ఉబ్బిపోయి మంకెనపూవులని తలపింపజేస్తున్నాయి.

దినేష్ ఏమీ మాట్లాడకుండా గదిలోకెళ్లి తలుపేసుకున్నాడు. మౌక్తికకు అతడి వైఖరి అంతుచిక్కలేదు. ఏ భావమూ లేకుండా అతడంత నిర్లిప్తంగా ఎందుకున్నాడో ఆమెకి బోధపడలేదు.

"ఇంతకీ నాన్నకేమైందమ్మా?'' ఆదుర్దాగా అడిగింది మౌక్తిక.

శకుంతల జిర్రున ముక్కు చీది " హార్ట్అటాక్... ఇరవైనాలుగ్గంటలసేపు అబ్జర్వేషన్‌లో పెట్టాలని డాక్టర్స్ చెప్పారు'' చెప్పింది వెక్కిళ్ళుపెడుతూ.

"మరి హాస్పిటల్‌లో ఎవరున్నారు?''

"పెద్దక్క, బావగారు ఉన్నారు. రాత్రి పదకొండింటివరకు నేనక్కడే ఉన్నాను. ఎక్కువమంది ఉండకూడదని అక్కడి నర్సులు కోప్పడితే పెద్దక్కే... బలవంతంగా నన్ను ఇంటికి పంపింది. నాన్న ఐసియు లో ఉన్నారు. నాకెందుకో భయంగా ఉందే ముక్తా...'' మరోసారి ఘొల్లుమంది శకుంతల.

"ఏం ఫరవాలేదమ్మా... ఇప్పుడు వైద్యరంగం చాలా అడ్వాన్స్ అయ్యింది. మంచి మందులొచ్చాయి. నాన్న క్షేమంగాఇంటికొస్తారు. నువ్వేమీ భయపడకు.'' గుండెపోటు అంటే సామాన్యమైన విషయం కాదని తెలిసినా తల్లికి ధైర్యం చెప్పింది మౌక్తిక.

"ఏమోనే... ఆయన క్షేమంగా ఇంటికొస్తే ఆ ఏడుకొండలూ నడిచొస్తానని మొక్కుకున్నాను.'' శకుంతల పలికింది వణికేస్వరంతో.

"అలాగే చేద్దూగాని ... తమ్ముడేంటీ అలా మూడీగా ఉన్నాడూ...'' అడిగింది మౌక్తిక.

"వెధవ... వాడూసు ఎత్తకు... వాడివలనే ఈ ఉపద్రవం వచ్చిపడింది.'' అంతవరకు ఏడుపుతో ఎర్రబడిన శకుంతల కళ్లు అప్పుడు కోపంతో రక్తారుణిమ నింపుకున్నాయి.

"వాడివలనా! అంత కాని పని వాడేం చేశాడమ్మా?'' ఆశ్చర్యపోయింది మౌక్తిక.

“ఏం చేశాడమ్మా? అంటూ అంత నెమ్మదిగా ఆడుగుతావేం... వాడు మా కొంపముంచాడు. మీ నాన్నగారి పరువు నిలువునా తీశాడు. ఎవరో అమ్మాయిని ప్రేమించానని మోసం చేయబోయాడుట... వాళ్ల వాళ్లందరూ ఇంటి మీదకొచ్చి నానా గలాభాచేసి గందరగోళం సృష్టించారు. ఆ గొడవకే మీ నాన్నకి గుండెపోటొచ్చింది.'' ఆగ్రహంగా చెప్పింది శకుంతల కొడుకుపైన గల కినుకను వ్యక్తపరుస్తూ.

చేష్టలుదక్కి నిలబడిపోయింది మౌక్తిక. నిజంగా... దినేష్ ఇంతటి గ్రంధసాంగుడైనాడా!?

“ నువ్వు చెప్పేది నిజమేనా అమ్మా?'' బలవంతాన నోరు పెగుల్చుకుంది మౌక్తిక.

“ బాగుందే... అబద్ధం చెప్పాల్సిన అవసరం నాకేముంది? వాడిని చూస్తే ఆయనకి మళ్ళీ తిరగబెడుతుందని మేమే హాస్పిటల్ కి రావద్దన్నాం.'' విసురుగా పలికింది శకుంత.

“మరి ఆ అమ్మాయి?''

“తగుల్చుకున్నాక తప్పుతుందా! ఆ గదిలో వాడితో పాటే ఏడిసింది.'' నిరసన గళం వినిపించింది శకుంతల.

మౌక్తిక గదిలోకి వెళ్లింది. తప్పుచేసిన వాడిలాగా తల దించుకుని కూర్చున్నాడు దినేష్.

“రా అక్కా...'' అన్నాడు మౌక్తికను చూస్తూనే.

“అమ్మ ఏదో చెబుతోంది...''

“నువ్వు ప్రయాణం చేసి బాగా అలసిపోయావు. రెస్ట్ తీసుకో... తెల్లారాక మాట్లాడుకుందాం.'' అన్నాడు దినేష్ నిర్వేదంగా.

“ అలాకాదులే... విషయమేమిటో చెప్పు...'' ఖచ్చితంగా ఆడిగాను.

వాడు నిస్సహాయంగా చూస్తూ “ ప్రీతి నేను ఇంజనీరింగ్ లో క్లాస్‌మేట్స్... ఇద్దరం మనస్ఫూర్తిగా ప్రేమించుకున్నాం. నాన్నగారితో ఈ విషయం చెప్పి ఆయన ఆమోదం పొందాక ప్రీతి వాళ్ల వాళ్లకి కూడా చెబుదాం అనుకున్నాం. ఈ లోపే ఈ విషయం వాళ్లింట్లో తెలిసి పెద్ద రభస అయ్యింది.

ప్రీతి అన్నయ్యలు నన్ను అపార్థం చేసుకుని, నేను తనని ఛీట్ చేశానేమోనని భావించి, ఇంటిమీదకు వచ్చి నానాగొడవా చేశారు.వాళ్ళని వారించాలని ప్రయత్నంచేసి అశక్తుడనైనాను. పరిస్థితి నాచేయి దాటిపోయిందని అర్థమైంది. అందుకే... అప్పటికప్పుడు ప్రీతిమెళ్లో తాళి కట్టాల్సివచ్చింది.

ఈ అల్లరంతా నాన్నను మానసికంగా చాలా డిస్టర్బ్ చేసింది. నా వలన పదిమందిలో ఆయన పరువు మంటకలిసిపోయింది. ఆ బెంగతోనే ఆయనకు స్ట్రోక్ వచ్చింది. ఈపనివలన అమ్మ దృష్టిలో దోషిగా మిగిలిపోయాను. ఇప్పుడు నాన్న ఉన్న దుస్థితికి ఒకవిధంగా నేనే కారణం అక్కా...''

పశ్చాత్తాపం నిండిన దినేష్ స్వరంలో నిజాయితీ కనిపించింది మౌక్తికకు. బరువుగా వెలువడుతున్న అతడి మాటలు, అతడి మనోభారాన్ని సూచిస్తున్నాయి. అప్పుడు గమనించింది

మౌక్తిక అతడిపక్కనే నిలబడి, భీతహరిణలా బితుగ్గా చూస్తున్న అమ్మాయిని.

అనుకోని విఘాతం ఎదురైనప్పుడు తల్లడిల్లే పసిపిల్లలాగా ఉందామె వాలకం.

"దీనికంతటికీ కారణ్ నేను. మా వాళ్లు మిస్ అండర్‌స్టాండ్ చేసుకుని తొందరపడడం వల్లనే ఈ ముప్పు వచ్చింది. దయచేసి దిన్నూని ఏమీ అనకండి.'' ఏడుపుగొంతుతో పలికింది ప్రీతి.

దీనంగా ఉన్న ఆ అమ్మాయి వదనం చూస్తే జాలి ముంచుకొచ్చింది. నిజమే... దినేష్ చెప్పినదాన్ని బట్టి చూస్తే జరిగినదానిలో ఆ అమ్మాయి ప్రమేయమూ ఉన్నట్లూ తోచలేదు.ఆమె నిమిత్తమాత్రురాలు మాత్రమే.ఏదైనా సంఘటన జరగడానికి కార్యకారణ సంబంధం అంటూ ఒకటుంటుందని బామ్మ అనేది. ఇప్పటి ఈ సంఘటనకి ఆమె అనుకోని కారణమైంది.

చేసేదీ... చేయించేదీ... ఆ జగన్నాటక సూత్రధారి.

"జరిగిందేదో జరిగింది...నాన్నకిప్పుడు మానసిక ప్రశాంతత ఎంతో అవసరం. ఆయన మనసు కుదుటపడేవరకు నువ్వాయనకి ఎదురుపడకు. నేను ఆయనకి నచ్చ చెబుతాను. అన్నీ అవే సర్దుకుంటాయి.'' చెప్పింది మౌక్తిక దినేష్ భుజంతట్టి.

జరిగిన పరిణామాలన్నీ చూస్తూఉంటే సినిమాల్లో సంఘటనల్లా అనిపిస్తున్నాయామెకి.ఎవరో పనిగట్టుకుని డైరెక్ట్ చేసినట్లుగా సీన్లన్నీ అత్యంత నాటకీయంగా జరిగిపోతున్నాయి.

అంతలోనే నవ్వుకుంది విషాదంగా. అవును... ఆ దేముడిని మించిన ఎఫిషియెంట్ డైరెక్టర్ ఎవరుంటారు! మానవ జీవితానికి సంబంధించిన ప్రతి సంఘటనకూ పకడ్బందీయైన స్క్రీన్‌ప్లేని రాసుకుంటాడాయ. మనిషి మనుగడకి చెందిన స్క్రిప్ట్‌ని పక్కాగా తయారుచేసుకుంటాడు.

ఆ పైనుంచే మానవుని జీవితదశలను నిర్దేశ్యించి, రిమోట్ తన చేతిలో ఉంచుకుని ఆటాడిస్తాడు.

"థాంక్యూ ముక్తక్కా... థాంక్యూ వెరీమచ్. కనీసం నువ్వైనా నా హృదయఘోషను అర్ధం చేసుకున్నావు. అంతేచాలు.'' దినేష్ కళ్ళు సజలమైనాయి.

పొరపాటు చేశానేమోనన్న అపరాధభావన నిండిన వాడి వదనంలోకి కాస్తంత వెలుగు చిమ్మింది.

"వెళ్ళి పడుకోరా... అమ్మా ప్రీతీ... నువ్వు కూడా వెళ్ళి రెస్ట్ తీసుకో...'' అనేసి బయటపడింది మౌక్తిక ఆ గదిలోనుంచి.

"నువ్వేమిటే... వాడికి నాలుగు చీవాట్లువేసి, ఇంత గడ్డి పెడతావనుకుంటే... అలా వెనకేసుకొస్తున్నావేంటి?'' చాటుగా నిలబడి అంతా వింటున్న శకుంతల కూతురిమీద విరుచుకుపడింది.

తల్లి ధోరణి మౌక్తికకు చిరాకు తెప్పించింది. చిన్నప్పటినుంచీ చూస్తోంది. అదే స్వభావం. ఎంతసేపూ తన సొద అతనదేగాని, ఎదుటివ్యక్తి అభిప్రాయాలని, ఉద్దేశ్యాలని, ఉద్వేగాలని అర్ధం

చేసుకునే ప్రయత్నమే చేయదు. కనీసం... అవతలవాళ్ళేం చెబుతున్నారో వినేందుకు కూడా మొగ్గుచూపదు. అందుకే కాబోలు... ఆవిడకి, బామ్మకి నిరంతరం వాగ్యుద్ధాలు జరుగుతూ ఉండేవి.

"ఏంటమ్మా... వచ్చినదగ్గరనుంచీ చూస్తున్నాను. నీ గోల నీదేగాని ఎదుటివాళ్ళనసలు పట్టించుకోవు. ప్రతీ విషయాన్నీ భూతద్ధంలోనుంచి చూసి గగ్గోలుపెడతావు.అసలు... నాన్నకి నీమూలంగానే వచ్చుంటుంది గుండెపోటు. కనీసం తమ్ముడి విషయంలోనైనా సర్దుకుపోవడానికి ప్రయత్నించు.''ఎప్పుడూ తల్లి మాటలకి ఎదురాడని మౌక్తిక అలా కసురుకుంటున్నట్లుగా మాట్లాడడంతో అవాక్కయి నిలబడిపోయింది శకుంతల.

"అనవే అను... మీ అందరూ మంచివాళ్ళే. ఎదుటివారిని అర్ధం చేసుకునే ఉత్తమోత్తములే. నేనే దుర్మార్గురాలిని. పగదాన్ని, పరాయిదాన్ని'' మళ్ళీ ముక్కుచీదింది శకుంతల ఏడుపు మొదలెడుతూ.

ఆవిడని ఓదార్చడానికి తాతలు దిగి వచ్చినంత పనైంది మౌక్తికకు. అప్పుడప్పుడే తెల్లారుతోంది. అరుణభానుడి ఆగమనానికి మురిసిన తూరుపుకాంత ఆయనకు స్వాగతగీతి పాడడానికి సమాయత్తమవుతున్నట్లుగా కెంజాయవర్ణపు వస్త్రాన్ని చుట్టుకుంటోందా అన్నట్లుగా ఆకాశం అంతా ఎర్రబడింది. ఆ ప్రశాంత ప్రభాతంలో... పక్షుల కిలకిలారావాలు అనేక రకాలైన వాయిద్యాల సమ్మేళనంలా ధ్వనిస్తున్నాయి.

రాత్రంతా ప్రయాణం...ఎడతెరిపిలోఏని ఉద్విగ్నత... వీటన్నింటితో అలసిపోయిన మౌక్తిక కళ్ళు మూతలుపడ్డాయి ఆమె ప్రమేయం లేకుండానే. అలా హాల్లోనే ఓ మూలకి ఒరిగిపోయింది.

----------------- ---------------------

-------------------------

"ముక్తా లేమ్మా... లే..'' శకుంతల తట్టిలేపడంతో మౌక్తికకు మెలకువ వచ్చింది. బద్ధకంగా కళ్ళు తెరిచి , కిటికీలోనుంచి బయటకు చూసింది. బయట ఎర్రని ఎండ కాస్తోంది.తరణి తన తీక్షణతతో పరిసరాలను మండిస్తున్నాడు.

"ముక్తా బారెడు పొద్దెక్కింది లేమ్మా..టైమ్ ఎనిమిది దాటుతోంది. ఆ వేడి డబ్బాలో ఇడ్లీలు, ఫ్లాస్కోలో కాఫీ అన్నీ రెడీ చేసి పెట్టాను.చూసుకో. నేను హాస్పిటల్ కి వెళ్తొస్తాను. అక్కావాళ్ళు కాఫీ అయినా తాగారో లేదో..''కూతురి ముఖం మీదకు వంగి నిద్రలేపింది శకుంతల.

భర్త ఆరోగ్యం సరిగా లేదన్న బెంగ ఆమెను డీలాపడేలా చేస్తోంది. రెండురోజులుగా పడుతున్న టెన్షన్, నిద్రలేకుండా చేస్తున్న జాగరణ ఫలితంగా ముఖమంతా పీక్కుపోయి, కళ్లు లోతుకిపోయి నీరసంగా ఉంది ఆమె వాలకం.

తల్లిని చూస్తే జాలి ముంచుకొచ్చింది మౌక్తికకు.

చటుక్కున లేచి కూర్చుంటూ...''ఛ...ఛ...మొద్దునిద్ర పట్టేసిందదేమిటోగాని...కాస్సేపాగు అమ్మా... నేను తీసుకెళ్తాను అక్కవాళ్లకి టిఫిన్, కాఫీ. నాకు కూడా నాన్నగారిని ఎంత త్వరగా చూస్తానని ఒకటే ఆత్రంగా ఉంది.'' అంది మౌక్తిక.

“తొందరేమీలేదు... నువ్వు తాపీగా రా. రాత్రనగా వచ్చేశాను.ఆయనెలా ఉన్నారో ఏంటో!నేను వెళ్తాను... నువ్వు తరువాత రా...'' అంది శకుంతల హడావుడి పడుతూ.

మరి తర్కించలేదు మౌక్తిక. ఆవిడ ఆదుర్దాని అర్థం చేసుకున్నదానిలా మౌనంగా ఉండిపోయింది.

“సరే... నువ్వొక్కదానివీ వెళ్లగలవా మరి!'' అడిగింది.

“ఆఁ...మరేం ఫరవాలేదు. తెలిసిన రిక్షావాడున్నాడుగా. వాడిని రమ్మన్నాను.'' చెప్పింది శకుంతల కంగారుగా అన్నీ సర్దుకుంటూ.

మౌక్తిక లెచి స్నానపానాలు పూర్తిచేసుకుని తయారయ్యేసరికి పదిదాటింది. ప్రీతికి, దినేష్‌కి జాగ్రత్తలుచెప్పి ఆదరాబాదరా హాస్పిటల్‌కి బయలుదేరింది. ఆమె వెళ్ళేసరికి విద్యాధరరావు పరిస్థితి ఏమంత ఆశాజనకంగాలేదు. శకుంతల విషణ్ణవదనంతో దీనంగా కూర్చుని ఉంది. కార్తీక, ఆమె భర్త కూడా ఆందోళన చెందుతున్నారు.

కూతుర్ని చూస్తూనే” ముక్తా” అంటూ బావురుమంది శకుంతల. ఆ స్థితిలో ఆమె అవధులుదాటి పొంగుతున్న శోకసంద్రంలా ఉంది.

ఊరుకోమన్నట్లుగా తల్లి భుజాలమీద చేతులు వేసి పొదివిపట్టుకుంది మౌక్తిక.

ఆమెకళ్ళు కూడా సజలమైనాయి. ముక్కుకి ఏవేవో గొట్టాలు, నోటికి ఆక్సిజన్ మాస్క్... ఇవన్నీ తగిలించబడి అపస్మారకంగా పడి ఉన్న తండ్రిని చూస్తే ఆమెకు దుఃఖమాగడంలేదు.

ఆ మధ్యాహ్నం విద్యాధరరావుకి మరోమారు స్ట్రోక్ వచ్చింది. అది ఈసారి ఆయన ప్రాణాలను తనతోపాటుగా పట్టుకుపోయింది. మృత్యువుతో పోరాడేశక్తిని కోల్పోయిన ఆయన దాన్ని స్వాగతించారు సంతోషంగా.

శకుంతలని ఆపడం ఎవరివల్లనా కావడంలేదు.గుండెలు బాదుకుంటూ, దుఃఖభారంతో నిలువెల్లా కంపించిపోతూ ఆక్రోశిస్తున్న ఆమెను చూస్తే కడుపు తరుక్కుపోతోంది.

ఫార్మాలిటీస్ పూర్తయినాక విద్యాధరరావు పార్థివదేహాన్ని ఇంటికి తీసుకొచ్చారు.

ఆడపిల్లలందరిలోకీ చిన్నదైన మౌక్తిక అంటే ఆయనకు అపరిమితమైన వాత్సల్యం.

“ముక్తమ్మా... ముక్తమ్మా...”అంటూ ఆప్యాయంగా పిలుస్తూ తనను సమర్థిస్తూ వచ్చిన ఆయన...భర్తను కాదని వచ్చిన తన తప్పులెంచక, ఆప్యాయంగా గుండెల్లో పొదువుకుని తనకు ఓదార్పునిచ్చిన ఆయన మరిలేరంటే దుఃఖం ముంచుకొస్తోంది మౌక్తికకు.

తాను తమ్ముడు కీచులాడుకుంటే... తమ మధ్యన సయోధ్య కుదర్చలేక చిరునవ్వుతో తలపట్టుకునే తండ్రి...సాత్విక మతాంతర వివాహం చేసుకుంటే చిన్నబుచ్చుకుని ఆమెతో తెగతెంపులు చేసుకున్న తండ్రి...తల్లి-బామ్మల తగాదాల్లో ఎటూ వాలిపోక, మౌనప్రేక్షక పాత్ర వహించి ఎంతో సంయమనంతో వ్యవహరించిన తండ్రి...మరలిరాని లోకాలకి తరలిపోయాడంటే ...

నమ్మశక్యంగా లేదు మౌక్తికకు.

ఆ ఆవేదనని తట్టుకోవడం వాళ్లవలన కావడంలేదు. పుట్టిన ఏ జీవికైనా మరణం అనివార్యం. దాన్ని ఆపే శక్తి మనుషులను పుట్టించిన ఆ పరమాత్మకి కూడాలేదు.

గుండె రాయి చేసుకుని జరగవలసిన తతంగమంతా జరిపించేశారు. వాళ్ళ ధర్మంగా సావిత్రికి, సాత్వికకి కూడా ఆయన మరణవార్త తెలియజేశారు. సావిత్రి వెంటనే పతీసమేతంగా వచ్చి శకుంతలని పలకరించి వెళ్ళిపోయింది. సాత్విక మాత్రం ఆ టైమ్‌కి ఢిల్లీలో ఉండడంచేత దశాహంనాటికి వచ్చింది.

శకుంతల ఆమెను కౌగిలించుకుని ఒకటే ఏడిచింది. చిన్నారి ' విద్యాధర్' ని ఎత్తుకుని 'మావారం'టూ వదలడంలేదు.

విద్యాధరరావు బతికి ఉన్నన్నినాళ్ళూ సాత్వికను ఇంటిగడప తొక్కద్దని శాశించాడు. ఆయన మాటలని అక్షరాలా అమలుపరిచిన సాత్విక ఆయన కర్మకాండలకి హాజరవడం అందరినీ విచారసాగరంలో ముంచివేసింది.

అంత బాధలోనూ శకుంతల దినేష్‌ని తూలనాడడం మానలేదు. అతడిని తన అగర్భశత్రువులా చూస్తూ, తన మాంగల్యాన్ని లాగేసుకున్నాడంటూ ఒకటే శాపనార్థాలు పెడుతోంది. దినేష్ వెర్రివాడిలా చూస్తూ అలా మౌనంగా ఉండిపోయాడే గాని, నోరుతెరచి తల్లిని వారించలేదు.

ప్రీతి సంగతి సరేసరి...జరిగిన ఘోరానికి తానే కారణం కాబోలు... అనుకుని బిక్కచచ్చిపోయి ఓ వారగా ఒదిగిపోయింది.

అన్ని కార్యక్రమాలు ముగిశాయి. తండ్రి ఆత్మశాంతి కోసమని అన్నిరకాలు దానాలు చేసి, తంతంతా ఎంతో ఘనంగా జరిపించాడు దినేష్.

తన సెలవును మరొక నాలుగురోజులకి పొడిగించింది మౌక్తిక. కన్నతండ్రిని కోల్పోయిన లోటు ఎవరూ భర్తీ చేయలేరు. శకుంతలకి కష్టాన్ని ఎవరూ తీర్చలేరు. పోయినవాళ్ళని మరచిపోక తప్పదు. ఆ మరుపు మనిషికి భగవంతుడిచ్చిన అమూల్యవరం.

జరిగిన ఘోరాన్ని నెమరు వేసుకుంటూ, కృంగిపోయి కూర్చుంటే మనుగడ అసాధ్యం అవుతుంది.

అక్కలిద్దరూ వెళ్లిపోయాక ఇల్లు ఖాళీ అయ్యింది. తల్లిని తనతోపాటుగా తీసుకెళ్దామని అనుకుంది మౌక్తిక. కాని, శకుంతల రావడానికి ఒప్పుకోలేదు. తాను ఇప్పుడు ప్రయాణాలేమీ చేసే స్థితిలో లేనని, కాస్తంత మానసిక ప్రశాంతత చిక్కగానే వస్తానని చెప్పేసింది.

మనసునిండా అంతులేని విషాదం నింపుకుని మౌక్తిక ఊరికి బయలుదేరింది.

--------------------      --------------------

----------------------

"సారీ ముక్తా...నాన్నగారు పోయారని తెలిసినా నేను రాలేకపోయాను. '' రమ్య పలకరించింది ప్రియసఖిని.

ఆమె పలకరింపులోని ఆత్మీయత మౌక్తిక హృదయాన్ని తాకగానే ఆమె నయనాలు జలజల వర్షించాయి.శరత్ కూడా ఆమెను పరామర్శించి తన సంతాపాన్ని తెలియజేశాడు. కాలేజ్‌లో స్టాఫందరూ కూడా విద్యాధరరావు కి నివాళులు అర్పించారు. మధుకిరణ్ ప్రత్యేకంగా వచ్చి ఆమె వేదనను పంచుకునే ప్రయత్నం చేశాడు. అతడు అలా... అంత చేరువగా వచ్చి తనను సాంత్వన పరుస్తూ ఉంటే తన స్వంతమనిషే తనను ఓదారుస్తున్నట్లుగా ఫీలైంది మౌక్తిక.

అతడు తనపట్ల కనబరుస్తున్న శ్రద్ధకి తన మనసెక్కడ అతడి వశమైపోతుందోనని ఆ కళ్లలోకి చూడడానికే భయపడింది మౌక్తిక.

నెమ్మదినెమ్మదిగా తండ్రిపోయిన దుఃఖంనుంచి తేరుకుని రొటీన్‌కి అలవాటుపడసాగింది.

---------------------- ----------------------------
------------------------

ఆ రోజు ఉదయాన్నే ఆరున్నరకి యోగాక్లాసునుంచి తిరిగివస్తున్న మౌక్తికకు తోవలో కనిపించాడు మధుకిరణ్.

ట్రాక్‌సూట్ వేసుకుని, జాగింగ్ చేసుకుంటూ వస్తున్న అతడిని చూసి మంత్రముగ్ధలా ఆగిపోయింది మౌక్తిక.

తెల్లని చుడీదార్, పైజమాలో అప్పుడే విరిసిన నందివర్ధనంలా తాజాగా కనిపిస్తున్న మౌక్తికను చూస్తూనే, అకస్మాత్తుగా కాళ్ళకెవరో సంకెలలు బిగించినట్లుగా నిలబడిపోయాడు మధుకిరణ్ కూడా.

"గుడ్ మార్నింగ్ ముక్తాగారూ...ఏమిటి సంగతి... ఇంత పొద్దున్నే ఇలా దర్శనమిచ్చారు.?'' చొరవగా తనే ముందు పలకరించాడు మధుకిరణ్.

అతడంత సమీపంగా మాట్లాడుతూంటే మౌక్తికకు ఏదోలా ఉంది.

"యోగాక్లాసుకెళ్లి వస్తున్నాను. మీరెక్కడినుంచి?'' సమాధానం చెప్పకుండా ఉండడమ్ సభ్యత కాదని అడిగింది మౌక్తిక.

"నేను జాగింగ్ చేసి వస్తున్నానండీ...'' చెప్పాడు మధుకిరణ్.

అంత సున్నితంగా మాట్లాడే మగవాడిని ఆమె ఇంతవరకు చూసి ఉండలేదు. ఏదో... మృదుమధుర పరిమళం తనను చుట్టుముట్టినట్లుగా అనుభూతి చెందిందామె. మందగతిన వీచే మలయానిలం అలా...అలా... తనను స్పృశిస్తూ వెళ్ళి, తన మదిగది మూలలను ఆప్యాయంగా తడిమినట్లుగా ఉన్నాయతడి చూపులు.

ఇదేమిటి! అతడికి తానింతలా లోబడిపోతోందేమిటి! అతడి సమక్షంలో ఏమీ గుర్తుకురావడం లేదెందుకు! ఎవరి ఆంక్షలు, తానుచేసిన ప్రమాణాలు తనని బాధించనట్లుగా ఉంది అతడి

సాన్నిధ్యం.

"ఏమిటీ... అలోచిస్తున్నారు?'' చిత్తరువై తనముందు నిలచిన మౌక్తికను వింతగా చూస్తూ ప్రశ్నించాడు మధుకిరణ్.

"అబ్బే..ఏమీలేదండీ... మీరు వెళ్ళేది ఇంటికేగా?'' అసంబద్ధమైన ప్రశ్న అని తెలిసినా అడగక తప్పలేదు మౌక్తికకు.

"అప్పుడేనా! ఎనిమిదింటివరకు ట్యూషన్స్ చెప్పి అప్పుడింటికెళ్తా. బ్రహ్మచారిగాడిని కదండీ... అప్పుడెళ్లి స్వయంపాకం చేసుకోవాలి.'' నవ్వాడు మధుకిరణ్.

మల్లెమొగ్గల్లాంటి పలువరస మెరిసింది తళుక్కున.

'కాలేజ్ లో వస్తున్న జీతం సరిపోలేదు కాబోలు...ట్యూషన్స్ చెప్పు ఇంకా నొర్లేసుకుంటున్నాడు.' కినుకగా అనుకుంది మౌక్తిక.

చాలామంది అధ్యాపకులు కాలేజ్ లో పాఠాలు సరిగ్గా చెప్పకుండా, ఇంటిదగ్గర ట్యూషన్స్ చెప్పి డబ్బులు వెనకేసుకోవడం ఆమెకి తెలుసు. అలాంటి వాటికి ఆమె చాలా దూరం.

"బాగానే సంపాదిస్తున్నారనుకుంటా'' కాస్తంత వ్యంగ్యంగా అడిగింది మౌక్తిక.

అతడు ఆమెవైపు ఆశ్చర్యంగా చూసి "సంపాదనా! కొంపదీసి నేను డబ్బుకోసం ట్యూషన్లు చెబుతున్నాననుకుంటున్నారా!'' అడిగాడు నొచ్చుకుంటున్నట్లుగా ముఖంపెట్టి.

"మరి!"

"నేను ట్యూషన్లు చెప్పేది డబ్బుకోసం కాదండీ... నా ఆత్మతృప్తికోసం. మా ఇంటికి దగ్గరలో బీదసాదా ఉండేటువంటీ బస్తీ ఒకటి ఉంది. అక్కడ ఉండేవాళ్లంతా రోజుకూలి చేసుకుని జీవనం సాగించే కార్మికులు, తాపీపనివాళ్లు. వాళ్లపిల్లలలో కొందరు చాలా తెలివైనవాళ్లు. సానపడితే ఒక్కొక్కరు ఒక్కో వజ్రాల్లా తయారౌతారు. కాని, వాళ్లకి ట్యూషన్ సెంటర్లలో చేరే ఆర్థికస్తోమతలేదు.

మట్టిలో మాణిక్యాల్లా మెరిసిపోయే అటువంటి విద్యార్థులకి కోచింగ్ ఇచ్చి మెరికల్లా తయారు చేయాలన్నదే నా ఆకాంక్ష."చెప్పాడు మధుకిరణ్.

కళ్లు విప్పార్చుకుని వింటోంది మౌక్తిక. మధుకిరణ్ వ్యక్తిత్వంలో ఇంకో పార్శ్వం ఆవిష్కృతమౌతూంటే సంభ్రమంతో చూస్తూ ఉండిపోయింది ఆమె.

మధుకిరణ్ చాలా సమర్థుడైన అధ్యాపకుడు అని ఆమెకి తెలుసు. అటువంటివాడు ఏ కోచింగ్ సెంటర్ పెట్టుకున్నా వేలకివేలు సంపాదించుకోవచ్చును. కాని, అతడలా ప్రతిఫలాపేక్ష లేకుండా పేదపిల్లలకి విద్యాదానం చేయడంతో ఆమె మనసులో అతడికున్న స్థానం ఇంకా పదిలమై నిలిచింది.

ఆమె దృష్టిలో అతడు హిమవన్నగమంత ఎత్తుకి ఎదిగిపోయాడు.

“గ్రేట్ మధుకిరణ్ గారూ...మీరు చేస్తున్న ఈ మంచిపని వలన ఎందరో పేదపిల్లల జీవితాలలో వెలుగులు నిండుతాయి.

ఈసారి మధుకిరణ్ విస్మయంగా చూశాడు ఆమెవైపు.

మౌక్తిక అతడితో అంత ఫ్రీగా మాట్లాడడం అదే మొదటిసారి మరి! ఎప్పుడూకూడా అత్తిపత్తిలా తనలోకి తానే ముడుచుకుపోతూ, బిడియంగా ఉండే మౌక్తిక అలా మనసువిప్పి తనతో మాట్లాడడం అతడికి అంతులేని సంతోషాన్ని కలుగజేసింది.

ఆమె సమక్షం ఏదో వింతభావనని రేకెత్తిస్తోంది. మాట్లాడుతున్నప్పుడు చిన్నగా మూసుకుంటూ, విచ్చుకుంటున్న ఆమె పలుచని పెదవులు, ఏదో తత్తరపాటుతో చంచలంగా కదులుతున్న ఆమె కనుగుడ్లు ఇవన్నీ అతడికి ఎంతో అపురూపంగా అనిపిస్తున్నాయి.

అలా ఆమెనే చూస్తూ యుగాలకొద్దీ ఉండిపోవాలనిపిస్తోంది. అతడికి స్పష్టంగా తెలుసు... తాను వెదికే అమ్మాయి ఆమేనని. కాని, ఆమె మనసులో ఏముందో తెలియడంలేదు. తాను తారసపడినప్పుడు ఆమెలో కనిపించే భావావేశాలకి అర్థమేమిటో అతడు కనుక్కోలేకపోతున్నాడు.

ఆమె నయనాలలో తనపట్ల వ్యతిరేకతైతే కనబడదు. కాని, ముఖంలో ఏదో... కంగారు, ఇదీ అని చెప్పలేని తడబాటు.

ఆమె హృదయాన్ని చేరే మార్గం ఆ కాలమే చూపాలి తనకు.

“వస్తా ముక్తాగారూ...నా క్లాసులకి టైమౌతోంది.'' ఆమెను వీడివెళ్లడం తప్పనిసరి అన్నట్లు కదిలాడు మధుకిరణ్.

“అలాగే... బై...'' అంది మౌక్తిక అతడు వెళ్తున్నవైపే చూస్తూ.

------------------------ -------------------------- ---------------------

“అక్కా...నువ్వొకసారి అర్జెంటుగా ఇంటికి రా...నీతో ఎన్నో మాట్లాడాలి.'' దినేష్ దగ్గరనుంచి ఫోన్ రాగానే ఆదరాబాదరా బయలుదేరిపోయింది మౌక్తిక.

వెళ్లేముందు రమ్యతో ఓమాట చెప్పిపోదామని వాళ్ళింట్లోకి వెళ్లింది. బెడ్‌మీద నిస్త్రాణంగా పడుకుని ఉంది రమ్య. పక్కనే ఉన్న శరత్ ఆమెచేత పళ్లరసం తాగించడానికి నానా తంటాలూ పడుతున్నాడు.

మౌక్తికను చూస్తూనే “చూడండి ముక్తా...జ్యూస్ తాగకుండా చిన్నపిల్లలా ఎలా మారాం చేస్తోందో... రెండురోజులై ఒకటే వామిటింగ్స్. ఎంత నీరసంగా అయిపోయిందో చూశారా... మీరన్నా మీఫ్రెండ్‌కి నచ్చచెప్పి ఈ జ్యూస్ తాగించండి....ప్లీజ్...'' పక్కకు తప్పుకుంటూ చేతిలోని గ్లాసుని టీపాయ్ మీద ఉంచాడు శరత్.

రమ్యకి వాంతులవుతున్నాయా!? ఎందుకు? పైత్యంచేసిందా? రెండురోజులై లీవ్ లో ఉంది

తను. ఫీవర్ అని చెప్పింది. ఇంకా తగ్గలేదా!?

"ఏమిటి రమ్యా? వాంతులవుతున్నాయా? నాతో అననేలేదూ..'' గ్లాసు రమ్య నోటికి అందించింది మౌక్తిక.

"ప్లీజ్ ముక్తా... తాగాలనిలేదు.నన్ను ప్రెస్‌చేయకు...'' అయిష్టంగా ముఖం తిప్పుకుంది రమ్య.

'పోనీలే... నీకు సహించకపోతే వద్దు. డాక్టర్ దగ్గరకన్నా వెళ్తావా!?'' గట్టిగా నిలదీసింది మౌక్తిక.

"అన్నీ అయ్యాయి... మొదట్లో ఇలాగే ఉంటుందని చెప్పిందావిడ...'' చిరాగ్గా అంటూ నాలిక్కరుచుకుంది రమ్య.

'మొదట్లో ఇలాగే ఉంటుందా!' అంటే! మౌక్తికకు అర్థం అయ్యీ...కానట్లుగా ఉంది.

" అసలే...క్యారీయింగ్... సహించినా సహించకపోయినా ఆరారా ఏదో ఒకతి తినాలని, తాగాలని చెప్పింది డాక్టర్...కాని, తనేమో మొండికేస్తోంది...'' తెగ హడావుడి పడిపోతున్న శరత్‌ని చూస్తే ఆమెకో సంగతి స్ఫురించింది.

రమ్య చెవిలో తానడగాలనుకున్నది అడిగేసింది గుసగుసగా.

ఆమె సిగ్గుగా నవ్వి మూడువేళ్ళు చూపించింది కళ్లు అరమోడ్పులవ్వగా.

అంతే... విషయం మొత్తం బోధపడిపోయింది. తన అల్లరి స్నేహితురాలు అమ్మ కాబోతోందన్న శుభవార్త తెలిసి ఎంతో సంతోషమనిపించింది మౌక్తికకు.

వెంటనే పరుగున వెళ్లి...రివ్వున వీస్తున్న చల్లగాలికి, ఆకాశంలో పరుగులు తీస్తున్న నీలిమబ్బులకి, స్వేఛ్ఛగా రెక్కలు 'టపటప' లాడించుకుంటూ ఎగిరిపోతున్న పక్షిసమూహాలకి ఈ శుభవర్తమానం చెప్పేసి రావాలి అనిపించింది.

అమ్మతనం పొందడంకన్నా అమూల్యవరం ఇంకేం కావాలి ఆడదానికి. స్త్రీత్వానికి సార్థకత చేకూరేది ఇక్కడే. పురుషుడు తలకిందులుగా తపస్సుచేసినా అనుభవించలేని మహత్తరమైన ఆనందం మగువకి లభించేది ఈ ఒక్కవిషయంలోనే.

తన ప్రాణాలను పణంగా పెట్టి , మృత్యువుతో పోరాడి ఒక జీవికి ఊపిరిపోసే అద్భుతశక్తి కేవలం స్త్రీమూర్తికే ఉంది.

ఆడపుట్టుక పుట్టినందుకు ఆక్షణాన ఎంతో గర్వంగా అనిపించింది మౌక్తికకు. అంతలోనే మనసంతా పిచ్చిపిచ్చిగా తయారైంది.

రమ్య నెలతప్పితే తనకెందుకు ఇంతసంబరం!? ఆమెతో తనకి పోలికేమిటి!?

అడవిలో పూసిన పిచ్చిపూవుకి, సుందరనందనోద్యానవనంలో ముద్దుగా విరిసిన గులాబిబాలకి సాపత్యం ఏమిటి?

అందం, యవ్వనం అంతా కూడా అడవికాచిన వెన్నెలలా వ్యర్థంగా ఉండిపోయి ఏ అనుభూతికీ

నోచుకోని తనకి, అనాఘ్రాత పుష్పంలా మిగిలిపోయిన తనకి...

తన స్త్రీత్వాన్ని, సౌందర్యాన్ని మనసైన ప్రాణనాధునికి అంకితంచేసి, అతడినుంచి అపురూపమైన అమ్మతనాన్ని కానుకగా పొందిన రమ్యకి సామ్యమా!?

అనుకుందికే ఏదోలా ఉంది. ఆడపుట్టుక పుట్టగానే సరా! అనుభవించే రాతుండద్దూ... ఒక శుష్కహాసం మెదిలింది మౌక్తిక పెదవులమీద. తన భావావేశాన్ని బహిర్గతం కానివ్వకుండా జాగ్రత్తపడుతూ... రమ్యని, శరత్ ని మనస్ఫూర్తిగా అభినందించి తాను ఊరికి వెళుతున్న విషయం చెప్పి బయలుదేరింది మౌక్తిక.

"నా బంగారుతల్లికదూ...నువ్విలా అల్లరిపెడితే..నీ కడుపులో పెరుగుతున్న బుజ్జిగాడికి బలం ఎలా వస్తుందిచెప్పు!? నా మాట విని ఒక్క సిప్...''గారం చేస్తూ బతిమలాడుతున్నాడు శరత్ మళ్ళీ.

"ఇదంతా బుజ్జిగాడిమీద ప్రేమే కాని, నామీద కాదన్నమాట!'' అలిగినట్లుగా అంటోంది రమ్య.

కిలకిల నవ్వులు వినబడ్డాయి ఒక్కసారిగా. తానేమి కోల్పోయిందో... మౌక్తికకు గుర్తు చేశాయి ఆనవ్వులు. భారమైన మనసుతో గేటుదాటింది.

------------------- -----------------
-------------------

ఇల్లుచేరిన మౌక్తిక ప్రీతిని చూస్తూనే నిర్ఘాంతపోయింది. తండ్రికి ఒంట్లో బాగాలేనప్పుడు తాను తొలిసారిగా చూసిన ప్రీతికి, ఈ ప్రీతికి అస్సలు పోలికేలేదు.

బొద్దుగా, ముద్దుగా ముద్దబంతిలా మిసిమివన్నెలొలుకుతూ ఎంతో ఆకర్షణీయంగా ఉన్న ఆనాటి ప్రీతివేరు.

శరీరమంతా శుష్కించి, వన్నెతగ్గి, వసివాడి కళ్లకిందుగా పాకిన నల్లని చారలతో వడలిపోయిన గులాబీలా ఉన్న ఇప్పటి ప్రీతి వేరు.

కేవలం రెండు... రెండంటే రెండే నెలల్లో మనిషిలో ఇంతటి మార్పు రావడం సాధ్యమా!

దానికి సాక్ష్యంగా కనబడుతున్న ప్రీతిని చూస్తే మౌక్తిక కడుపు తరుక్కుపోయింది.

"ఏంటి ప్రీతీ... ఇలా అయిపోయావు? ఒంట్లో బాగాలేదా?'' కళ్లలో ప్రాణాలు నిలబెట్టుకున్నట్లుగా ఉన్న ప్రీతిని ఆప్యాయంగా దగ్గరకు తీసుకుంది మౌక్తిక.

దినేష్ ముఖం గంభీరంగా మారిపోయింది.

"ప్రీతీ... నువ్వు లోపలికి వెళ్ళి అక్కకి కావలసినవి చూడు..'' అని ఆమెకి పురమాయించి, "అక్కా... నువ్వు స్నానంచేసి రెస్ట్ తీసుకో...తరువాత మాట్లాడుకుందాం.'' అన్నాడు.

ప్రీతి లోపలికి వెళ్ళిపోయింది. దినేష్ వైఖరికి, ప్రీతి అలా నీరసించిపోవడానికి కారణం ఏమైఉంటుందో మౌక్తికకు అంతుచిక్కడంలేదు.

ఇంట్లో శకుంతల అలికిడి వినబడలేదు. ఆమె ఏమైనట్లు!?

"అమ్మేది దినేష్?'' అడిగింది మౌక్తిక బ్యాగ్ లోనుంచి ఇస్త్రీ చీర, జాకెట్ తీసుకుంటూ.

"అమ్మ...పెద్దక్క వాళ్ళింట్లో ఉందక్కా...'' దినేష్ స్వరం నూతిలోనుంచి వస్తున్నంత నీరసంగా ఉంది.

"అక్క తీసుకెళ్లిందా?'' తండ్రి పోయి, మూడోనెల నడుస్తోంది కాబట్టి లాంఛనం కోసం కార్తిక తల్లిని తీసుకెళ్లిందేమోనని అడిగింది మౌక్తిక.

"లేదక్కా''.

"మరి! " ఆశ్చర్యపోయింది మౌక్తిక.

"అమ్మ నామీద అలిగి వెళ్ళిందక్కా.'' ఆ విషయం చెప్పడానికి అతడు ఎంతో వేదనను, మానసిక సంఘర్షణని అనుభవించాడని అతడి వాలకమే చెబుతోంది.

"అదేంటి దినేష్... అమ్మ నీమీద అలగడం ఏమిటి?'' నమ్మలేనట్లుగా చూసింది మౌక్తిక.

దినేష్ శకుంతలకి గారాల పుత్రుడు. ఒక్కగానొక్క మగపిల్లాడని ఆమెకు అతడిమీదే పంచప్రాణాలూనూ. భర్త ఎప్పుడైనా మందలించబోతే 'పసివాడం'టూ వెనకేసుకొచ్చేది. అందుకే అక్కచెల్లెళ్లందరూ కూడా దినేష్‌ని ' అమ్మకూచి' అని వెక్కిరిస్తారు.

అటువంటి దినేష్ మీద తల్లి అలగడమేమిటి... వింత కాకపోతేనూ!

"నువ్వు చెప్పేది నిజమేనట్రా!'' విస్మయంగా అడిగింది మౌక్తిక.

విరక్తిగా నవ్వాడు దినేష్.

"ఏ ముహూర్తాన నేను ప్రీతిని పెళ్ళి చేసుకున్నానో గాని, అప్పటినుంచీ ఈ ఇంట్లో అన్నీ అరిష్టాలే. అల్లారుముద్దుగ పెరిగిన ఆమెకు నా వలన ఎటువంటి సుఖమూ చేకూరకపోగా, ఆమె బతుకు మరింత నరకమైంది. ప్రీతిని ఈ ఇంటికోడలిగా తెచ్చి నేను చాలా పెద్ద తప్పు చేశానక్కా'' బాధగా పలికాడు దినేష్.

"దినేష్... ఏమంటున్నావురా?'' నిర్ఘాంతపోయింది మౌక్తిక.

అతడు నిస్పృహగా చూస్తూ "అవునక్కా... ప్రీతిని చూస్తేనే అమ్మకెందుకో కోపం. నేను, ప్రీతి సరదాగా మాట్లాడుకుంటే చూడలేదు. నాకు సంబంధించినంత వరకు అన్నిపనులూ తానే చేయాలి అనుకుంటుంది ప్రీతి జోక్యాన్ని అస్సలు సహించలేకపోతోంది.

ప్రీతి గట్టిగా మాట్లాడినా, నవ్వినా, ఆఖరుకి శుభ్రంగా తయారై మంచిచీర కట్టుకున్నా అమ్మ భరించలేకపోతోంది. ప్రతి విషయంలో ఆమెను తప్పుపడుతోంది. పని చేయడానికి ముందుకొస్తే నీ సహాయం అక్కరలేదంటోంది. అలాగని దూరంగా మెలిగితే 'దున్నపోతులా తిని కూర్చుంటే ఇంటి చాకిరీ అంతా చేసే ఓపిక తనకు లేదని తగువాడుతోంది.'' గాఢంగా నిట్టూర్చాడు దినేష్.

“నువ్వు చిన్న సమస్యను పెద్దది చేసి చూస్తున్నావేమో దినేష్. నాన్నపోయి ఇంకా మూడునెలలు కూడా కాలేదు. బహుశా అమ్మ... ఆ డిప్‌రెషన్‌లో...'' ఖండించింది మౌక్తిక.

దినేష్ అడ్డంగా తలూపుతూ “అలా అనుకునే నేనూ ఓపిక పట్టానక్కా... కాని,అమ్మ విపరీత ధోరణి రోజురోజుకీ ఎక్కువౌతోంది. నేను ప్రేమించానని చెప్పడం లేదు కాని, ప్రీతి చాలా మంచి అమ్మాయి. ఎవరినీ నొప్పించే మనస్తత్వం కాదు. ఎందుకో గాని, అమ్మ ప్రీతి ఉనికిని ద్వేషించేంతటి రాక్షసత్వం ప్రదర్శిస్తోంది. ప్రీతి పడే మానసిక క్షోభ నేను చూడలేకున్నాను. నా మీద ఇష్టంకొద్దీ తను ఇదంతా భరిస్తోంది. తన పుట్టింట్లో విషయం తెలిస్తే... మళ్లీ ఏం గొడవలౌతాయోనని పళ్ల బిగువున భరిస్తోంది. చివరికి... అమ్మ... ఎంతలా తయారైందంటే...'' దినేష్ స్వరం గధ్గదమైంది.

“ఏమైందిరా?'' ఆరాటంగా అడిగింది మౌక్తిక.

అతడు ఇబ్బందిగా కదులుతూ” నాలుగురోజుల కిందట రాత్రి పదకొండు గంటలప్పుడు...నేను, ప్రీతి ఏకాంతంలో ఉండగా... హఠాత్తుగా గది తలుపులు తట్టి, లోపలికి వచ్చి తనకు భయంగా ఉందంటూ మా ఇద్దరి మధ్యనా పడుకుంది...'' చెప్పలేక చెప్పలేక చెప్పాడు.

తీవ్ర దిగ్భ్రమకి లోనైంది మౌక్తిక. తల్లి ఇంత సంస్కారహీనంగా తయారైంది అంటే ఆమెకి నమ్మశక్యం కావడంలేదు. అసలు... ఆమె ఎందుకింత దిగజారి ప్రవర్తించినట్లు!? మిలియన్ డాలర్ల క్వశ్చన్.

నిజంగానే భయపడిందనుకోవడానికి లేదు. ఆమెకి భయమంటే ఏమిటో తెలియదు. ఇంట్లోని వాళ్లందరూ ఎక్కడైనా వెళ్లినా సరే... ఎవరి సాయమూ లేకుండా అదే ఇంట్లో ఎన్నోసార్లు గడిపిన ఆమె భయమంటూ వెళ్ళి, భార్యాభర్తలని అసౌకర్యానికి గురిచేసిందా!?

“నమ్మలేకపోతున్నావు కదూ! కాని, ఇదంతా నిజమక్కా. మరునాడు ఉదయాన అకారణంగా ప్రీతిమీద విరుచుకుపడిన అమ్మని' నీ ఉద్దేశమేమిటని' నిలదీశాను. అంతే...నన్ను నానా మాటలాడి అలిగి, అక్కవాళ్ళింటికి వెళ్లిపోయింది'' దినేష్ కళ్లు సజలమైనాయి.

తనకన్నా రెండేళ్ళు చిన్నవాడైన అతడి కళ్లలో చెమ్మని చూసి తట్టుకోలేకపోయింది మౌక్తిక. తల్లి అతడినెంతో గారం చేసేది.

“మగపిల్లాడిని అంతలా నెత్తెక్కించుకోవద్దే శకుంతలా...గారాబం ఎక్కువైతే చెడిపోతారంటూ' నెత్తినోరు కొట్టుకుని గోలపెట్టేది బామ్మ.

అయినాసరే... అతడి ఒంటిమీద ఈగ కూడా వాలనిచ్చేదికాదు తల్లి. అటువంటి తల్లి ...ఇప్పుడు కొడుకు సుఖసంతోషాలకి అడ్డుతగులుతోందెందుకు? అనురాగమయమైన అతడి సంసారానికి విఘాతం కలిగిస్తోందెందుకు?

మౌక్తిక బుర్రంతా గజిబిజిగా తయారైంది.

“వదినా... స్నానానికి నీళ్ళు పెట్టాను. మీరు ఫ్రెష్ అయితే టిఫిన్ చేద్దురుగాని...''చెప్పింది ప్రీతి వంటింటి గడపలో నిలబడి.

ఆమెవైపు తదేకంగా చూసింది మౌక్తిక. కల్లాకపటం తెలియని అమాయకపు పసిదనం తొంగిచూస్తోంది ఆమె వదనంలో. ఆ కళ్ళు... మంచులో తడిసిన మరుమల్లెల్లా వింత ధవళిమతో మెరుస్తున్నాయి. ఆ ముఖంలో ఎక్కడాకూడా జాణతనం కాని, జట్టీలుపెట్టే మనస్తత్వం కాని కనబడడంలేదు.

ఇంతటి సౌజన్యమూర్తిని తల్లి అంతలా ఆరడి పెడుతోందెందుకు!?

స్నానం చేసొచ్చి ప్రీతి పెట్టిన టిఫిన్ తినేసి బయలుదేరింది మౌక్తిక.

"అక్కా'' గడప దాటుతూంటే పిలిచాడు దినేష్.

"ఏంటిరా?'' ఆప్యాయంగా అడిగింది మౌక్తిక.

"అమ్మతో అనవసరంగా గొడవ పడకక్కా... నీతో చెప్పుకుంటే, నిన్నోసారి చూస్తే నా గుండెబరువు తీరి కాస్త మనశ్శాంతిగా ఉంటుందని నిన్ను రమ్మన్నాను.'' ఏడ్చేశాడు దినేష్.

చూడలేకపోయింది మౌక్తిక. తనతో ఏదైనా గొడవ పడినప్పుడు ఎప్పుడూ తనదే పైచేయిగా ఉండాలని మొండిగా వాదించే దినేష్... ఇలా పిరికివాడిలా ఏడుస్తూ ఉంటే మౌక్తిక గుండె తరుక్కుపోయింది.

తనకే ఇంత బాధగా ఉందే!మరి... తల్లి గుండెల్లో జాలి, దయ ఇంకిపోయి ఆమె అంత మొరటుగా తయారైందేమిటి!?

"నువ్వు గాబరాపడకు. నేను అంతా సెట్‌రైట్ చేస్తానుగా.'' అతడికి అభయం ఇచ్చి వీధిలోకి కాలుపెట్టింది మౌక్తిక.

------------------

-------------------------                                             -------------------

మౌక్తికను చూడగానే శకుంతల ఆశ్చర్యపడింది. కూతురంత హఠాత్తుగా ఎందుకు ఊడిపడిందో అర్ధంకాక సంశయంగా చూడసాగింది.

"ఎప్పుడొచ్చావే ముక్తా...'' కూతురుని పలకరించింది.

తనకేమీ తెలియనంత అమాయకంగా ముఖం పెడుతూ " ఇప్పుడే వచ్చాలే...నువ్వేంటిక్కడా?'' అడిగింది మౌక్తిక.

అంతే... శకుంతల ముఖం కళతప్పింది. ఎందుకంటే శకుంతల ఇల్లువిడిచి ఎవరింట్లోనూ ఒక్కక్షణం ఉండదు. ఎప్పుడైనా కార్తీక వచ్చి తనింట్లో నాలుగురోజులు ఉండమంటే" ఆడపిల్ల సొమ్ము మాకెందుకు?'' అంటూ రానుపొమ్మని నిరాకరించేది.

"అంతా నా ఖర్మ తల్లీ...ఏ ముహూర్తాన ఆ మహాతల్లి ఇంట్లో పాదం మోపిందో నా కొడుకు నాకు కాకుండా పోయాడు.వన్నెల విసనకర్రలా వగలుపోయి వాడికి వల విసిరింది. వాడికేదో మందుపెట్టి తన వశం చేసుకుంది. నా కొడుకుని నా నుంచి దూరంచేసింది.'' కళ్లు-ముక్కు ఎర్రగా చేసుకుని

ఆవేశపడింది శకుంతల.

నువ్వు సమస్యను నీ కోణంలోనుంచే చూస్తున్నావు. వాడింకా పసిపిల్లాడు కాదు. పెళ్లైనవాడు. వాడికీ వ్యక్తిగత జీవితం ఉంటుంది. మనమే సర్దుకుపోవాలి.'' వ్యర్థమని తెలిసినా శకుంతలని శాంతపరచాలని చూసింది మౌక్తిక.

ఆవిడ తన ముఖాన్ని కందగడ్డలా చేసుకుని "ఏమిటే సర్దుకుపోయేదీ... గాడిదగుడ్డు. నేననేదాన్ని జన్మనివ్వకపోతే వాడెలా వచ్చాడటా! అలాంటి కన్నతల్లిని ...పెళ్లవగానే పనికిమాలినదానిలా చూస్తాడా? ఆ ఇనపగజ్జెలతల్లి ని ఇంట్లోకి తెచ్చి నా పసుపుకుంకాలు లాగేసుకున్నాడు. అది చాలనట్లు నన్ను చులకన చేసి చూస్తాడా?'' ముక్కుచీదింది జిర్రున.

తల్లి ఆక్రోశానికి అర్థం తెలిసింది మౌక్తికకు. పొసెసివ్‌నెస్...

తనది అనుకున్న వస్తువు వేరొకరి స్వంతం అయితే చూసి ఓర్వలేని ఉడుకుమోత్తనం. కొడుకు కోడలికి తనతో సమానస్థానమిచ్చి ఆదరిస్తే భరించలేని అసూయ.

తన మనిషి కేవలం తన సొత్తు మాత్రమే కావాలని ఆశించే స్వార్థపరత్వం.

అత్తకోడళ్లకి అభిప్రాయబేధాలు తలెత్తేదిక్కడే. అన్నాళ్ళు ' అమ్మా...అమ్మా...' అంటూ తన కొంగుపట్టుకుని తిరిగే ముద్దులకొడుకు..., కోడలు రాగానే ఆమె కొంగుచాటు కృష్ణుడల్లే మారిపోవడం చూసి సహించలేనితనంతో కొందరు తల్లులు వారిని విడదీసేందుకు సైతం వెనుకాడరని తల్లిని చూస్తే తెలిసింది మౌక్తికకు.

తన తల్లి కూడాఈ రకమైన భావనకి అతీతురాలు కాదన్న సత్యం అవగతమైన మౌక్తిక డీలాపడిపోయింది.

ఇంతలో కార్తిక వచ్చి "ఇలారా ముక్తా" అంటూ మౌక్తిక చేయిపట్టుకుని గదిలోకి తీసుకెళ్ళి తలుపు మూసింది.

"ముక్తా... ఇక్కడ నూటికి నూరుపాళ్ళు అమ్మదే తప్పు. ప్రీతి మెతకపిల్ల అని నాకు తెలుసు. కాని, తనను దోషి చేసి నిలదీస్తే అమ్మ తట్టుకోలేదు. అందుకే... నీకు ఫోన్ చేయమని తమ్ముడితో చెప్పాను. ఏం చేయాలో కాస్త ఆలోచించు.'' చెప్పింది కార్తిక.

ఆమె సంయమనానికి, వ్యవహార దక్షతకు అబ్బురపడింది మౌక్తిక. నిజమే... పీకలు తెగ్గోసేంత కర్కోటకుడిని కూడా డైరెక్ట్‌గా నువ్వు ' నేరస్తుడివి' అంటే మండిపడతాడు.

'నీదేతప్పు...' అని నేరుగా చెబితే తల్లికి కోపం రావచ్చును.

"అయితే అమ్మని కొన్నాళ్లపాటు నాతో తీసుకెళ్తాను. ఆమె మనసు మరలేదాకా అక్కడే ఉంటుంది.'' అంది మౌక్తిక.

కార్తిక సంతోషంగా చూసి "అవునే ముక్తా...నువ్వన్నదీ నిజమే.... ఇక్కడ వాళ్లకి కూడా కాస్త

రిలీఫ్‌గా ఉంటుంది. కొత్తగా పెళ్ళైందన్న మాటేగాని తమ్ముడు ఒక్కరోజు కూడా ఆనందంగా గడిపిందిలేదు.'' అంది జాలిగా చూస్తూ.

"ఏమిటే... మీ ఇద్దరూ అక్కడ మంతనాలూ...'' అనుమానంగా అరిచింది శకుంతల.

"ఏమీలేదమ్మా... నిన్ను నాతో తీసుకెళ్తానని అక్కతో చెబుతున్నా...'' సర్దుకుంటూ అంది మౌక్తిక.

"అవునమ్మా...అంతే...'' వత్తాసు పలికింది కార్తిక.

"నేను నీతో చచ్చినా రాను. ఆ ఇల్లునాది... ఆ ఇంటిమీద నాకు సర్వాధికారాలూ ఉన్నాయి. ఆముట్టముంగి నన్నింట్లోనుంచి పంపేయడానికి ప్లాన్ వేసినట్లుంది... దాని ఆటలు నాదగ్గర కాదు.'' ఆగ్రహంతో బుసలుకొట్టింది శకుంతల.

తల్లిధోరణి మౌక్తికకి చిరాకు కలిగించగా"చూడమ్మా... నిన్నెవరూ అక్కడినుంచి పొమ్మనలేదు. వాళ్లమీద అలిగి నీకు నువ్వుగా ఇంట్లోనుంచి వచ్చేశావు. బామ్మకూడా ఇలాగే భావించి నిన్ను-నాన్నగారిని సంసారం చేయనివ్వకపోతే మేమందరం ఎలా పుట్టేవాళ్లం? నువ్వెందుకింత అసభ్యంగా...ఛ ఛ...'' అసహనంగా అంది మౌక్తిక.

శకుంతల విస్తుపోయింది. ఖంగుతిన్నట్లుగా కూతురివైపు చూసింది. కూతురు తననిలా నిలదీస్తుందని ఆమె అస్సలూహించలేదు. గుడ్ల నీరుకుక్కుకుని అలా నిలబడిపోయింది.

తల్లిని చూస్తే జాలనిపించినా, కాస్త మెత్తబడితే ఆవిడ బిగుసుకుపోతుందని బింకంగా వ్యవహరించింది మౌక్తిక.

"నాతోపద... ప్రదేశం మారితే నీకూ ఉపశమనంగా ఉంటుంది. నీకేలోటూ కలగకుండా చూసుకునే పూచీనాది.'' అనునయంగా పలికింది.

"అవునత్తయ్యా... వెళ్ళండి. మనసుకి కాస్త ప్రశాంతంగా ఉంటుంది.'' కార్తిక భర్త నచ్చచెప్పాడు.

ఏమనుకుందో... అలాగేనంది శకుంతల. ఆ మరునాడే తల్లిని తీసుకుని బయలుదేరింది మౌక్తిక. దినేష్- ప్రీతి కళ్లలో మెరిసిన ఆనందపు మెరుపులు చూసిన మౌక్తిక మనసెంతో తృప్తిచెందింది.

------------------------- --------------------
-------------------

"ఛ...కాలంగాని కాలంలో ఈ వానేమిటో!" వర్షపుధారల్లో తడిసి ముద్దైన మౌక్తిక అలా విసుగ్గా అనుకోవడం ఏ పదిహేనోసారో అయ్యుంటుంది.

ఆ రోజు గురువారం కావడంతో సాయిబాబా గుడికి వచ్చింది మౌక్తిక. గుడిలో సాయిబాబాకి హారతిచ్చే సమయం అది. భక్తులందరూ కలిసి హారతి పాటలు పాడుతున్నారు. ప్రశాంతత నిండిన ఆ వాతావరణం మనసుకి హాయిని కలిగిస్తోంది.

గుడిలోనుంచి ఇలా బయటకి వచ్చిందో లేదో...చెప్పాపెట్టకుండా... పెట్టేబేడాతో దిగిపోయిన

దూరపు చుట్టంలా ఉరుములు మెరుపులతో పెద్దవాన దిగిపోయింది.

తడుసుకుంటూనే వెళ్ళి ఒక షాపుముందు నిలబడింది మౌక్తిక. ఎంతగా ఒదిగి నిలుచున్నా శరీరమంతా తడిసిపోయింది.

"హలో ముక్తాగారూ... ఏమిటిలా వానలో బయలుదేరారూ?'' చొరవగా అడుగుతూ షాప్ ముందు బైక్ ఆపాడు మధుకిరణ్.

మౌక్తిక హృదయం అప్రయత్నంగానే లయతప్పింది. అతడు కనబడగానే ఆమెలో ఏదో భావసంచలనం మొదలైంది.

"ఏంటండీ... మాట్లాడరూ...'' చిటికె వేసి పిలిచాడు మధుకిరణ్.

"సాయిబాబా గుడికొచ్చాను. ఇంతలో... ఇలా'' బిడియంగా చెప్పింది మౌక్తిక.

"అరెరె... మొత్తం తడిసిపోయారే... మీకు అభ్యంతరం లేకపోతే... ఈ పక్కనే నా రూమ్. రండి కాసేపు కూర్చుని వెళ్లురుగాని.'' ఆహ్వానించాడు మధుకిరణ్.

ఒళ్ళంతా కవర్ చేసిన రైన్‌కోట్ తో గమ్మత్తుగా ఉంది అతడిరూపం. అతడి ఆహ్వానాన్ని మన్నించాలా వద్దా... అన్న సందేహంలో కొట్టుమిట్టాడుతున్న మౌక్తిక మనసులో మాట గమనించినట్లుగా అన్నాడతడు...

"మీ సంకోచం దేనికో నాకు అర్థమైంది. మన మనసుల్లో ఏ కల్మషమూ లేనప్పుడు, ఎవరో ఏదో అంటారని ఆలోచించడం శుద్ధ అవివేకం.''

చుట్టూ చూసింది మౌక్తిక. వాన అంతకంతకూ పెరిగేలా ఉంది తప్ప తగ్గుముఖం పట్టే సూచనలు లేవు. ఈ వానలో, ఈ చీకటిలో తాను ఇలా ఒంటరిగా రోడ్డుమీద నడవడం కూడా ప్రమాదమే.

మంత్రముగ్ధలా నడచివెళ్లి మధుకిరణ్ బైక్ ఎక్కింది మౌక్తిక.

రెండు సందులు దాటి అతడున్న ఇంటికి చేరుకున్నారు వాళ్ళు.

"వెల్‌కమ్ టు మై స్వీట్ హోమ్...'' రెండుచేతులూ చాచి మౌక్తికకు స్వాగతం పలికాడు మధుకిరణ్.

ఒక గ్రూప్ హౌస్ మీద ఉండే పెంట్‌హౌస్ అది. ముందు చిన్నవరండా... తరువాత ఒకపెద్ద గది. ఆ గది మధ్యలోనే పార్టీషన్ పెట్టి వంటగది ఏర్పాటు చేశారు. అవడానికి బ్రహ్మచారి గదే అయినా చాలా శుభ్రంగా ఉంది.

మధుకిరణ్ అందించిన టవల్ తీసుకుని తల తుడుచుకుంది మౌక్తిక. చలికి ఒంట్లోనుంచీ వణుకు పుట్టుకొస్తోంది.

' వేడిగా ఏదన్నా తాగితే బాగుంటుంది...' మౌక్తిక మనసు చదివినట్లుగా ఐదు నిముషాల

తరువాత టీకప్పుతో ప్రత్యక్షమైనాడు మధుకిరణ్.

ఆ రోజు పికినిక్ లో అతడు తీసుకొచ్చిన టీ కి ఎంత మాత్రం తీసిపోలేదు ఇప్పటి ఈ రుచి.

" మా అమ్మ నా చిన్నప్పుడే పోయింది. నాన్న నేను టెంత్ చదువుతున్నప్పుడు పోయారు. మా చిన్నాన్నగారే నన్ను, మా అన్నయ్యను పెంచి పెద్దచేశారు. అన్నయ్య- వదిన హైదరాబాద్‌లో ఉంటున్నారు.'' మధుకిరణ్ తన వివరాలన్నీ చెప్పుకు వస్తున్నాడు.

వింటున్న మౌక్తికను ఏవేవో భావోద్వేగాలు చుట్టుముడుతున్నాయి.

అసలు... అతడి పేరు తలచుకుంటే చాలు...ఆమెకి చెప్పలేనంత పారవశ్యం కలుగుతోంది. ఏవో దివ్యలోకాల్లో విహరిస్తున్న అనుభూతి జనిస్తోంది.

ఇది ప్రేమా! ఏమో!

ఎవరన్నారో గాని,' గాలికన్నా వేగంగా ప్రయాణించేది మనసు' అని. అది పూర్తిగా నిజమని తేలింది ఇప్పుడు.

"ముక్తాగారూ ... ఏమిటాలోచిస్తున్నారూ?'' అతడు ఆమెను ఈ లోకంలో పడేసే ప్రయత్నం చేశాడు.

తన ప్రవర్తనకి సిగ్గిల్లింది మౌక్తిక. బయట వర్షం ఊపందుకుంది. ఇంతలో కరెంట్ పోయింది. ఒక్కసారిగా భయమేసింది మౌక్తికకు. తాను శివాజీకి ఆశ్రయం ఇచ్చిననాడూ ఇదే పరిస్థితి.

ఇలాంటి వర్షమే ఆనాడూ కురిసింది. ఇదే చీకటి అప్పుడూ కమ్ముకుని ఉంది. ఆ చీకట్లో శివాజీ అడ్వాంటేజ్ తీసుకుని ,తన పట్ల ఎలా ప్రవర్తించాడో తలచుకుంటేనే ఒళ్ళు గగుర్పొడుస్తోంది.

ఇతడూ మగవాడే...అలానే ప్రవర్తించడన్న గ్యారెంటీ ఏముంది?

ఆమె ఆలోచనలని చెదరగొడుతూ "అలాగే కూర్చోండి ముక్తా గారూ...నేను ఎమర్జెన్సీ లాంప్ వెలిస్తాను.'' అంటూ వెళ్ళి ల్యాంప్ తీసుకొచ్చాడు మధుకిరణ్.

"రక్షించావురా భగవంతుడా!'' గుండెల నిండుగా గాలి పీల్చుకుంది మౌక్తిక.

"చాలా థాంక్స్ మధుకిరణ్ గారూ... మంచి టీ ఇచ్చారు. ఇక నేను బయలుదేరుతాను.'' లేచి నిలబడింది మౌక్తిక.

" వానింకా తగ్గలేదులా ఉంది. కాసేపాగండి. తగ్గాక నేను డ్రాప్ చేస్తాను. అదీకాక... నేను మీతో మాట్లాడాలి...'' నెమ్మదిగా చెప్పాడు మధుకిరణ్.

గతుక్కుమంది మౌక్తిక... అనుకున్నంతా అయ్యింది. ఎప్పుడో ఒకప్పుడు అతడు తన ఎదుటపడి, మనసులో మాట వెల్లడిస్తాడని రమ్య అంటూనే ఉంది.

ఇప్పుడు... అతడు తనని అడిగబోయేది ఆ విషయమే అయితే ఏమని బదులీయాలి?

ఉలుకు-పలుకు లేకుండా కొయ్యబొమ్మలా బిగుసుకుపోయిన మౌక్తికవైపు వింఅత్గా చూశాడు మధుకిరణ్.

"ఇది తగిన సమయం అవునో కాదో నాకు తెలియదు...కాని, మళ్లీ...మన మధ్యన ఇలాంటి సందర్భం ఒకటి ఎదురౌతుందని నేను అనుకోవడం లేదు. అందుకే... ధైర్యం చేసి చెబుతున్నాను.'' ఊపిరి బిగపట్టి ఉద్విగ్నంగా చూశాడు మధుకిరణ్.

మౌక్తిక మౌనం మధుకిరణ్‌లో ఏ అలజడి రేపిందో ... ఆమెవైపే అనురాగంగా చూస్తూ ఉండిపోయాడు.

ఆమె ముఖంలో రంగులు మారుతున్న వైనాన్ని గమనించి మళ్లీ తానే అన్నాడు" నేను ... నేను మిమ్మల్ని ప్రాణం కంటే ఎక్కువగా ప్రేమిస్తున్నాను. మీరంగీకరిస్తే... మిమ్మల్ని పెళ్లి చేసుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. దీనికి మీ సమాధానం ఏమిటో ఆలోచించుకుని చెప్పండి. టేక్ యువర్ ఓన్ టైమ్...''

చెప్పాల్సింది అయిపోయినట్లుగా హాయిగా ఊపిరి పీల్చుకున్నాడు మధుకిరణ్.

అతడు తన మనసులోని మాట వెల్లడించేసి హృదయభారం తీర్చుకున్నాడు. ఆ బరువంతా ఇప్పుడు ఆమె గుండెల మీద కెక్కి కూర్చుంది.

మధుకిరణ్ తనని ప్రేమిస్తున్నాడని విన్న మరుక్షణం... ఆ ఇల్లే సుందర బృందావనం లాగా... హెూరున కురుస్తున్న వానధారలు చేస్తున్న లయబద్ధమైన సవ్వడి మధుర మురళీరవంలాగా, తాను రాధికలా... అతడు కృష్ణుడిలా... ఎన్నో...ఎన్నో అవ్యక్త ప్రణయభావనలు, అపురూప అనుభూతులు యమునాతరంగాల్లా మౌక్తికను చుట్టుముట్టాయి.

అంతలోనే... తల్లికి తాను చేసిన ప్రమాణం మదిలో మెదిలి హృదయాన్ని కకావికలు చేసింది.

ఆమె అలా...బొమ్మలా ఉండిపోవడం గమనించిన మధుకిరణ్ "నేను తప్పుగా మాట్లాడానని మీకు అనిపిస్తే వెరీసారీ... చెప్పాగా... మీ నిర్ణయం అప్పుడే చెప్పాల్సిన అవసరంలేదు. బాగా ఆలోచించుకోండి.'' అన్నాడు కంగారుగా.

ఇక ఉపేక్షించి లాభంలేదు. ఇతగాడు తనపట్ల అనురక్తిని పెంచుకుని, ఆశలసౌధాలు నిర్మించుకోకముందే నిజం చెప్పేయాలి.

అదురుతున్న గుండెని దిటవు పరచుకునే ప్రయత్నం చేస్తూ "మీకు నా పట్ల ఉన్న అభిప్రాయం మీరు చెప్పారు.కాని, నేను మీ ఆరాధనకి తగినదాన్ని కాదు.'' చెప్పింది మౌక్తిక తన చూపులను ఎటో మళ్ళిస్తూ.

మధుకిరణ్ సంభ్రమంగా చూస్తూ" ఎందుకలా అనుకుంటున్నారు?'' అన్నాడు.

మౌక్తిక దిగ్గున లేచి నిలబడుతూ "నేను పెళ్ళై విడాకులు పొందిన స్త్రీని." చెప్పింది టీపాయ్ మీద ఉన్న తన హ్యాండ్ బ్యాగ్ అందుకుంటూ.

మధుకిరణ్ ముఖంఒక్కసారిగా వెలవెలబోయింది. షాక్ తిన్నట్లుగా చూశాడు. ఈ విషయం విని అతడి మనసు తూట్లు పడుతుందని ఆమెకు తెలుసు. అయినా తప్పలేదు. ఆమె మనసుకి కూడా కనబడని గాయమై, ఆ బాధ బయటకు కానరాక సలుపుతూనే ఉంది.

"ముక్తా... మీరు చెప్పేది నిజమేనా? అయితే... ఆయన....''

"ప్లీజ్... నన్నేమీ అడగకండి. నా గురించిన వివరాలు రమ్యని అడిగి తెలుసుకోండి.'' అతడివైపన్నా చూడకుండా, బయట ఆగకుండా కురుస్తున్న వానని లక్ష్యపెట్టకుండా చకచక అడుగులు వేసింది మౌక్తిక.

ఆమె కళ్లనుంచి కురుస్తున్న కన్నీటివాన...ఆకాశంలోనుంచి కిందికి దుముకుతున్న వర్షపు ధారలలో కలిసిపోయింది.

చేతికందిన పెన్నిధిని చేజార్చుకున్న తన అసహాయతకు మూగగా రోదిస్తూ అటుగా వెళ్తున్న ఖాళీ ఆటోని ఆపి ఎక్కి కూర్చుంది మౌక్తిక.

-------------------- ---------------------- -------------------

ముందురోజంతా వానలో తడవడం నుంచి ఒళ్లంతా నొప్పులుచేసి, జ్వరం వచ్చినట్లుగా అనిపిస్తోందని కాలేజ్‌కి సెలవుపెట్టి ఇంట్లోనే రెస్ట్ తీసుకుంటోంది మౌక్తిక.

సాయంత్రం రమ్య కాలేజ్ నుండి వస్తూనే సుడిగాలిలా మౌక్తిక దగ్గరకు దూసుకొచ్చింది. ఆమె కళ్లలో మౌక్తికమీద కోపం, జాలి, ప్రేమ...ఇత్యాది భావాలు కలగాపులగమై కనిపిస్తున్నాయి.

"నీకసలు బుద్ధుందా?'' తూటాలా రమ్య నోటమ్మట వెలువడిన మాట విని విస్తుపోయింది మౌక్తిక.

"ఏం జరిగింది రమ్యా?'' ఆశ్చర్యంగానే ప్రశ్నించింది.

"ఏం జరిగిందా!? చేతులారా... నీ బతుకు నువ్వే నాశనం చేసుకున్నావు కదే...'' ఆమెను పట్టి కుదిపేసింది రమ్య.

ఆమె ఏ విషయం గురించి అంటోందో తెలిసిన మౌక్తిక మోము వివర్ణమైంది.

"మధుకిరణ్ గారు నీకు తన ప్రేమసంగతి చెప్పినప్పుడు...నువ్వేంచేశావు? నీఅంత పిచ్చిది వేరెవరైనా ఉంటారా? ఎందుకిలా చేశావు ముక్తా...'' ఆవేదనలో ఆగ్రహం మిళితంచేసి పలికింది రమ్య.

ఆమె ఆగ్రహమంతా తనపట్ల గల అంతులేని ప్రేమాభిమానాలనుంచి పుట్టినదేనని మౌక్తిక గ్రహించింది. తన జీవితం ఏమైపోతుందోనన్న బాధే ఆమె చేత అలా అడిగించిందని కూడా ఆమె ఎరుగుదును.

సమాధానం చెప్పకపోతే రమ్య ఊరుకునేలా లేదు.

"అతడు నామీద అనవసరంగా ఆశలు పెంచుకోవడం ఇష్టంలేదు. అందుకే అక్కడే

తుంచేశాను.'' ముక్తసరిగా చెప్పింది మౌక్తిక.

"ఎవరిచేతుల్లోనో కీలుబొమ్మలాగా ఆడడానికి నువ్వేమీ చిన్నపిల్లవి కాదు ముక్తా... నీకు నిర్ణయం తీసుకునే స్వేచ్ఛ ఉండాలన్నదే నా బాధ. అతడికి నీ గతం అంతా చెప్పాను. దానితో అతడికి పనిలేదన్నాడు. నీకు మనస్పూర్తిగా ఇష్టమైతే , నిన్ను అతడి జీవితంలోకి సాదరంగా ఆహ్వానించడానికి సిద్ధంగా ఉన్నాడు.'' అనునయంగా అంది కోపం తగ్గిన రమ్య.

"అతడి ప్రేమలో నిజాయితీని నేను శంకించడంలేదు. కాని, నేను అమ్మకి మాటిచ్చాను. నన్ను వదిలేయి ప్లీజ్...''హిస్టీరిగ్గా అరిచింది మౌక్తిక.

ఆమె ఫ్రస్టేషన్‌ని అర్థం చేసుకున్నట్లుగా తలూపింది రమ్య.

"మీ బావ పిరికిగా ప్రవర్తించి నీ జీవితాన్ని నాశనం చేశాడని బాధపడే నువ్వు అదేతప్పు మళ్లీ చేస్తూ నీ బతుకు నరకం చేసుకుంటున్నావు.'' అండి నింపాదిగా.

వెర్రిగా చూసింది మౌక్తిక. తన బతుకు తానే నరకం చేసుకోవడమేమిటి? ఎవరైనా సరే... కోరి జీవితం పాడు చేసుకుంటారా!?

"అలా పిచ్చిగా చూడకు...మీ అత్తయ్య మాట జవదాటని మీ బావ... ఆవిడ చచ్చిపోతానని బెదిరిస్తే నీ మెడలో తాళికట్టాడు. మీ బావకి తనమీద గల ప్రేమాభిమానాలను అడ్డం పెట్టుకుని విజయం సాధించింది మీ అత్తయ్య.

మరి నీ విషయంలో మాత్రం అంతకన్న భిన్నంగా ఏం జరిగింది! మీ అమ్మగారు మాత్రం ఏం చేశారు? దేముడిని అడ్డుపెట్టుకుని నీచేత అర్థంపర్థం లేని ప్రమాణం చేయించుకుని నీకు భవిష్యత్తన్నదే లేకుండా చేశారు. 'అమ్మకూచం'టూ మీ బావని నిందించావు కాని, అంతకన్నా అమ్మకూచివి నువ్వు.'' ఉద్వేగంగా పలికింది రమ్య.

రమ్య మాటల్లోని వాస్తవం ఒక తిరుగులేని దివ్యాస్త్రంలా మౌక్తిక మనసుని తాకి ఛిద్రం చేసింది.

అవును. అమ్మ బెదిరిస్తే లొంగిపోయాడని మనసులోనే బావని తూలనాడిన తానుమాత్రం చేసిందేమిటి!?తన తల్లి బాధపడుతుందని ఆమె దైవం మీద వేసిన ఆనకి కట్టుబడిన తాను...బావ కూడా అదే పరిస్థితికి లోబడి తలవంచాడని ఎందుకనుకోలేకపోయింది?

పెద్దవాళ్ళ మూర్ఖత్వాలకి బలైపోయిన అమాయకులు తాము.

ఆమె మనసుని చదివినట్లుగా అంది రమ్య " నా మాటవిను ముక్తా...ఇది పాతకాలంకాదు. స్త్రీ మళ్లీ పెళ్ళి చేసుకోవడం పెద్ద విషయమేమీ కాదు. నీ సంకోచాలన్నీ పక్కనపెట్టి మధుకిరణ్ చేయందుకో."

మౌక్తిక కన్నార్పకుండా ఆమెనే చూసింది. రమ్య కళ్ళు స్వచ్ఛమైన స్నేహబంధానికి నిర్వచనం చెప్పే నిలువుటద్దాల్లా ఉన్నాయి.

"మరోసారి చెపుతున్నా ముక్తా... ఇది నీ జీవితం. నీ జీవితం మీద నీకు సర్వహక్కులూ

ఉన్నాయి.ఎవరి శాసనాలకో లోబడి నీకు నువ్వే అన్యాయం చేసుకోకు.'' హెచ్చరించింది రమ్య.

తన బతుకుకోసం ఆమె పడుతున్న తపన చూసి మౌక్తిక మనసు చలించిపోయింది. స్వచ్ఛమైన స్నేహబంధానికి మించిన అనుబంధమేముంటుందీ!

థాంక్ గాడ్... నువ్వు దయామయుడివి. రమ్యలాంటి గొప్ప స్నేహితురాలినిచ్చావు.

మౌక్తిక కళ్లు చెమర్చాయి.

---------------------- --------------------
--------------------

శకుంతల వచ్చిన నెలరోజులకి రమ్య అత్తగారు లలితమ్మ కూడా వచ్చింది. గతంలో ఆమెని ఒకటి రెండుసార్లు చూసి ఉంది మౌక్తిక.

లలితమ్మకి-శకుంతలకి క్షణాలమీద దోస్తీ కలిసింది. కోడలికి వేవిళ్ళు తగ్గలేదని, సహాయంకోసం తాను వచ్చానని లలితమ్మ చెప్పగానే శకుంతలకి ఆశ్చర్యం కలిగింది. కోడలిపట్ల లలితమ్మ కనబరుస్తున్న అభిమానం ఆమెకు వింతగా తోచిందేమో!

"మా రమ్యకి అస్తమానం నీ గురించిన ధ్యాసేనమ్మా...తరచూ నీ గురించే చెబుతుంది.'' లలితమ్మ అంది ఆప్యాయంగా.

"స్నేహమంటే అదేనండీ వదినగారూ...మా ముక్తకి అన్నింటా రమ్యే తోడుమరి!'' అంది శకుంతల.

"అవునండీ... స్నేహంలో స్వార్థం, ఈర్ష్యాసూయలు ఏమీ ఉండవు.'' అంది లలితమ్మ.

లలితమ్మ, శకుంతలలు పాలు-నీళ్లలా కలిసిపోయారు. రెండువాటాల మధ్యన గల తలుపు తెరిచిపెట్టుకుని ఒకటే కబుర్లు.

లలితమ్మ కోడలిపట్ల చూపించే ఆప్యాయతానురాగాలు, శ్రద్ధాసక్తులు శకుంతలకి వింత గొలిపాయి. ఆమెలో ఏదో ఆత్మశోధన మొదలైంది.

"కోడలిని అంతలా నెత్తెక్కించుకుంటున్నారు. చేయించుకున్నంతా చేయించుకుని కాలితో తన్నేసిపోయే రకాలు ఈ కాలం కోడళ్ళు.'' ఈసడింపుగా అంది శకుంతల ఓసారి.

లలితమ్మ నవ్వి" అలా అనుకోవడం తగదు వదినగారూ... ' కోడలు' అంటే ఎవరు? మన ఇంటి మహలక్ష్మి. తన వారందరినీ వదులుకుని మన వంశాన్ని వృద్ధి చేసేందుకు వచ్చిన ఆమెను చిన్నచూపు చూడడం తగనిపని. కోడలిని కన్నతల్లిలా లాలిస్తేనే ఏ అత్తగారికైనా గౌరవమర్యాదలు లభిస్తాయి. ఆమెను బాగా చూస్తేనే కదా... కొడుకు సంతోషంగా ఉండేది. కన్నబిడ్డ ఆనందంకన్నా తల్లికింకేం కావాలి?'' అంది లలితమ్మ.

శకుంతల ముఖంలో అనేక రంగులు మారాయి. లలితమ్మ మెత్తనిచెప్పుతో కొట్టినట్లుగా ఎన్నో వాస్తవాలని విశదీకరించింది.

ఒక రకంగా లలితమ్మ రాక ఆమెలో అనూహ్యమైన మార్పును కలుగజేసింది. అది గమనించిన మౌక్తిక మనసులోనే లలితమ్మకి వేనవేల కృతజ్ఞతలు చెప్పుకుంది.

అత్తగారి ఆదరణలో రమ్య త్వరగానే కోలుకుంది. ముఖంలో కొత్తకళ, పరిపూర్ణత చోటు చేసుకున్నాయి. మాతృత్వపు మధురానందం తెచ్చిన వింతశోభలతో రమ్య సంపూర్ణస్త్రీత్వానికి ప్రతీకలా కనిపిస్తోంది. శరత్ కూడా ఆమెనెంతో అపురూపంగా చూసుకుంటున్నాడు.

"అదంతా స్వార్ధం... కడుపులో ఉన్న తనబిడ్డకి ఇబ్బందౌతుందన్న కంగారు ఇదంతా... ఎవరికి తెలియదూ..'' మురిపెంగా అంటుంది రమ్య.

"ఎలాన్నా అనుకో... నా వరాలమొలకను భద్రంగా దాచి కానుకగా ఈయబోతున్నావు. నీపట్ల కేర్ తీసుకోవడం నా కనీసబాధ్యత.'' నవ్వేస్తాడు శరత్.

వారి సంసారాన్ని కన్నులపండుగగా చూసుకుంటుంది లలితమ్మ.

వీరి సాహచర్యంతో శకుంతలలోని సంకుచితభావాలు తొలగిపోసాగాయి. ఆమెలో మౌక్తిక ఆశించిన మార్పు అదే.

---------------------- -------------------- -------------------------

"మేడమ్...మధుకిరణ్ సార్ మీకీ కవర్ ఇయ్యమన్నారు.'' శంకర్‌రావు మౌక్తికకి ఓ కవర్ ఇచ్చాడు.

మధుకిరణ్ ఇచ్చాడా? ఏమిటిది? లవ్‌లెటరా! ఆలోచిస్తూనే ఓపెన్ చేసింది మౌక్తిక.

తెల్లని కాగితంమీద నల్లని ముత్యాలొలకపోసినట్లుంది అతడి చేతిరాత. పొందికగా , కుదురుగా ఉన్న అక్షరాల దారులవెంట పరుగులు తీశాయి మౌక్తిక కళ్లు.

"ముక్తాగారూ...

మీ పేరుముందు 'మైడియర్' అని సంబోధించాలని ఉంది. కాని, ఆ అవకాశం మీరు నాకివ్వలేదు. ముఖాముఖి మీతో మాట్లాడదామని నేను అనుకుంటూండగానే, ' నేనిదివరకే వివాహితనంటూ' విషయాన్ని అసంపూర్ణంగా చెప్పేసి, నా మాట మరి వినిపించుకోకుండా వెళ్లిపోయారు.

అందుకే... ఈ ఉత్తరం.

మీ గతం గురించి రమ్యగారు చెప్పారు. మీ అభ్యంతరం దేనికో బోధపడింది. కాని, మీరా విషయంలో నిశ్చింతగా ఉండవచ్చు. నాకా పట్టింపులేదు. మీ గతంతో నాకు పనిలేదు.

నేను కావాలనుకుంటున్నది కేవలం 'మౌక్తిక'ను మాత్రమే. ఆమె నాదైతే చాలు. ఇంకేమీ పట్టించుకోను. మీరు నా ప్రేమను అర్ధం చేసుకుని, నన్ను అంగీకరిస్తే మీ చేతిలో చేయి కలిపి జీవితాంతం నడవాలనుకుంటున్నాను.

ఇప్పటికీ మీకు నా హృదయం అర్థంకాకపోతే, మీ తీర్పు నాకు వ్యతిరేకంగా వస్తే... తట్టుకునే శక్తి నాకులేదు. మీ నుంచి దూరంగా...ఇక్కడినుంచి ట్రాన్స్‌ఫర్ చేయించుకుని వెళ్లిపోవాలనుకుంటున్నాను..ఇక్కడే ఉంటూ...మిమ్మల్ని పొందలేకపోయిన నా దౌర్భాగ్యాన్ని అనుక్షణం భరిస్తూ నేను నరకయాతన పడలేను.

మీరు ఈ విషయంలో పాజిటివ్ గా స్పందిస్తారని, మీ ఆమోదం తెలియజేస్తారని ఆశిస్తూ... మీ కరుణాకటాక్ష వీక్షణాల కోసం నిరీక్షిస్తూ...

మీవాడు కావాలని తపించే

మధుకిరణ్.''

అతడి లేఖను చదివి తనను తానే కోల్పోయింది మౌక్తిక. అనవసరమైన సోదిలేకుండా అతడు సూటిగా తన అభిప్రాయాన్ని తెలియజేశాడు. రమ్య చెప్పినట్లు... ఈ సువర్ణావకాశాన్ని వదులుకుంటే తనకి బతుకులేదు. భవిష్యత్తు లేదు.

కాని, దీనికి తల్లి చచ్చినా ఒప్పుకోదు. ఈ విషయంలో తాను తెగించి చేసేందుకేం లేదు.

మధుకిరణ్ సాహచర్యాన్ని అందుకునీ అదృష్టం తనకుంటే గనుక ఆభగవంతుడే తన మార్గాన్ని సుగమం చేస్తాడు.

లేకపోతే...లేకపోతే... ఆ ఊహకే ఒళ్లు కంపించింది. ఎంతోసేపు మధనపడిన మీదట ఆలోచనలపైన విజయాన్ని సాధించి వాటిని తరిమికొట్టింది. మనసు నిశ్చలసరస్సులా మారింది.

ఇంటికెళ్లగానే రమ్యను డాబామీదకు తీసుకెళ్లి ఉత్తరం చూపింది మౌక్తిక.

“నువ్వేమంటావు?'' ఆత్రుతగా అడిగింది రమ్య.

“కొత్తగా అనడానికేముంది? నీకిదివరకే చెప్పాను...'' అంది మౌక్తిక.

“నిన్ను ఆభగవంతుడే కాపాడాలి'' భారంగా నిట్టూర్చి, విసవిసా మేడ దిగి వెళిపోయింది రమ్య వెనకనుంచి మౌక్తిక ' జాగ్రత్తంటూ' హెచ్చరిస్తున్నా పట్టించుకోక.

----------------- ----------------- ----------------

“వదినగారూ... మిమ్మల్నో మాట అడుగుతాను. తప్పుగా అనుకోరు కదూ...'' లలితమ్మ అడిగింది రెండువాటాల మధ్యన్న ఉన్న తలుపుకి అటువైపు కూర్చుని కూరగాయలు కోస్తూ.

“అడగండి ...మీకు అడ్డేముంది?'' భరోసా ఇచ్చింది శకుంతల.

“మా రమ్య మౌక్తిక గురించి చెప్పింది. ముక్కు పచ్చలారని ఆ పసిదాని బతుకు అలా

మోడులా మిగ్లిపోవడం నాకు చాలా బాధను కలిగిస్తోంది. మీరు తనకి మళ్లీ పెళ్లెందుకు చేయకూడదు?''

ఊహించని ఈ ప్రశ్నకి శకుంతల విస్తుపోయింది. ఏం చెప్పాలో తోచక తికమకపడింది.

ఆ ప్రశ్న ఆవిడని ఇరకాటంలో పెట్టిందని ఆవిడ ముఖం చూస్తే అర్ధమౌతోంది.

"ఆడపిల్లకి మారుమనువు చేయడం మన సంప్రదాయంలో ఉందంటారా వదినగారూ?'' అంటూ ప్రశ్నించింది తిరిగి.

లలితమ్మ చిన్నగా నవ్వింది.

" ఆమాటకొస్తే సంప్రదాయానికి అనుగుణంగా ఏం జరుగుతున్నాయి చెప్పండి. మన ఆచారాల ప్రకారం మడి-తడి పాటిస్తున్నామా? అయిదురోజుల పెళ్ళిళ్ళు చేస్తున్నామా! 'తూతూ' మంత్రం చేసి బఫే డిన్నర్లతో ఓ పూటలో ముగించేస్తున్నాము.

అంతదాకా ఎందుకు వివాహితయైన ఆడపిల్ల నుదుట కుంకుమ దిద్దుకుంటోందా? సులువుగా ఉంటుందని స్టిక్కర్‌బిందీ అంటించుకుంటోంది. కొందరు అదీలేదు. తెలుగింటి ఆడపడుచులా చీర కట్టుకుంటోందా? చిన్న-పెద్ద తేడా లేకుండా ఆపంజాబీ డ్రస్సులేవో దిగేసుకుంటున్నారు. కొందరింకా మోడ్రన్‌గా జీన్సు అవీ వేసుకుంటున్నారు. పెద్దవాళ్లం కూడా వాటిని ఆమోదిస్తున్నాము. ఒక్కోసారి అనుకరిస్తున్నాం కూడా.'' అంది లలితమ్మ.

శకుంతల ఆ మాటలను ఖండిస్తున్నట్లుగా తల అడ్డంగా ఊపి, "అదీ...ఇదీ ఒకటెలా అవుతుంది వదినగారూ...కాలానుగుణంగా వస్త్రధారణలోనూ, ఆహార్యంలోనూ మార్పులు రావడం సహజం. ఆచారవ్యవహారాల్లో తేడాలను అంగీకరించాలి. కాని, కట్టుబాట్లలో మార్పులంటే...అంత త్వరగా ఒప్పుకోలేము.'' అంది.

"ఏమండీ... ఎందుకొప్పుకోలేము? పూర్వంఆడపిల్లలను చదువుకోసం బయటకు పంపేవాళ్లం కాదు. మా నాన్నగారు అయిదు పూర్తి కాగానే నన్ను బడి మానిపించేశారు.. పన్నెండో ఏటే నాకు పెళ్లిచేశారు. ఆ రోజులు అవి. ఇప్పటి ఆడపిల్లలు అంతరిక్షాల్లోకి ఎగురుతున్నారు. వారికి ఇష్టమైన రంగాల్లో పురోగమిస్తున్నారు. మరి వారి జీవితాలను వారికిష్టమైన రీతిలో మలచుకునే స్వేచ్ఛ మాత్రం వాళ్లకి ఎందుకీయకూడదు!''

అక్కడే కూర్చుని వీళ్ళ సంభాషణా వింటున్న మౌక్తిక లలితమ్మ మాటలకి అబ్బురపడింది. అయిదో తరగతితో చదువాపేసిన ఆవిడకి ఎంతటి ఆలోచనాశక్తి ఉంది! లోకం తీరుని ఆవిడెంతగా ఆకళింపు చేసుకుంది? ఆవిడమీద మౌక్తికకున్న గౌరవం ఆక్షణాన రెట్టింపైంది.

శకుంతల కిమ్మనలేదీసారి. ఆమె మాటలని ఖండించలేదు. ఆమె మౌనాన్ని గమనించిన లలితమ్మ తన మాటలని కొనసాగించింది.

"మీరు వయసులో నాకన్నా కొంచెం పెద్దవారు. మీకు తెలియని ధర్మం ఉంటుందని నేననుకోను. కాకపోతే ముక్త విషయంలో మాత్రం మీ ఆలోచనా విధానం సరియైనది కాదని నాకనిపిస్తోంది. ఎల్లకాలం ఆమెని అలా ఒంటరి బతుకు బతకమని శాసించడం భావ్యంకాదు.

ఇవాళంటే మీరు తోడుంటారు. ఎల్లకాలం మనం బతికిఉండలేము కదా! తోబుట్టువులున్నా ఎవరి సంసారాలు వారివి.

చెయ్యని నేరానికి మౌక్తిక శిక్షననుభవించడం ఎంతవరకు న్యాయమో మీరే చెప్పండి. లోపల తన మనసెంత ఉసురు చెందుతోందో ఊహించండి... మీ పట్టు సడలించి మౌక్తిక జీవితాన్ని చక్కదిద్దండి.'' పెద్ద ఉపన్యాసమే చెప్పింది లలితమ్మ.

ఆశ్చర్యకరంగా శకుంతల ఆమె మాటలతో విభేధించలేదు. పన్నెత్తి మాట్లాడనూలేదు. ఆలోచనాసంద్రంలో మునకలు వేస్తున్నట్లుగా ఆమె నొసలు ముడివడింది. పుస్తకాన్ని చాటు చేసుకుని తల్లివదనంలో మారుతున్న భావాలరంగులను గమనించసాగింది మౌక్తిక.

లలితమ్మ మళ్లీ అందుకుంది...'' నామాట వినండి వదినగారూ...పెద్దమనసు చేసుకుని మౌక్తిక విషయంలో ఒక మంచి నిర్ణయం తీసుకోండి.'' అనేసి కూరగాయల బుట్టను, తరిగిన బెండకాయలను తీసుకొని లోపలికి వెళ్ళిపోయింది.

శకుంతల అలా అచేతనంగా కూర్చుండిపోయింది. మౌక్తిక గప్‌చుప్‌గా పుస్తకంలోకి తలదూర్చింది మళ్లీ.

-----------------                                        ----------------------
----------------------

ఆరోజు దినేష్ ఫోన్‌లో చెప్పిన శుభవార్త విన్నతరువాత ఆనందంతో గాల్లో తేలినట్లుగా అయ్యింది మౌక్తికకు.

తను అత్త కాబోతోందన్న ఆ విషయం ఆమెను సంతోషసంద్రాల్లో మునిగేలా చేసింది.

తల్లి ఇంటిదగ్గర లేకపోతే తనకు ఏదో పోగొట్టుకున్నట్లుగా, వెలితిగా ఉందని... ఆమెచేత్తో తినకపోతే తనకు కడుపునిండిన అనుభూతి కలగడంలేదని, ఇంకా ఏవేవో చెప్పాడు దినేష్. ప్రీతి నెలతప్పిందన్న విషయం తల్లితో చెప్పమని ఫోన్ పెట్టేశాడు దినేష్.

తమ్ముడు తనతో అన్న మాటలను తల్లిచెవిన వేసింది మౌక్తిక. శకుంతల ముఖం విప్పారింది.

"నాకు వాడిని చూడాలని మనసు కొట్టుకుపోతోందే ముక్తా... వాడిని విడిచిపెట్టి ఎప్పుడూ ఇన్ని రోజులున్నదిలేదు.'' అంది శకుంతల కొడుకుమీద బెంగపెట్టుకున్న వైనాన్ని విశదపరుస్తూ.

"నువ్వు వాడిని తలచుకోకపోవడం చూసి, వాడిమీద నీకు కోపం పోలేదనుకుంటున్నా. వాడు కూడా నీతో మాట్లాడడానికి జంకుతున్నాడు.'' కవ్వించింది మౌక్తిక.

శకుంతల చిరుకోపంగా ముఖంపెట్టి "ఆవేశంలో లక్షాతొంభై అనుకుంటాం.అవన్నీ పట్టించుకుంటారా ఎవరైనా?అయినా... ఇప్పుడు నీ మరదలు నెలతప్పింది. నేను నాన్నమ్మని కాబోతున్నా. ఇలాంటప్పుడు దానిమీద కక్ష సాధిస్తానా! నేను వెళ్లి తన ఆలనాపాలనా చూడద్దూ!'' అంది సౌమ్యంగా.

నిర్ఘాంతపోయింది మౌక్తిక. తన తల్లేనా...ఇలా మాట్లాడుతున్నదీ! ఇదెన్నో వింత ప్రపంచంలో!

"అవునే ముక్తా...ప్రీతిమీద నాకేం కక్షలేదు. అసలప్పుడు ఎందుకలా ప్రవర్తించానో నాకే అంతుచిక్కడం లేదు. అదంతా తలచుకుంటే సిగ్గేస్తోంది. దయ్యం పట్టినట్లుగా ప్రవర్తించాను.'' శకుంతల శిరస్సు లజ్జాభారంతో అవనతమైంది.

తల్లిలో వచ్చిన ఈ అనూహ్యమైన మార్పుకి ఎంతో సంతోషించింది మౌక్తిక. బహుశా...లలితమ్మ తన కోడలిపట్ల కురిపించే వాత్సల్యం, ఆప్యాయత చూసిన తరువాత ఆమెలో పశ్చాత్తాపం కలిగి ఉండాలి.లలితమ్మ ఔదార్యం శకుంతల వివేకానికి పదునుపెట్టి ఆమెలో పరివర్తన తీసుకొచ్చింది.

"నాకు బుద్ధొచ్చిందే ముక్తా... కోడలిని ఆప్యాయంగా లాలించి , గుండెల్లో దాచుకుంటేనే ఆమె మనలని గౌరవించి నెత్తిన పెట్టుకుంటుందని తెలుసుకున్నాను.'' శకుంతల స్వరంలో అపరాధభావన.

తల్లిని అనునయిస్తున్నట్లుగా ఆమె భుజంతట్టి "పోనీలే...ఇప్పటికైనా తెలుసుకున్నావు. అదేచాలు'' అంది మౌక్తిక.

"తమ్ముడికి ఫోన్ కలుపు. నేను అర్జెంటుగా వాడితో మాట్లాడాలి'' అంది శకుంతల 'లేడికి లేచిందే పరుగు' అన్నట్లుగా.

ఆమె చెప్పినట్లే చేసింది మౌక్తిక. లోకం మరచి కొడుకుతో కబుర్లలో మునిగిపోయిన తల్లిని చూసి గుంభనగా నవ్వుకుంది మౌక్తిక. హృదయంలో ఉప్పొంగే మమతలప్రవాహానికి ఆనకట్టవేయడం మాతృమూర్తి వలన అవుతుందా!

"అమ్మ...ప్రేమకి మారుపేరూ... అమ్మమనసూ పూలతేరూ...'' ఎక్కడినుంచో పాట వినిపిస్తోంది.

అవును... అమ్మ 'మమతల రథం.' అందులో ఊరేగడం బిడ్డకి ఎంతో ఆనందదాయకం.

------------------ ------------------------ -----------------------

రమ్యకి ఇప్పుడు ఏడోమాసం వచ్చింది. ఆ మధ్య వేవిళ్ళవలన పీక్కుపోయిన బుగ్గలు ఇప్పుడు యాపిల్‌పళ్లలా తయారైనాయి. మాతృత్వపు చిహ్నాలు ఒక్కక్కటిగా ఆమెలో చేరుతూ ఆమెను పరిపూర్ణురాలిగా చేస్తున్నాయి.

నిండుగా కనిపిస్తున్న రమ్యని చూస్తూంటే మౌక్తిక మదిలో అనేక భావపరంపరలు ఉధ్భవిస్తున్నాయి.

ఆరోజు సాయంత్రం లలితమ్మకోసం ఓ కబురు వచ్చింది. శరత్ తండ్రికి ఆస్తమా తిరగబెట్టిందని, శరత్ అన్నయ్య ఫోన్ చేశాడు.

లలితమ్మకి ఆందోళన మొదలైంది. ఇంటిదగ్గర భర్త ఎలా ఉన్నాడోనని కంగారుచెందింది. ఆమెను దిగవిడిచి వస్తానని శరత్ ఉద్యుక్తుడైనాడు. బయలుదేరేముందు శకుంతల దగ్గరకొచ్చి కోడలి గురించి ఎన్నో అప్పగింతలుపెట్టింది.

"మీరు మరీ అత్తయ్యా...నేనేం పసిపిల్లనా? నా గురించి వర్రీకావద్దు. నేను జాగ్రత్తగా ఉంటాలెండి. మామయ్యగారి ఆరోగ్యంపట్ల శ్రద్ధ తీసుకోండి.'' రివర్స్‌లో జాగ్రత్తలు చెప్పింది రమ్య.

అత్తకోడళ్ల దగ్గరితనం చూసి శకుంతల కళ్లు చెమర్చాయి.

--------------------- --------------------

-------------------

మధుకిరణ్ ట్రాన్స్‌ఫర్ దాదాపు ఖాయం అయ్యిందన్న మాట తెలిసిన దగ్గరనుంచీ మౌక్తికలో అంతక్రితం లేని ఆందోళన చోటుచేసుకుంది. అది ఆమెను సజావుగా నిలువనీయడంలేదు.

శాపవశాత్తూ శిలలా మారిపోయిన గంధర్వకన్యమీద ఏ వీరుడో మంత్రజలాన్ని సాధించి తెచ్చి జల్లితే ఆమెకి పూర్వపు రూపం వచ్చినట్లే...

బిగుసుకుపోయి కరుడు కట్టిందనుకున్న ఆమె హృదయం... అతడు ఇంకొద్దిరోజుల్లో తనకి శాశ్వతంగా దూరమవబోతున్నాడన్న సత్యం గుర్తొచ్చి కరిగినీరై ప్రవహిస్తోంది.

ఏ దేముడైనా హఠాత్తుగా ప్రత్యక్షమైతననో వరం కోరుకుంటే...జీవితాంతం మధుకిరణ్ సాంగత్యం లభించాలని కోరుకుంటుంది తను.

తన ఆలోచనకి తనకే నవ్వొచ్చింది మౌక్తికకు.

నిజంగా ఈ మనిషికెంత అత్యాశ!? తాను కోరుకున్న ప్రతీదీ తనకు దక్కాలని కోరుకుంటాడు కాని, సాధ్యాసాధ్యాల గురించి ఆలోచించడు.

ఇదేమీ పద్నాలుగు రీళ్లలో ముగిసిపోయే సినిమాకాదు... ఆఖరు రీల్లో క్లైమాక్స్ సీన్‌లో ట్రైనో, ఫ్లైటో ఎక్కి హీరోయిన్‌కి దూరంగా వెళ్లిపోతున్న హీరోని కలుసుకోవడంకోసం పిచ్చిదానిలా పరుగెత్తుకొచ్చిన హీరోయిన్ ఆఖరుక్షణంలో అతడిని చేరుకోవడానికి.

ఇది జీవితం. తన భవిష్యత్తేదో తెలుసుకోలేని మానవజీవితం. అందిన వాటితో తృప్తిచెందని మనసు ... అందనివాటికోసం అర్రులు చాస్తుంది. మధుకిరణ్ ని పొందే భాగ్యం తనకులేదని స్పష్టంగా తెలిసిపోతోంది.

ఇది విధిలిఖితం. తన జీవితంలో మధురక్షణాలనేవి లేవు. ఇక రావు.

మనసు వెయ్యిటన్నుల భారాన్ని అతి కష్టంమీద మోస్తున్నట్లుగా తయారైంది. తనలో తనే మధనపడుతూ అలా ఉండిపోయింది మౌక్తిక.

---------------- -------------------

--------------------

“ముక్తా... లేచి తయారవు. కాలేజ్‌కి టైమౌతోంది.'' హడావుడిగా వచ్చింది రమ్య.

ఆమె అప్పటికే నీట్‌గా తయారై ఉంది.

“నేను రాలేను రమ్యా... ఒంట్లో చిరాగ్గా ఉంది.లీవ్‌లెటర్ రాసిస్తాను. తీసుకెళ్లి ఇచ్చేయి.'' అంది మౌక్తిక బద్ధకంగా ఒళ్లు విరుచుకుంటూ.

“ ఆ పప్పులేం ఉడకవు. మార్చిపోయావా? ఇవాళ మధుకిరణ్‌కి సెండాఫ్ పార్టీ ఉంది.'' మౌక్తిక రెక్క పట్టుకుని గుంజింది రమ్య.

అప్పుడు గుర్తొచ్చింది మౌక్తికకు. అవును... ఈ రోజే మధుకిరణ్ కి శాశ్వతంగా వీడ్కోలు పలికే రోజు. ఇప్పుడు తాను అతడి ఎదుట పడగలదా!

“అమ్మా అంతర్ముఖీ... నీ ఆలోచనలు కట్టిపెట్టి తొందరగా రెడీ కా.'' రెండుచేతులూ జోడించింది రమ్య.

“నాకు రావాలని లేదు రమ్యా...'' కిటికీలోనుంచి బయటకు చూస్తూ చెప్పింది మౌక్తిక.

“ఎందుకంట?''

“నీకు తెలిసీ అడుగుతావెందుకు?'' తన కళ్లలో నీళ్లు దాచేసుకోవాలని చూసింది మౌక్తిక.

“అది నీ వ్యక్తిగత కారణం. దానికోసం నువ్వు సెలవుపెట్టి ఇంట్లో కూర్చుంటాననడం మర్యాదకాదు. అతడు మన సహోద్యోగి. అతడికి సెండాఫ్ ఇవ్వడం మన కనీస ధర్మం. అయినా... ఈ రోజు ఎవరికీ సెలవిచ్చేది లేదని మన ప్రిన్సిపాల్ సార్ ఖచ్చితంగా చెప్పేశారు కదా!'' రమ్య అంది ఒకింత విసుగ్గా.

“ప్లీజ్ రమ్యా... నాకు ఒంట్లో బాగాలేదని ఎలాగైనా కన్విన్స్ చేయి.'' రమ్య గడ్డం పుచ్చుకుంది మౌక్తిక.

“నథింగ్ డూయింగ్... నువ్వొస్తున్నావు. అంతే...'' ఆమెను మంచంమీద నుంచి పెరట్లోకి తోసేసింది రమ్య.

రాక్షసి...పిశాచి...తాననుకున్నది చేసి తీరుతుంది... తన మనసులో బాధ దానికేం తెలుసు! కోపంతో పళ్లు పటపటలాడిస్తూ స్నానాదికాలు పూర్తిచేసుకుంది మౌక్తిక.

మిరపపండు ఎరుపుమీద బంగారురంగు జరీ పనితనం చేసిన లైట్‌వెయిట్ పట్టుచీర కట్టుకుంది. అపరంజివన్నెలో ఉన్న మౌక్తిక దేహంమీద ఆ చీర ఎంతో అందంగా అమిరింది. లూజ్ గా జడ అల్లుకుని తలలో కనకాంబరాల మాల తురుముకుంది. ఈ అలంకరణంతా రమ్య బలవంతం మీద చేసుకుంటున్నదే.

స్టిక్కర్‌బిందీ తీసుకుని అద్దంలో చూసుకుంటూ దాన్ని నుదుటిమీద అతికించుకుంది.. అందమైన చీరలో... అంతకన్నా అందమైన మౌక్తిక. తన జన్మ ధన్యమైంది అనుకుంది అద్దం.

అల్లరిగా ఎగిరిపడే చేపపిల్లల్లాంటి చంచల నయనాలు... పొడవైన నాసిక, నునుపుగా ఉన్న శంఖంలాంటిమెడ...

అద్దంలో దర్శనమిస్తున్న తన సౌందర్యాన్ని చూసి పులకితురాలైంది మౌక్తిక ఒక్క క్షణంసేపు. అంతలోనే మనసు బాధగా మూలిగింది.

'అడవికాచిన వెన్నెల' అనుకుంది నిర్వికారంగా.

"ముక్తా... ఏమిటి లేట్..." రమ్య టైమ్ చూసుకుంది కంగారుగా.

"ఆఁ...అయిపోయింది పద..." అంటూ పెరట్లో పని చేసుకుంటున్న తల్లితో చెప్పేసి బయటపడింది మౌక్తిక.

---------------- ------------------

----------------------

కాలేజ్ ముందు ఆటో ఆగింది. ఇద్దరూ లోపలికి నడిచారు. అప్పటికే కాలేజ్ అంతా హడావుడిగా ఉంది.

యాధాలాపంగా తలపైకెత్తి చూసిన మౌక్తిక విస్మయంలో మునిగిపోయింది.

' కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు విజేత అయిన శ్రీ మధుకిరణ్ గారికి అభినందన సత్కార సభ.'

ఆమె ఆశ్చర్యాన్ని గమనించిన రమ్య ముసిముసిగా నవ్వుకుంది.

"మధుకిరణ్ కి సాహిత్య అకాడమీ అవార్డు వచ్చిందా! ఎప్పుడు?" అడిగింది మౌక్తిక అయోమయంగా.

"పేపర్లో న్యూస్ వచ్చి మూడురోజులైంది. నువ్వు ఈలోకంలో ఉంటే కద... ఏ విషయమైనా తెలియడానికీ..." దీర్ఘంతీసింది రమ్య.

"నువ్వైనా అనలేదూ!" నిష్ఠురంగా అంది మౌక్తిక.

రమ్య వింతగా చూసిందామెవైపు.

"ఇంతకీ ఏ రచనకి వచ్చిందా అవార్డ్?" ఆసక్తిగా అడిగింది మౌక్తిక.

" నవమౌక్తికం' అని వీధిబాలల మీద రాసిన నవలకి వచ్చిందట. ఆ పుస్తకం నేనూ చదవలేదు. కాని, చాలా గొప్ప రచనట" చెప్పింది రమ్య.

"అలాగా!" తలూపింది మౌక్తిక.

గుంభనగా నవ్వుకుంది రమ్య. మౌక్తిక కళ్లు అప్రయత్నంగా మధుకిరణ్ కోసం గాలించాయి. దూరంగా అహోబిలంగారితో మాట్లాడుతూ కనిపించాడు.

గచ్చపిక్కరంగు కాటన్ జీన్స్, లైట్ ఆరెంజ్ కలర్ షర్ట్ ధరించి, తలంటుకున్న జుట్టుతో, నవ్వుముఖంతో మాట్లాడుతున్న అతడు చాలా హుందాగా అనిపించాడు.

మనసులో మళ్లీ ఏవేవో భావాలు లాస్యం చేయడం మొదలెట్టాయి. మౌక్తికను చూడగానే అతడి నయనాల్లో ఏదో మెరుపు వెల్లివిరిసింది.

ఆ కళ్ళు...కాంక్షలకి నెలవులు కావు. ఆరాధనకి, ఆత్మీయతకి పుట్టిళ్ళు.

పారిజాత, నవనీతలు మాత్రం మౌక్తికను చూడగానే ముఖం ముడుచుకున్నారు యధాప్రకారం.

ఇద్దరూ వెళ్ళి అహోబిలంగారిని, మధుకిరణ్ ని పలకరించి, మధుకిరణ్ కి అభినందనలు తెలిపి, మళ్లీ వచ్చి ఓ చోట కూర్చున్నారు. ఎవరినోత విన్నా మధుకిరణ్ గురించిన ప్రశంసలే. అతడు సాధించిన ఈ విజయంపట్ల ఆనందసందోహాలే.

సభ ప్రారంభమైంది. మౌక్తిక మనసు మేఘావృతమైన ఆకాశంలా ఉంది. ఎవరైనా కదిలిస్తే కురిసేటట్లున్నాయి ఆమె కళ్ళు.

అనాసక్తమైన మనసుని ఇహంలోకి మళ్లించింది అతి బలవంతంమీద. శమంతకం గారు మైక్ అందుకున్నారు.

"సోదరసోదరీ మణులారా, ప్రియ విద్యార్థులారా... ఈ రోజు మనమందరం ఇక్కడ ఎందుకు సమావేశమైనామో మీకందరికీ తెలుసు. మన ప్రిన్సిపాల్ శ్రీయుతులు అహోబిలంగారు ట్రాన్స్ ఫర్ మీద హైదరాబాద్ లో ఉన్న మన మెయిన క్యాంపస్ కి వెళ్తున్నారు.''

ఉలిక్కిపడింది మౌక్తిక. ట్రాన్స్ఫర్ అయ్యింది మధుకిరణ్ కి కదా! మరి అహోబిలం అంటారేమిటీ! వయసు పైబడుతోంది... చాదస్తం ముదురుతోంది కాబోలు.

"ఆయనకి వీడ్కోలు పలకడానికి మనం ఈ సభ ఏర్పాటుచేసుకున్నాం. అలాగే ఈనాటి ఈ సమావేశానికి ఓ ప్రత్యేకత ఉంది. మన కాలేజ్ లో మాథ్స్ లెక్చరర్గా పని చేస్తున్న శ్రీ మధుకిరణ్ గారికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం వచ్చింది. వీధిబాలల మీద ఆయన రాసిన ఒక నవలకు గాను ఆయనకీ పురస్కారం లభించింది. మన అందరిలో ఒకరిగా కలిసిపోయి స్నేహభావంతో మసలే మధుకిరణ్ కి ఈ అవార్డ్ రావడం మనకందరికీ ఎంతో గర్వకారణం.

అలాగే... ఆయన మన కాలేజ్ కి అందిస్తున్న ఈ విద్యాసేవలకి గాను ఆయనను ఇదే కాలేజ్ కి ప్రిన్సిపాల్ గా నియమిస్తూ మన కాలేజ్ కార్యవర్గ కమిటీ ఉత్తర్వులు జారీచేసింది. ఒక విధంగా ఇది డబల్ ధమాకా. ఆయనకు అభినందనలు తెలియచేయడం మనందరి బాధ్యత.''

మౌక్తికకంతా అయోమయంగా, గజిబిజిగా అనిపిస్తోంది. మధుకిరణ్ ట్రాన్స్ఫర్ మీద వెళ్తానని కదా అన్నాడు. మరి... ఈ ప్రమోషన్ గొడవేమిటి!

మతిపోయినట్లుగా రమ్యకేసి చూసింది.

"నువ్వు విన్నది నిజమే... ఆయన సరిగానే మాట్లాడుతున్నాడు. మధుకిరణ్ కి మన కాలేజ్

ప్రిన్సిపాల్‌గా ప్రమోషన్ వచ్చింది.'' నింపాదిగా చెప్పింది రమ్య.

"ఈ విషయం నీకు ముందే తెలుసా?''

"ఓ...భేషుగ్గా.''

" మరి నాకెందుకు చెప్పలేదూ!?'' కోపంగా అడిగింది మౌక్తిక.

రమ్య ఆమెను నమిలేసేలా చూస్తూ" చెప్పేట్లుగా తమరున్నారా? మూడురోజులై కాలేజ్‌కి సెలవు పడేసి ఇంట్లో కూర్చున్నావు. అందుకే... నిన్ను సర్‌ప్రైజ్ చేయాలని చెప్పలేదు...'' అంది నిష్టూరంగా.

అదిసరే... తననుండి దూరంగా వెళ్లిపోవాలని నిశ్చయించుకున్న మధుకిరణ్ ఈ ప్రమోషన్‌ని యాక్సెప్ట్ చేసి ఇక్కడే ఉండిపోవాలని ఎందుకనుకున్నాడూ!

కొరుకుడు పడని ప్రశ్న. అయితే... మౌక్తిక మదిలో ఏదో మూల అతడిక్కడే ఉంటే బాగుండునని అనిపించింది.

అహోబిలంగారు మధుకిరణ్‌ని శాలువా కప్పి, దండవేసి సత్కరించారు. ఆ తరువాత అహోబిలం గారిని కూడా ఘనంగా సన్మానించారు. ఆయన అంత మంచి స్టాఫ్‌ని విడిచిపెట్టి దూరంగా వెళ్తున్నందుకు విచారం వ్యక్తపరిచారు. తనకి జరిగిన ఈ సత్కారానికి ధన్యవాదాలు తెలిపారు.

ఆయన తన ప్రసంగాన్ని ముగించగానే మధుకిరణ్ లేచి పోడియం వద్దకు వచ్చాడు. అతడి ప్రతి కదలికా ఎంతో హుందాగా ఉంది.

"ఈ రోజు నా జీవితంలో మరచిపోలేని రోజు. మీ వంటి ఉత్తమమైన సహోద్యోగుల మధ్యన మరికొన్నాళ్ళు పనిచేసే సదవకాశాన్ని నాకు కల్పిస్తూ... మన కాలేజ్ కమిటీ వారు నాకు ప్రమోషన్ ఇచ్చారు.''

మధుకిరణ్ చూపులన్నీ తనమీదే కేంద్రీకృతమై ఉండడంతో కళవళపడింది మౌక్తిక.

అతడి తీక్షణదృక్కుల్లో ఏదో... సమ్మోహన శక్తిఉన్నట్లు, తానతడికి వశమైపోతున్నట్లు...ఏవేవో భావనలు.

"ఏ ఉద్యోగికీ దొరకని అరుదైన అవకాశం నాకు దొరకడం నిజంగా నా అదృష్టం. పనిచేసే చోటే పదోన్నతి లభించడం అందరికీ దొరకని వరం. అలాగే... నా ఆనందాన్ని మీతో పంచుకునేందుకు నాకు ఇంకో అదృష్టం దక్కింది. నేనురాసిన 'నవమౌక్తికం' అనే నవలకి కేంద్రసాహిత్య అకాడమీ వారు యువ రచయిత అవార్డుని ప్రకటించారు. ఇది నాకు అత్యంత గర్వకారణం.

గతంలో ఎందరో ప్రముఖ రచయితలని వరించిన ఈ అత్యున్నత పురస్కారం నాలాంటి వర్ధమాన రచయితకి దక్కడం నా పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నాను. ప్రతి మగవాడి విజయం వెనక ఓ స్త్రీమూర్తి ఉంటుందంటారు. నా విజయం వెనుకనున్నది కూడా అలాంటి స్త్రీమూర్తే. నా

రచనలకి, ఆలోచనలకి, ప్రేరణ ఆమే.

ఎందరో వీధిబాలల జీవితాలని ప్రత్యక్షంగా చూసిన నేనుదయనీయమైన వారి గాధలకి చలించిపోయి ఈ 'నవమౌక్తికం' అనే రచనకి శ్రీకారం చుట్టాను.ఈ పురస్కారానికి గాను నాకు లభించబోయే నగదుమొత్తాన్ని వారి సంక్షేమానికే వినియోగించాలని నిర్ణయించుకున్నాను. అంతేకాదు. నాకున్న పరిధిలో కొందరు బాలలను చేరదీసి వారి పోషణకయ్యే ఖర్చుని భరించడమే కాక, వాళ్ళకి విద్యాబుద్ధులు చెప్పించడానికి నిశ్చయించుకున్నాను.''

మధుకిరణ్ ఈ మాటలు చెప్పగానే సభ మొత్తం చప్పట్లతో మార్మోగిపోయింది. మౌక్తిక మనసు అవ్యక్తానుభూతికి ఆలవాలమై హర్షాతిరేకంతో పులకించిపోయింది. మధుకిరణ్ ఔన్నత్యం, సౌహార్ద్రం ఆమెకు అమితానందాన్ని కలుగజేశాయి.

ఎంత గొప్పమనిషి! ఎంతటి మహోన్నత వ్యక్తిత్వం! మనసులోనే జోహార్లు అర్పించింది.

ఆదర్శాలను కేవలం రాతల్లోనే గుప్పించక, వాటిని ఆచరించే నిబద్ధత ఆమెను ఆకట్టుకుంది.

“ఈరోజు ఇంకో ముఖ్యవిషయం కూడా మీ అందరికీ చెప్పాలనుకుంటున్నాను. ఉద్యోగంలో ప్రమోషన్ వచ్చినట్లే... జీవితంలో కూడా 'భర్త' గా ప్రమోషన్ రానుంది.'' అతడి మాటలింకా పూర్తి కానేలేదు... కరతాళధ్వనులతో ఆ ప్రదేశమంతా దద్దరిల్లిపోయింది.

“భర్తగానా! అంటే... అతడు పెళ్లి చేసుకోబోతున్నాడా!'' డీలా పడిపోయింది మౌక్తిక ఒక్కసారిగా.

' నిన్నుతప్ప జీవితంలోకి మరెవరినీ ఆహ్వానించలేను... నువ్వు నాకందవని తెలిసి...భరిస్తూ ఇక్కడే ఉండలేనన్నట్లుగా ' తీయగా వలపులొలకపోశాడు తనకు రాసిన ఉత్తరంలో.

అన్నీ శుద్ధ అబద్ధాలు.

హాయిగా పెళ్లిచేసుకుని, రేప్పొద్దున్న తనకళ్లముందే కులాసాగా కాపురం కూడా చేస్తాడు. ఇతడి ప్రేమ నిజమనుకుంది. స్వచ్ఛమైన అమృతబిందువనుకుంది. కాని, అంతా కపటం

'' నువ్వు కాదన్నంత మాత్రాన నేను పెళ్లి మానుకుంటానా!'' అని తనని అవహేళన చేయడమే అతడి ప్రధానోద్దేశ్యమా!?

మౌక్తిక మనసు భగ్గున మండింది అసూయతో.

అంతలోనే... ఆమెలోని విచక్షణ ఆమె ఆలోచిస్తున్న తీరు తప్పని మందలించింది.

“అలా... మామూలు ఆడదానిలా... ఈర్ష్యపడతావెందుకు? అతడు మొదటి అవకాశం ఇచ్చింది నీకే. దాన్ని సద్వినియోగపరచుకోకపోవడం ముమ్మాటికీ నీ తప్పు. ఆ నేరాన్ని అతడిమీద నెట్టేయడం అన్యాయం. కోరికలను చంపుకుని బ్రహ్మచారిగా బతకడానికి అతడేమీ అడవిలో కందమూలాలు తింటూ, ముక్కు మూసుకుని తపస్సు చేసుకునే మునివరుడు కాదు.'' అంటూ బుద్ధి హెచ్చరించింది.

మౌక్తికలోని ఆవేశమంతా చప్పగా చల్లారిపోయింది. ఎంతగా మనసుకి సర్దిచెప్పుకున్నా ఏదో

బాధ మనసుని కుమ్మరిపురుగులా దొలుస్తూనే ఉంది.

"నేను అర్ధాంగిని చేసుకోబోతున్నది మరెవరినో కాదు... ఆమె మన కాలేజ్ లోనే పనిచేస్తున్న మౌక్తికగారు.'' అతడి నోటమ్మట తన పేరు వినబడడంతో నిటారుగా అయ్యింది మౌక్తిక.

ఏమిటితడు అంటున్నది! తానతడిని పెళ్ళి చేసుకుంటుందని ఎప్పుడు చెప్పింది!? తన అనుమతితో పనిలేకుండా ఇలా...పదిమందిలో తన పేరు వెల్లడిచేసి, పరువుతీసే అధికారం ఇతడికెవరిచ్చారు? ఈ అవమానాన్ని తానెలా తట్టుకోగలదు!

ఆవేశంగా లేచినిలబడిన మౌక్తికని ఆశ్చర్యంగా చూడసాగారందరూ.

"ముక్తా...ప్లీజ్ రిలాక్స్... నేను చెప్పేది విను.'' రమ్య ఆమెను కూర్చోబెట్టే ప్రయత్నం చేసింది.

"చూశావా రమ్యా...అతడెంతో మంచివాడని నమ్మినందుకు అతడేం చేశాడో చూశావా? ఇలా నలుగురిలో నన్ను అల్లరిపాలు చేస్తే అతడికేమొస్తుంది" బాధగా అంది మౌక్తిక.

ఆమె ప్రమేయం లేకుండానే కన్నీళ్ళు మంచిముత్యాల వానలా జలజల రాలాయి.

రమ్య నవ్వింది చల్లగా. కాని, ఆమె తనని ఎద్దేవా చేస్తోందేమోనని భావించింది మౌక్తిక.

"నా అవస్థ చూస్తే నీకు నవ్వులాటగా అనిపిస్తోందా! ఛఛ... అంతా నాఖర్మ. అందరికీ నేనొక ఆటబొమ్మలాగానూ, బఫూన్ లాగానూ అనిపిస్తున్నానులా ఉంది. నా బతుకంత హాస్యాస్పదంగా అయిపోయింది. అసలు... అమ్మకి నా ముఖమెలా చూపాలి? అందరిలోనూ నేను తలెత్తుకుని ఎలా తిరగగలను?'' ఆవేదన సుళ్లు తిరిగింది మౌక్తిక స్వరంలో.

మళ్ళీ నవ్వింది రమ్య. 'ఒకరి ఖేదం ఇంకొకరికి మోదం' కాబోలు!

"నువ్వు అనవసరంగా టెన్స్ అవకు... ఈ పెళ్లికి ఎవరైతే అనుమతి ఇవ్వాలని నువ్వు ఎదురుచూశావో, ఆవ్యక్తే అనుమతినిచ్చేశారు. ఇక నీకే హద్దులు, ఆటంకాలు లేవు. హాయిగా మధుకిరణ్ చేయందుకుని కొత్తజీవితం ప్రారంభించు.'' ప్రశాంతస్వరంతో చెప్పింది రమ్య.

అసలు ఏం మాట్లాడుతోంది రమ్య! కొంపదీసి వీళ్లందరికీ మతిగాని చలించిందా ఏమిటి!

"ఏమిటి సంశయిస్తున్నావు? మీ అమ్మగారి గురించేనా? నీ పెళ్లికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందే ఆవిడ. అటుచూడు...'' అంటూ దూరంగా వేలుపెట్టి చూపింది రమ్య.

అక్కడ శాంతంగా చూస్తూ...దయగా నవ్వుతూ... ప్రేమగా తననే చూస్తున్న తల్లి కనిపించింది మౌక్తికకు.

"మా అమ్మ... మా అమ్మ ...ఒప్పుకుందా?'' నమ్మలేనట్లుగా చూసింది మౌక్తిక.

అవునన్నట్లుగా కళ్లోతోనే పలికింది రమ్య.

" నిజమైన ప్రేమికుడికి జీవితంలో ఒకేఒక్కసారి ప్రేమానుభూతి కలుగుతుంది. నాకటువంటి మధురస్పందన మౌక్తిక గారిని చూడగానే కలిగింది. అందుకే ఆమెను నా జీవితభాగస్వామిని

చేసుకోవాలని ఆరాటపడ్డాను. మనస్ఫూర్తిగా కోరుకున్నాను.

ఆమె తల్లిగారైన శకుంతలగారు మా పెళ్లికి ఆమోదం తెలియజేశారు. అందుకే... నేనింత ధైర్యంగా, సభాముఖంగా మౌక్తికగారిని నాకు కాబోయే అర్ధాంగిగా మీ అందరికీ పరిచయం చేయ సాహసించాను.'' మధుకిరణ్ నోటివెంట జలపాత వేగంతో జాలువారుతున్నాయి మాటలు.

తానే స్థితిలో కొట్టుమిట్టాడుతోందో మౌక్తికకే తెలియడంలేదు. ఆనందం...ఆవేశం, ఉల్లాసం, ఉద్వేగం. నమ్మకం అపనమ్మకం...ఇలా... ఎన్నో రకాల భావ సముదాయాలు, అనుభూతుల పరంపరలు కలిసి ఆమెను నిలువనీయక ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.

" నా మనసులో మాటను మీ అందరితోటీ పంచుకున్నాను. మౌక్తిక కూడా తన అంగీకారాన్ని తెలియజేస్తే బాగుంటుందని అనుకుంటున్నాను.'' మధుకిరణ్ తన కోరికను వ్యక్తపరిచాడు.

"వెళ్లవే తల్లీ..ఇంకా అలా నిలబడ్డావేం? మీ అమ్మగారే ఒప్పుకున్నప్పుడు నీకా జంకెందుకు? క్యారీ ఆన్...'' మౌక్తికను ముందుకు తోసింది రమ్య.

కమ్మనిస్వప్నం కంటూ... మధ్యలో మెలకువ వచ్చినదానిలా... అలా నడుస్తూ డయాస్ మీదకి వెళ్లింది మౌక్తిక.

ఆమె చేయందుకుని తన సరసన నిలబెట్టుకున్నాడు మధుకిరణ్.

మౌక్తిక ముఖంలో కదలాడుతున్న సిగ్గుదొంతరలు, దేదీప్యమానంగా వెలిగిపోతున్న ఆమెముఖం ఇవన్నీ ...అతడిపట్ల ఆమెకున్న ఇష్టాన్ని తేటతెల్లం చేశాయి... ఆమె పెదవివిప్పి ఏమీ పలకకపోయినా.

ఇంతలో రమ్య వచ్చి రెండుదండలను తెచ్చి వారిని మార్చుకోమని సూచించింది. 'ఎమ్' అన్న అక్షరాలతో డిజైన్ చేయబడి ఉన్న ఉంగరాలను వారిచేతికిచ్చి మార్చుకోమని చెప్పింది. ఇద్దరూ అలాగేచేశారు.

సభంత చప్పట్లతో మారుమ్రోగిపోయింది. ఆనందంతో మౌక్తిక గొంతు మూగవోయింది.

అంటే... ఇదంతా ప్రీప్లాన్డ్‌గా జరిగిన వ్యవహారమన్నమాట! దీనికి సూత్రధారి ఎవరు? ఇంకెవరు? రమ్యే అయ్యుంటుంది.

తన వెనకేదో గూడుపుఠాణీ జరుగుతోందనుకుంది కాని, ఇదనుకోలేదు. రమ్య చెవి మెలేసి కక్ష తీర్చుకోవాలి తీయగా. అసలు తల్లి దీనికెలా అంగీకరించింది.

మౌక్తిక ఆలోచనలలో ఉండగానే సభ ముగిసింది. ప్రతి ఒక్కరూ కూడా వ్యక్తిగతంగా అభినందనలు తెలియజేస్తున్నారు. వారి జీవితం శుభప్రదం కావాలని ఆకాంక్షిస్తున్నారు. ప్రశంసల జడివానలో తడిసి ముద్దౌతోంది మౌక్తిక.

ఇంతలో శకుంతల వారి దగ్గరకు వచ్చింది. కూతురి తల నిమిరి ఆమె చేతిని మధుకిరణ్ తో కలిపింది. కదిలిపోయింది మౌక్తిక.

“అమ్మా…'' అంటూ ఆమెని అల్లుకుపోయింది మౌక్తిక.

------------------------ ------------------------ --------------------------

“పిల్లల అభిప్రాయాలతో పనిలేకుండా…పెద్దలు అహంకారంతో ఆలోచించి పెళ్లిళ్ళు చేస్తే…పర్యవసానం ఎంత దారుణంగా ఉంటుందో…నీ జీవితం చూశాక అర్థమైంది ముక్తా. మీ అత్తయ్య కోరిందని నాన్నగారి ఆజ్ఞమేరకు తలవంచి తాళి కట్టించుకున్నావు.

నీ జీవితం మోడువారిన చెట్టులా తయారైతే ఎవరినీ నిందించకుండా తప్పుకున్నావు. ఆఖరుకి ఏ తల్లీ కోరకూడని కోరిక నేను కోరితే…మరో ఆలోచన లేకుండా ప్రమాణం చేశావు.

నీకూ ఓమనసుంటుందని, దానికీ కొన్ని ఆశలుంటాయని నేను తెలుసుకోలేక అజ్ఞానంతో ఆంక్షలుపెట్టినా సహనంతో భరించావు.'' శకుంతల స్వరం రుద్ధమైంది.

పితృవాక్య పరిపాలన కోసం రాజ్యాన్ని, సర్వసుఖాలను త్యాగంచేసి పదునాలుగేళ్ళపాటు అడవులకి వెళ్లాడు శ్రీరామచంద్రుడు. ఈ రోజుల్లో అలా తల్లిదండ్రుల మాటలను గౌరవించే బిడ్డలెవరున్నారని అనుకునేవారికి నేనిచ్చే సమాధానం ఒక్కటే.

తల్లికిచ్చిన మాటకోసం తన కోరికలను, కలలలు సమాధిచేసుకుని తనలో తనే మధనపడుతూ బతుకు గడుపుతున్న నా ముక్త ఉందని గర్వంగా చెప్పుకుంటాను. నీలాంటి ఆణిముత్యాన్ని కన్నందుకు నేను చాలా గర్వపడుతున్నాను.'' చెమర్చినకళ్లతో పలికిన శకుంతల మాటల్లో మౌక్తికపట్ల గల ప్రేమాభిమానాలు వరదలైపొంగాయి.

“అమ్మా…” ఆనందమో…ఉద్వేగమో తెలియని స్థితిలో గొంతు పూడుకుపోతూ ఉండగా తల్లిని ఆలింగనం చేసుకుంది మౌక్తిక.

వాళ్ళిద్దరినీ చూస్తూ ప్రేక్షకుల్లా నిలబడ్డారు మిగతావాళ్ళు.

“రమ్యవలన నాకు నీ మనసు తెలిసింది. ఇద్దరం మధుని కలిసి మీ పెళ్లి గురించి మాట్లాడాము. మీ ఇద్దరికీ పెళ్లిచేయడం నాకు ఆమోదమేనని చెప్పగానే అతడెంతో సంబరపడిపోయాడు. తనకి అన్న-వదిన తప్ప ఇంకెవరూ లేరని, వారు తన ఇష్టాన్ని కాదనరని నమ్మకంగా చెప్పడంతో నా సందేహాలన్నీ దూదిపింజలై తేలిపోయాయి.'' శకుంతల పలుకుల్లో అనురాగం, వాత్సల్యం అంతర్వాహినిలా ప్రవహిస్తూనే ఉన్నాయి.

“అమ్మా…'' మౌక్తిక గొంతు గధ్గదమైంది. ఆనంద పారవశ్యంలో మనసు మధురస్రవంతిలా తయారైంది.

రమ్య ఆమెకి చేరువగా వస్తూ” ఇప్పటికి నీ మనసు కుదుటపడిందనుకుంటాను. ఇక ఆల్ హ్యాపీస్…'' అంది అల్లరిగా నవ్వుతూ.

మౌక్తిక ఆమెను కొట్టడానికన్నట్లుగా చెయ్యెత్తుతూ”ఇదంతా నీ డైరెక్షన్ అన్నమాట… ఏ సినిమా డైరెక్టరూ కూడా ఇంత పకడ్బందీగా కథ నడిపించలేదు.'' అంది మౌక్తిక చిరుకోపం నటిస్తూ.

"ఔరా! ఏమి ఈ వైపరీత్యము! సహాయం చేసిన ప్రాణసఖినే దండించవైతువా?'' హతవిధీ!'' భయంభయంగా కళ్లార్పుతూ నాటకీయంగా అంది రమ్య.

ఫక్కున నవ్వింది మౌక్తిక ఆమె అభినయం చూసి. ఎన్నాళ్ళ తరువాతో స్వేచ్ఛగా నవ్వింది. కొండకోనల్లోంచి పరవళ్లు తొక్కుతూ గలగలమని పారే సెలయేరులా, ఎత్తైన పర్వతప్రాంతాలనుంచి కిందికి దుమికే జలపాతంలా , మధురనాదాలు రవళించే చిరుమువ్వలా... హాయిగా నవ్వింది.

అలా నవ్వుతున్న ఆమెను ఆరాధనగా... అపురూపంగా చూశాడు మధుకిరణ్.

ఆమె దరిచేరి, ఆమెకుడిచేతిని అందుకుని సున్నితంగా తన పెదవులకి ఆనించుకుంటూ "రియల్లీ అయాం వెరీహ్యాపీ ముక్తా...ఈ జన్మలో నిన్ను పొందుతాననుకోలేదు. నిజంగా... నేను చాలా అదృష్టవంతుడిని.'' అన్నాడు మంద్రస్వరంతో.

మౌక్తిక మనసు మురిసింది. అదృష్టవంతుడు అతడుకాదు. ఎన్నో జన్మలకి తపస్సుచేసినా లభించనటువంటి అరుదైన వరం అతడు. అతడి సాహచర్యం అందుకోబోయే తాను చాలా భాగ్యవంతురాలు.

"అమ్మో...చూశారా ఆంటీ...ఇద్దరూ ఇద్దరే...ఇంతమంది చుట్టూ ఉండగానే మీలోకంలోకి మీరెళ్లిపోయారంటే...వామ్మో! ఏకాంతంలో మిమ్మల్ని ఆపగలమా! అవ్వ...అవ్వ... మాకాలంలో ఇలా లేదమ్మా!'' సరదాగా కన్నుగీటుతూ అన్న రమ్య మాటలకి అందరూ ఘొల్లుమన్నారు.

"నీపెళ్ళి చేసేసి నేను తమ్ముడిదగ్గరకు వెళ్లిపోతాను. నాకున్న ఒక్క కొరతా తీరిపోయింది. పిల్లాపాపలతో హాయిగా ఉండు.'' శకుంతల కళ్లలో చెమ్మ.

అవును... ఆమె ఒక అమ్మ. అమ్మమనసు మమతల పూరెమ్మ.

"అమ్మా...'' పసిపాపలా ఆమె గుండెల్లో ఒదిగిపోయింది మౌక్తిక.

"అమ్మకొంగు పట్టుకుని తిరిగే ఇంత చిన్నపాపాయిని చేసుకుని నేనెలా సుఖపడనూ!'' కినుక నటించాడు మధుకిరణ్.

మళ్ళీ నవ్వులపువ్వులు విరిశాయి. మౌక్తిక సిగ్గుగా మధుకిరణ్ ముఖంలోకి చూసింది. అతడి కళ్లు అనురాగధారలు కురిపిస్తూ ఆమెను నిలువెల్లా అభిషేకిస్తున్నాయి.

------------------ ----------------------
--------------------

"అవునూ...ఇంతప్రేమని గుండెల్లో దాచుకుని నన్ను తప్పించుకు తిరిగేదానివి ఎందుకు! నీ వైఖరిచూసి నేనంటే నీకు ఇష్టం లేదేమోనని తెగ ఫీలైపోయేవాడిని తెలుసా?'' మౌక్తిక నుదుటిమీద అల్లిబిల్లిగా పరుచుకున్న తుమ్మెదరెక్కల్లాంటి ముంగురులని సుతారంగా సవరిస్తూ అన్నాడు మధుకిరణ్.

మౌక్తిక నోరుతెరచి ఏమీ బదులీయలేదు. అతడి ప్రశ్నకి తన చేతల్తో సమాధానం చెప్పింది.

అతడి వీపు చుట్టూ తన చేతులు పెనవేసి దగ్గరగా హత్తుకుపోయింది.

ఆ రోజు ఉదయమే వారికి శాస్త్రోక్తంగా వివాహమైంది. పెళ్లికి మధుకిరణ్ అన్న- వదినలు, మౌక్తిక కుటుంబసభ్యులు అందరూ వచ్చారు. గుళ్ళో పెళ్లితంతు పూర్తయ్యాక హోటల్లో లంచ్ అరేంజ్ చేశారు రమ్య- శరత్ లు. నెలలు నిండుతున్నా సరే...ఎంతో చలాకీగా తిరుగుతూ. ఆమె పెళ్లిసందడిలో ప్రధాన పాత్ర పోషించింది రమ్య.

లంచ్ అవగానే మొత్తం బంధుగణం అంతా బయలుదేరిపోయారు.

రమ్య- శరత్ లు కలిసి మౌక్తిక గదిని పూలతో అలంకరించారు.ఇది ఇదివరకు తానున్న గదేనా! అనుకుంది మౌక్తిక... రూపురేఖలు మార్చుకుని కొత్తగా కనబడుతున్న తన పడకగదిని చూసి.

"గుడ్‌నైట్... అండ్ స్వీట్ నథింగ్స్'' మౌక్తిక చెవిలో గుసగుసలాడింది రమ్య.

ఆగదిలో మౌక్తిక- మధుకిరణ్ లు తప్ప ఎవ్వరూలేరు. ఆ ఏకాంతం వారిలో అంతర్లీనంగా జ్వలిస్తున్న వాంఛలకి ఆజ్యంపోస్తోంది.

మౌక్తిక కనురెప్పలు సిగ్గుతో తమాషాగా వాలిపోతున్నాయి. తన కళ్ళనిండుగా కొండంత ప్రేమను ఇముడ్చుకుని రెండుచేతులూ చాచి ఆహ్వానం పలికాడు మధుకిరణ్.

అంతే... సందేహాలన్నీ ఎవరో కర్రపుచ్చుకుని వెళ్లగొట్టినట్లుగా పారిపోయాయి. సిగ్గుబిడియాలన్నీ సిగ్గుపడి ముఖం చాటేశాయి. పరుగునవెళ్లి ఆ చేతుల్లో వాలిపోయింది మౌక్తిక.

అమె తనూలతికను వీణియగా మార్చి వింతరాగాలు పలికించసాగాయి అతడి చేతులు. పటిష్ఠమైన అతడి బాహుబంధం ఆమె మేనుకి ప్రణయ శ్రీగంధాలద్దింది.ఇన్నేళ్ల ఆమె ప్రేమార్తి తీరి ఆహ్లాదకరమైన అనుభూతి మిగిలింది.

ప్రకృతీ పురుషుల ప్రణయలాస్యాలకి సాక్ష్యాలయ్యారు వారు. వలపు విన్యాసాలలో మునిగితేలుతూ 'శృంగార సాగరసంగమాల'లో తేలియాడారు.

"ముక్తా... ఏమిటాలోచిస్తున్నావు?'' స్వప్నజగత్తులో తన్మయత్వం చెంది ఉన్న మౌక్తికను పట్టి కుదిపాడు మధుకిరణ్.

మత్తువదిలినట్లుగా చూసింది మౌక్తిక.

"అంతర్ముఖీ...'' అచ్చం రమ్య పిలిచినట్లుగానే పిలిచాడు మధుకిరణ్.

కోపంగా చూడబోయి, సాధ్యంకాక నవ్వేసింది మౌక్తిక. అతడు కురిపిస్తున్న ప్రేమామృతవర్షంలో నిలువెల్లా తడిసి, ఇన్నాళ్లుగా ఆమెమదిని దహిస్తున్న ఒంటరితనమంతా మటుమాయమైంది.

ఆమె కోరుకున్నట్లే... అతడి ప్రేమ ఆమె హృదయాన్ని ఒక దివ్యజ్యోతియై వెలిగిస్తోంది.

-------------------------------------సమాప్తం-------------------------------------